www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 64
సంచిక (Issue) : 315

గురువారం | 29-2-2024

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం, తిథి: పంచమి తె. 6.24 తదుపరి షష్ఠి; నక్షత్రం: చిత్త ఉ. 10.23 తదుపరి స్వాతి; వర్జ్యం: సా. 4.33-6.18; దుర్ముహూర్తం: ఉ. 10.32-11.18, మ. 3.12-5.58; అమృతఘడియలు: తె. 3.07-4.53; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.38; సూర్యాస్తమయం: 6.18

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఎత్తేర జెండా...



తాడేపల్లిగూడెం సభలో పార్టీ జెండాలు చేతబట్టిన పవన్, చంద్రబాబు



కాచుకో జగన్

సిద్ధం సిద్ధం అంటున్న నీకు యుద్ధం చూపిస్తా: పవన్

పాతాళానికి తొక్కకపోతే నా పేరు పవనే కాదు

వైసీపీ గూండాలు బెదిరిస్తే మక్కెలిరగ్గొట్టి మంచం మీద పెడతా.. బాబు అనుభవం రాష్ట్రానికి కావాలి

ఆయన నవ నగర నిర్మాత.. ఉపాధి కల్పించిన వ్యక్తి.. అందుకే టీడీపీతో పొత్తు పెట్టుకున్నా

ఇటుక ఇటుకతో ఇల్లు కడుతున్నాం.. తాడేపల్లి జగన్ కోట బద్దలుకొడతాం.. జన సేనాని హెచ్చరిక

ఆర్టీసీ బస్సులు ఇవ్వలేదు. స్కూలు బస్సులను రానివ్వలేదు. వేదిక వద్ద పనులు చేసే కూలీలకు బెదిరింపులు! అర్ధరాత్రి పనులు చేయడానికి వీల్లేదంటూ ఆంక్షలు! అడుగడుగునా నిఘా! అటువైపు వెళితే పథకాలు పోతాయంటూ హెచ్చరికలు! సభకు ముహూర్తం పెట్టి వారం రోజులు కూడా కాలేదు! అయినా సరే... తెలుగుదేశం, జనసేన ఉమ్మడిగా ఎగరేసిన 'జెండా' ఘనంగా రెపరెపలాడింది.

జయం మనదే!

టీడీపీ-జనసేన పొత్తు గెలవాలి.. రాష్ట్రం వెలగాలి

టీడీపీ అగ్నికి జనసేన తోడైంది.. ఇక అన్‌స్టాపబుల్

ఈ కలయిక మా కోసం కాదు.. రాష్ట్రం కోసం

బాదుడులేని అభివృద్ధి.. కోతలు లేని సంక్షేమం

ఐక్యత చెడగొట్టాలనుకునేవారి కుట్రలు తిప్పికొట్టండి

కష్టపడిన నేతలకు, కార్యకర్తలకు న్యాయం చేస్తాం

పులివెందులలోనూ జగన్‌ను ఓడిస్తాం

'హూ కిల్డ్ బాబాయ్'కి దమ్ముంటే జవాబు చెప్పాలి

ఎదుగుతున్న చెట్టులాంటి ఏపీపై జగన్ గొడ్డలి వేటు

ఇలాంటి సైకోను భరించడం అవసరమా?: బాబు

11

మాది విన్నింగ్ టీమ్.. వైసీపీది చీటింగ్ టీమ్

ప్రజలారా ఆశీర్వదించండి.. వైసీపీని సాగనంపండి.. 'జెండా' సభలో బాబు, పవన్ పిలుపు

కుట్రలు, కుతంత్రాల వైసీపీ అట్టర్ ఫ్లాప్ కాబోతోంది. మాది విన్నింగ్ టీం. వైసీపీది చీటింగ్ టీం. ప్రశాంత రాష్ట్రంలో జగన్ విద్వేషాగ్ని రాజేశాడు. అదే అగ్ని ఇప్పుడు వైసీపీని దహించబోతోంది. అగ్నికి వాయువు తోడైనట్లు టీడీపీకి జనసేన తోడైంది. ఇక వైసీపీ బుగ్గి అవుతుంది. - చంద్రబాబు



జనసేనకు 24 స్థానాలేనా అంటున్నారు. వాళ్లకు తెలియనిదేమిటంటే.. వామనుడిని చూసి బలి చక్రవర్తి కూడా 'ఇంతేనా' అన్నాడు. నెత్తి మీద కాలు పెట్టి తొక్కుతున్నప్పుడే తెలిసింది.. ఇంత కాదు, అది ఎంతో అని! జనసేన కూడా అంతే! జగన్‌ను అథఃపాతాళానికి తొక్కేస్తాం! - పవన్

ఉమ్మడిగా ఉప్పొంగిన 'జెండా'

టీడీపీ-జనసేన సంయుక్త సభ సక్సెస్

ఆది నుంచీ 'అధికార' అవాంతరాలు

ఆర్టీసీ బస్సులు ఇవ్వకుండా చెక్

వేదిక వద్ద ఏర్పాట్లపైనా ఆంక్షలు

అయినా వెనక్కి తగ్గని శ్రేణులు

తాడేపల్లిగూడెం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం సమీపంలోని ప్రత్తిపాడులో 'తెలుగు జన విజయ కేతనం జెండా' పేరిట నిర్వహించిన ఉమ్మడి సభకు భారీగా జనం తరలి వచ్చారు. రెండున్నర గంటలపాటు సాగిన సభ ఆద్యంతం ఉద్వేగంగా సాగింది. టీడీపీ, జనసేన అభ్యర్థుల తొలి జాబితా విడుదల అనంతరం జరిగిన తొలి ఉమ్మడి సభ ఇది. దీనిని భగ్నం చేసేందుకు

మిగతా 11వ పేజీలో...

జగన్ ప్యాలెస్ వెలిగిపోవాలి..



రుషికొండపై పర్యాటకులకు మధురానుభూతిని మిగిల్చే టూరిజం కాటేజీలను కూల్చి... కట్టిన ప్యాలెస్‌లు ఇవి! పేరుకే ఇది టూరిజం ప్రాజెక్టు. కట్టుకున్నది జగన్ కోసమే! కట్టింది జనం ధనంతోనే! పూర్తికాని పనులకూ 'సెట్టింగ్'లు వేసి బటన్ నొక్కుతున్న జగన్.. రూ.500 కోట్లతో నిర్మించిన ఈ భవనాలను ప్రారంభించే అవకాశాన్ని మాత్రం మంత్రి రోజాకు ఇచ్చారు! గురువారం వీటిని గుట్టుగా ప్రారంభిస్తున్నారు. 12

జనం గూడు కూలిపోవాలి..



కేంద్రం నిధులకు తోడు సొంతంగా రూ.1.30 లక్షలు పోగేసి కట్టుకున్న 'జగనన్న ఇల్లు' ఇది! 'నేనే కడతా' అంటూ వైసీపీ నేత కాంట్రాక్టరు అవతారమెత్తాడు. ఆయనకు ఇసుకపై ఉన్న ప్రేమ.. సిమెంటు, ఐరన్‌పై లేదు. ఫలితంగా... మార్చి 2న గృహ ప్రవేశం జరగాల్సిన ఈ పేదల ఇల్లు ఇలా కూలిపోయింది. అనంతపురం జిల్లా రాయదుర్గం పట్టణానికి చెందిన 'లబ్ధిదారులకు' గూడు కాదు... గోడు మిగిలింది. 3

మా చెడ్డ మావయ్య!

విద్యార్థులపై జగన్ మామ కాఠిన్యం

విద్యాహక్కు కింద చేరిన చిన్నారులకు అమ్మఒడి నుంచి ఫీజులు కట్టాలని హుకుం

కట్టని వారికి మూడు రోజుల గడువు

ఈలోగా కట్టించాలని డీఈవోలకు ఆదేశాలు

ఆర్టీఈ చట్టానికి వ్యతిరేకంగా నిర్ణయాలు

ప్రభుత్వమే చెల్లించాలని చెబుతున్న చట్టం

బాధ్యతల నుంచి తప్పించుకునే ఎత్తుగడ



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పేద విద్యార్థుల చదువులపై సీఎం జగన్ వైఖరి ఏంటనేది తాజాగా మరోసారి స్పష్టమైంది. పేద విద్యార్థులకు నేనున్నానంటూ మాటివ్వడమే తప్ప, దాన్ని అమలు చేయడం తనకు చేతకాదని 'మేనమామ' మడమ తిప్పేశారు. విద్యా హక్కు చట్టం కింద కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో చేరిన విద్యార్థుల ఫీజులను అమ్మ ఒడి పథకం కింద ఇస్తున్న నిధుల నుంచి చెల్లించుకోవాలని.. తాను ఇవ్వలేనని ఆయన కుండబద్దలు కొట్టారు. అంతేకాదు..

మిగతా 12వ పేజీలో...



'అసైన్డ్'లో మైనింగ్ అనుమతులా?

2.8 ఎకరాల్లో అనుమతులు తీసుకుని 60 ఎకరాల్లో తవ్వకాలు జరుపుతారా?

మైనింగ్ సర్వేకు హైకోర్టు ఆదేశం 2

నివేదికపై సందేహం వస్తే వాస్తవాలను న్యాయాధికారితో తేలుస్తామని వ్యాఖ్య

సర్వేకు 3 వారాలు కోరిన మైనింగ్ శాఖ

అంగారకునిపైకి వెళ్తున్నారా? అన్న కోర్టు



ఆత్మగౌరవం లేని చోట

ఉండలేం!

వైసీపీకి ఎంపీ మాగుంట రాజీనామా

నేడో రేపో టీడీపీలో చేరిక! 2



వైసీపీలోకి ఐఏఎస్!

వీఆర్ఎస్ తీసుకున్న ఇంతియాజ్ 12

ఉదయం దరఖాస్తు.. మధ్యాహ్నమే ఆమోదం.. సాయంత్రానికి ఉత్తర్వులు

చేరికపై ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

కర్నూలు ఎమ్మెల్యేగా పోటీ?



జగన్ బీజేపీ నాయకుడే!

రేపు తిరుపతిలో 'హోదా' సభ: షర్మిల 3

జంతర్ మంతర్ జాబితా

5 పేర్లతో వైసీపీ 8వ లిస్టు.. బంధువులు, బదిలీలతో సరి

గుంటూరు ఎంపీ, కందుకూరులో 'సవరణలు' 2

ఎట్టకేలకు ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి



'సిద్ధం' కాలేదు!

జగన్ మేదరమెట్ల సభ 3 నుంచి 10కి వాయిదా

జనసమీకరణపై నాయకుల నుంచి దక్కని భరోసా

రైలు ఢీ.. 12 మంది మృతి?

అగ్నిప్రమాద అనుమానంతో ఆగిన అంగ ఎక్స్‌ప్రెస్

దిగి పక్కట్రాక్‌పై నడిచి వెళ్తుండగా దూసుకొచ్చిన మెమూ ట్రైన్.. ఝార్ఖండ్‌లో దారుణం 2

2029లో జమిలి.. లా కమిషన్ ఓకే! 2

రూ.100 మాత్రతో క్యాన్సర్‌కు చెక్

రూ.100 మాత్రతో క్యాన్సర్ వ్యాప్తికి చెక్




ముంబై, ఫిబ్రవరి 28: క్యాన్సర్ బాధితులకు శుభవార్త! కీమో, రేడియేషన్ వంటి చికిత్సలతో తగ్గిపోయిన క్యాన్సర్.. మళ్లీ తిరగబెట్టకుండా అడ్డుకునే మాత్రను ముంబైలోని ప్రతిష్ఠాత్మక క్యాన్సర్ పరిశోధన సంస్థ 'టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్ (టీఐఎఫ్ఆర్)' శాస్త్రజ్ఞులు రూపొందించారు. వారి దశాబ్దకాల పరిశోధనల ఫలితం ఈ ట్యాబ్లెట్. దీని గురించి టాటా మెమోరియల్ ఆస్పత్రిలోని సీనియర్ క్యాన్సర్ సర్జన్, ఈ పరిశోధనల్లో పాలుపంచుకున్న డాక్టర్ రాజేంద్ర బడ్వే వివరించారు. ప్రయోగాల్లో భాగంగా తాము కొన్ని ఎలుకల శరీరాల్లోకి.. మానవ క్యాన్సర్ కణాలను చొప్పించామని, ఆ ఎలుకల్లో క్యాన్సర్ కణితులు ఏర్పడ్డాక వాటిని రేడియేషన్, కీమో థెరపీలతో, సర్జరీ ద్వారా తొలగించామని తెలిపారు. "ఆ చికిత్సలతో చనిపోయిన క్యాన్సర్ కణాలు.. 'సెల్ ఫ్రీ క్రోమాటిన్ పార్టికల్స్' అనే చిన్నచిన్న తునకలుగా మారిపోవడం మేం గమనించాం. ఆ పార్టికల్స్ రక్తప్రసరణ వ్యవస్థ ద్వారా శరీరంలోని ఇతర అవయవాలకు ప్రయాణిస్తాయి. అవి అక్కడ ఆరోగ్యవంతమైన కణాల్లోకి ప్రవేశించి వాటిని క్యాన్సర్ కణాలుగా మారుస్తాయి" అని ఆయన వివరించారు. కొన్ని సీఎఫ్‌సీహెచ్‌పీఎస్‌లు ఆరోగ్యవంతమైన క్రోమోజోములతో కలిసిపోయి కొత్త కణితులకు కారణమవుతాయని వెల్లడించారు. "ఈ సమస్యకు చెక్ పెట్టడానికి ఎలుకలకు మేము రెజ్వెట్రాల్, కాపర్ (ఆర్+సీయూ)తో కూడిన ప్రో-ఆక్సిడెంట్ ట్యాబ్లెట్లను ఇచ్చి చూశాం. ఈ ట్యాబ్లెట్లు కడుపులో ఆక్సిజన్ రాడికల్స్‌ను ఉత్పత్తి చేస్తాయి. ఆక్సిజన్ రాడికల్స్ కూడా రక్తప్రసరణ వ్యవస్థలోకి ప్రవేశించి.. ఎక్కడ సెల్ ఫ్రీ క్రోమాటిన్ పార్టికల్స్ కనిపించినా వాటిని నాశనం చేస్తాయి. తద్వారా మెటాస్టాసిస్" అని తెలిపారు. ఈ ట్యాబ్లెట్ క్యాన్సర్ తిరగబెట్టకుండా కాపాడడంలో 30 శాతం ప్రభావవంతంగా పనిచేస్తుందని.. కీమోథెరపీ దుష్ప్రభావాల నుంచి కూడా 50శాతం దాకా రక్షణ ఇస్తుందని చెప్పారు. ఈ ట్యాబ్లెట్ విశిష్టత గురించి తెలిపే ప్రజెంటేషన్‌కు వారు.. 'మ్యాజిక్ ఆఫ్ ఆర్+సీయూ' అని పేరు పెట్టడం విశేషం. జూన్ జూలై నుంచి ఈ టాబ్లెట్ మార్కెట్లో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని, సామాన్యులకు భారం లేకుండా రూ.100కే అందుబాటులోకి వస్తుందని డాక్టర్ రాజేంద్ర వెల్లడించారు.

బర్డ్ ఫ్లూ కోళ్ల వల్ల సోకదు..!

» నిరూపిస్తే కోటి రూపాయల నజరానా: నెక్

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 28: "బర్డ్ ఫ్లూ అనేది వైరస్ కాదు.. అంటురోగం అంతకంటే కాదు.. అది కోళ్ల వల్ల సోకదు" అని నేషనల్ ఎగ్ అండ్ చికెన్ ప్రమోషన్ కౌన్సిల్ కన్వీనర్ డాక్టర్ కె.బాలస్వామి స్పష్టం చేశారు. నెల్లూరులోని జర్నలిస్టు భవన్‌లో కోళ్ల ఉత్పత్తిదారులు, విక్రయదారులు, వినియోగదారులతో జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఇటీవల పొదలకూరు, కోవూరు తదితర ప్రాంతాల్లో బ్రాయిలర్ కోళ్లకు బర్డ్ ఫ్లూ రావడం, జిల్లాలో చికెన్ దుకాణాలు మూసివేశారని తెలిసి నెల్లూరులో ఈ సదస్సు ఏర్పాటు చేశామన్నారు. దేశంలో 2006 నుంచి బర్డ్ ఫ్లూ కోళ్లకు వస్తూ పోతూ ఉందని, ఏనాడైనా కోళ్ల నుంచి మనుషులకు ఆ వ్యాధి సోకి చనిపోయిన జాడలేదని అన్నారు. బర్డ్ ఫ్లూ ద్వారా మనిషి చనిపోయాడని రుజువు చేసిన వారికి నెక్ (నేషనల్ ఎగ్ కో ఆర్డినేషన్ కమిటీ) రూ.కోటి బహుమతి ఇస్తుందని ప్రకటించారు. చికెన్, గుడ్డుతో బర్డ్ ఫ్లూ ప్రజలకురాదని తెలిపారు.

లోకం తీరు



ఝార్ఖండ్‌లో రైలు ఢీకొని 12 మంది మృతి?

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: ఝార్ఖండ్‌లో బుధవారం సాయంత్రం రైలు ఢీకొన్న ఘటనలో కనీసం 12మంది మరణించినట్టు అనుమానిస్తున్నారు. రైల్వే అధికార వర్గాలు మాత్రం ఇద్దరు ప్రాణాలు కోల్పోయినట్టు చెబుతున్నాయి. జామ్‌తారా-కర్మతాండ్ స్టేషన్ల మధ్య ఉన్న కాలా ఝరియా వద్ద ఈ దుర్ఘటన చోటుచేసుంది. బాగల్పూర్ వెళ్తున్న అంగ ఎక్స్‌ప్రెస్ నుంచి దిగిన ప్రయాణికులు ఝూఝా నుంచి అసన్‌సోల్ వెళ్తున్న మెమూ రైలు కింద పడి మరణించారు. ట్రాక్ వద్ద దుమ్ము, పొగలాంటిది కనిపించడంతో అనుమానించిన అంగ ఎక్స్‌ప్రెస్ లోకోపైలట్ దాన్ని కాలా ఝరియా వద్ద నిలిపివేశాడు. మంటలు వ్యాపించాయేమోనన్న భయంతో కిందికి దిగిన కొందరు ప్రయాణికులు పక్క ట్రాక్ మీదుగా నడుస్తూ వెళ్లారు. ఆ ట్రాక్‌పై మెమూ రైలు వస్తున్న విషయాన్ని గమనించక దాని కింద పడి నలిగిపోయారు. అంగ ఎక్స్‌ప్రెస్ నిలిపిన దాదాపు 2కి.మీ. దూరంలో ఈ దుర్ఘటన జరిగిందని తూర్పు రైల్వే వర్గాలు తెలిపాయి. అంగ ఎక్స్‌ప్రెస్‌లో అగ్ని ప్రమాదం జరగలేదని పేర్కొన్నాయి. సమాచారం అందుకున్న అధికార యంత్రాంగం సహాయ చర్యలు చేపట్టింది. ఆధార్ కార్డుల ఆధారంగా ప్రయాణికులను గుర్తించి తగుసేవలు అందిస్తున్నారు.

గోదావరి, కృష్ణా పరీవాహకాలకు మహర్దశ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: గోదావరి, కృష్ణా పరీవాహకాలకు మహర్దశ పట్టనుంది. నీటి నిర్వహణకు సమగ్ర ప్రణాళికలు రూపొందించాలంటూ 12 ఐఐటీలు, ఇతర అత్యున్నత సంస్థలతో బుధవారం ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ వెల్లడించారు. గోదావరి, కృష్ణాతోపాటు దేశంలోని మొత్తం 6 నదుల పరీవాహకాల అభివృద్ధికి జలశక్తి మంత్రిత్వ శాఖ పరిధిలోని జాతీయ నదుల పరిరక్షణ డైరెక్టరేట్(ఎన్‌ఆర్‌సీడీ) ఆయా సంస్థలతో ఒప్పందాలను కుదుర్చుకున్నట్లు ఆయన వివరించారు. గంగానది పరీవాహక నిర్వహణ విషయంలో ఐఐటీ-కాన్పూర్ నేతృత్వంలోని ఏడు విద్యా సంస్థలు ఇచ్చిన ప్రణాళిక సత్ఫలితాలనిస్తున్న నేపథ్యంలో కృష్ణా, గోదావరి, కావేరి, మహానది,పెరియార్, నర్మదానదులపై దృష్టిసారించామన్నారు. 2019లో సంయుక్త పార్లమెంట్ సమావేశం సందర్భంగా అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నదులను శుభ్రం చేయించడం, పరీవాహక ప్రాంతాల నిర్వహణపై ప్రతిపాదనలు చేసినట్లు గుర్తుచేశారు. ఆమేరకు సమగ్ర ప్రణాళిక కోసం బుధవారం ఒప్పందాలు జరిగాయన్నారు.

ఆత్మగౌరవం లేని చోట ఉండలేం!

» వైసీపీకి ఎంపీ మాగుంట రాజీనామా
» ప్రకాశం జిల్లాలో అధికార పార్టీకి పెద్ద షాక్
» వచ్చే ఎన్నికల్లో నా కుమారుడి పోటీ: శ్రీనివాసులరెడ్డి
» నేడో రేపో టీడీపీలో చేరిక!



ఒంగోలు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): అధికార వైసీపీకి మరో పెద్ద షాక్ తగిలింది. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఆత్మగౌరవం లేనిచోట ఉండలేకనే రాజీనామా చేస్తున్నట్లు స్పష్టం చేశారు. మాగుంట కుటుంబం కేవలం గౌరవం మాత్రమే కోరుకుంటుందని, అది లేనిచోట ఉండలేక వైసీపీ నుంచి బయటకు వస్తున్నట్లు చెప్పారు. బుధవారమిక్కడ రామనగర్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 'మాగుంట కుటుంబం ఒంగోలులో గత 32 ఏళ్ల నుంచి రాజకీయాలు చేస్తోంది. ఎనిమిది సార్లు పార్లమెంటుకు, ఒకసారి ఎమ్మెల్సీకి, రెండు సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసింది. మమ్మల్ని జిల్లా ప్రజానీకం అక్కున చేర్చుకుంది. రానున్న ఎన్నికలకు ఒక నిర్ణయం తీసుకున్నాం. దాని ప్రకారం నా కుమారుడు రాఘవరెడ్డిని పోటీలో ఉంచుతున్నాం' అని వివరించారు. ఏ పార్టీలో చేరేదీ త్వరలో వెల్లడిస్తానని తెలిపారు. కాగా.. ఆయన నిర్ణయానికి ఒంగోలు లోక్‌సభ పరిధిలో ఆయా అసెంబ్లీ సెగ్మెంట్లలోని ఆయన అనుచర గణం మొత్తం మద్దతు ప్రకటించింది. పలువురు నేతలు సంఘీభావం ప్రకటించారు. కొంతకాలంగా మాగుంట వైసీపీలో అనేక అవమానాలు ఎదుర్కొన్నారు. ప్రధానంగా సీఎం జగన్ ఆయనపై వ్యతిరేకత పెంచుకున్నారు. పరోక్షంగా పలు నిర్ణయాలు, వ్యాఖ్యల ద్వారా ఆయన్ను రాజకీయంగా అభాసుపాలు చేసే చర్యలు చేపట్టారు. 2014లో ఆయనకు టికెట్ నిరాకరించి జగన్ బాబాయి వైవీ సుబ్బారెడ్డికి అవకాశం ఇచ్చారు. 2019 ఎన్నికల నాటికి ఏరికోరి మళ్లీ మాగుంటను పార్టీలో చేర్చుకుని టికెట్ ఇచ్చారు. గెలుపొందినప్పటి నుంచి లిక్కర్ వ్యాపారానికి సంబంధించి జగన్ అన్నిరకాలుగా మాగుంటను ఇబ్బందులకు గురిచేశారు. దీంతో ఆయన రాష్ట్రంలో వ్యాపారాలకు ఫుల్‌స్టాప్ పెట్టారు. ఆ తర్వాత ఎంపీ నిధులతో రైల్వే ఓవర్‌బ్రిడ్జిలు మంజూరు చేయించగా రాష్ట్రప్రభుత్వం సహకరించలేదు. అయినా ఓర్చుకున్న మాగుంట.. చివరకు జగన్‌ను కలిసేందుకు ప్రయత్నించగా చేదు అనుభవాలు ఎదురయ్యాయి. తర్వాత టికెట్ విషయంలో సీఎం పేచీ పెట్టారు. రూ.180 కోట్లు డిపాజిట్ చేయాలని.. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లను విమర్శించాలని షరతులు విధించారు. అందుకు మాగుంట సిద్ధపడకపోవడంతో తన గడప తొక్కడానికి వీల్లేదంటూ విజయసాయిరెడ్డి ద్వారా సమాచారం పంపారు. అంతేగాక ఒంగోలు లోక్‌సభ వైసీపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని తెరపైకి తెచ్చారు. ఈ నేపథ్యంలో వైసీపీ కి మాగుంట రాజీనామా చేశారు. ఏ పార్టీలో చేరేదీ తర్వాత వెల్లడిస్తానని ఆయన చెప్పినప్పటికీ ఒకట్రెండు రోజుల్లో టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. మాగుంట నిర్ణయంతో ప్రకాశం జిల్లాలో సరికొత్త రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటాయని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

పార్టీని వీడలేక ఉంటున్నా: బాలినేని

మాగుంట రాజీనామాపై మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి స్పందించారు. మాగుంటకు వైసీపీ టికెట్ ఇవ్వాలని సీఎంతో పోరాడానని.. అయినా తన ప్రయత్నం ఫలించలేదన్నారు. చివరకు ఆయన రాజీనామా చేశారని, తాను మాత్రం పార్టీని వీడలేకనే వైసీపీలోనే ఉంటున్నానని తెలిపారు.

'అసైన్డ్'లో మైనింగ్ అనుమతులా?

» 2.8 ఎకరాల్లో అనుమతులు తీసుకుని 60 ఎకరాల్లో తవ్వకాలు జరుపుతారా?
» సర్వే చేసి నివేదిక సమర్పించండి
» మైనింగ్ అధికారులకు హైకోర్టు ఆదేశం
» నివేదికపై సందేహం వస్తే వాస్తవాలను న్యాయాధికారితో తేలుస్తామని స్పష్టీకరణ
» సర్వే చేసేందుకు 3 వారాలు కోరిన ప్రభుత్వం
» అంగారక గ్రహంపైకి వెళ్తున్నారా? అన్న కోర్టు



అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): అసైన్డ్ భూముల్లో మైనింగ్ చేసేందుకు అధికారులు అనుమతులు ఇవ్వడాన్ని హైకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. అదేసమయంలో 2.8 ఎకరాల్లో మైనింగ్ అనుమతులు తీసుకుని ఏకంగా 60 ఎకరాల్లో తవ్వకాలు చేపట్టడంపై విస్మయం వ్యక్తం చేసింది. అక్రమ మైనింగ్‌పై వాస్తవాలు తేల్చేందుకు ఓ బృందాన్ని పంపించి సర్వే చేయించాలని మైనింగ్‌శాఖ అధికారులను ఆదేశించింది. అనంతరం పూర్తి వివరాలతో నివేదికను కోర్టు ముందు ఉంచాలని స్పష్టం చేసింది. తప్పుడు నివేదిక ఇచ్చారని అనుమానం వస్తే.. వాస్తవాలు తేల్చేందుకు న్యాయాధికారులను పంపిస్తామని హెచ్చరించింది. ఉల్లంఘనలపై అవసరమైతే మైనింగ్‌శాఖ కార్యదర్శిని కోర్టుకు పిలిపించి వివరణ కోరతామని తేల్చి చెప్పింది. ఇసుక అక్రమ తవ్వకాలను నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్జీటీ) తీవ్రంగా పరిగణిస్తున్నట్లుంది కదా? అని ఆరా తీసింది. సంబంధిత కంపెనీకి ఎన్జీటీ రూ.1800 కోట్లు జరిమానా విధించిందని, ఏమీ జరగకుండా అంత మొత్తాన్ని ఎందుకు విధిస్తారని ప్రశ్నించింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్. రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. ఈ దశలో ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ.. సర్వే చేసి నివేదిక సమర్పించేందుకు మూడు వారాలు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా జోక్యం చేసుకున్న ధర్మాసనం "మీరేమీ అంగారక గ్రహం మీదకు వెళ్లడం లేదు కదా?" అని వ్యాఖ్యానించింది. రెండు వారాల సమయం సరిపోతుందని పేర్కొంది. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం, వీరనాయకుని పాలెం గ్రామపరిధిలోని పలు సర్వే నెంబర్లలో ఉన్న 60 ఎకరాల డీకేటీ భూముల్లో గ్రావెల్ తవ్వకాలు అక్రమంగా జరుగుతున్నాయని, అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొంటూ ఎం. ప్రభుదాస్ హైకోర్టులో పిల్ వేశారు. బుధవారం దీనిపై విచారణ ప్రారంభమైన వెంటనే ధర్మాసనం స్పందిస్తూ.. ఇసుక అక్రమ తవ్వకాలను ఎన్జీటీ తీవ్రంగా పరిగణిస్తున్నట్లుంది కదా? అని ప్రశ్నించింది. రూ.1800 కోట్లు జరిమానా వేసింది కదా అని వ్యాఖ్యానించింది. ఈ దశలో మైనింగ్ శాఖ తరపున ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ.. అంతమొత్తం జరిమానా విధించలేదన్నారు. ఎన్జీటీ విధించిన రూ.100 కోట్ల జరిమానాపై సుప్రీంకోర్టు స్టే విధించిందన్నారు. తాజాగా ఇసుక తవ్వకాలకు సంబంధించిన వ్యవహారాన్ని ఎన్జీటీ సుప్రీంకోర్టు ముందు ఉంచిందన్నారు. ప్రస్తుత పిల్ గ్రావెల్‌కి సంబంధించిందన్నారు. అనుమతుల మేరకు మైనింగ్ జరుగుతోందని తెలిపారు. ధర్మాసనం స్పందిస్తూ రాష్ట్రంలో అక్రమ మైనింగే జరగడం లేదని, అంతా సవ్యంగా ఉందని సానుకూల దృక్పథంతో ఉంటారని మైనింగ్ శాఖ జీపీని ఉద్దేశించి వ్యాఖ్యానించింది. పిటిషనర్ తరపు న్యాయవాది నర్రా శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. అసైన్డ్ భూముల్లో మైనింగ్ అనుమతులు ఇవ్వడానికి వీల్లేదన్నారు. అందుకు చట్ట నిబంధనలు అనుమతించవన్నారు. 2.86 ఎకరాల్లో గ్రావెల్ మైనింగ్‌కి అనుమతులు తీసుకుని 60 ఎకరాల్లో తవ్వకాలు జరుపుతున్నారని తెలిపారు. అసైన్డ్ రైతులు తమ భూముల్లోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారన్నారు. చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారని చెప్పారు. ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ.. పిటిషనర్ బాధితుడు కాదని తెలిపారు. తవ్వకాలపై అభ్యంతరం ఉంటే బాధితులు నేరుగా కోర్టును ఆశ్రయించాలన్నారు. ధర్మాసనం స్పందిస్తూ.. బాధితులకు స్తోమత లేని కారణంగానే పిల్ దాఖలు చేశారని పేర్కొంది.

దేశంలో అత్యంత ధనిక పార్టీ బీజేపీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): దేశంలో అత్యంత సంపన్న పార్టీ బీజేపీయేనని అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) వెల్లడించింది. 2022-23సంవత్సరంలో తమ ఆదాయం రూ. 2,360.84 కోట్లు ఉంటుందని బీజేపీ ప్రకటించింది. కాంగ్రెస్, సీపీఎం, ఆప్, బీఎస్పీ, నేషనల్ పీపుల్స్ పార్టీ కూడా తమ ఆదాయాన్ని వెల్లడించాయి. గత ఆర్థిక సంవత్సరంలో కాంగ్రెస్ రూ.452.37 కోట్లు, సీపీఎం రూ.141.66 కోట్లు, ఆప్ రూ.85.17 కోట్లు, బీఎస్పీ రూ.29.27 కోట్లు, నేషనల్ పీపుల్స్ పార్టీ రూ.7.56 కోట్ల మేరకు తమ ఆదాయం ఉంటుందని ప్రకటించాయి. 2023 అక్టోబరు 31నాటికి ఈ పార్టీలు ఎన్నికల కమిషన్‌కు తమ ఆడిట్ నివేదికలను సమర్పించాల్సి ఉండగా.. కేవలం సీపీఎం మాత్రమే తన నివేదికను సకాలంలో సమర్పించింది. కాగా బీజేపీకి గత ఏడాది ఎన్నికల బాండ్ల రూపంలో రూ.1,294.15 కోట్లు రాగా, కాంగ్రెస్‌కు రూ. 171.02కోట్లు వచ్చాయి.

జమిలి ఎన్నికలకు లా కమిషన్ ఓకే!

» రాజ్యాంగంలో కొత్త అధ్యాయం చేర్చాలని సిఫారసు చేసే అవకాశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: ఒకే దేశం-ఒకే ఎన్నిక అన్న లక్ష్య సాధనకు అనుకూలంగా లా కమిషన్ సిఫార్సులు చేయనున్నట్టు బుధవారం విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇందుకోసం రాజ్యాంగంలో కొత్త చాప్టర్‌నుగానీ, పార్ట్‌నుగానీ జోడించాలని సలహా ఇవ్వనున్నట్లు పేర్కొన్నాయి. మూడు అంచలైన... లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలతో పాటు స్థానిక సంస్థలైన మున్సిపాలిటీలు/గ్రామ పంచాయతీలు అన్నింటికీ ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని సూచించనున్నట్లు, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రుతురాజ్ అవస్థి ఆధ్వర్యంలోని లా కమిషన్ ఈ మేరకు నివేదిక సమర్పించే అవకాశం ఉన్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. "జమిలి ఎన్నికల నిర్వహణకు తొలుత అన్ని రాష్ట్రాల అసెంబ్లీల కాలపరిమితి ఒకే సమయానికి ముగిసేలా ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. ఇందుకు కొన్ని అసెంబ్లీల కాలపరిమితిని తగ్గించాల్సి ఉండగా, మరికొన్నింటిని పొడిగించాల్సి ఉంటుంది. రానున్న అయిదేళ్ల కాలంలో మూడు దశల్లో ఎన్నికలు నిర్వహిస్తే ఇది సాధ్యపడుతుంది. తద్వారా 2029 మే-జూన్‌ల మధ్య నిర్వహించే 19వ లోక్‌సభ ఎలక్షన్ల సందర్భంగా ప్రప్రథమ ఏకకాల ఎన్నికలు జరపడానికి వీలు కలుగుతుంది. ఇందుకు అనుగుణంగా రాజ్యాంగంలో నిబంధనలు పొందుపరచాల్సి ఉంటుంది. దీనికి అవసరమైతే రాజ్యాంగ సవరణ చేయాలని లా కమిషన్ సిఫారసు చేయనుంది" అని వివరించాయి. అవిశ్వాస తీర్మానం కారణంగా ప్రభుత్వం పడిపోయి, కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేని పరిస్థితి తలెత్తితే వెంటనే అసెంబ్లీని రద్దు చేయకుండా అన్ని పార్టీలతో కూడిన 'యూనిటీ గవర్నమెంట్'ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించనున్నట్లు తెలుస్తోంది.

రాజ్యసభలో మెజారిటీకి చేరువలో ఎన్డీయే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ఈ ఏడాది ఏప్రిల్‌లో రాజ్యసభలో మెజారిటీ మార్క్ సాధించే అవకాశాలున్నాయి. నామినేటెడ్ కేటగిరీలో ఖాళీగా ఉన్న ఆరు స్థానాల భర్తీ, కొత్తగా ఎన్నికయిన అభ్యర్థుల ప్రమాణస్వీకారాల తర్వాత ఎన్డీయే మ్యాజిక్ ఫిగర్‌ను సాధించే చాన్స్ ఉంది. 245 మంది సభ్యులు ఉన్న రాజ్యసభలో మెజారిటీ మార్క్ 123గా ఉంది. ప్రస్తుతం బీజేపీకి 96 మంది సభ్యులు ఉన్నారు. దాంతో మొత్తం ఎన్డీయేకు ఎగువసభలో 113 మంది సభ్యులు ఉన్నారు. ఈ క్రమంలో కొంతమంది స్వతంత్ర సభ్యులు, నామినేటెడ్ సభ్యుల మద్దతుతో ఏప్రిల్‌లో ఎన్డీయే మెజారిటీ మార్క్‌ను చేరుకునే అవకాశాలున్నాయి. ఈ ఏప్రిల్‌లో ఖాళీ కానున్న 56 రాజ్యసభ సీట్లలో 41 సీట్లు ఏకగ్రీవంగా కాగా మిగిలిన సీట్లకు ఈనెల 27న ఎన్నికలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ 56 సీట్లలో బీజేపీ 30, కాంగ్రెస్ 9, ఎస్పీ 2, టీఎంసీ 4, వైయస్‌ఆర్‌సీపీ 3, ఆర్జేడీ 2, బీజేడీ 2, ఎన్సీపీ, శివసేన, బీఆర్‌ఎస్, జేడీ(యూ)లు ఒక్కొక్కటి చొప్పున సీట్లు గెలుచుకున్నాయి.

మణిపూర్‌లో ఏఎస్పీ కిడ్నాప్

ఇంఫాల్, ఫిబ్రవరి 28: మణిపూర్‌లో సాయుధ తీవ్రవాదులు ఏకంగా ఓ పోలీసు అధికారినే కిడ్నాప్ చేశారు. తూర్పు ఇంఫాల్‌లోని వాంగ్‌ఖీలో మైతేయీ తెగకు చెందిన ఓ సాయుధ ముఠా సభ్యులు అడిషనల్ ఎస్పీ అమిత్ కుమార్ ఇంటిపై మంగళవారం రాత్రి దాడికి పాల్పడ్డారు. విచ్చలవిడిగా కాల్పులు జరిపి ఇంటిని, నాలుగు వాహనాలను ధ్వంసం చేశారు. ఆ సమయంలో ఇంట్లో ఉన్న అమిత్ కుమార్ తండ్రి.. కుమారుడికి విషయం చెప్పగా.. ఆయన తన బృందంతో కలిసి అక్కడికి వచ్చారు. అయితే, పెద్ద సంఖ్యలో ఉన్న సాయుధ తీవ్రవాదులను వారు అడ్డుకోలేకపోయారు. తీవ్రవాదులు అమిత్ కుమార్‌ను బంధించి తమ వెంట తీసుకెళ్లారు. ఆయన అంగరక్షకులను తీవ్రంగా కొట్టి గాయపరిచారు. విషయం తెలిసిన రాష్ట్ర పోలీసులు కొన్ని గంటల్లోనే ఏఎస్పీని విడిపించుకోగలిగారు. ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

7న కశ్మీర్‌కు ప్రధాని మోదీ

ఆర్టికల్ 370 రద్దు తర్వాత ఇదే తొలిసారి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేసి, రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించిన తర్వాత తొలిసారిగా ప్రధాని నరేంద్ర మోదీ కశ్మీర్‌లో పర్యటించనున్నారు. శివరాత్రికి ఒక్క రోజు ముందు.. మార్చి 7న కశ్మీర్ పర్యటనకు వెళుతున్నారు. ఇందులో భాగంగా ఆ రోజున శ్రీనగర్‌లో జరిగే సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. అంతేకాక, పలు పథకాలను కూడా ప్రారంభించనున్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ మోదీ కశ్మీర్ పర్యటన అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. సరికొత్త కశ్మీర్(నయా కశ్మీర్) తాము సాధించిన గొప్ప విజయంగా బీజేపీ ఈ ఎన్నికల్లో ప్రచారం చేసుకోనుంది. ప్రధాని పర్యటన నేపథ్యంలో కశ్మీర్‌లో హై అలెర్ట్ ప్రకటించారు. శ్రీనగర్‌లో సభా వేదిక కూడా నిర్ణయం కావడంతో పోలీసులు, పారామిలటరీ బలగాలు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి వాహన తనిఖీలు చేపడుతున్నాయి. సభావేదిక పరిసరాలను జల్లెడ పడుతున్నాయి. కాగా, ఫిబ్రవరి 20న జమ్మూలో పర్యటించిన ప్రధాని మోదీ రూ.32వేల కోట్ల విలువైన పనులను ప్రారంభించారు.

సచిన్ పర్యటనపై మోదీ స్పందన

టీమిండియా మాజీ క్రికెటర్ సచిన్ తన కుటుంబంతో కలిసి ఇటీవల జమ్మూకశ్మీర్‌లో పర్యటించారు. ఇందుకు సంబంధించి సచిన్ బుధవారం ఎక్స్‌లో ఓ వీడియో పోస్ట్ చేశారు. "జమ్మూకశ్మీర్ పర్యటన ఓ అందమైన అనుభవంగా ఎప్పటికీ నా జ్ఞాపకాల్లో ఉండిపోతుంది. మనం దేశంలో సందర్శించాల్సిన ప్రదేశాలు చాలా ఉన్నాయని ప్రధాని మోదీ చెప్పిన మాటలను ఈ పర్యటన తర్వాత నేను ఏకీభవిస్తున్నా. ఇక్కడ తయారయ్యే కశ్మీర్ విల్లో బ్యాట్లు మేక్ ఇన్ ఇండియా, మేక్ ఆఫ్ వరల్డ్‌కు మంచి ఉదాహరణ. జమ్మూకశ్మీర్ అందాలను ఆస్వాదించాలని ప్రజలకు నేను పిలుపునిస్తున్నా" అని అందులో పేర్కొన్నారు. ఈ వీడియోపై స్పందించిన మోదీ.. కశ్మీర్‌లో సచిన్ పర్యటనను చూసిన యువత రెండు విషయాలు తెలుసుకోవాలన్నారు. దేశంలోని వేర్వేరు ప్రాంతాలను సందర్శించడం అందులో ఒకటైతే.. మేక్ ఇన్ ఇండియా ప్రాముఖ్యతను గుర్తించడం రెండోదని అన్నారు. అందరం కలిసి వికసిత్, ఆత్మనిర్భర్ భారత్ నిర్మిద్దామని పిలుపునిచ్చారు.

నేడో రేపో బీజేపీ తొలిజాబితా!

లోక్‌సభ అభ్యర్థుల ఎంపికపై బీజేపీ అధిష్ఠానం బుధవారం ప్రత్యేకంగా సమావేశమైంది. పలు రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు, వారి విజయావకాశాలపై మేధోమథనం నిర్వహించింది. గురువారం పార్టీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సమావేశమై పలు రాష్ట్రాల్లో అభ్యర్థులను ఖరారు చేయనుంది. అనంతరం, బీజేపీ లోక్‌సభ అభ్యర్థుల తొలిజాబితాను ప్రకటించనుంది. తొలి జాబితాలో 100మంది పేర్లు ఉంటాయని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ జాబితాలోనే ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా లాంటి సీనియర్ నాయకుల పేర్లతో పాటు 2019లో ఓడిపోయిన పలు స్థానాలకు కూడా అభ్యర్థులను ప్రకటిస్తారని పేర్కొన్నాయి. 2019లో కూడా బీజేపీ తొలి జాబితాలోనే మోదీ, అమిత్ షా పేర్లను ప్రకటించింది. అయితే, అప్పుడు లోక్‌సభ షెడ్యూల్ వెలువడిన తర్వాత తొలి జాబితాను వెల్లడించింది.



తమిళనాడులోని తూత్తుకుడిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న మోదీ

ఇస్రో కీర్తికిరీటంలో మరో కలికితురాయి

చెన్నై, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఇస్రో కీర్తికిరీటంలో మరో కలికితురాయి చేరింది. తమిళనాడులోని తూత్తుకుడి జిల్లా తిరుచెందూరు సమీపంలోని కులశేఖరపట్టణం వద్ద కొత్త రాకెట్ ప్రయోగ కేంద్రం నిర్మాణానికి ప్రధాని మోదీ బుధవారం శంకుస్థాపన చేశారు. తేలికపాటి, మధ్యతరహా రాకెట్లను ప్రయోగించేందుకు అనువుగా దీన్ని నిర్మిస్తున్నారు. తూత్తుకుడి హార్బర్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ రాకెట్ ప్రయోగకేంద్రం నిర్మాణానికి ప్రధాని శంకుస్థాపన చేశారు. అలాగే, రూ.17,300 కోట్ల వ్యయంతో తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో వివిధ అభివృద్ధి పనులకు కూడా ఈ సందర్భంగా ప్రధాని శ్రీకారం చుట్టారు. కేంద్రప్రభుత్వం తమిళనాడులో ఎన్నో అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నా.. ఆ వివరాలను ప్రసార మాధ్యమాల్లో రాకుండా డీఎంకే ప్రభుత్వం అడ్డుకుంటోందని ఇదే సభలో మోదీ ఆరోపించారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా రాష్ట్రాభివృద్ధికి పాటుపడతానని చెప్పారు. కాగా, ఇస్రో కొత్త రాకెట్ ప్రయోగ కేంద్రం శంకుస్థాపన సందర్భంగా తమిళనాడు ప్రభుత్వం పత్రికలకు ఇచ్చిన వాణిజ్య ప్రకటనల్లో చైనా రాకెట్‌ను ముద్రించడం వివాదం రేపింది. తిరునల్వేలిలో బీజేపీ నిర్వహించిన బహిరంగ సభలో మోదీ ఈ అంశాన్ని ప్రస్తావించారు. చైనా రాకెట్ ఫొటోను ముద్రించడాన్ని బట్టి డీఎంకే పాలకుల దేశభక్తి స్పష్టమవుతోందని ఎద్దేవా చేశారు.

'సిద్ధం' కాలేదు!

» జగన్ మేదరమెట్ల సభ 3 నుంచి 10కి వాయిదా
» జనసమీకరణపై నాయకుల నుంచి దక్కని భరోసా
» నేతల మధ్య సమన్వయ లోపంతో బెంబేలు
» ఎంపీల రాజీనామాలు.. టీడీపీలోకి భారీగా వలసలు

బాపట్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అంతన్నారు.. ఇంతన్నారు.. 400 ఎకరాల్లో సభ అన్నారు.. ఆరు జిల్లాల పరిధిలో 15 లక్షల మంది జనం వస్తారన్నారు.. మేనిఫెస్టో ప్రకటిస్తామనీ అన్నారు.. చివరకు తుస్సుమనిపించారు.. సీఎం జగన్ నిర్వహిస్తున్న చివరి 'సిద్ధం' సభ బాపట్ల జిల్లా అద్దంకి పరిధిలోని మేదరమెట్ల వద్ద మార్చి 3న జరుగుతుందని వైసీపీ అట్టహాసంగా ప్రకటించింది. అయితే ఆయా జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పరిస్థితులు పార్టీకి అనుకూలంగా లేవనే తత్వం బోధపడిందో.. నేతల మధ్య సమన్వయం లోపంతో జన సమీకరణ సాధ్యం కాదనే అనుమానం కలిగిందో.. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు ముందు పెట్టే సభ ఫ్లాప్ అయితే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని భయపడ్డారో.. సరైన కారణాలేవీ చెప్పకుండానే 'సిద్ధం' సభను మార్చి 3 నుంచి 10కి వాయిదా వేశారు. ఈ విషయాన్ని వైసీపీ పెద్దలు బుధవారం మేదరమెట్లలోని సభాస్థలి వద్దే ప్రకటించారు. మరోవైపు ఆయా జిల్లాల్లో వైసీపీ కీలక నేతల రాజీనామాల పర్వం కొనసాగుతోంది. బుధవారం ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పార్టీకి గుడ్‌బై చెప్పగా.. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అంతకుముందే వైసీపీతో తెగదెంపులు చేసుకున్నారు. రాజ్యసభ సభ్యుడు, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సైతం ఇటీవలే పార్టీని వీడారు. ఈ ముగ్గురు ఎంపీలు సిద్ధం సభ జరగాల్సిన జిల్లాల పరిధిలోని వైసీపీ కీలక నేతలే కావడం గమనార్హం. మరోవైపు టీడీపీ అభ్యర్థులను ప్రకటించాక వైసీపీ నుంచి వలసలు జోరందుకున్నాయి. ముఖ్యంగా గుంటూరుతో పాటు సిద్ధం సభకు వేదికగా నిలవనున్న బాపట్ల జిల్లాలో చేరికలు పోటెత్తడం కూడా అధికార పార్టీని కలవరపాటుకు గురిచేశాయి. మేదరమెట్ల ప్రాంతం అద్దంకి నియోజకవర్గ పరిధిలోకి వస్తుంది. ఇక్కడ వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు పతాకస్థాయిలో ఉన్నాయి. నిన్న మొన్నటి వరకు అద్దంకి వైసీపీ ఇన్‌చార్జిగా పనిచేసిన చైతన్య ఇటీవలే చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలవడం కూడా కారణంగా కనబడుతోంది

రాప్తాడు సభతో భయాందోళన...

రాప్తాడు సిద్ధం సభలో పాలకపార్టీ శ్రేణులు చేసిన అరాచకం రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల్లో ఆ పార్టీ ఉన్మాద చర్యలను చర్చకు నిలిపింది. 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకలు దాడితో పాటు బస్సుల కోసం సామాన్య జనం ఇక్కట్లు కూడా వైసీపీ గ్రాఫ్‌ను మరింత దిగజార్చాయి. వైసీపీ దుర్మార్గాలను జనం ఏవగించుకుంటున్నారనే రిపోర్టు పార్టీ పెద్దలకు చేరడంతోనే మేదరమెట్ల సిద్ధం సభను వాయిదా వేశారనే చర్చ నడుస్తోంది.

జంతర్ మంతర్ జాబితా

» ఐదు పేర్లతో వైసీపీ 8వ లిస్టు

అమరావతి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): 'మార్పులు చేర్పులు ముగిశాయి. అభ్యర్థుల ఎంపిక పూర్తయిపోయింది' అని వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి ప్రకటించిన మరుసటి రోజునే... 8వ జాబితా విడుదలైంది. బుధవారం రాత్రి మరి కొన్ని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు 'అభ్యర్థుల'ను ప్రకటించారు. ఇందులోనూ... పాత వాటికి సవరణలు, బదిలీలు, పాత నేతల బంధువులతో 'జంతర్ మంతర్' చేశారు. ఒంగోలు ఎంపీ స్థానానికి చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డిని ఎప్పుడో ఖరారు చేశారు. కానీ... ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి రాజీనామా చేసిన రోజునే చెవిరెడ్డి పేరుతో ప్రకటన విడుదల చేయడం గమనార్హం. ఇక... ముందు నుంచి అనుకున్నట్లుగానే గంగాధర నెల్లూరుకు డిప్యూటీ సీఎం కె.నారాయణ స్వామి బదులు ఆయన కుమార్తె కల్లత్తూర్ కృపాలక్ష్మిని ఇన్‌చార్జిగా నియమించారు. కందుకూరులో సిట్టింగ్ ఎమ్మెల్యే ఎం.మహీధర్‌రెడ్డిని తప్పించారు. కనిగిరి ఎమ్మెల్యే మధుసూదన్ యాదవ్‌ను కందుకూరుకు ట్రాన్స్‌ఫర్ చేశారు. నిజానికి... ఇటీవల కందుకూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా అరవింద యాదవ్ పేరు ప్రకటించారు. కానీ... పోటీకి ఆమె విముఖత వ్యక్తం చేయడంతో, మరో గత్యంతరం లేక కనిగిరి ఎమ్మెల్యేనే కందుకూరుకు బదిలీ చేశారు. గుంటూరు ఎంపీ సీటు సంగతీ అంతే. ఇక్కడ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు కుమారుడు వెంకట రమణను ఇదివరకే అభ్యర్థిగా ప్రకటించారు. కానీ.. ఆయన పోటీకి ఇష్టపడలేదు. ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అల్లుడు, పొన్నూరు ఎమ్మెల్యే కిలారు రోశయ్యను గుంటూరు ఎంపీ అభ్యర్థిగా నిర్ణయించారు. పొన్నూరు అసెంబ్లీకి అంబటి రాంబాబు సోదరుడు అంబటి మురళిని రంగంలోకి దింపారు. ఇలా ఎనిమిదో జాబితాలో ఐదు పేర్లు ప్రకటిస్తే... అవన్నీ బదిలీలు, సవరణలు, కుటుంబ సభ్యులతో కూడుకున్నవే.

గృహ ప్రవేశానికి ముందే కూలిన జగనన్న ఇల్లు






బాధిత దంపతులు

- బాధితుడు దివ్యాంగుడు
- నాసిరకంగా నిర్మించిన వైసీపీ నాయకుడు

రాయదుర్గం, ఫిబ్రవరి 28: అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గ కేంద్రంలో గృహ ప్రవేశానికి ముందే జగనన్న ఇంటి పైకప్పు కూలిపోయింది. పట్టణానికి చెందిన హేమజ్యోతి, ఆనంద్ దంపతులు గార్మెంట్స్ కంపెనీలో కార్మికులు. ఆనంద్ దివ్యాంగుడు. వారికి మల్లాపురం లే అవుట్‌లో జగనన్న ఇల్లు మంజూరైంది. ఇంటి నిర్మాణ పనులను తనకే అప్పగించాలని వైసీపీ నాయకుడు సత్యనారాయణ హుకుం జారీ చేయడంతో ఏమీ చేయలేక అప్పగించారు. ప్రభుత్వం ఇచ్చే సొమ్ము రూ.1.80 లక్షలు, అదనంగా రూ.1.30 లక్షలను బాధితులు ఆయనకు చెల్లించారు. పైకప్పు నిర్మాణ సమయంలో సిమెంట్ తక్కువగా వాడుతున్నట్లు గమనించి ప్రశ్నించారు. వారిని వైసీపీ నేత గద్దించడంతో ఏమీ అనలేక మిన్నకుండిపోయారు. మార్చి 2, శనివారం మంచిరోజు కావడంతో గృహ ప్రవేశానికి ఏర్పాట్లు చేసుకున్నారు. ఇంతలోనే మంగళవారం తెల్లవారుజామున ఇంటి ముందు భాగం పైకప్పు కుప్పకూలింది. ఇంటి లోపల గోడలు నెర్రెలిచ్చాయి. ఇంట్లో ఎవరూ లేనప్పుడు పైకప్పు కూలడంతో ప్రాణహాని తప్పింది. నాసిరకంగా నిర్మించి తమ సొంత ఇంటి కలను ఛిద్రం చేశారని బాధితులు వాపోయారు.

వికసిత్ ఆంధ్రా-2047 డాక్యుమెంట్ అద్భుతం: సీఎస్

అమరావతి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు వికసిత్ ఆంధ్రా-2047పై నీతి ఆయోగ్ రూపొందించిన విజన్ డాక్యుమెంట్ అద్భుతంగా ఉందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి అన్నారు. బుధవారం అమరావతి సచివాలయంలో వికసిత్ ఆంధ్రా-2047పై ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్ల అవుతున్న సందర్భంగా అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దే లక్ష్యంలో ఏపీని కూడా 2047నాటికి అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దే కృషికి ఈ విజన్ డాక్యుమెంట్ దోహదపడుతుందన్నారు. పరిశ్రమలు, ఇంధన, వ్యవసాయ, మౌలిక సదుపాయాలు, సేవలు, గ్రీన్ ఎకానమీ నగరాల అభివృద్ధి వంటి అంశాల్లో రాష్ట్రాభివృద్ధికి ఈ డాక్యుమెంట్ అమలు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. దేశంలో రెండో పెద్ద తీరప్రాంతాన్ని కలిగిన ఏపీలో ఓడరేవులతో పాటు పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. ఈ డాక్యుమెంట్‌పై సీఎంకు ప్రజెంటేషన్ ఇచ్చి, దీని అమలుకు ఆమోదం తీసుకోనున్నట్టు వివరించారు.

జగన్ బీజేపీ నాయకుడే!

- రేపు తిరుపతిలో హోదా డిక్లరేషన్ సభ
- రాష్ట్రం పాతికేళ్లు వెనక్కి: షర్మిల



అమరావతి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బీజేపీ నాయకుడేనని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి స్పష్టం చేశారు. వైసీపీని అందరూ బీజేపీకి 'బీ' టీంగా చిత్రిస్తున్నారని.. కానీ బీజేపీలోనే వైసీపీ ఉందని ఆరోపించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తానంటూ నరేంద్ర మోదీ తిరుపతి బహిరంగ సభలో హామీ ఇచ్చిన చోటే.. శుక్రవారం ప్రత్యేక హోదా డిక్లరేషన్ పేరిట బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. బుధవారం విజయవాడలో పీసీసీ కార్యాలయం ఆంధ్రరత్న భవన్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. హోదా సాధించకపోవడం వల్ల రాష్ట్రం పాతికేళ్లు వెనక్కి పోయిందన్నారు. ఉద్యోగాల భర్తీ ఇదే తరహాలో కొనసాగితే.. రాష్ట్రంలో యువత కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రత్యేక హోదాతోనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని.. ఇది రాష్ట్రానికి సంజీవని వంటిదని చెప్పారు. రాజకీయం కోసం ప్రతిపక్షంలో ఉండగా జగన్ దీనిని వాడుకున్నారని, దీక్షలు కూడా చేశారని.. మూకుమ్మడిగా లోక్‌సభ సభ్యులు రాజీనామా చేస్తే కేంద్రం దిగివచ్చి ప్రత్యేక హోదా ఎందుకివ్వదంటూ ప్రశ్నించారని గుర్తుచేశారు. తీరా అధికారంలోకి వచ్చాక ఒక్క ఎంపీతోనైనా రాజీనామా చేయించారా అని ప్రశ్నించారు. చంద్రబాబు, జగన్ తమ రాజకీయ లబ్ధి కోసం ప్రజా హక్కు హోదాను కేంద్రానికి తాకట్టు పెట్టేశారని ఆరోపించారు. '2014లో ఢిల్లీని తలపించే రాజధాని నిర్మాణం చేస్తానని మోదీ హామీ ఇచ్చారు. ఆ హామీ ఏమైంది? హోదా ఇచ్చాక ఉత్తరాఖండ్‌లో 2,000 పరిశ్రమలు వచ్చాయి. ఇక్కడ జగన్ వచ్చాక పట్టుమని పది పరిశ్రమలైనా వచ్చాయా? రాష్ట్రంలో 972 కిలోమీటర్ల తీరప్రాంతం ఉంది. వాటి ఆధారిత పరిశ్రమలు వచ్చాయా? రాష్ట్రాన్ని హార్డ్‌వేర్ హబ్ చేస్తానంటూ మోదీ చేసిన ప్రకటన ఏమైంది' అని ప్రశ్నలవర్షం కురిపించారు. జగన్ పాలనలో లిక్కర్, శాండ్, మైనింగ్ మాఫియా పేట్రేగిపోతున్నాయని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించగా.. మాఫియా గురించి కేంద్రంలోని వారందరికీ తెలుసని.. కానీ ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన కేంద్ర ప్రభుత్వం ఎందుకు కేసులు పెట్టడం లేదో అందరికీ అర్థమవుతోందన్నారు. జగన్ బీజేపీ నాయకుడు కాబట్టే ఆయనపై క్రిమినల్ చర్యలు తీసుకోవడం లేదని షర్మిల మండిపడ్డారు.

అభ్యర్థుల ఎంపికలో షర్మిల రెడ్డి

సార్వత్రిక ఎన్నికల్లో లోక్‌సభ, అసెంబ్లీ అభ్యర్థుల వడబోతలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి బుధవారమంతా బిజీగా ఉన్నారు. ఆంధ్రరత్నభవన్‌లో ఆమె కాంగ్రెస్ తరఫున పోటీ చేసేందుకు దరఖాస్తులు చేసుకున్న ఆశావహులతో వ్యక్తిగతంగా మాట్లాడారు. ఏడు లోక్‌సభ స్థానాలు... నర్సాపురం, ఏలూరు, నరసారావుపేట, బాపట్ల, గుంటూరు, మచిలీపట్నం నియోజకవర్గాల దరఖాస్తుదారులతో మాట్లాడారు. అదేవిధంగా ఈ పార్లమెంటుస్థానాల పరిధిలోని 49 అసెంబ్లీ నియోజకవర్గాలలో పోటీ చేసేందుకు అప్లికేషన్ పెట్టుకున్న 280 మంది దరఖాస్తుదారులతో షర్మిలరెడ్డి చర్చించారు. ఈ వడబోత ప్రక్రియ రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగింది. కాగా, గురువారం మరో తొమ్మిది లోక్‌సభ స్థానాలకు దరఖాస్తు చేసిన నేతలు.. 63 అసెంబ్లీ నియోజకవర్గాల దరఖాస్తుదారుల అభ్యర్థిత్వాలను షర్మిలరెడ్డి పరిశీలిస్తారు.

రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఓటేయాలి

- అడ్డొచ్చే వాళ్లను సైకిల్‌తో తొక్కుకుంటూ పోవాలి
- టీడీపీ హయాంలో అభివృద్ధిలో ఏపీ నంబర్‌వన్
- వైసీపీ పాలనలో గంజాయి, ఇసుక, మద్యం మాఫియాలో నంబర్‌వన్
- అల్లూరి జిల్లాలో భువనేశ్వరి 'నిజం గెలవాలి' యాత్ర


అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో అనసూరి రాజారావు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న నారా భువనేశ్వరి

పాడేరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబునాయుడు పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో నంబర్‌వన్‌గా ఉంటే, ఇప్పుడు జగన్ పాలనలో గంజాయి, ఇసుక, మద్యం మాఫియాలో నంబర్‌వన్‌గా నిలిపారని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి విమర్శించారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా ఆమె బుధవారం అల్లూరి సీతా రామరాజు జిల్లాలో పర్యటించారు. పాడేరు మండలం ఆడారిమెట్ట గ్రామంలో నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మరో రెండు నెలల్లో ఎన్నికలు రానున్నాయని, మీ పిల్లల భవిష్యత్తు, రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఓటు అనే ఆయుధాన్ని బలంగా వాడాలని ఆమె పిలుపునిచ్చారు. చంద్రబాబుకు ప్రజలు, రాష్ట్రం మాత్రమే ముఖ్యమని, అందరం ఐక్యంగా ఆయన్ను ముఖ్యమంత్రిని చేసి రాష్ట్రాన్ని బాగు చేసుకుందామని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎవరు అడ్డువచ్చినా సైకిల్‌తో తొక్కుకుంటూ పోవాలని నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నాలుగున్నరేళ్లు టీడీపీ కార్యకర్తలను చాలా ఇబ్బంది పెట్టారని, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని నారా భువనేశ్వరి ఆవేదన వ్యక్తంచేశారు. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో బోరులో నీళ్లు రావడం లేదని హంసవేణి అనే మహిళ స్థానిక టీడీపీ నేతలకు వినతిపత్రం ఇచ్చిందనే కోపంతో వైసీపీ నాయకులు... ఆమె కళ్లు పీకేశారన్నారు. అలాగే శాండ్ మాఫియా అక్రమాలను అడ్డుకున్నాడని ఒక తెలుగుదేశం పార్టీ కార్యకర్తను చంపేశారన్నారు. ప్రజలు ఆలోచించాలని, చంద్రబాబు పాలనలో ఇలా ఎప్పుడైనా జరిగిందా?...అని ఆమె ప్రశ్నించారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

అరకులోయ/పాడేరు/జి.మాడుగుల, ఫిబ్రవరి 28: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు అరెస్టుతో మనస్తాపానికి గురై మృతిచెందిన కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని నారా భువనేశ్వరి హామీ ఇచ్చారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా ఆమె బుధవారం అల్లూరి సీతారామరాజు జిల్లాలో నలుగురి కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. తొలుత అరకులోయ మండలం మాదల పంచాయతీ మునిసిరిగుడ గ్రామానికి చెందిన సీనియర్ కార్యకర్త సొనాయి బసు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కాగా, రెండు రోజుల క్రితమే సొనాయి బసు భార్య కాసులమ్మ బ్యాంకు ఖాతాలో రూ.మూడు లక్షల ఆర్థిక సాయాన్ని జమ చేశారు. బసు ఇంటి బయట ఆవరణలో వేచి ఉన్న గ్రామ మహిళలను ఆప్యాయంగా పలకరించారు. పిల్లలకు చాకెట్లు ఇచ్చారు. అనంతరం జి.మాడుగుల మండలం లువ్వాసింగి పంచాయతీ చిట్టంపుట్టు గ్రామానికి వెళ్లి కోరాబు లక్ష్మణరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆ తరువాత మండల కేంద్రంలో అనసూరి రాజారావు ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ, మృతుల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెబుతూ అధినేత చంద్రబాబునాయుడు పంపించిన ఉత్తరంతో పాటు రూ.3 లక్షల చెక్‌లను అందజేశారు. అక్కడ నుంచి పాడేరు మండలం కిండంగిలోని ఓంద్రు నాగేశ్వరరావు ఇంటికి వెళ్లి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబీకులకు రూ.3 లక్షల ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యకర్తల కుటుంబాలను పరామర్శించిన అనంతరం ఆమె పాడేరులో మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.



అరకు కాఫీ ఎలా ఉంది!

- భువనేశ్వరికి చంద్రబాబు ట్వీట్

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): అరకు పర్యటనలో ఉన్న తన సతీమణి నారా భువనేశ్వరి.. అరకు కాఫీ రుచిచూస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో టీడీపీ అధినేత చంద్రబాబు స్పందించారు. 'మన గిరిజన సోదరులు పండించే అరకు కాఫీ రుచి ఎలా ఉందో చెప్పు భువనేశ్వరీ..' అంటూ బుధవారం చంద్రబాబు ట్వీట్ చేశారు. భువనేశ్వరి అరకు కాఫీ తాగుతున్న ఫొటోను కూడా జత చేశారు. దీనిపై భువనేశ్వరి స్పందించారు. 'మన కిచెన్‌లో అరకు కాఫీ ప్యాకెట్లు ఉన్నాయి. కానీ ఇక్కడ తాగినప్పుడు ఉన్న రుచి వేరుగా ఉంది. దానికి కారణం గిరిజన సోదర, సోదరీమణులు సాగు చేస్తుండటమే. ఇది గ్లోబల్ బ్రాండ్‌గా మారడం గర్వంగా ఉంది' అని ఆమె ఎక్స్‌లో సమాధానమిచ్చారు.



36 గంటలుగా 'ఉక్కు'లో ఆందోళన

- బయోమెట్రిక్‌పై వివాదం
- వేతన సవరణతో పాటు సమస్యలు పరిష్కరించాకే అమలు చేయాలంటున్న కార్మికులు
- పరిపాలనా భవనంలో 25 గంటల పాటు డైరెక్టర్ (పర్సనల్) దిగ్బంధం
- పరిపాలనా భవనం గేటు ముందు కార్మికుల బైఠాయింపు
- స్తంభించిన కార్యకలాపాలు


స్టీల్‌ప్లాంటు ప్రధాన పరిపాలనా భవనం గేటు ముందు బైఠాయించిన కార్మికులు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 28: విశాఖపట్నం ఉక్కు కర్మాగారంలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. వేతన సవరణతో పాటు ప్లాంటులో తగిన సౌకర్యాలు కల్పించిన తరువాతే బయోమెట్రిక్ అమలు చేయాలంటూ మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు చేపట్టిన ఆందోళనను కార్మికులు బుధవారం రాత్రి (36 గంటలు) కూడా కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం డైరెక్టర్ (పర్సనల్) ఎస్‌సీ పాండేను దిగ్బంధించిన కార్మిక సంఘాల నేతలు, రాత్రి ఆయన కార్యాలయంలోనే నేలపై నిద్రించారు. కార్మికులకు స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు కదిలేది లేదని తేల్చి చెప్పారు. మరోవైపు ప్లాంట్ పరిపాలనా భవనం బయట ఉద్యోగులు, కార్మికులు నిరసనకు దిగారు. దీంతో స్టీల్‌ప్లాంటు చరిత్రలో తొలిసారి వర్కింగ్ డే రోజున పూర్తిగా కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో సాయంత్రం హిల్‌టాప్ గెస్ట్ హౌస్‌లో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు సీఎండీ అతుల్‌భట్ సమాచారం ఇవ్వడంతో పర్సనల్ డైరెక్టర్ కార్యాలయం నుంచి ఉక్కు కార్మిక సంఘ నాయకులు బయటకు వచ్చారు. అయితే సీఎండీతో జరిగిన సమావేశంలో కార్మిక సంఘాలకు, యాజమాన్యానికి మధ్య అవగాహన కుదరలేదు. ఈ క్రమంలో సమావేశం వివరాలను నాయకులు వివరించే యత్నం చేసినప్పటికీ కార్మికులు వినలేదు. స్పష్టమైన హామీ వస్తేనే మాట్లాడాలని, లేదంటే మిమ్మల్ని కూడా ఇక్కడ నుంచి కదలనివ్వబోమని స్పష్టంచేశారు. దీంతో కార్మిక సంఘాల నేతలు మరోసారి చర్చలకు వెళ్లారు.

కార్మికులను చెదరగొట్టిన పోలీసులు

కార్మికులు 36 గంటలుగా ఆందోళన చేస్తున్న నేపథ్యంలో బుధవారం రాత్రి వందలాది మంది పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పరిపాలనా భవనంతోపాటు గెస్ట్‌హౌస్ గేటు ముందు ధర్నా చేస్తున్న కార్మికులను చెదరగొట్టారు. కొంతమందిని వాహనాల్లో ఎక్కించుకొని తీసుకువెళ్లారు. వందలాది మంది పోలీసులు ఒక్కసారిగా రావడం, వీరికి తోడు భారీ సంఖ్యలో సీఐఎస్ఎఫ్ సిబ్బంది ఉండడం...పైగా చిన్నపాటి లాఠీచార్జి చేయడంతో కార్మికులు భయంతో పరుగులు తీశారు.


హిల్‌టాప్ గెస్ట్‌హౌస్ వద్ద కార్మికులను వెళ్లిపోవలసిందిగా హెచ్చరిస్తున్న పోలీసులు

హిల్‌టాప్ గెస్ట్‌హౌస్‌లోనే సీఎండీ, డైరెక్టర్

ఉక్కు కార్మిక సంఘ నాయకులతో హిల్‌టాప్ గెస్ట్‌హౌస్‌లో సీఎండీ, డైరెక్టర్ బాగ్గి సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశంలో ఎటువంటి స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో.. సీఎండీ, డైరెక్టర్‌లను అక్కడ నుంచి వెళ్లనివ్వబోమంటూ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కార్మిక సంఘాల నాయకులు హిల్‌టాప్ గెస్ట్‌హౌస్ ఎంట్రన్స్ గేటు ముందు కూర్చున్నారు. దీంతో చేసేది లేక సీఎండీ, డైరెక్టర్‌లు గెస్ట్‌హౌస్‌లోనే ఉండిపోయారు. స్టీల్‌ప్లాంటు హెచ్‌ఆర్ అధికారి పరిపాలనా భవనం నుంచి బయటకు వచ్చే క్రమంలో కార్మికులు అడ్డుకున్నారు. ఈ సమయంలో వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో కోపోద్రిక్తులైన కార్మికులు...ఆయనపై దాడి చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఆయన్ను అక్కడ నుంచి బయటకు తీసుకువెళ్లారు.

శానిటరీ ప్యాడ్స్ పక్కదారి!

- ఆదోని వద్ద పొలంలో భారీగా నిల్వ
- విద్యార్థినులకు పంపిణీ చేయకుండా ఇక్కడెందుకో!?



ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 28: ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు అందాల్సిన శానిటరీ ప్యాడ్స్ (శానిటరీ న్యాప్కిన్స్) పక్కదారి పడుతున్నాయి. కర్నూలు జిల్లా ఆదోని పట్టణ శివారులోని భరత్‌నగర్ వద్ద ఓ పొలంలో వందలకొద్ది బాక్సుల్లో శానిటరీ ప్యాడ్స్ కనిపించాయి. అసలు వీటిని అక్కడ ఎవరు ఉంచారో? ఎందుకు ఉంచారో? ఎవరికీ తెలియడం లేదు. ప్రభుత్వ స్కూళ్లలో చదివే విద్యార్థినులకు ఉచితంగా శానిటరీ ప్యాడ్స్‌ను పంపిణీ చేస్తోంది. వాటిని నేరుగా జిల్లా విద్యాశాఖ నుంచే పాఠశాలలకు కాంట్రాక్టర్ల ద్వారా పంపిణీ చేయాలి. అలా కాకుండా వ్యవసాయ పొలంలో ఇలా లారీకి సరిపడా బాక్సులను దాచారు. పొలంలోని ఓ వ్యక్తిని విచారించగా అది ఆదోని మండలానికి సంబంధించింది కాదని, గూడూరుకు సరఫరా చేస్తున్నామని, స్థలం లేక పొలంలో నిలువ ఉంచినట్లు తెలిపారు. అయితే సదరు వ్యక్తి తన వివరాలను తెలిపేందుకు నిరాకరించారు. ఆదోని ఎంఈఓ శ్రీనివాసులును వివరణ కోరగా శానిటరీ ప్యాడ్స్‌ను ప్రభుత్వం నేరుగా జిల్లా కేంద్రాల నుంచి కాంట్రాక్టర్‌కు అప్పజెప్పి పాఠశాలలకు సరఫరా చేస్తుందన్నారు. పొలంలో వాటిని ఎందుకు దాచిఉంచారో విచారించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కాలుష్య నియంత్రణ మండలిలో పదోన్నతులు

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలిలో ఐదుగురు సీనియర్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్లకు జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్లుగా తాత్కాలిక పదోన్నతి కల్పించి, పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. పదోన్నతి పొందిన ఎం.రాజశేఖర్, పి.ప్రసాదరావుకు హెడ్ ఆఫీస్‌లో పోస్టింగ్ ఇచ్చారు. కె.రమేష్‌ను విశాఖపట్నం, ఎం.మునిస్వామినాయుడును విజయవాడ, ఎంవీఎస్. ప్రసాద్‌ను కర్నూలు జోనల్ ఆఫీస్‌ల్లో నియమించారు.

గురు వైభవ-2024 అవార్డులకు పలువురు ఎంపిక

మంత్రాలయం, ఫిబ్రవరి 28: గురువైభోత్సవాల్లో భాగంగా మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం అందజేసే అవార్డులకు పలువురు ప్రముఖులు ఎంపికయ్యారు. ఇందుకు సంబంధించిన వివరాలను మఠం ఏఏఓ మాధవశెట్టి బుధవారం వెల్లడించారు. మార్చి 12వ తేదీన రాఘవేంద్రస్వామి 403వ పట్టాభిషేకం, 16న 429వ రాఘవేంద్రస్వామి జన్మదిన వేడుకలను ఆరు రోజుల పాటు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖులకు గురువైభవ అవార్డులను అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. యోగేంద్ర కళామండపంలో జరిగే వైభోత్సవాల్లో అవార్డులు, ప్రశంసాపత్రం, నగదు, వెండి గిన్నె ఫలపుష్ప మంత్రాక్షింతలు, పరిమళ ప్రసాదం ఇచ్చి సన్మానిస్తామని ఏఏఓ తెలిపారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

భారత్ కొత్త సరిహద్దు

భారతదేశం నుంచి రోదసిలోకి వెడుతున్న గగన్‌యాన్ వ్యోమగాములను దేశానికి పరిచయం చేశారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. ప్రతి దేశానికి అభివృద్ధి విషయంలో సమయం ఆసన్నమవుతుందనీ, ఇప్పుడు వచ్చిందనీ అంటూ గతేడాది చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండర్ వాలిన ఘట్టాన్ని గుర్తుచేశారు. అభివృద్ధి అంతా తన హయాంలోనే జరిగిందని ఆయన నమ్ముతారు కనుక, అంతరిక్ష రంగంలో పదేళ్ళకు ముందు జరిగిన ప్రయోగాలను, ఇస్రో సాధించిన విజయాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించకపోవడం సహజం. నలభైయేళ్ళ తరువాత భారతీయులు అంతరిక్షంలోకి వెడుతున్నారు అని ఆయన మాటమాత్రంగా అన్నందుకు, నాలుగుదశాబ్దాల క్రితం రాకేశ్ శర్మ అంతరిక్షయానాన్ని, ఆ సందర్భంగా అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ప్రశ్నకు సమాధానంగా 'సారే జహాసే అచ్ఛా' అంటూ వచ్చిన జవాబును ఇప్పుడు చాలామంది గుర్తుచేసుకుంటున్నారు. ఎనిమిదిరోజుల పాటు అంతరిక్షంలో గడిపిన ఆ ఎయిర్‌ఫోర్స్ మాజీ పైలట్ శిక్షణపొందిన యూరీగగారిన్ కాస్మోనాట్ ట్రైనింగ్ సెంటర్‌లోనే ఇప్పటి గగనయాన వీరులూ శిక్షణ తీసుకున్నారు. అప్పటి యాత్ర సోవియట్ వ్యోమనౌకలో, ఇప్పుడు స్వదేశీ వాహనంలో.

భారత్–సోవియట్‌లు సంయుక్తంగా చేపట్టిన ఆ మిషన్ దేశ అంతరిక్ష పరిశోధనలకు ఊతం ఇచ్చినట్టుగానే, భారత వాయుసేనకు చెందిన గ్రూప్ కెప్టెన్ల ఈ గగనయానంతో దేశప్రతిష్ఠ ఇనుమడిస్తుంది, ప్రపంచంలో నాలుగోస్థానంలో నిలుస్తుంది. నలభైయేళ్ళలో దేశప్రధాని ఇస్రోను సందర్శించడం ఇదే తొలిసారని ఆ సంస్థ ఛైర్మన్ సంతోషిస్తున్నారు. ప్రధానుల రాకలూ, ప్రత్యక్ష వీక్షణాలు, ప్రసంగాలు, పరామర్శలతో నిమిత్తం లేకుండానే ఇస్రో దశాబ్దాలుగా స్వయంకృషితో చక్కగా ఎదిగివచ్చిందని ఆయనకు తెలియనిదేమీ కాదు. ఇక, ఈ నలుగురు వీరులను యాత్రకు సిద్ధం చేయడంద్వారా గగన్‌యాన్ విషయంలో దేశం మరో కీలకమైన ముందడుగువేసింది. గత ఏడాది అక్టోబర్‌లో క్రూ ఎస్కేప్ వ్యవస్థను ఇస్రో విజయవంతంగా పరీక్షించిన విషయం తెలిసిందే. అనుకోని అవాంతరాలు ఏర్పడిన పక్షంలో వ్యోమగాములను కాపాడుకొనేందుకు ఉద్దేశించిన వ్యవస్థ ఇది. వచ్చే ఏడాది యాత్రకు అన్ని ఏర్పాట్లూ వేగం పుంజుకుంటున్న తరుణంలో 2009లో ఓ పన్నెండున్నర వేలకోట్లతో అనుకున్నది ఇప్పటికి సాధ్యపడబోతున్నదని అర్థం. 2019 సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో 2018లో మోదీ ప్రభుత్వం దీనికి తొమ్మిదివేలకోట్ల కేటాయింపుతో తిరిగి పట్టాలెక్కించింది. ఆ ఏడాది స్వాతంత్ర్యదినోత్సవ ప్రసంగంలో 2022లోనే గగన్‌యాన్ అని మోదీ ప్రకటించారు. కరోనా సహా చాలా కారణాలతో అది సాధ్యపడలేదు. ముగ్గురు వ్యోమగాములను 400 కిలోమీటర్ల ఎత్తులోని అంతరిక్ష కక్ష్యలోకి పంపి, మూడురోజులు ఉంచి వెనక్కు క్షేమంగా తీసుకొచ్చే ఈ ప్రాజెక్టు నిజానికి అంగారక యాత్రకంటే, చంద్రయానం కంటే ఖరీదైనదీ, క్లిష్టతరమైనది కూడా.

గగనయానానికి ఎంపికైనవారిని దేశానికి ఇలా పరిచయం చేయడానికి కొద్దిరోజుల ముందే అంతరిక్షరంగంలో నూరుశాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతిస్తూ కేంద్రమంత్రివర్గం ఓ నిర్ణయం తీసుకుంది. 'ఇండియన్ స్పేస్ పాలసీ–2023' ఆశయాలకు, లక్ష్యాలకు అనుగుణంగా ఈ నిర్ణయం జరిగింది. అంతరిక్ష ఆర్థికంలో ప్రైవేటుభాగస్వామ్యం అత్యంత కీలకమైనదని, అంతరిక్షంలో వాణిజ్యపరమైన ఉనికిని పెంచుకోవడం దేశానికి ముఖ్యమని ఆ పాలసీ అంటున్నది కనుక, ఏ ఆటంకాలూ, ఆంక్షలూ లేని విదేశీపెట్టుబడుల ప్రవాహానికి దారులు తెరుచుకున్నాయి. ప్రైవేటురంగం భాగస్వామ్యాన్ని పెంచి, ఉపగ్రహాల నుంచి అంతరిక్ష నౌకల తయారీవరకూ సకలకార్యకలాపాలను ఉధృతం చేసేందుకు ఎఫ్‌డీఐ నిబంధనల సడలింపు దోహదం చేస్తుంది. అంతరిక్షమార్కెట్‌లో మన వాటా పెంచుకోవడానికి ఇతోధికంగా దోహదపడుతుంది. పెట్టుబడులతో పాటు పరిజ్ఞానం ఎంతమేరకు ప్రవహిస్తుందో తెలియదు కానీ, అత్యంత కీలకమైన, వ్యూహాత్మకంగా ముఖ్యమైన రంగంలోకి చిన్నాపెద్దా గ్లోబల్ సంస్థలను ప్రత్యక్షంగానో, పరోక్షంగానూ ప్రవేశించనీయడం సమంజసమేనా అన్నది ప్రధానం. భారత అంతరిక్ష అన్వేషణలూ, అధ్యయనాలు పెద్దదేశాలతో పోటీపడుతూ, పైచేయి సాధించడానికి ఉద్దేశించినవి కాదని, నేలమీద నిలబడి, సమాజంలోని సమస్యలను పరిష్కరించడానికి ఉద్దేశించినవని 1960లో విక్రమ్ సారాభాయ్ అన్నారట. దశాబ్దాలపాటు అదే దిశలో ప్రయాణం సాగింది కూడా. ఇప్పుడు శాస్త్రీయపరంగా కొత్త అన్వేషణలు, సామాజిక ప్రయోజనాల కంటే స్పేస్ సూపర్‌పవర్ అనిపించుకోవాలన్నదే ప్రధానంగా పాలసీలు తయారవుతున్నాయి. తదనుగుణంగా సొంత అంతరిక్ష కేంద్రం నిర్మాణం, చంద్రుడిమీద కాలూనడం వంటివి ప్రధానమవుతున్నాయి. ప్రపంచం మనవైపు చూడాలన్న కోరికా పెరుగుతోంది.

దృశ్యాల వెనుక అదృశ్య ప్రయోజనాలు!



అందరూ వేషాలు వేస్తారు, మాటలూ చెబుతారు. కానీ, అందరి పప్పులూ ఉడకవు. ఏమి చూపించినా, ఏమి చెప్పినా, జనానికి ఏమి కనిపించిందన్నదే ముఖ్యం. దర్పా ప్రదర్శించబోతాం, జనం మాత్రం దర్పాన్ని చూస్తారు. మంచితనం చూపబోతాం, మెతకదనమే కనిపించవచ్చు.

అప్పుడిక మార్గం ఏమిటంటే, ఎట్లా కనబడితే అనుకున్న ప్రయోజనం దొరుకుతుందో, అట్లా కనిపించగలగాలి. అదొక విద్య దానికో శాస్త్రం ఉంది. కొందరు నిపుణులున్నారు. ఈ ఇంద్రజాలికులు, జనం దృక్వలయంతో యథేచ్ఛగా విన్యాసాలు చేయగలరు. అబ్బురపరిచి, తన్మయపరిచి, వశీకరణం చేసుకోగలరు. వారు కనికట్టు చేసినప్పుడు, ఒక దృశ్యాన్ని చూసినప్పుడు పారవశ్యం కలుగుతుంది. మనకు కలిగే మనోభావాలు ఎవరో సంకల్పించి జొప్పించినవి అని కనిపెట్టలేము. నాడీమండలం పూర్తిగా పరాధీనం అయిపోతుంది. ఏది హితవో ఏది కాదో విచక్షణ ఉండదు.

నరేంద్రమోదీ ద్వారక దగ్గర చేసిన పని ఏదో, ఆయన కేవలం తన సొంత భక్తిలో భాగంగా చేసి ఉంటారని, లేదా, యథాలాపంగా జరిగి ఉంటుందని అనుకోలేము. ఆ ప్రక్రియ అంతటినీ దృశ్యీకరించి ప్రపంచంతో పంచుకున్నారు కాబట్టి, దానికి ఒక సార్వజనీన విలువ ఉంటుంది, ఒక ప్రయోజనమూ ఉంటుంది. ఆయనను అట్లా చూసిన ప్రజలు రకరకాల భావసంచలనాలను పొంది ఉంటారు. అట్లా పొందడం కోసమే ఆ సన్నివేశం ఏర్పడి ఉంటుంది. మోదీ వంటి నాయకుడి ప్రతిక్షణమూ, ప్రతిచర్యా అతి జాగ్రత్తగా ముందస్తు రూపకల్పనతో, నిర్దిష్ట లక్ష్యంతో నిర్మితమవుతుంది. అందుకోసం పెద్ద పటాలమే పనిచేస్తూ ఉంటుంది.

ఎన్నో రాచకార్యాలతో ఎంతో పనిఒత్తిడిలో ఉండే పదవిలో ఉన్నారు మోదీ. పైగా, ఎన్నికలు సమీపిస్తున్నందున, రాజకీయమైన పనిభారం కూడా ఆయన మీద చాలా ఉన్నది. వీటన్నిటి మధ్య ఆయన ద్వారక సందర్శన చేశారంటే, స్వామి కార్యంతో పాటు స్వకార్యం కూడా ఉండి ఉండాలి. ఈ మధ్య నరేంద్రమోదీ ఎక్కడికి ఏ అధికారిక, రాజకీయ కార్యక్రమానికి వెళ్లినా, అక్కడికి సమీపంలోని గుడులు గోపురాలను సందర్శిస్తున్నారు. రామ మందిర ప్రతిష్ఠకు ముందు అయితే, దేశ వ్యాప్తంగా అనేక దేవాలయాల్లో ఆయన ఆలయసేవ చేశారు, నిద్రచేశారు. వీటన్నిటిని గమనిస్తున్నవారు, ఆయన దేశానికి ప్రధానమంత్రా, ప్రధాన అర్చకుడా అని హాస్యాలు కూడా చేశారు. రెంటికి మధ్య సరిహద్దులు చెరిగిపోయే కాలంలో జీవిస్తున్నామని ఆ వేళాకోళాల వారికి తెలియనట్టుంది. మోదీ తమ పార్టీ బలాన్ని 370కి, కూటమి బలాన్ని 400కు పెంచే మహాకార్యంలో ఉన్నారు. ద్వారక సందర్శనతో సహా అన్ని ఆలయ పర్యటనలూ ఆ మహాకార్యంలో భాగాలే.

ఒక వయసు వచ్చిన తరువాత రామా, కృష్ణా అనుకోవాలని పెద్దవాళ్లు చెబుతుంటారు. పార్టీ సహచరులలో ముప్పాతిక వయసు వచ్చినవారందరినీ వానప్రస్థానికి పంపించివేసిన నరేంద్రమోదీ, తాను మాత్రం ముచ్చటగా మూడోసారి పదవికి సిద్ధపడుతున్నారు. పదవిలో ఉంటూ కూడా రామా, కృష్ణా అనుకోవడంలో ఆయనకు పుణ్యం, పురుషార్థం రెండూ ఉన్నాయి. అయోధ్య కార్యక్రమంతో రామస్మరణ జరిగింది, ద్వారక విన్యాసంతో కృష్ణ కృష్ణ అని కూడా అనుకున్నారు. మరోపక్క వారణాసిలో హరహరమహదేవుడు కూడా సిద్ధమవుతున్నాడు. ద్వారక శిథిలాలు ఉన్న సముద్ర భాగంలో నీటిలోపల మోదీ కూర్చుని, నెమలీకలు సమర్పించి భక్తి ప్రదర్శించిన దృశ్యాన్ని చూసి, చాలా మంది ప్రజలు పులకించిపోయి ఉంటారు. రామాలయాన్ని మోదీయే సాధించారని ఒక వాడుక స్థిరపడిన వాతావరణంలో, ఇప్పుడు మరో అవతార పురుషుడి రాజ్యస్థానంలో, ఎంతో ప్రమాదానికి సిద్ధపడి భక్తి ప్రదర్శించడం ఆయనను జన హృదయాలలో మరొక మెట్టు ఎక్కించింది. మ్లేచ్ఛ నామం కలిగిన అరేబియా సముద్రం నుంచి ద్వారకను పైకి తీసుకు రాగలిగిన ధీరుడు అని కూడా మోదీ మీద అంచనాలు పెరిగి ఉండవచ్చు. మోదీ అనే ఒక సజీవ విగ్రహాన్ని తాము సంకల్పించిన రూపురేఖలతో నిర్మించడానికి, వాటిని మెచ్చేటట్టుగా ప్రజలను తీర్చిదిద్దడానికి గత దశాబ్దంగా జరుగుతున్న ప్రయత్నాల్లో భాగంగానే ద్వారక రంగస్థలం రూపొందింది.



■ కె. శ్రీనివాస్

సందర్భం

> భక్తినివేదనను ఈ రూపంలో ప్రదర్శించి, ప్రచారం చేయడంలో నరేంద్రమోదీ ఉద్దేశం వ్యక్తిగతం కాదు. ఆయన వంటి రాజకీయనాయకుడు ప్రదర్శించే అన్ని వ్యక్తిత్వ లక్షణాలూ వాస్తవంలో ఉండనక్కరలేదు. హిమాలయాల్లో పర్వతగుహల్లో ధ్యానం చేయడం, సముద్రతీరంలో వాలుకుర్చీలో సేదతీరడం, సఫారీ వాహనం మీద వేటగాడి వేషంలో సంచరించడం, డిస్కవరీ ఇంటర్వ్యూ కోసం వనవిహారం చేయడం, సముద్రం ఒడ్డున స్వచ్ఛభారత్ చేయడం... బహుముఖ ప్రజ్ఞలు, సకల కళలు ఉన్న మహానాయకుడుగా మోదీ కనిపించి, ఆశ్చర్యపరుస్తారు. ధీరుడు, వీరుడు, కర్కశుడు, కారుణ్యమూర్తి, విహారి, వినోది, భక్తుడు, ఈ వ్యక్తిత్వాలను అన్నిటిని జనహృదయాలలో ప్రతిష్ఠించిన ప్రజాసంబంధాల ప్రచారవ్యవస్థను అభినందించవచ్చు.

అట్లాగని, నరేంద్రమోదీకి భక్తి లేదని కాదు. భక్తినివేదనను ఈ రూపంలో ప్రదర్శించి, ప్రచారం చేయడంలో ఉద్దేశం వ్యక్తిగతం కాదు. ఆయన వంటి రాజకీయ నాయకుడు ప్రదర్శించే అన్ని వ్యక్తిత్వ లక్షణాలూ వాస్తవంలో ఉండనక్కరలేదు. హిమాలయాల్లో పర్వత గుహల్లో ధ్యానం చేయడం, సముద్రతీరంలో వాలు కుర్చీలో సేదతీరడం, సఫారీ వాహనం మీద వేటగాడి వేషంలో సంచరించడం, డిస్కవరీ ఇంటర్వ్యూ కోసం వన విహారం చేయడం, సముద్రం ఒడ్డున స్వచ్ఛభారత్ చేయడం... బహుముఖ ప్రజ్ఞలు, సకల కళలు ఉన్న మహానాయకుడుగా మోదీ కనిపించి, ఆశ్చర్యపరుస్తారు. ధీరుడు, వీరుడు, కర్కశుడు, కారుణ్యమూర్తి, విహారి, వినోది, భక్తుడు, ఈ వ్యక్తిత్వాలను అన్నిటిని జన హృదయాలలో ప్రతిష్ఠించిన ప్రజాసంబంధాల ప్రచార వ్యవస్థను అభినందించవచ్చు.

వేషభాషలు, ఇతర ప్రదర్శనలు రాజకీయరంగంలో ఎప్పటినుంచో ఉన్నాయి. గాంధీజీకి తన ఆహార్యమే పెద్ద రాజకీయ ఆయుధం. చైనా నేత మావోసేటుంగ్ 1960 దశకం మధ్యలో కమ్యూనిస్టు పార్టీలో బలహీన పడినప్పుడు, 73వ ఏట యాంగ్సీ నదిని మరోసారి ఈది, తన దృఢత్వాన్ని ప్రదర్శించాడు. ప్రజలకు తెలుగుదేశం పార్టీ ఆరంభదినాల్లో ఖాకీ డ్రెస్‌లోనూ, తరువాత కాషాయంలోను ఎన్టీయార్ ఉద్దేశించిన ప్రయోజనాలు రాజకీయమైనవే. బేఖాతరు జులాయి అధ్యక్షుడిగా కనిపించడం వల్లనే డొనాల్డ్ ట్రంప్ 2020లో ఓడిపోయారు. జో బైడెన్ తనను తాను అమెరికాకు అవసరమైన అనుభవశాలినని అనుకుంటుంటే, ప్రజలు మాత్రం ఇప్పుడు తడబడునడకల నీరస వృద్ధుడిగా చూస్తున్నారు.

భౌతిక శాస్త్రంలోనే కాదు, రాజకీయాలలోనూ 'ఆప్టిక్స్' దృశ్యనిర్వహణగా ఇప్పుడు మంచి డిమాండ్‌లో ఉన్నది. 'ఆప్టిక్స్'ను సమర్థంగా నిర్వహించాలని బీజేపీ అనుకోవడం సహజమే. అందుకు కావలసిన హంగు, సమర్థతా కూడా ఆ పార్టీకి ఉన్నాయి. మరి వ్యూహకర్తలు సంకల్పించిన దృశ్యాలను జనం వడగట్టుకోరా? ఆ కనికట్టులోకి అందరూ జారిపోతారా? మోదీ ద్వారక సన్నివేశాన్ని ప్రశంసాపూర్వకంగా చూసేవారు, నిజంగా ఆయన ప్రయత్నంలో రాజకీయ ఉద్దేశ్యాలు లేవని అనుకుంటారా? లేక, భక్తిని రాజకీయాలకు వాడుకోవడం కాక, రాజకీయాలనే భక్తివ్యాప్తికి ఉపయోగించుకుంటున్నారని మెచ్చుకుంటారా? ఆలయ సందర్శనల మధ్య విరామంలో, రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ లేదా గగన్‌యాన్ వ్యోమగాముల ప్రకటన కార్యక్రమంలోనో మోదీ కనిపిస్తారు. వైజ్ఞానిక, మౌలిక వసతుల అభివృద్ధివాదిగా ప్రదర్శిస్తున్న మరో ముఖాన్ని కూడా ప్రజలు సీరియస్‌గా తీసుకుంటారా? దైనందిన జీవితానికి ఎంతో కీలకమయిన అవసరాలను నెరవేర్చడంలో విఫలమైన నాయకుడి ముఖాన్ని మరచిపోతారా? ఓటు మీట నొక్కేముందు ఏ ముఖం వారికి గుర్తుకు వస్తుంది?

వాస్తవమైన, భౌతికమయిన కష్టనష్టాలు, స్థితిగతులు ప్రధానం కాకుండా, ఉద్వేగపూరిత ప్రపంచంలోకి పంపించడం ఈ ప్రక్రియల లక్ష్యం. చారిత్రక అన్యాయం, వర్తమానంలో దాని నివృత్తి, ఒక ప్రజాసమూహంపై కృత్రిమ ఆధిక్య ప్రదర్శన, ఇవన్నీ వాస్తవజీవితాన్ని మెరుగుపరిచేవి కావు. ద్వేషాన్ని కల్పించి,

> మ్లేచ్ఛ నామం కలిగిన అరేబియా సముద్రం నుంచి ద్వారకను పైకి తీసుకురాగలిగిన ధీరుడు అని కూడా మోదీ మీద అంచనాలు పెరిగి ఉండవచ్చు. మోదీ అనే ఒక సజీవ విగ్రహాన్ని తాము సంకల్పించిన రూపురేఖలతో నిర్మించడానికి, వాటిని మెచ్చేటట్టుగా ప్రజలను తీర్చిదిద్దడానికి గత దశాబ్దంగా జరుగుతున్న ప్రయత్నాల్లో భాగంగానే ద్వారక రంగస్థలం రూపొందింది.

అది లక్ష్యంగా చూపే కల్పిత శత్రువుని నిర్మూలించి, కృత్రిమ ఉపశమనాన్ని, బూటకపు విజయభావాన్ని పొందే మేధావరణంలో విచక్షణ, హేతువులకు ప్రవేశమే ఉండదు.

ఫోటో, వీడియో ఏదైనా కానీ, దృశ్యం అనేది బలమైన కమ్యూనికేషన్ సాధనం. అటువంటి దృశ్యంలో ఆలోచనాత్మక సందేశం కాక, ఉద్వేగాత్మక సందేశాన్ని దట్టించినప్పుడు, వీక్షకుల మనసులో అది ముద్రలనే వేస్తుంది. పదే పదే ఒకే ముద్ర పడినప్పుడు, ఆలోచనకు ఉద్వేగం అవకాశమివ్వనపుడు, ప్రజల ఎంపికలు వారిచేతిలో ఉండవు. మరబొమ్మలుగా మారిపోతారు. తమ మీద తాము అదుపుతప్పిపోతారు. రాజకీయ దృశ్యశాస్త్రజ్ఞులు దానినే కోరుకుంటారు. దీనికి ఔషధం ఏమిటి? ఉద్వేగం మీద ఆలోచన పైచేయి కావడం ఎట్లా? పారవశ్యం నుంచి, పూనకం నుంచి మనిషి విచక్షణాయుత హృదయాన్ని ఉద్ధరించడం ఎట్లా? ప్రతి దృశ్యం వెనుక ఉండే అసలు అర్థాన్ని ఆవిష్కరించడం ఎట్లా? మీడియాను వినోద సాధనంగా, సమాచార సాధనంగా మాత్రమే కాకుండా, ఒక రాజకీయ పరికరంగా కూడా అర్థంచేసుకోవాలి. ప్రతి అక్షరాన్ని, శబ్దాన్ని, దృశ్యాన్ని వడగట్టకుండా లోపలికి తీసుకోగూడదు, సంశయించకుండా స్వీకరించకూడదు.

దండకారణ్యంలో అప్రకటిత యుద్ధం!

దేశ ప్రజల మీద భారత రాజ్యం ఆకాశ యుద్ధానికి దిగింది. నాలుగేళ్ల క్రితం నుంచే ఛత్తీస్‌గఢ్ ఆదివాసుల మీద అప్పుడు రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కలిసి హెలికాప్టర్లలో బాంబింగ్‌ను మొదలుపెట్టాయి. ఇప్పుడు రాష్ట్రంలో కూడా బీజేపీ ప్రభుత్వం వచ్చాక ఈ యుద్ధం తీవ్రమైంది. దండకారణ్యంలో జరుగుతున్న ఈ వైమానిక యుద్ధానికి వ్యతిరేకంగా ఆదివాసులు నాలుగేళ్లుగా నిరాయుధ పోరాటాన్ని నడుపుతున్నారు.

దండకారణ్యంలో సహజ వనరులను కార్పొరేట్లకు ఇవ్వడానికి వ్యతిరేకంగా ఆదివాసీలు జరుపుతున్న పోరాటానికి పాటలను, కళారూపాలను అందించి సాంస్కృతిక రంగంలో పని చేయడానికి మూలవాసీ సాంస్కృతిక కళా మంచ్ ఏర్పడింది. ఈ సంస్థ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్పొరేట్ హిందుత్వ విధానాలను, వాటికి వ్యతిరేకంగా సాగుతున్న ఛత్తీస్‌గఢ్ ఆదివాసుల పోరాటాలను, వాటి మీద జరుగుతున్న వైమానిక యుద్ధాన్ని సమాజానికి తెలియజేయడానికి పని చేస్తున్నది.

ఛత్తీస్‌గఢ్‌లో సైనికీకరణ రూపంలో జరుగుతున్న ఈ యుద్ధానికి కారణం కార్పొరేటీకరణ. రాష్ట్రంలో 26 రకాల విలువైన ఖనిజ సంపదలు వున్నాయి. ఇక్కడ ఇనుము, బొగ్గు, బాక్సైట్, డోలమైట్, క్రోమెట్, మెగ్నీషియం, సున్నపు రాళ్లు, సిలికాన్, గ్రానైట్, లిథియం లాంటివి ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని కార్పొరేట్ కంపెనీలకు ఇచ్చేందుకు పథకాలు వేసుకొని అమలు చేస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో 31శాతం ఖనిజ సంపదలు, అటవీ సంపదలు ప్రభుత్వాలకు కోట్లాది ఆదాయాన్ని ఇస్తున్నాయి. కానీ ఈ ఆదాయాన్ని ఆదివాసీ ప్రజల మౌలిక అవసరాలకు కేటాయిస్తున్నది మాత్రం చాలా తక్కువ. దీన్ని అధికారంలో వున్న రాజకీయ నాయకులు, అధికారులు, కార్పొరేట్ కంపనీలు, సామ్రాజ్యవాదశక్తులు కలిసి దోచుకుంటున్నాయి.

ఇప్పుడు ఛత్తీస్‌గఢ్‌లో విష్ణుదేవ్ సాయి బీజేపీ అధికారంలోకి రావడంతో డబల్ ఇంజన్ బుల్డోజర్ సర్కార్ కార్పొరేట్లకు నమ్మకమైన సేవకురాలిగా, వాళ్లకు అనుకూలమైన విధానాలను అమలు చేస్తున్నది. ఛత్తీస్‌గఢ్ బొగ్గు గనులను అదాని కంపెనీలకు ఇచ్చింది. ఐటిఐ ట్రైనింగ్ టాటా కంపెనీకి ఇచ్చింది. ఎన్ఎండిసి బైలాడిల్లా కంపెనీని ప్రైవేటీకరణ చేసేందుకు తయారుగా వుంది. ఇందుకుగాను లక్షల కోట్ల రూపాయల ఒప్పందాలు జరగనున్నాయి. గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, ఇప్పుడు వచ్చిన బీజేపీ ప్రభుత్వాలు గత నాలుగేళ్లుగా 104 ఎంఓయూలను చేసుకున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో ప్రభుత్వాలు చేసుకున్న ఒప్పందాల ప్రకారం ఆ కంపెనీలకు అన్నిరకాల సౌకర్యాలు త్వరగా పూర్తి చెయ్యాలి. కార్పొరేట్లకు అనేక రకాల సౌకర్యాలు కల్పించేందుకే బస్తర్‌లో సైనికీకరణ – ప్రైవేటీకరణలో భాగంగా ప్రభుత్వం ప్రజలపై యుద్ధం ప్రకటించింది.



దండకారణ్యంలో నెలకొన్న యుద్ధ పరిస్థితిపై వాస్తవాలను వెలికి తీయడానికి, ఆదివాసులకు సంఘీభావం తెలియజేయడానికి రచయితలు, విద్యార్థులు, ప్రజాస్వామికవాదులు ఇక్కడికి వచ్చి క్షేత్ర పరిశీలన చేయాలి. ఇది కేవలం ఆదివాసుల పోరాటమే కాదు. హిందుత్వ కార్పొరేట్ శక్తులపై సాగుతున్న ఫాసిస్టు వ్యతిరేక పోరాటం.

బస్తర్ సంబాగ్‌లో గత నాలుగేళ్ళుగా కొత్తగా నిర్మించే పోలీసు క్యాంపులకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడుతున్నారు. ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో గ్రామ సభ అనుమతి లేకుండానే రాత్రికి రాత్రి పెద్దయెత్తున బలగాలు వచ్చి పోలీసు క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. ప్రశ్నించే ప్రజల్ని పోరాడే ప్రజల్ని బూటకపు కేసులతో అరెస్టులు చేసి నక్సలైట్ కేసుల పేరుతో జైళ్లలో పెడుతున్నారు. ప్రజల్ని భయాందోళనలకు గురిచేసేలా బూటకపు ఎదురు కాల్పుల్లో ప్రజలను చంపేస్తున్నారు. ఇటీవల ఆరునెలల పసిపాపను కూడా హత్య చేశారు.

2021 ఏప్రిల్ 19న మొదటిసారిగా సుక్మా జిల్లాలోని పాలగూడెం, బొత్తిలంక, ఈతగూడెం గ్రామాల పరిసర అటవీ ప్రాంతంలో భారత సరిహద్దులో ఉపయోగించే డ్రోన్లతో బాంబులు వేశారు. రెండవసారి 2022 ఏప్రిల్ 14న సుక్మా జిల్లాలోని సాకిలేరు, చంద, ఇంకాల్, మెట్టగూడెం గ్రామాల మధ్య డ్రోన్లతో బాంబులు వేశారు. మూడవసారి 2023 జనవరి 11న ఇదే జిల్లాలోని బొట్టెం, ఎర్రం గ్రామాల మధ్య హెలికాప్టర్లలో వచ్చి విచ్చలవిడిగా కాల్పులు జరుపుతూ డ్రోన్లతో బాంబింగ్ చేసారు. ఈ దాడిలో ఒక మహిళ చనిపోయింది. మరికొందరు గాయపడ్డారు. నాల్గవ సారి 2023 ఏప్రిల్ 7న సుక్మా–బీజాపూర్ జిల్లాల సరిహద్దుల్లో మీనగట్ట, జబ్బాల్, కావుర్గట్ట, బొట్టెం, గుండం గ్రామాల మధ్య డ్రోన్ల ద్వారా పెద్ద ఎత్తున బాంబింగ్ చేస్తూ, మరొక వైపు హెలికాప్టర్లతో విచ్చలవిడిగా కాల్పులు జరిపారు. ఈ దాడులన్నీ కేవలం ప్రజా గెరిల్లా విముక్తి సైన్యాన్ని లక్ష్యంగా చేసుకొని జరిగినవి కావు. ప్రజలను లక్ష్యంగా చేసుకొని జరిగిన దాడులే.

2024 ప్రారంభం నుండే కార్పెట్ సెక్యూరిటీ విస్తరణలో భాగంగా ఛత్తీస్‌గఢ్ వ్యాప్తంగా వేలాది బలగాలను మోహరించి పదుల సంఖ్యలో కొత్తగా క్యాంపులు నిర్మాణం చేసారు. అందులో భాగంగా సుక్మా జిల్లాలోని దూలోడ్, మెట్టగూడెం గ్రామాల మధ్య క్యాంపు ఏర్పాటు చేసి జనవరి 13న రాకెట్ లాంచర్లతో దాని చుట్టుపక్కల ఉన్న గ్రామాలను, అడవులను లక్ష్యంగా చేసుకొని పెద్ద ఎత్తున దాడులు చేసారు. ఈ దాడుల్లో ప్రజలు చెల్లాచెదురై పరుగెత్తుతూ తమ ప్రాణాల్ని కాపాడుకున్నారు. జనవరి 30న బీజాపూర్ జిల్లాలోని టేకులగూడెం పోలీసు క్యాంపు నుండి అర్ధరాత్రి ప్రజలందరు నిద్రించే సమయంలో అకస్మాత్తుగా రాకెట్ లాంచర్లతో విచ్చలవిడిగా దాని చుట్టుపక్కల గ్రామాలపై షెల్లింగ్ చేయడంతో క్యాంపునకు 5కి.మీ దూరంలో ఉన్న పువ్వారు గ్రామంలోని ప్రజల నివాస స్థలాలకు 10మీటర్ల దూరంతో పడి అవి పేలాయి. ప్రజలు చిన్న పిల్లలనూ, వృద్ధులనూ మోసుకొని పరుగులు తీసారు. ఇలా విచ్చలవిడిగా కాల్పులు చేస్తూ ఈ మధ్య కాలంలో 10 మందికి పైగా ప్రజలను హత్య చేసారు.

వేలాది పోలీసు బలగాలు పగలంతా రోడ్ల నిర్మాణాలకు రక్షణగా ఉంటూ కూంబింగ్ పేరుతో అడవులను గాలిస్తూ విచ్చలవిడి కాల్పులు జరుపుతూ ప్రజలెవరిని ఇండ్లల్లో నుండి బయటకు రాకుండా భయోత్పాతాన్ని సృష్టిస్తున్నాయి. మహిళలపై అత్యాచారాలకు అంతు లేకుండా పోయింది. దండకారణ్యంలోని ఆదివాసీలపై అప్రకటిత యుద్ధం కొనసాగుతున్నది. ఈ దాడులపై ప్రజలు తమ నిరసనను తెలియజేసే అవకాశం లేకుండా ఇక్కడ యుద్ధ పరిస్థితి నెలకొన్నది. ఇక్కడున్న నిర్బంధాన్ని ఇతర ప్రాంతాలకు తెలియజేయకుండా మీడియాను భయపెట్టి నియంత్రణలో ఉంచుకొని కేవలం పోలీసు అధికారులు ఇచ్చే ప్రకటనలే ప్రసారం అయ్యేలా కట్టడి చేస్తున్నారు. దండకారణ్యంలో ప్రజలపై కొనసాగుతున్న అమానవీయ యుద్ధంలో భాగంగా హత్యలను, అత్యాచారాలను ప్రపంచానికి తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఈ వాస్తవాలను వెలికి తీయడానికి వారికి సంఘీభావం తెలియజేయడానికి రచయితలు, విద్యార్థులు, ప్రజాస్వామికవాదులు ఇక్కడికి వచ్చి క్షేత్ర పరిశీలన చేయాలి. ఇది కేవలం ఆదివాసుల పోరాటమే కాదు. హిందుత్వ కార్పొరేట్ శక్తులపై సాగుతున్న ఫాసిస్టు వ్యతిరేక పోరాటం. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల సందర్భంగా దండకారణ్య ప్రాంతంలో కార్పొరేట్ దోపిడీని, ఆదివాసులపై సైనిక, వైమానిక యుద్ధాన్ని చర్చనీయాంశం చేయాలని కోరుతున్నాం.

◆ కురుసం శంకర్
మూలవాసీ సాంస్కృతిక కళామంచ్

మధ్యంతర భృతి లేనట్టేనా?

ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీ ఇవ్వాలి. ప్రభుత్వ ఉత్తర్వుల లోనే ఇది ఉంది. దీన్నే అమలుపరచడంలో ప్రతి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తూనే ఉంది. ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే ఆనవాయితీని కొనసాగిస్తోంది. ఈ ప్రభుత్వం పదేళ్లకే పీఆర్సీ అంటూ కొత్త విధానానికి తెరలేపి ఉద్యోగ, ఉపాధ్యాయుల నోరు మూయించి, కొత్త డిమాండ్‌కు శ్రీకారం చుట్టింది. ఆ డిమాండ్‌ను పరిష్కరించుకోవడం కోసం సంఘాలు నానా యాతనలు పడ్డాయి. ఉన్న సమస్యలను పక్కనపెట్టి ఐదేళ్లకే పీఆర్సీ అనే కొత్త డిమాండ్‌ను ప్రభుత్వం పరిష్కరిస్తున్నట్లు ఉద్యోగ సంఘాలు ఆర్భాటంగా ప్రకటించాయి. అయితే ప్రస్తుతం మధ్యంతర భృతి (ఐఆర్) లేని పిఆర్సీనే ఉంటుందన్నది ప్రభుత్వ వాదన. కానీ మధ్యంతర భృతి ఎందుకు ఇస్తారన్న విషయాన్ని అటు సంఘాలు, ఇటు ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్చించకపోవడం వల్లే సమస్యను కొలిక్కి తీసుకురాలేకపోయాయి. దీంతో ఉద్యోగులకు అన్యాయం జరగనున్నది.



పీఆర్సీ కమిటీ వేశాక సకాలంలో వేతన స్థిరీకరణ జరగకపోతే ప్రతిఫలంగా మంజూరయ్యే భృతినే మధ్యంతర భృతి అంటారు. పెరిగిన ధరలు, ద్రవ్యోల్బణం సమాంతరం చేయడం కోసమే ఐఆర్ మంజూరు చేస్తారు. 2023 జూలై 1 నుంచి కొత్త పీఆర్సీ అమలుచేయాలి. కానీ ఇప్పటివరకు ఎనిమిది నెలలు గడిచినా పీఆర్సీ ఆలస్య కాలానికి మధ్యంతర భృతి లేదు. ప్రభుత్వం డిసెంబర్ లోపు కమిటీ నివేదిక తెప్పించుకోవాల్సింది, కానీ అది జరగలేదు. అందుకే మధ్యంతర భృతి ఇవ్వాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నా ఫలితం లేదు.

రిటైర్డ్ ఐఎఎస్ అధికారి డా. మన్మోహన్ సింగ్‌ను 12వ పీఆర్సీ కమిటీ ఛైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వం జూలై, 2023లో నియమించింది. ఎనిమిది నెలలు గడిచిన తర్వాత సిబ్బందిని నియమిస్తూ 22 ఫిబ్రవరి, 2024న ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఆలస్యానికి ఉద్యోగులు బాధ్యులు కారు, కాబట్టే మధ్యంతర భృతి డిమాండ్ చేస్తున్నారన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలి. సంవత్సరంలో నివేదిక అందించాలని ప్రభుత్వం సూచించినా, ఇప్పటికే 8 నెలలు గడిచినందున సకాలంలో నివేదికొచ్చే అవకాశం లేదు. ఈ విషయాలన్నీ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు సమావేశాల్లో ప్రస్తావించి ఉంటే మధ్యంతర భృతికి బలం చేకూరేది.

ఇప్పటివరకు ఏపీలో మధ్యంతర భృతి లేని పీఆర్సీ లేదు. గత పీఆర్సీలను పరిశీలిస్తే– 9వ పీఆర్సీలో 22 శాతం, 10వ పీఆర్సీలో 27 శాతం, 11వ పీఆర్సీలో 27 శాతం ఐఆర్ ఇచ్చారు. పీఆర్సీ ఆలస్యమైన ఆరు నెలల్లోనే మధ్యంతర భృతి ప్రకటించారు. 12వ పీఆర్సీ అమలు ఇప్పటికీ ఎనిమిది నెలలు ఆలస్యమైనా మధ్యంతర భృతి ఇవ్వలేదు. దీంతో పెరిగిన ధరల కనుగుణంగా, ద్రవ్యోల్బణ సూచిక ఆధారంగా పెరగాల్సిన వేతనాలు చేజారిపోతాయి. రాబోయే కాలంలో పీఆర్సీ కనుమరుగయ్యే ప్రమాదం ఉంటుంది. ప్రభుత్వాలు సకాలంలో పీఆర్సీ ఇవ్వకపోవడం వల్ల ఇప్పటికే రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయులు ఒక విడత పీఆర్సీ అంత నష్టపోయారు. మధ్యంతర భృతికి మంగళం పాడితే పీఆర్సీకి మంగళం పాడినట్లే. పీఆర్సీలో ఫిట్‌మెంట్.. ఐఆర్ మీద ఆధారపడి ఉంటుంది. ఐఆర్ లేనప్పుడు ఫిట్‌మెంట్ నిర్ణయించడంలో ఉద్యోగులకు అన్యాయం జరుగుతుంది. దీన్ని సమాంతరం చేయడం సున్నితమైన అంశం. ఆర్థిక అంశాలను, ధరల సూచికలను పరిశీలించి, కొత్త పీఆర్సీ కమిటీ ఛైర్మన్ ప్రభుత్వానికి ఐఆర్ శాతాన్ని ప్రతిపాదించాలి. తదుపరి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపి కమిటీ నివేదికను సమర్పించాలి. కొత్త కమిటీ గత పీఆర్సీల్లో అనుసరించిన సంప్రదాయాలను పరిశీలించాలి. 30 శాతం కంటే తక్కువ లేని ఐఆర్ ప్రతిపాదించాలి. వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నుంచి ప్రతిపాదన నివేదికలు, జిల్లాల వారీ సమావేశాలను ఏర్పాటు చేయాలి. మరొక్కసారి చర్చలు జరిపి స్తబ్దతను నివారించాలి.

■ సి.వి. ప్రసాద్
రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఏపీటీఎఫ్ అమరావతి

మీడియాపై కక్ష—ప్రజాస్వామ్యంపై దాడి

'సామాజిక వ్యవస్థను ఓ సినిమాలా ప్రేక్షకుడి కోణంలో చూస్తే ఈ దేశం అన్యాయాలకు పెట్టనికోటలా కనిపిస్తుంది. కచ్చితంగా అలానే అనిపిస్తుంది'. సరిగ్గా 104 సంవత్సరాల క్రితం, 31 జనవరి 1920నాడు 'మూక్‌నాయక్' జర్నల్ తొలి సంచిక కోసం అంబేడ్కర్ రాసిన తొలి కథనం ప్రారంభ వ్యాఖ్యలు నేటి వైసీపీ గూండాలు మీడియాపై చేస్తున్న దాడులకు అద్దం పడుతున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రజలకు మెరుగైన సేవలందించి వారి అభిమానం పొందాల్సిన వారు ప్రతీకారంతో, అధికార బలంతో మీడియాను అణచి వేసి దాడులు చేస్తూ బలపడాలనుకోవడం చేతకానితనం అవుతుంది. ప్రజల పక్షాన నిలుస్తున్న మీడియాపై దాడులకు పూనుకోవడం బాధాకరం. ప్రజల కోసం వినియోగించాల్సిన అధికారాన్ని మీడియా నోరు నొక్కేందుకు ఉపయోగించే వికృత సంస్కృతి మరోసారి బయటపడింది. వాదనలో నెగ్గలేనివారే భౌతిక దాడులకు దిగుతారు. తమకు వ్యతిరేకంగా మాట్లాడినా, రాసినా అంతు చూస్తామంటూ ప్రజాస్వామ్య సంస్థలను బెదిరించేవారు నియంతలు అవుతారు. కానీ ప్రజాస్వామ్యవాదులు కాజాలరు. ప్రజాస్వామ్యంలో నియంతలకు చోటుండదు.

ఒక చెట్టు నుంచి కొన్ని లక్షల అగ్గిపుల్లల్ని తయారు చేయొచ్చు! ఒక అగ్గిపుల్లతో లక్షల చెట్లను కాల్చి బూడిద చేయొచ్చు! అందుకే... వస్తువు గొప్పదనం కన్నా, దాని వినియోగం ముఖ్యమంటారు. అధికారం అడ్డం పెట్టుకొని మీడియాపై దాడులకు పాల్పడుతున్నారు. నేరస్వభావం ఉన్న ముఖ్యమంత్రి ఏలుబడిలో పౌరుల ప్రాథమిక హక్కులను హరించివేస్తున్నారు. ప్రజాస్వామ్యానికి మూలసూత్రం చట్టం ముందు అందరూ సమానమే. కానీ ఈ ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. చొక్కాలు మడత పెట్టండి అంటూ జగన్‌రెడ్డి సభల్లో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతో వైసీపీ కార్యకర్తలు మీడియా ప్రతినిధులు, మీడియా సంస్థలపై దాడులకు పాల్పడుతున్నారు. జగన్‌రెడ్డి ప్రతి సభలోనూ ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5 పేరెత్తకుండా సభ ముగించడంలేదు. అంటే వాటిపై ఆయనకు ఎంత అక్కసు ఉందో అర్థమౌతుంది. జగన్‌రెడ్డి నవరత్నాల పేరుతో చేస్తున్న మోసపు సంక్షేమాన్ని మీడియా సంస్థలు ఎండగట్టడాన్ని ఆయన తట్టుకోలేకపోతున్నారు. అంతేకాకుండా జగన్‌రెడ్డి అవినీతి, అక్రమాలు, భూకబ్జాలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తెస్తున్నారని మీడియాపై దాడులు చేయిస్తున్నారు. ప్రభుత్వ నిర్వాకాన్ని ప్రశ్నిస్తే, విమర్శిస్తే, నిరసిస్తే తట్టుకోలేక విచక్షణారాహిత్యంతో ప్రజాస్వామిక హక్కుల పీక నులిమి వేయడానికి సిద్ధపడింది జగన్ ప్రభుత్వం. ప్రశ్నించే గొంతులను, మీడియాను ఏదో ఒక విధంగా అణచివెయ్యడమే ఎజెండాగా పెట్టుకొన్నారు. కర్నూలులో కాటసాని సైకో గ్యాంగ్ ఈనాడు కార్యాలయంపై పోలీసుల సమక్షంలో దాడులు చేశారు. రాప్తాడు సభలో ఆంధ్రజ్యోతి విలేఖరిపై తీవ్రంగా దాడులు చేశారు. ఇది ఒక పత్రికా స్వేచ్ఛమీదే జరిగిన దుర్మార్గపు దాడి. పోలీసు యంత్రాంగం ఇప్పటివరకు దాడి చేసిన వారిని అరెస్టు చేయకపోవడం, కనీసం స్పందించకపోవడం చూస్తుంటే వారి పనితీరు ఏ విధంగా ఉన్నదో అర్థమవుతుంది. పాత్రికేయుల మీద దాడి చేయడం ప్రజాస్వామ్యంపై దాడి చేయడమే అవుతుంది. ప్రభుత్వ అవినీతి, అక్రమాలు ఎత్తిచూపడం మీడియా వృత్తి ధర్మం. వాటిని పట్టించుకోకుండా మీడియా మౌనంగా వుంటే ప్రభుత్వం చేస్తున్న నేరాలు, ఘోరాల్లో పాలు పంచుకున్నట్లే అవుతుంది.


> వాస్తవాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే వాహకాలు భయభ్రాంతులకు గురైతే ప్రజలకు నష్టం కలుగుతుంది. ఏమి రాస్తే, ఏమి చెబితే ఎప్పుడు ఎటునుంచి ఎవరు దాడిచేస్తారోనని మీడియా హడలిపోయే దుస్థితి వస్తే ప్రజాస్వామ్యానికి చెడ్డకాలం దాపురించినట్టే. ప్రజాస్వామ్యాన్ని కాపాడే పాత్రలో అందరూ కచ్చితంగా పాత్రికేయులకు అండగా నిలబడాలి.



ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా అన్న సామెత లాగా మీడియా వాచ్ పేరుతో ఆంక్షలు విధించాలని గతంలో జగన్ తండ్రి వైఎస్ రాజశేఖర రెడ్డి 2007లో జీవోని విడుదల చేస్తే, తండ్రి వారసత్వానికి కొనసాగింపుగా 2019లో జగన్ జీవోని విడుదల చేశారు. గతంలో ఏబీఎన్, టీవీ–5, ఈటీవీ ఛానళ్ల ప్రసారాలు నిలిపేయాలంటూ వైకాపా నాయకులు ఎంఎస్‌వోల మీద బలవంతంగా ఒత్తిడి తెచ్చారు. వాస్తవాలు ప్రజలకు చేరవేస్తున్నారన్న కక్షతో టీవీ–5 కార్యాలయంపై రాళ్ల దాడి, బీఆర్.నాయుడు, సాంబశివరావు, మూర్తి లాంటి సీనియర్ జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించారు. ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణపై అక్రమ కేసు బనాయించిన జగన్‌రెడ్డి పైశాచిక ఆనందం పొందారు. జగన్ సభలో శ్రీకృష్ణ అనే ఫోటోగ్రాఫర్‌పై దాడికి పాల్పడ్డా ఇంతవరకు బాధితులపై చర్యలు తీసుకోలేదు. తునిలో ఆంధ్రజ్యోతి విలేఖరి కాతా సత్యనారాయణ హత్యకు గురయ్యారు. చీరాలలో ఆమంచి కృష్ణమోహన్ విలేఖరిపై హత్యాయత్నం, కోనసీమలోని ఐ–పోలవరం ప్రజాశక్తి విలేకరిపై వైసీపీ కార్యకర్తల దాడి, నరసన్నపేట విశాలాంధ్ర విలేఖరిపై దాడులకు పాల్పడ్డారు. అమరావతి ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకువెడుతున్నారని కుట్ర పూరితంగా ముగ్గురు విలేఖరులపై అక్రమ కేసులు పెట్టారు. ఈటీవీ, ఏబీఎన్, టీవీ–5 ఛానళ్ల ప్రతినిధులను అసెంబ్లీ ప్రాంగణంలోకి రానివ్వకుండా అడ్డుకున్నారు. ప్రజల పక్షాన నిలుస్తున్న జర్నలిస్టులు, విలేఖర్లు, మీడియా, పత్రికలపై ప్రభుత్వం జులుం చెలాయించి పత్రికా స్వేచ్ఛను అణచివేసే ప్రయత్నం చేస్తోంది.


అర్థాన్ని ద్వేషించడం, అక్షరం పైన యుద్ధం ప్రకటించడం ఏ నాయకుడికైనా శ్రేయస్కరం కాదు. మీడియాపై ఆంక్షలు విధించే దుస్సాహసానికి ఒడిగట్టిన జగన్ మూల్యం చెల్లించుకోక తప్పదు. ఆయన పెత్తందారులను మించిపోవడమే కాదు నియంతలా వ్యవహరిస్తున్నారు. వాస్తవాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే వాహకాలు భయభ్రాంతులకు గురైతే ప్రజలకు నష్టం కలుగుతుంది. ఏమి రాస్తే, ఏమి చెబితే ఎప్పుడు ఎటునుంచి ఎవరు దాడిచేస్తారోనని మీడియా హడలిపోయే దుస్థితి వస్తే ప్రజాస్వామ్యానికి చెడ్డ కాలం దాపురించినట్టే. ప్రజాస్వామ్యాన్ని కాపాడే పాత్రలో అందరూ కచ్చితంగా పాత్రికేయులకు అండగా నిలబడాలి. ఆంధ్రప్రదేశ్‌లో మీడియాపై దాడిని ప్రజాస్వామ్య జీవన విధానంలో విశ్వాసం ఉన్న ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలి.

• కొత్తపల్లి శామ్యూల్ జవహర్
మాజీ మంత్రి





వైసీపీ అభ్యర్థులపై ఆ పార్టీ నేతల్లో అయోమయం నెలకొంది. ప్రకటించిన వారిలో కొందరికి చివరి వరకు తమనే అభ్యర్థిగా ఉంచుతారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరికొందరు అసలు నియోజకవర్గంవైపే కన్నెత్తి చూడటం లేదు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో వైసీపీలో నెలకొన్న పరిస్థితికి నిదర్శనమిది. ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు ఎవరన్న అంశంపై ఆ పార్టీ శ్రేణుల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో మొత్తం 14 స్థానాలకుగాను టీడీపీ - జనసేన కూటమి 10 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించింది. మరో రెండు స్థానాలను జనసేనకు కేటాయించనుంది. మిగిలిన రెండు స్థానాలపై స్పష్టత రావాల్సి ఉంది. వైసీపీలో మాత్రం విడతల వారీగా ఇన్‌చార్జుల జాబితాలను విడుదల చేస్తున్నా ఇంత వరకు ప్రకటించిన స్థానాలు 8 మాత్రమే. వాటిలో కూడా చివరి వరకు ఎవరు ఉంటారు? ఎవరిని తొలగిస్తారు? అని ఆ పార్టీ శ్రేణుల్లో సందిగ్ధత నెలకొంది. - (విజయవాడ - ఆంధ్రజ్యోతి)



వచ్చేదెవరో.. పోయేదెవరో..!?

వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జుల్లో అయోమయం

- కాపు నేతలపై వైసీపీ కన్ను
- వంగవీటి రాధాతో కొడాలి నాని, పేర్ని నాని భేటీ
- విజయవాడ పశ్చిమ ఇస్తామని ఆఫర్
- సున్నితంగా తిరస్కరించిన రాధా
- మైలవరం తెరపైకి లకిరెడ్డి కుటుంబసభ్యుల పేరు
- పెడన సీటు బూరగడ్డ వేదవ్యాస్‌కు..
- అవనిగడ్డ సీటు బుద్ధప్రసాద్‌కు ఆఫర్
- మంతనాలు చేస్తున్న పేర్ని నాని, బాడిగ రామకృష్ణ

పశ్చిమానికి 'షేక్'!

ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ పశ్చిమానికి షేక్ ఆసిఫ్‌ను ప్రకటించారు. ఇప్పటికే ఆయన నియోజకవర్గంలో ప్రచారం కూడా ప్రారంభించారు. అయితే చివరి నిమిషంలో ఆసిఫ్ స్థానంలో మరొకరు బరిలో నిలిచే అవకాశం ఉందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. టీడీపీ నేత జలీల్‌ఖాన్ కొద్ది రోజుల క్రితం అయోధ్యరామిరెడ్డిని కలిసి పశ్చిమ సీటు ఇస్తే వైసీపీలో చేరేందుకు సుముఖత చూపారన్న ప్రచారం జోరుగా సాగింది. తాజాగా మంగళవారం కొడాలి నాని, పేర్ని నాని.. వంగవీటి రాధాను కలిసి పశ్చిమ సీటు ఆఫర్ చేశారు. రాధా వారి ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఆసిఫ్ చివరి వరకు బరిలో ఉంటారా లేదా అన్నది అనుమానమే.

అవనిగడ్డకు మూడో పేరు

అవనిగడ్డలో ముచ్చటగా మూడో కృష్ణుడి పేరు తెరపైకి వచ్చింది. ఈ స్థానం నుంచి సిటింగ్ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌ను పక్కనపెట్టి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన పోటీకి విముఖత చూపడంతో ఆయన తనయుడు రాంచరణ్‌ను తెరపైకి తెచ్చారు. తాజాగా టీడీపీ నేత మండలి బుద్ధప్రసాద్‌తో వైసీపీ నాయకులు మంతనాలు చేస్తున్నారు.

ప్రకటించిన స్థానాలపై అనుమానం

- మైలవరానికి సర్నాల తిరుపతిరావును ప్రకటించారు. ఈయన చివరి వరకు బరిలో ఉండటం అనుమానమేనని సొంత పార్టీ శ్రేణులే అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. ఇక్కడి నుంచి జోగి రమేశ్, వల్లభనేని వంశీ పేర్లతోపాటు లకిరెడ్డి బాలరెడ్డి సోదరుడు హనిమిరెడ్డి కుటుంబం నుంచి ఒకరు పోటీ చేస్తారన్న ప్రచారం కూడా జరుగుతోంది.
- పెడన నుంచి ఉప్పాల రాము పేరు ప్రకటించగా ఆయన టికెట్ కూడా అనుమానమేనంటున్నారు. ఈ స్థానం నుంచి టీడీపీ టికెట్ ఆశించి భంగపడ్డ బూరగడ్డ వేదవ్యాస్‌ను వైసీపీలోకి ఆహ్వానించి ఆయనకు పెడన టికెట్ ఇస్తారన్న ప్రచారం జరుగుతోంది. ఇప్పటి వరకు ప్రకటించిన స్థానాల్లో విజయవాడ సెంట్రల్ నుంచి వెలంపల్లి శ్రీనివాసరావు, తిరువూరు నుంచి నల్లగట్ల స్వామి దాసు, మచిలీపట్నం నుంచి పేర్ని కృష్ణమూర్తి అలియాస్ కిట్టు, పెనమలూరు నుంచి జోగి రమేశ్ మాత్రమే చివరి వరకు బరిలో నిలిచే అభ్యర్థులుగా ఉన్నారు.

ప్రకటించాల్సిన స్థానాల్లో గందరగోళం

ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ తూర్పు నుంచి దేవినేని అవినాశ్, నందిగామ నుంచి మొండితోక జగన్మోహనరావు, జగ్గయ్యపేట నుంచి సామినేని ఉదయభాను పేర్లను ప్రకటించాల్సి ఉంది. కృష్ణా జిల్లాలో గుడివాడ నుంచి కొడాలి నాని, గన్నవరం నుంచి వల్లభనేని వంశీ, పామర్రు నుంచి కైలే అనీల్ కుమార్ పేర్లను ప్రకటించాల్సి ఉంది. వీరిలో కొడాలి నాని, వల్లభనేని వంశీ, సామినేని ఉదయభానుకు టికెట్లు ఉండవన్న ప్రచారం జరుగుతోంది. జగ్గయ్యపేట నుంచి బొల్లా శివరామకృష్ణ, కేశినేని శ్వేత పేర్లు వినిపిస్తున్నాయి. గన్నవరం నుంచి ముద్దరబోయిన వెంకటేశ్వరరావుకు దాదాపు ఖాయమని ప్రచారం జరుగుతోంది. గుడివాడ నుంచి కాపు లేదా ఎస్సీ సామాజికవర్గం వారికి అవకాశం ఇస్తారని ప్రచారం జరుగుతోంది.

పేర్నినాని, బాడిగ రామకృష్ణ మధ్యవర్తిత్వం

టీడీపీలో అసంతృప్తితో ఉన్న నేతలతో పేర్ని నాని, బాడిగ రామకృష్ణ మంతనాలు చేస్తున్నట్టు సమాచారం. మచిలీపట్నం ఎంపీ స్థానం నుంచి బాడిగ రామకృష్ణ కానీ ఆయన కుటుంబ సభ్యుల్లో ఒకరు వైసీపీ అభ్యర్థిగా బరిలో ఉంటారన్న ప్రచారం జరుగుతోంది. సింహాద్రి రమేశ్‌కు ఎక్కడా టికెట్ ఇవ్వకపోవచ్చని పార్టీ శ్రేణులు చెబుతున్న మాట. ఇటీవల బూరగడ్డ వేదవ్యాస్‌ను రామకృష్ణ కలిసి వచ్చారు. పేర్ని నాని.. మండలి బుద్ధ ప్రసాద్, వంగవీటి రాధాతో మాట్లాడి వారిని వైసీపీలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా వారికి సీట్లు కూడా ముందుగానే ఆఫర్ చేస్తున్నట్టు సమాచారం.

పిటిషన్ పరేషాన్!

ఇన్‌స్పెక్టర్లకు చేరని సమాచారం

- ఫిర్యాదులను తొక్కిపెడుతున్న ఎస్ఐలు, రైటర్లు
- కొత్త ఇన్‌స్పెక్టర్లు ఉన్న స్టేషన్లలో సిబ్బంది నయా పోకడ

ఓ మహిళ.. తన భర్త వేధిస్తున్నాడని దక్షిణ మండలంలోని పోలీసులకు ఫిర్యాదు చేసింది. మూడు రోజులుగా ఆమె తిరుగుతున్నా భర్త మాత్రం పోలీసుస్టేషన్‌కు రావడం లేదు. ఆమె రోజూ రాత్రిపూట వచ్చి స్టేషన్‌లో వేచి ఉండడంతో ఇన్‌స్పెక్టర్ గమనించారు. ఆమెను పిలిచి సమస్య ఏమిటని ప్రశ్నించారు. జరిగిన విషయం వివరించింది. రైటర్‌ను పిలిచి ఈ పిటిషన్ నా దృష్టికి ఎందుకు రాలేదని ప్రశ్నించారు. దీనికి ఏం చెప్పాలో తెలియక రైటర్ నీళ్లు నమిలారు.

యువకుడు బైక్ చోరీ అయిందని ఉత్తర మండలంలో ఓ పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. ఫిర్యాదు తీసుకుని పక్కన పెట్టేశారు. ఆ యువకుడు పోలీసులు చేయాల్సిన పని చేసి సీసీ కెమెరా ఫుటేజీని సేకరించి వారికి ఇచ్చాడు. దీని గురించి ఇప్పటి వరకు అతీగతి లేదు.

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : ఎన్టీఆర్ జిల్లాలో స్టేషన్లకు హౌస్ ఆఫీసర్లుగా ఇన్‌స్పెక్టర్లు ఉన్నప్పటికీ రైటర్లు, సెక్టర్ ఎస్ఐలు చక్రం తిప్పుతున్నారు. స్టేషన్లకు వచ్చిన పిటిషన్లను వారి వద్ద పెట్టుకుని వ్యవహారాలు నడుపుతున్నారు. ముఖ్యంగా కొత్త ఇన్‌స్పెక్టర్లు ఉన్న స్టేషన్లలో ఈ విధానాలు జోరుగా అమలవుతున్నాయి. ఇన్‌స్పెక్టర్ల దృష్టికి పిటిషన్లు వెళ్లకుండా తమ వద్దే పెట్టుకుంటున్నారు. తర్వాత లోపాయికారీ వ్యవహారాలు చక్కబెట్టి పిటిషన్లు పరిష్కారం అయ్యాయని రాసుకుంటున్నారు. కొత్తగా వచ్చిన ఇన్‌స్పెక్టర్లకు ఈ వ్యవహారాలు పెద్ద తలనొప్పిగా మారుతున్నాయి. ఈ విధానం ముున్ముందు తమ కొంపముంచుతుందని ఇన్‌స్పెక్టర్లు భయపడుతున్నారు.

అంతా కొత్తదనం

ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఎన్టీఆర్ జిల్లాలోకి కొత్త ఇన్‌స్పెక్టర్లు వచ్చారు. కమిషనరేట్ పరిధిలో మూడేళ్ల సర్వీసు పూర్తయిన వారిని బదిలీ చేయాలని ఆదేశాలు రావడంతో ఇక్కడ పనిచేసిన వారు ఏలూరు రేంజ్‌కు బదిలీ అయ్యారు. వారి స్థానాల్లో ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి ఇన్‌స్పెక్టర్లు వచ్చారు. వారిలో కొంతమందికి లా అండ్ ఆర్డర్ పోలీసుస్టేషన్లలో ఎస్‌హెచ్‌వోలుగా పోస్టింగ్ ఇచ్చారు. విజయవాడ సిటీపై పూర్తి అవగాహన ఉన్న ఇన్‌స్పెక్టర్లు నాలుగు పోలీస్‌స్టేషన్లలో మాత్రమే ఉన్నారు. కొత్తగా వచ్చిన ఇన్‌స్పెక్టర్లకు ఆయా స్టేషన్ పరిధి ఇంకా పూర్తిగా అవగాహన రాలేదు. ప్రస్తుతం ఇంతకుముందున్న వారినే రైటర్లు, జనరల్ పార్టీ సిబ్బందిగా కొనసాగిస్తున్నారు. సాధారణంగా పోలీస్‌స్టేషన్లకు వచ్చే పిటిషన్లు ముందుగా రైటర్ల వద్దకు వెళ్తాయి. ఆ తర్వాత సంబంధిత సెక్టార్ ఎస్ఐల వద్దకు వెళ్తాయి. ఇలా వచ్చిన పిటిషన్ల ప్రాథమిక సమాచారం సేకరించి స్టేషన్ హౌస్ ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్లాలి. అయితే ఈ పిటిషన్లలో కొన్ని మాత్రమే ఇన్‌స్పెక్టర్ల వద్దకు వెళ్తున్నాయి. మిగిలిన పిటిషన్లను రైటర్లు, సంబంధిత సెక్టార్ ఎస్ఐలు సెటిల్ చేసి సమస్యను పరిష్కరించినట్టుగా రికార్డుల్లో రాసుకుంటున్నారు. ఈ తరహా తీరు నాలుగు ఐదు పీఎస్‌ల్లో కనిపిస్తోంది. ఈ స్టేషన్లలో ఉన్న ఎస్‌హెచ్‌వోలు అంతా కొత్తవారే కావడం గమనార్హం.

చివరి క్షణంలో సమాచారం

వచ్చిన పిటిషన్లను సెటిల్ చేసి ఎంతోకొంత ప్రతిఫలాన్ని పొందుతున్నారు. కొన్ని పిటిషన్ల విషయంలో ఉన్నతాధికారుల నుంచి ఫోన్లు ఇన్‌స్పెక్టర్లకు వెళ్తున్నాయి. అప్పుడు మాత్రమే ఫలానా పిటిషన్ వచ్చిందని సమాచారం ఇస్తున్నారు. కొన్ని పిటిషన్లను తమ వద్ద పెట్టుకుని బాధితులను స్టేషన్ల చుట్టూ తిప్పించుకుంటున్నారు. దీంతో వారు డీసీపీ, ఏసీపీల వద్దకు వెళ్లి సమస్యను చెప్పుకుంటున్నారు. వారు ఫోన్‌చేసి అడిగినప్పుడు ఇన్‌స్పెక్టర్ల వద్ద సమాధానం ఉండడం లేదు. పరిశీలించి చెబుతామని ఫోన్లు కట్ చేస్తున్నారు. తర్వాత రైటర్‌ను గానీ, సంబంధిత సెక్టార్ ఎస్ఐని గానీ పిలిచి అడిగినప్పుడు పిటిషన్ బయటకు వస్తోంది. దీనికి గురించి తనకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని అడిగితే ప్రశ్నకు సంబంధంలేని సమాధానాలు చెబుతున్నారు. తాము కొత్తగా రావడం వల్లే ఈ విధంగా వ్యవహరిస్తున్నారని ఇన్‌స్పెక్టర్లు గుర్తించి చక్కదిద్దే పనిలో పడ్డారు.



మంత్రి అనుచరులు పంపిణీ చేసిన చీర, కుక్కర్

మాకు ఓట్లు... మీకు తాయిలాలు

కానూరులో డ్వాక్రా గ్రూపుల యానిమేటర్లకు మంత్రి జోగి రమేష్ అనుచరుల చీరలు, కుక్కర్ల పంపిణీ

పెనమలూరు, ఫిబ్రవరి 28 : పెనమలూరు వైసీపీ ఇన్‌చార్జి, మంత్రి జోగి రమేష్ తాయిలాల పంపిణీ కొనసాగుతోంది. పది రోజుల క్రితం పెనమలూరులో పాస్టర్లకు కుక్కర్లు, డబ్బులు పంపిణీ చేశారు. వారం కిందట కానూరు మన కల్యాణ మండపంలో వలంటీర్లకు విలువైన ఫ్లాస్కులు, హాట్‌బాక్సులు ఇచ్చారు. బుధవారం అదే కల్యాణ మండపంలో కంకిపాడు, ఉయ్యూరు, పెనమలూరు మండలాలకు చెందిన 190 మంది డ్వాక్రా గ్రూపుల యానిమేటర్లకు విలువైన చీరలు, కుక్కర్లను మంత్రి అనుచరులు అందజేశారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమంలో కోత

1214 మెమోతో బిల్డింగ్ వర్కర్స్ సంక్షేమ పథకాల నిలిపివేత



కార్మికుల్లో సింహభాగంగా ఉన్న భవన నిర్మాణ రంగ వర్కర్ల పరిస్థితి దారుణంగా ఉంది. వారి సంక్షేమాన్ని ప్రభుత్వం గాలి కొదిలేసింది. మెమో నెంబర్ 1214 ద్వారా భవన నిర్మాణ కార్మికులకు అమలౌతున్న సంక్షేమ పథకాలన్నింటినీ నిలిపివేయటం పట్ల కార్మికుల నుంచి ఆందోళన వ్యక్తమౌతోంది. ఈ క్రమంలో బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ నేతృత్వంలో రెండు రోజుల రిలే నిరాహార దీక్షలు బుధవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి.

- వెల్ఫేర్ బోర్డు ద్వారా పాత విధానం అమలు చేయాలని వేడుకోలు
- రెండు రోజుల నిరాహార దీక్షల్లో భవన నిర్మాణ కార్మికులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి సంబంధించి వెల్ఫేర్ ఫండ్ ఉన్నా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయకుండా వాటిని కుదించేసింది. ఫలితంగా భవన నిర్మాణ రంగ కార్మికులు ఆందోళన చెందుతున్నారు. పొరుగున ఉన్న తెలంగాణా రాష్ట్రంలో భవన నిర్మాణ రంగ కార్మికుడు మరణిస్తే రూ.6 లక్షలు నష్టపరిహారం చెల్లిస్తున్నారు. సహజ మరణానికి రూ.2 లక్షలు ఇస్తున్నారు. ఇవి కాకుండా వివాహ కానుక, ప్రసవ కానుక, వృత్తిపరమైన పనిముట్లు తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. ఇలాంటి పథకాలనే పొరుగున ఉన్న తమిళనాడు, కర్నాటకలలో కూడా అమలు చేస్తున్నారు. మన దగ్గర మాత్రం అలాంటి పరిస్థితి లేదు.

1214 మెమో రద్దు కోరుతూ వినతులు

ఉమ్మడి కృష్ణా జిల్లాలో లక్ష మంది వరకు భవన నిర్మాణ రంగ కార్మికులు ఉన్నారు. నవరత్నాల పేరుతో గతంలో ఉన్న పథకాలను కూడా నిలుపుదల చేశారు. నవరత్న పథకాల్లో భాగంగా వైఎస్ఆర్ బీమా పరిహారం రావాలంటే కుటుంబ పెద్ద చనిపోవాలి. కానీ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా పరిహారం రావాలంటే.. కుటుంబ పెద్ద కాకపోయినా ప్రమాదంలో ఎవరు చనిపోతే పరిహారం వచ్చేది. నవరత్న పథకంలో భాగంగా వైఎస్ఆర్ బీమా పేరుతో ఉన్న పథకాన్ని తీసేయటం వల్ల ఎంతో మంది మరణించిన భవన నిర్మాణరంగ కార్మికులకు అన్యాయం జరిగింది. నవరత్నాల్లో మరో పథకమైన వైఎస్ఆర్ వివాహ కానుక కారణంగా.. భవన నిర్మాణ కార్మికులకు అమలు చేస్తున్న వివాహ కానుకను రద్దు చేశారు. వైఎస్ఆర్ వివాహ కానుక కింద కచ్చితంగా అమ్మాయి పదో తరగతి చదివి ఉండాలి. అదే భవన నిర్మాణ బోర్డులో అయితే అలాంటి నిబంధన ఏమీ లేదు. పదో తరగతి వరకు చదివించగలిగే స్తోమత లేని వారి పరిస్థితి ఏమిటని కార్మికులు వాపోతున్నారు. నవరత్నాల్లో సహజ మరణానికి ఎలాంటి నష్టపరిహారం లేదు. ప్రమాదంలో గాయపడి హాస్పిటల్ పాలైనా కూడా వెల్ఫేర్ బోర్డు ద్వారా ఎలాంటి జీవన భృతి రావటం లేదు. భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా అమలైన సంక్షేమ పథకాలు.. నవరత్నాల్లో భాగంగా అమలు చేస్తున్న వాటిలో లేవు. దీంతో పాత విధానాన్నే భవన నిర్మాణ రంగ కార్మికులు కోరుతున్నారు. ప్రభుత్వం జారీ చేసిన 1214 మెమోను రద్దు చేయాల్సిందిగా ఎన్నాళ్ల నుంచో వినతిపత్రాలు ఇస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ నేతృత్వంలో రెండు రోజుల రిలే నిరాహార దీక్షలు చేపట్టారు.

ఇంటర్ పరీక్షలు, సీఎం పర్యటన.. ఒకేరోజు

- బస్సులన్నీ సీఎం సభకు
- విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునేదెలా?

ఆంధ్రజ్యోతి- మచిలీపట్నం : ఇంటర్మీడియట్ పరీక్షల ప్రారంభం రోజునే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కృష్ణాజిల్లాలో పర్యటించనున్నారు. దీంతో పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఇక్కట్లు తప్పేలాలేవు. మార్చి 1వ తేదీన పామర్రులో ఉదయం 10 గంటల నుంచి జరిగే విద్యాదీవెన కార్యక్రమానికి సీఎం హాజరుకానున్నారు. జిల్లాలో 400లకుపైగా బస్సుల్ని సీఎం పర్యటనకు జన సమీకరణ కోసం అధికారులు సిద్ధం చేశారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్ష మార్చి 1వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 12 గంటలకు ముగుస్తుంది. పామర్రుకు ముఖ్యమంత్రి 10.50కు చేరుకుంటారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు సీఎం పామర్రులోనే ఉంటారు. ఈ నేపథ్యంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు పెడతారు. ఇంటర్మీడియట్ పరీక్షల ప్రారంభం మొదటిరోజున తల్లిదండ్రులు తమ పిల్లలతో సహా పరీక్షా కేంద్రాలకు వెళ్లి జాగ్రత్తలు చెబుతూ ఉంటారు. సీఎం పర్యటన సందర్భంగా విధుల్లో ఉన్న ఉద్యోగులు తమ పిల్లలను పరీక్షా కేంద్రాలకు తీసుకువెళ్లే అవకాశం లేకుండా పోతోందని వాపోతున్నారు.

చలో తాడేపల్లిగూడెం

- టీడీపీ - జనసేన ఉమ్మడి సభకు భారీగా తరలిన శ్రేణులు
- వందలాది కార్లతో బాలశౌరి ర్యాలీ
- విజయవాడ నుంచి పెద్ద సంఖ్యలో తరలిన అభిమానులు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : టీడీపీ - జనసేన ఉమ్మడిగా నిర్వహిస్తున్న తొలి సభకు ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల నుంచి భారీఎత్తున టీడీపీ, జనసేన శ్రేణులు తరలివెళ్లాయి. మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ - జనసేన ఉమ్మడి అభ్యర్థిగా టికెట్ ఆశిస్తున్న బాలశౌరి వందలాది కార్లతో ర్యాలీగా తాడేపల్లిగూడెం సభకు తరలివెళ్లారు. హనుమాన్‌జంక్షన్ వద్ద ఆయనకు అభిమానులు గజమాలతో ఘనస్వాగతం పలికారు.

- విజయవాడ నగరంలోని మూడు నియోజకవర్గాల నుంచి ఆయా నియోజకవర్గ ఇన్‌చార్జుల ఆధ్వర్యంలో రెండు పార్టీల అభిమానులు భారీఎత్తున వెళ్లారు.
- విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి 4 బస్సులు, 40 కార్లతో అభిమానులు తరలివెళ్లారు. పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి జనసేన నగర అధ్యక్షుడు పోతిన మహేశ్ ఆధ్వర్యంలో సితార సెంటర్ నుంచి తరలివెళ్లారు.



హనుమాన్‌జంక్షన్ వద్ద బాలశౌరికి గజమాలతో స్వాగతం

- విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి 15 బస్సులు, 60 కార్లతో ర్యాలీగా వెళ్లారు. విజయవాడ సెంట్రల్ నుంచి కూడా బొండా ఉమ అనుచరులు పెద్ద ఎత్తున తాడేపల్లిగూడెం సభకు తరలివెళ్లారు.

మండలి బుద్ధప్రసాద్ వైసీపీలో చేరడం లేదు

ఆ పార్టీ నుంచి ఆహ్వానం వాస్తవమే

- అవాస్తవ ప్రచారాలను ప్రజలు నమ్మొద్దు
- కుమారుడు మండలి వెంకట్రామ్ స్పష్టీకరణ

- 6లో..

వీరమ్మ శిడిబండి వేడుక నేడు




వేదికపై జనసేన పార్టీ నాయకులు




తెలుగుదేశం పార్టీ నాయకులు


దాహం తీర్చేందుకు చల్లని మజ్జిగ


ఒళ్ళంతా జెండాలతో..


అన్న..ఎన్టీఆర్


ఫ్లడ్‌లైట్, ఫ్లెక్సీ స్తంభాలపై అభిమానులు

జెండా జోష్



పశ్చిమ గోదావరి జిల్లా ప్రత్తిపాడులో బుధవారం జరిగిన టీడీపీ-జనసేన ఉమ్మడి సభకు జనం పోటెత్తారు.. చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌లు తమ ప్రసంగాలతో ఇరుపార్టీల కార్యకర్తల్లో జోష్ నింపారు. ఉభయగోదావరి జిల్లాలతో పాటు, కృష్ణా, గుంటూరు, విశాఖ జిల్లాల నుంచి కార్యకర్తలు, అభిమానులు సభకు హాజరయ్యారు.


వయసు పైబడినా తగ్గేదేలే..


ఊరేగింపుగా రెక్కలు విరిగిన ఫ్యాన్


తెలుగు మహిళల సందడి


తాడేపల్లిగూడెం నుంచి జనసేన ర్యాలీ




వేదిక ముందు యువత ఉత్సాహం


మద్దాలి ఉషాగాయత్రి


డాక్టర్ సేతురామ్


ఎం.సురేందర్

కూచిపూడిని వరించిన అకాడమీ అవార్డులు

కూచిపూడి, ఫిబ్రవరి 28: కూచిపూడి నాట్యానికి విశేషమైన సేవలందిస్తూ దేశ, విదేశాల్లో ప్రచారం చేస్తున్న ఇద్దరిని కేంద్రసంగీత నాటక అకాడమీ అవార్డు, మరొకరిని బిస్మిల్లాఖాన్ యువ పురస్కారం వరించాయని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కూచిపూడి సిద్ధేంద్ర యోగి నాట్య కళాపీఠం ప్రధానాచా ర్యుడు డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్ బుధవారం తెలిపారు. 2023వ సంవత్సరానికి సంగీత నాటక అకాడమీ అవార్డుకు డాక్టర్ భాగవతుల సేతురామ్, మద్దాలి ఉషాగాయత్రి, 2023 సంవత్సరానికి ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కారానికి ఎం.సురేంద్రనాథ్ ఎంపికయ్యారని ఆయన పేర్కొన్నారు. ముగ్గురు కళాకారులను కూచిపూడి అగ్రహారం యువతతోపాటు పలువురు నాట్యాచార్యులు, డాక్టర్ వేదాం తం రాధేశ్యాం, డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి, పసుమర్తి రత్తయ్యశర్మ, డాక్టర్ చింతా రవిబాలకృష్ణ, డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసులుతోపాటు పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

బాలికపై ప్రధానోపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

» సస్పెండ్ చేస్తూ డీఈవో ఉత్తర్వులు..విచారణకు ఆదేశం

ఘంటసాల, ఫిబ్రవరి 28: పాపవినాశనం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న బాలికపై అసభ్యంగా ప్రవర్తించా వంటూ ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాస్‌పై బుధవారం బాలిక తల్లి దండ్రులు, గ్రామస్థులు దాడికి యత్నించారు. మంగళవారం తన పట్ల ప్రధానో పాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించాడని బాలిక ఇంటి వెళ్లి తల్లిదండ్రులకు చెప్పింది. ఉదయం పాఠశాలకు వచ్చిన ప్రధానోపాధ్యాయుడిని తల్లిదండ్రులు, గ్రామస్థులు నిలదీశారు. ఆయన బుకాయించటంతో దాడికి యత్నించారు. గ్రామ పెద్దలు సముదాయించి ఎంఈవో దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు.

ప్రధానోపాధ్యాయుడి సస్పెన్షన్

మచిలీపట్నం టౌన్: పాపవినాశనం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్ ఎం బి.శ్రీనివాస్ బాలిక పట్ల అసభ్యక రంగా ప్రవర్తించారని ఆరోపణలు రావడంతో డీఈవో తాహెరా సుల్తానా సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. విచారణ చేయాలని ఎంఈవో శివశంకర్‌ను డీఈవో ఆదేశించారు.

నేడు పాఠశాలలో వి చారణ జరుపుతాం

బాలిక తల్లిదండ్రులు జరిగిన విషయాన్ని నా దృష్టికి తెచ్చారు. గురువారం ఉదయం పాఠశాల వెళ్లి విచా రణ జరుపుతాం. డీఈవోకు నివేదిక అందజేస్తాం.

-ఎన్.శివశంకర్‌రావు, ఎంఈవో-1, ఘంటసాల

ఎన్టీఆర్ జిల్లాలో 1,781 పోలింగ్ స్టేషన్లు

వన్‌టౌన్, ఫిబ్రవరి 28: ఎన్టీఆర్ జిల్లాలో 1,781 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వ యంత్రాంగం పనిచేస్తోందని కలెక్టర్ దిల్లీరావు తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్ట రేట్‌లో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఎన్నికల నిర్వహణకు ప్రణాళికా బద్ధంగా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు. జిల్లాలో 169 మంది సెక్టార్ అధికారులు, 169 సెక్టార్ పోలీసు అధికారులు, 800 మంది మైక్రో అబ్జర్వ ర్లను నియమించినట్లు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తిస్తామని, రాజకీయపార్టీలు సూచనలిస్తే ఆమేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. దిన పత్రికల్లో వచ్చిన నెగిటివ్ కథనాలపై వివరణలను ప్రతినిధులకు అందించారు. డీసీపీ కృష్ణశాంతి, డీవీ కృష్ణ(సీపీఎం), బి.అనిల్(టీడీపీ), అశోక్ షరన్(కాంగ్రెస్), వీవీ శ్రీహరి (బీజేపీ), కె.పరమేశ్వరరావు(ఆప్), పి.రాజశేఖర్(వైసీపీ), ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కృష్ణాలో రూ.31.90 కోట్ల పీఎం కిసాన్ నిధులు జమ

» రూ.7.03 కోట్ల సున్నావడ్డీ విడుదల: కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లాలో 1,58,485 మంది రైతుల ఖాతాల్లో రూ.31.90 కోట్ల పీఎం కిసాన్-రైతుభరోసా నిధులు జమ చేస్తున్నట్లు కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. 2021-22 రబీ, 2022-23 ఖరీఫ్ సీజన్లకు 40,182మంది రైతులకు రూ.7.03కోట్ల సున్నావడ్డీ నిధులు విడుదల చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి రైతు భరోసా, పంటరుణాలకు సున్నావడ్డీ నిధులను సీఎం జగన్ విడుదల చేసిన సందర్భంగా వర్చువల్ పద్ధతిలో కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ రాజాబాబు, జేసీ గీతాంజలిశర్మ, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ జన్ను రాఘవరావు, రైతులు పాల్గొన్నారు. మెగా చెక్కులను రైతులకు కలెక్టర్, జేసీ అందించారు. ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ పిన్నింటి మహేష్, వ్యవసాయశాఖ జేడీ పద్మావతి, డీఎస్వో పార్వతి, ఉద్యానశాఖ జేడీ జె.జ్యోతి పాల్గొన్నారు.


మచిలీపట్నం కలెక్టరేట్‌లో రైతులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ రాజాబాబు, జేసీ గీతాంజలి శర్మ

ఎన్టీఆర్ జిల్లాలో రూ.28.73 కోట్లు లబ్ధి


విజయవాడ కలెక్టరేట్‌లో చెక్కును రైతులకు అందజేస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు, మేయర్ భాగ్యలక్ష్మి

వన్‌టౌన్, ఫిబ్రవరి 28: ఎన్టీఆర్ జిల్లాలో 1,42,011 మంది రైతులకు పీఎం కిసాన్-రైతు భరోసా పథకంలో భాగంగా రూ.28.73 కోట్లు లబ్ధి చేకూరిందని కలెక్టర్ ఎస్.దిల్లీరావు తెలిపారు. 30,405 మంది రైతులకు రూ.7.72 కోట్ల సున్నా వడ్డీ రాయితీలను రైతుల ఖాతాల్లో జమచేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం జగన్మోహన్‌రెడ్డి బుధవారం ఐదో ఏడాది మూడో విడత నిధులను బటన్ నొక్కి రైతుల ఖాతాల్లోకి జమచేశారు. అనంతరం ఆయన నిర్వహించిన వీడియో సమావేశంలో నగరంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ దిల్లీరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. లబ్ధిదారులకు మెగా చెక్‌ను వారు అందజేశారు. 2021-22 రబీ సీజన్ 2022 ఖరీఫ్ సీజన్‌లలో పంట రుణాలు తీసుకుని సకాలంలో డబ్బు చెల్లించిన వారికి వడ్డీ రాయితీని నేరుగా ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. సొంత భూమి సాగు చేసుకుంటున్న రైతులకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కౌలు రైతులకు ఆర్ఓఎఫ్ఆర్ రైతులకు రైతు భరోసా సాయం అందుతుందన్నారు. డిప్యూటీ మేయర్లు అవుతు శ్రీశైలజారెడ్డి, బెల్లం దుర్గ, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ అడపా శేషగిరి, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ షేక్ ఆసిఫ్, జైన్ కార్పొరేషన్ ఛైర్మన్ మనోజ్ కొఠారి, పారిశ్రామిక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ బండి శివశక్తి పుణ్యశీల, వ్యవసాయ సలహా మండలి జిల్లా ఛైర్మన్ డి.దామోదర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా ఛైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ, వ్యవసాయ, ఉద్యాన శాఖ జిల్లా అధికారులు ఎస్.నాగమణెమ్మ, పి.బాలాజీకుమార్ పాల్గొన్నారు.


ఉయ్యూరులో శిడిబండిని సిద్ధం చేస్తున్న కార్మికులు

వీరమ్మ శిడిబండి వేడుక నేడు

ఉయ్యూరు, ఫిబ్రవరి 28: వీరమ్మతల్లి తిరునాళ్లలో 11వరోజు గురువారం శిడిబండి వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం వివాహానికి సిద్ధంగా ఉన్న దళిత కుంబానికి చెందిన ఓ యువకుడిని శిడిబండికి కట్టిన ఉట్టిబుట్టలో కూర్చోబెట్టి ఆలయ ప్రదక్షిణ చేయిస్తారు. అనంతరం శివాలయం కొబ్బరి తోట సమీపం నుంచి డప్పు వాయిద్యాలు, మేళతాళాల మధ్య వేలాది భక్తుల హారతులు అందుకుంటూ, ఊరేగింపుగా ప్రధానసెంటర్, ఊయల స్తంభాల నుంచి శిడిబండి ఆలయానికి చేరుకుంటుంది. వేడుకను తిలకించేందుకు భక్తులు వేలాదిగా తరలి వస్తారు. వేడుకకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు గన్నవరం డీఎస్పీ జయసూర్య తెలిపారు.


ఒప్పంద పత్రాలతో కేయూ వీసీ జి.జ్ఞానమణి, సిలికానాంధ్ర వ్యవస్థాపకుడు కూచిభొట్ల ఆనంద్

కృష్ణా విశ్వవిద్యాలయంతో సిలికానాంధ్ర ఎంవోయూ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 28: విద్య, పరిశోధనా రంగాల్లో పరస్పర అవగాహన కోసం కృష్ణా విశ్వవిద్యాలయంతో సిలికానాంధ్ర సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. బుధవారం కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి జి.జ్ఞానమణి, సిలికానాంధ్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కూచిభొట్ల ఆనంద్ ఒప్పంద పత్రాలను చూపారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ పి.వీరబ్రహ్మచారి, కూచిభొట్ల ఆనంద్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. కృష్ణా విశ్వవిద్యాలయం సూచించిన ఐదుగురికి అమెరికాలోని తమ విశ్వవిద్యాలయంలో ఉచిత విద్య, శిక్షణ, ఇంటర్న్‌షిప్ ఇస్తామని కూచిభొట్ల ఆనంద్ తెలిపారు. విశ్వవిద్యాలయ ఆర్థిక గణాంక అధికారి రతన్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుందరకృష్ణ, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమారి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాంబాబు, కంప్యూటర్ సైన్స్ విభాగ సహాచార్యులు డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ బాపురెడ్డి, ఎన్ఎస్ఎస్ విభాగ సమన్వయకర్త డాక్టర్ ఎం.శ్రావణి పాల్గొన్నారు.

మండలి బుద్ధప్రసాద్ వైసీపీలో చేరడం లేదు

» ఆ పార్టీ నుంచి ఆహ్వానం వాస్తవమే

» అవాస్తవ ప్రచారాలను అవనిగడ్డ నియోజకవర్గ ప్రజలు నమ్మొద్దు

» కుమారుడు మండలి వెంకట్రామ్ స్పష్టీకరణ

అవనిగడ్డ, ఫిబ్రవరి 28: "మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ వైసీపీలో చేరుతున్నారన్న ప్రచారంలో వాస్తవం లేదు. మాకు వైసీపీ నుంచి ఆహ్వానం వచ్చిన మాట వాస్తవమే. కానీ ఆ పార్టీలో చేరడం లేదు. అవాస్తవ ప్రచారాలను నియోజకవర్గ ప్రజలు నమ్మొద్దు." అని ఆయన కుమారుడు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ స్పష్టం చేశారు. మంగళవారం సాయంత్రం నుంచి సామాజిక, ప్రసార మాధ్యమాల్లో బుద్ధప్రసాద్ వైసీపీలో చేరుతున్నట్లు భారీగా ప్రచారం జరగడంతో బుధవారం వెంకట్రామ్ సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించారు.

మూడు రాజధానులంటూ రాష్ట్రాన్ని నాశనం చేశారు

» జగన్‌పై వసంత నాగేశ్వరరావు ఆగ్రహం

వీరులపాడు, ఫిబ్రవరి 28: ఎన్నికలకు ముందు అమరావతే రాజధాని అని చెప్పి అధికారంలోకి వచ్చాక మూడు రాజధానుల ఆట మొదలు పెట్టి సీఎం జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని నాశనం చేశారని మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. వెల్లంకి గ్రామంలో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు హయాంలో ఐటీ సెక్టార్ కారణంగా ఎంతోమంది యువతకు విదేశాల్లో ఉద్యోగాలు చేసే అవకాశం వచ్చిందన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో పరిశ్రమలు రాష్ట్రం నుంచి పారిపోయి యువతకు ఉద్యోగాలు లేక పక్క రాష్ట్రాలకు పయనమయ్యారన్నారు. ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేస్తున్న జగన్ నిధులు మాత్రం విడుదల చేయలేదన్నారు. రాష్ట్రంలో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉందని, ప్రజలకు మౌలిక వసతుల కల్పన లేదని ఆయన విమర్శించారు.

పదో తరగతి విద్యార్థులకు 4 నుంచి మోడల్ గ్రాండ్ టెస్టులు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 28: కృష్ణాజిల్లాలో కలెక్టర్ రాజాబాబు ఆదేశాల మేరకు మార్చి నాలుగో తేదీ నుంచి పదో తరగతి విద్యార్థులకు మోడల్ గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తున్నట్టు డీఈవో తాహెరా సుల్తానా తెలిపారు. బుధవారం డీఈవో విలేకరులతో మాట్లాడారు. విద్యార్థుల్లో పరీక్షలంటే భయంపోయేలా నాలుగు విడ తల సైకిల్ టెస్టులు నిర్వహించామని తెలిపారు. పబ్లిక్ పరీక్షలు మార్చి 18వ తేదీ నుంచి ఏప్రిల్ 2వతేదీ వరకు నిర్వహిస్తున్నారని విద్యార్థులకు పరీక్షలపై అవగాహన పెంపెందించేందుకు, విద్యలో వెనుకబడిన విద్యా ర్థులకు ప్రశ్నపత్రాలపై మరింత అవగాహన కల్పించేం దుకు గ్రాండ్ టెస్టులు ఉపయోగపడతాయని డీఈవో తెలిపారు. సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించనున్న దృష్ట్యా విద్యార్థులు అలసిపోకుండా చూడాలని వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని ప్రధానోపాధ్యాయులను డీఈవో తాహెరా సుల్తానా ఆదేశించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	148, 157, 168
చికెన్ విత్ స్కిన్	286
చికెన్ స్కిన్‌లెస్	296

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.75

వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనం : కోగంటి

విద్యాధరపురం, ఫిబ్రవరి 28: సీఎం జగన్‌రెడ్డి సిద్ధం సభల్లో అబద్ధపు మాటలు చెబుతున్నారని, వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆంధ్ర రాష్ట్రం సర్వనాశనం అయిందని టీడీపీ అధికార ప్రతినిధి కోగంటి రామారావు అన్నారు. బుధవారం ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమైందని, ఆంధ్రప్రదేశ్ అప్పులకుప్పగా మారిందని పేర్కొన్నారు. జగన్‌రెడ్డి మోసపు మాటలను నమ్మి అన్ని వర్గాలు మోసపోయారన్నారు. తెలుగుదేశం-జనసేన కూటమితో తాడేపల్లి ప్యాలెస్ వణుకుతుందన్నారు. వలంటీర్లను, పోలీసులను అడ్డం పెట్టుకుని అవినీతి సొమ్ముతో ఎన్నికలకు వెళ్లాలని జగన్ చూస్తున్నారని, అరాచకాలకు పాల్పడుతున్న జగన్‌ను తరిమికొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. సోలంకి రాజేంద్ర కుమార్ జైన్, పరిశపోగు రాజేష్ పాల్గొన్నారు.


రీజియనల్ సైన్స్ సెంటర్‌లో


నెల్లూరు రవీంద్రభారతిలో


చిట్టినగర్ చైతన్య స్కూల్‌లో


విద్యాధరపురం రవీంద్రభారతి స్కూల్‌లో


వించిపేట శ్రీ విద్యాంజలి హైస్కూల్‌లో



ఐడియల్ పబ్లిక్ స్కూల్‌లో

సృజనాత్మకతకు వైజ్ఞానిక ప్రదర్శనలు

విద్యాధరపురం, ఫిబ్రవరి 28: భవానీపురంలోని రీజియనల్ సైన్స్ సెంటర్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా అప్‌కాస్ట్ మెంబర్ సెక్రటరీ వై.అపర్ణ పాల్గొని ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు. సైన్స్ సెంటర్ అధికారి డాక్టర్ షైనం హంస్సేన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సైన్స్ సెంటర్ సీఈవో డాక్టర్ కె.జయరామిరెడ్డి, జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి యు.వి సుబ్బారావు తదితరులు వివిధ అంశాలపై ప్రసంగించారు. సర్ సీవీ రామన్ ఎఫెక్ట్‌ను కనుగొన్న రోజును సైన్స్ దినోత్సవంగా జరుపుకుంటారని, ఈ దినోత్సవ ప్రత్యేకతను వివరించారు. వందమందికి పైగా విద్యార్థులు వివిధ ప్రాజెక్టులను ప్రదర్శించారు.

సత్యనారాయణపురం: స్థానిక నెల్లూరు రవీంద్రభారతి పాఠశాలలో బుధవారం సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిన్‌ను స్థానిక కార్పొరేటర్ శర్వాణీమూర్తితో కలిసి ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రారంభించారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన వివిధ సైన్స్ ప్రాజెక్టులను ప్రిన్సిపాల్ మీనాక్షి శైలజతో కలిసి పరిశీలించారు. ఏబీఆర్ వేంపాటి శ్రీసాయి, ఏవీఎస్ఆర్ సిద్ధార్థ కాలేజి ప్రిన్సిపాల్ సునీత, సీఐ మజ్జి గురునాయుడు, సుప్రీంకోర్టు అడ్వకేట్ రామకృష్ణ, పాఠశాల జీఎం శివారెడ్డి, ఏజీఎం కేశవరాజు, డీన్ శ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కృష్ణలంక: స్థానిక సుధాకర్స్ ఐడియల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌లోని పలు అంశాలు విద్యార్థులు తల్లిదండ్రులు, ప్రదర్శకులను అలరించాయి. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ సుధాకరరెడ్డి మాట్లాడుతూ పిల్లల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్‌లు ఎంతో దోహదపడతాయన్నారు. కరస్పాండెంట్ దేవినేని వరలక్ష్మి, డీన్ సురేష్, ప్రిన్సిపాల్ రామకోటేశ్వరరావు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

చిట్టినగర్: చిట్టినగర్ చైతన్య స్కూల్‌లో జరిగిన సైన్స్ ప్రదర్శనలు అదరహో అనిపించాయి. ఈ సైన్స్ ప్రదర్శనలను కేబీఎన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యకుమార్ ప్రారంభించారు. స్కూల్ ప్రిన్సిపాల్ కె.సునీత, ఏజీఎం మురళీకృష్ణ, ఆర్ఐ రాజేష్‌బాబు, పాఠశాల సెకండరీ డీన్ నరేష్, ప్రైమరీ ఇన్‌చార్జిలు, సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


కేబీఎన్‌లో, లయోలా కాలేజీలో

భవానీపురం: విద్యాధరపురం క్వారీ సెంటర్‌లోని రవీంద్రభారతి స్కూల్‌లో సైన్స్ ఎక్స్‌పోను ఫైర్ సర్వీసెస్ అడిషనల్ డైరెక్టర్ టి.ఉదయ్‌కుమార్ ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లు అందర్ని ఆలోచింపచేశాయి. వివిధ తరగతుల్లో ప్రతిభ కనపర్చిన ఎగ్జిబిట్లకు బహుమతుల ప్రధానోత్సం నిర్వహించారు. చైర్మన్ వి.వంశీకృష్ణ, అకడమిక్ డైరెక్టర్ వి.శాంతి, ప్రిన్సిపాల్ కె.మంజుల పాల్గొన్నారు.

పాతరాజరాజేశ్వరి పేట: 55వ డివిజన్ వించిపేటలోని శ్రీవిద్యాంజలి హైస్కూల్‌లో బుధవారం వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ పుప్పాల శ్రీనివాసరావు అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేబీఎన్ కళాశాల సీనియర్ సైన్స్ అధ్యాపకులు జీబీఎస్‌కె ప్రసాద్, ఫిజిక్స్ లెక్చరర్ కె. ఉమామహేశ్వరరావు హాజరయ్యారు. సైన్స్ అధ్యాపకులు, లెక్చరర్‌లను ప్రిన్సిపాల్ పుప్పాల శ్రీనివాసరావు ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రతిభ చూపించిన విద్యార్థులకు ప్రముఖులు అల్మాస్ ఖాన్, ముష్ ఖాన్, షేక్ మొబీనా స్కాలర్‌షిప్‌లు అందజేశారు. అధ్యాపకులు షాలిని, సుధీర్ కుమార్, నాగమణి, భావన, ఖమార్ జహాన్, జాబీన, ప్రసన్న, ధనలక్ష్మీ, ఫర్హీన్ పాల్గొన్నారు.

వన్‌టౌన్: కేబీఎన్ కళాశాలలో సైన్స్ దినోత్సవం సందర్భంగా కేబీఎన్ కళాశాల ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో ప్రాచీన భౌతిక శాస్త్రం, సమగ్ర అన్వేషణ అంశంపై నిర్వహించిన సదస్సుకు విశ్వభారతి జాతీయ కౌన్సిల్ సభ్యుడు , రాష్ట్ర సమన్వయ కర్త కే సుబ్బరాయశాస్త్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

సీనియర్ అధ్యాపకుడు డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు, విభాగాధిపతి ఆర్.ఉదయకుమార్, అధ్యాపకులు సీహెచ్ నాగభూషణం, బి శృతి, పీహెచ్‌డీ ప్రకాష్ పాల్గొన్నారు.

భారతీనగర్: జాతీయ విజ్ఞాన దినోత్సవ సందర్భంగా లయోలా కళాశాలలో భౌతిక శాస్త్రవిభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్టేట్‌టాక్స్ జాయింట్ కమిషనర్ తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు. బెంగళూరుకు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ (ఐఐఎస్‌సి) భౌతిక శాస్త్ర విభాగపు అధ్యాపకులు డాక్టర్ ప్రసాద్ విష్ణుభోట్ల, అధ్యాపకురాలు వి.కాంచన, లయోలా కళాశాల భౌతిక శాస్త్ర విభాగాధిపతి వి.శ్రీనివాస శాస్త్రి, హిస్టరీ అధ్యాపకులు ఎం.శ్రీనివాసరెడ్డి, భౌతిక విభాగపు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేతివృత్తులకు గుర్తింపు తెచ్చింది టీడీపీనే

● టీడీపీ నాయకుడు కేశినేని శివనాథ్

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 28: టీడీపీ పేద ప్రజల పార్టీ అని, చేతివృత్తులకు గుర్తింపు తెచ్చిన ఘనత టీడీపీదేనని విజయవాడ పార్లమెంటు నియోజవర్గ తెలుగుదేశం నాయకులు కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. వరల్డ్ టైలర్స్ డే సందర్భంగా టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీ ఆధ్వర్యంలో బుధవారం బందరు లాకుల సెంటర్‌లోని కృష్ణాజిల్లా స్వాతంత్ర్య సమరయోధుల సంఘం కార్యాలయంలో వరల్డ్ టైలర్స్ డే ఘనంగా నిర్వహించారు. ప్రపంచంలో తొలిసారిగా కుట్టు మిషన్ తయారు చేసిన విలియమ్స్ ఎలియాస్ హోవే చిత్రపటానికి కేశినేని చిన్ని పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిన్ని మాట్లాడుతూ రాబోయే తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో టైలర్స్ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు లక్షల కుట్టు మిషన్లు ఉచితంగా అందజేశారని తెలిపారు. మహిళలను వారి కాళ్ల మీద నిలబెట్టేందుకు వేల మందికి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తన సొంత నిధులతో కుట్టుమిషన్లు పంపిణీ చేశారని తెలిపారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ టీడీపీ హయాంలో చంద్రబాబు రాష్ట్ర ప్రజల కోసం చేసిన కార్యక్రమాలు ప్రజలకు వివరించాలని టైలర్స్‌ను కోరారు. టైలర్ అసోసియేషన్ అధ్యక్షుడు వల్లూరు మధుసూదనరావు, సభ్యులు పాల్గొన్నారు.



వరల్డ్ టైలర్స్ డేలో కేశినేని చిన్ని, ఎమ్మెల్యే గద్దె

అజిత్‌సింగ్‌నగర్: దర్జీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. బుధవారం ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ టైలర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలియజేశారు.

ధర్నాచౌక్: నవ్యాంధ్ర విజయవాడ టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక హనుమంతరాయ గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో కుట్టుమిషన్ ఆవిష్కర్త ఎలియాస్ హోవే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ రాపూరి సుబ్బారావు, గొడుగు కృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సిల్వెస్టర్ మిమిక్రీ, లావణ్య బృందం నాట్య ప్రదర్శన, కేవీ భాస్కర్ బృందం హాస్య వల్లరి ఆహుతులను అలరించాయి. అసోసియేషన్ కార్యదర్శి పిల్లి అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారు కొండేటి కృష్ణ, స్టీరింగ్ కమిటీ చైర్మన్ కూరపాటి రాఘవరాజు, అధ్యక్షుడు జేడీ.కలాణ్, ఉపాధ్యక్షుడు ఎండీ.షఫీవుల్లా, జాయింట్ సెక్రటరీ షేక్ అస్లాం, కోశాధికారి జె.దుర్గ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చిట్టినగర్, ఫిబ్రవరి 28: ఆర్థిక బాధలతో ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. చిట్టినగర్ సొరంగం సాధుజాన్ వీధిలో పి. విజయ్‌కుమార్, భార్య, నలుగురు పిల్లలతో ఉంటున్నాడు. ఆటో డ్రైవర్‌గా పనిచేసే అతను కుటుంబపోషణకు, పిల్లల చదువులకు చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపంతో మంగళవారం చిట్టినగర్ సొరంగం రోడ్డులో పురుగుల మందు తాగి భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. భర్తను భార్య ఆసుపత్రికి తరలించింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్లు బాధితురాలు పోలీసులకు తెలియజేసింది. కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు.

జెండా సభకు భారీగా తరలిన టీడీపీ, జనసేన శ్రేణులు


13వ డివిజన్ నుంచి బయలుదేరిన టీడీపీ శ్రేణులు

పటమట, ఫిబ్రవరి 28 : తెలుగుదేశం-జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు తాడేపల్లిగూడెంలో జరుగుతున్న జెండా బహిరంగ సభకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి గద్దె ఏర్పాటు చేసిన 15 బస్సుల్లో, 60 కార్లలో ర్యాలీగా పార్టీ శ్రేణులు తాడేపల్లిగూడెం సభకు తరలి వెళ్లారు. టీడీపీ-జనసేన పొత్తులో భాగంగా ఉమ్మడి అభ్యర్థుల ప్రకటన తరువాత మొదటిసారి చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు ఒకే వేదిక మీదకు రానున్న సందర్భంగా ఇరుపార్టీల శ్రేణులు తరలివెళ్లారు.

భవానీపురం: గూడెం సభకు పశ్చిమ నియోజకవర్గం నుంచి జనసేన శ్రేణులు సితార సెంటర్ నుంచి 4 బస్సులు, 40 కార్లలో బుధవారం తరలివెళ్లారు వెళ్లారు. చలో తాడేపల్లిగూడెం సభకు జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన మహేశ్ జెండా ఊపి కార్లు, బస్సులను పంపారు. విజయవాడ అర్బన్ సమన్వయ కర్త తిరుపతి సురేష్, నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్వరరావు, గుజారి అమర్, రాయల్ సేన ఈశ్వర్, పిల్లా శ్రీనివాసరావు, గోపిశెట్టి వెంకన్న, పోతిన సాంబశివరావులు పాల్గొన్నారు.


జెండా సభకు బయలుదేరిన జనసేన శ్రేణులతో పోతిన మహేశ్




జల్లేపల్లికి ఘన నివాళి

పటమట, ఫిబ్రవరి 28 : జల్లేపల్లి అజయ్‌కుమార్ గోష్ 14వ వర్ధంతి బుధవారం ఎన్ఎస్ఎం స్కూల్ వద్ద ఉన్న గోపాలరావు గ్రంథాలయం వద్ద వీరంకి గోపాలరావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ జల్లేపల్లి ఆదర్శ కమ్యూనిస్ట్ అని కొనియాడారు. ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్ విప్లవ గేయాలు ఆలపించారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్క వీరభద్రరావు, నగర కార్యవర్గ సభ్యులు దోనేపూడి సూరిబాబు, ఏఐటీయూసీ నాయకులు కెఆర్. ఆంజనేయులు, మాజీ కార్పొరేటర్ వీరంకి కుమారి, లంక ప్రసాద్, గోష్ సతీమణి స్వర్ణకుమారి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 28 : నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం పోలీసులు రోజు వారీ తనిఖీల్లో భాగంగా న్యూ రాజరాజేశ్వరిపేట అపార్ట్‌మెంట్స్ వెనుకాల సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో కోపూరి సామేల్(64) వద్ద మద్యం బాటిళ్లు ఉండటాన్ని గుర్తించారు. అతని వద్ద నుంచి 22 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



రాణిగారితోట, ఫిబ్రవరి 28: నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ బుధవారం కృష్ణానది ఫేస్ 2 రిటైనింగ్ వాల్ వెంబడి జరుగుతున్న పార్క్ అభివృద్ధి పనులను, కనకదుర్గమ్మ వారధి నుంచి పోలీసు కాలనీ డీపీ స్టేషన్ వరకు నిర్మాణం అవుతున్న రిటైనింగ్ వాల్ పార్క్‌ను పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, మలుపులు అత్యంత సుందరంగా ఉండాలని, మొక్కల్ని పెట్టి గ్రీనరీ వర్క్ మొదలుపెట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో అడిషనల్ కమిషనర్ జనరల్ ఎ.మహేష్, చీఫ్ ఇంజనీర్ ఏం.ప్రభాకరరావు, డీఈ పార్క్స్ పురుషోత్తం పాల్గొన్నారు.

జగన్ పాలనలో అన్ని వర్గాలకు బాధలు : బొండా ఉమా

సత్యనారాయణపురం, ఫిబ్రవరి 26: రాష్ట్ర ప్రజలు మార్పును కోరుకుంటున్నారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. భానునగర్ సాయిబాబా గుడి వద్ద నుంచి భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం బుధవారం సాయంత్రం జరిగింది. ఈ కార్యక్రమంలో బొండా ఉమా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పూర్‌టు రిచ్, నమ్మకం భరోసాను కల్పించే విధంగా వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సైకో జగన్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎక్కడకి వెళ్లినా టీడీపీ నాయకులకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.


పార్టీలో చేరిన వారితో బొండా ఉమా

60 మంది టీడీపీలో చేరిక

భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో టీడీపీ కార్పొరేటర్ వీరమాచినేని లలిత ఆధ్వర్యంలో 60 మంది వివిధ పార్టీలకు చెందిన నాయకులు టీడీపీలో చేరారు. బొండా ఉమా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. డివిజన్ అధ్యక్షుడు గొర్లె శ్రీను, పవన్, ఘంటా కృష్ణమోహన్, జోగినాయుడు, దుర్గారావు, ధనలక్ష్మి, భారతి, రామారావు, రూప, లక్ష్మి పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించం

● పటమట సీఐ మోహన్ రెడ్డి

గుణదల, ఫిబ్రవరి 28: సస్పెక్ట్ షీట్, రౌడీ షీట్ ఉన్న వారు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని పటమట సీఐ మోహన్ రెడ్డి హెచ్చరించారు. పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో చెడునడతగల యువతను బుధవారం స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో రాజకీయ నాయకులకు వత్తాసు పలుకుతూ లేనిపోని అల్లర్లు సృష్టించాలనే ప్రయత్నాలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారం రోజుల్లో ప్రతి ఒక్కరూ మీమీ రూపాలు మార్చుకుని ఎదుటి వారి చూపులకు మంచి వ్యక్తుల్లా కనబడేలా తయారవడమా లేక కమిషనరేట్ పరిధి వదిలిపెట్టి వెళ్లిపోవడమా అనేది మీరే నిర్ణయించుకోమన్నారు. గంజాయి బ్యాచ్ ఆగడాలు ఇకమీదట చెల్లవన్నారు. శివారు ప్రాంతాల్లో ప్రత్యేక పహారా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలని నిరసన

చిట్టినగర్, ఫిబ్రవరి 28: చిట్టినగర్ జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించి సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం చిట్టినగర్ జంక్షన్‌లో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు మాట్లాడుతూ పాతబస్తీలో నాలుగు కూడళ్ల ప్రధాన జంక్షన్ చిట్టినగర్‌లో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇక్కడ ట్రాఫిక్ నియంత్రణకు సిగ్నల్ కూడా లేకపోవడంతో వాహనచోదకులు ఇష్టానుసారం రాకపోకలు సాగిస్తూ ప్రజలను ప్రమాదాలకు గురి చేస్తున్నారన్నారు. నాయకులు తాడి పైడియ్య, పంచదార్లదుర్గాంబ, కొట్టు రమణారావు, సంగుల పేరయ్య, సింగరాజు సాంబశివరావు, మందగళ్ల సాయికుమార్, కంచర్ల భార్గవ్ చింతాడ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
గురువారం • 29 ఫిబ్రవరి 2024
cinema@andhrajyothy.com

ప్రేక్షకులు గర్వపడేలా
ఆపరేషన్ వాలెంటైన్

వరుణ్‌తేజ్, మానుషి చిల్లర్ జంటగా నటించిన 'ఆపరేషన్ వాలెంటైన్' మార్చి ఒకటిన విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు సిద్దు ముద్దా, నందకుమార్ అబ్బినేని బుధవారం మీడియాతో మాట్లాడుతూ చిత్ర విశేషాలు వెల్లడించారు.


నిర్మాతలు

- దర్శకుడు శక్తి ప్రతాప్‌సింగ్ రూపొందించిన షార్ట్ ఫిల్మ్ మాకు, వరుణ్‌కి బాగా నచ్చింది. దాన్నే ఫుల్ లెంగ్త్ ఫీచర్ ఫిల్మ్‌గా చేయాలనే ప్రయత్నాల్లో దర్శకుడు ఉన్నప్పుడు ఆ కథ విన్నాం. బాగా నచ్చడంతో సినిమా తీయాలని నిర్ణయించుకున్నాం. సోనీ పిక్చర్స్ నిర్మాణ భాగస్వామిగా రావడంతో తెలుగు, హిందీ భాషల్లో గ్రాండ్‌గా తీశాం.
- కొత్త వాడైనా ప్రతాప్ సింగ్‌కు మంచి క్లారిటీ ఉంది. సినిమాకు ఏం కావాలో ఆయనకు స్పష్టంగా తెలుసు. అలాగే తను అదే నేపథ్యం నుంచి వచ్చారు కనుక వీఎఫ్ఎక్స్ మీద మంచి కమాండ్ ఉంది. 'ఫైటర్' తర్వాత ఇలాంటి భారీ ఎయిర్ సీక్వెన్స్‌తో ఇండియాలో వచ్చిన మా చిత్రాన్ని ఆయన చాలా అద్భుతంగా తీశారు. గ్వాలియర్ ఎయిర్ బేస్‌లో సినిమాను షూట్ చేశాం. రియల్ ఎయిర్ బేస్‌లో షూటింగ్ చేయడం ఒక కొత్త అనుభూతి. వాయు సేన సైనికుల త్యాగాలను, ధైర్యాలను స్మరించుకుంటూ వాళ్ల కథని ప్రేక్షకులకు చెప్పాలనే ఆలోచనతో ఈ సినిమా నిర్మించాం.
- ఎయిర్‌ఫోర్స్ అధికారులు సినిమా చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఏం చెప్పారో అదే తీశారని ప్రశంసించారు. ఈ చిత్ర నిర్మాణ సమయంలోనే ఇలాంటి రియల్ హీరోస్ సినిమాలు మరిన్ని చేయాలనే స్ఫూర్తి కలిగింది.
- అందరి హీరోలతో సినిమాలు తీయాలని ఉంది. నితిన్‌తో ఓ సినిమా అనుకుంటున్నాం. 'ఆపరేషన్ వాలెంటైన్' విడుదల తర్వాత చిన్న బ్రేక్ తీసుకుని ఆగస్టు నుంచి కొత్త ప్రాజెక్ట్‌పై వర్క్ చేస్తాం. ఈసారి ఓ డిఫరెంట్ లవ్‌స్టోరీ తీయాలని మా ఆలోచన.

దర్శకుడు ఎస్.శంకర్ మూడు హిస్టారికల్ వెబ్ సిరీస్‌లు



సినిమాల్లో వాణిజ్య అంశాలతో పాటు సామాజిక ప్రయోజనం కూడా ఉండాలని నమ్మే దర్శకుల్లో ఎస్.శంకర్ ఒకరు. పలు విభిన్న చిత్రాలు రూపొందించిన ఆయన తాజాగా చారిత్రక నేపథ్యంలో మూడు వెబ్ సిరీస్‌లు తీయడానికి సంకల్పించారు. బుధవారం వాటి విశేషాలు వెల్లడిస్తూ 'తెలంగాణ సాయుధ పోరాటం, తెలంగాణ ప్రాంతం ఇండియన్ యూనియన్‌లో కలవడం, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడడం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన పోరాట నేపథ్యం, తెలంగాణ రాష్ట్రం ఏర్పడేంతవరకూ ఉద్యమాల్లో జరిగిన ఆటుపోట్లు, కవులు, కళాకారులు, మేధావులు పంచిన చైతన్యం, విద్యార్థులు, యువకుల త్యాగాలు.. తదితర అంశాలను ప్రజల కోణంలో చూపించాలని మా ప్రయత్నం. అక్టోబర్ నుంచి షూటింగ్‌కు శ్రీకారం చుడతాం' అని చెప్పారు. అలాగే జ్యోతీరావు పూలే అనుభవాలు, ఆయన జీవితంలో జరిగిన సంఘటనలు, సంఘర్షణలు, ఆయన ఎదుర్కొన్న సమస్యలు, అవమానాలు కథాంశంగా మరో వెబ్ సిరీస్‌ను నిర్మించనున్నట్లు శంకర్ వెల్లడించారు. అదే విధంగా బాబా సాహెబ్ అంబేద్కర్ వ్యక్తి నుంచి వ్యవస్థగా మారడానికి మధ్య జరిగిన సంఘర్షణలు, అణగారిన వర్గాలకు ఆయన ఇచ్చిన రాజ్యాంగ స్ఫూర్తి ఇతివృత్తంగా ఇంకో వెబ్ సిరీస్ నిర్మిస్తామని ఆయన చెప్పారు. జ్యోతిరావు పూలే, అంబేద్కర్ వెబ్ సిరీస్‌లు వారి బయోగ్రఫీలు కాదని శంకర్ స్పష్టం చేశారు. తెలుగు, హిందీ భాషల్లో ఈ మూడు వెబ్ సిరీస్‌లు నిర్మిస్తామనీ, మూడేళ్ల నుంచి తన టీమ్‌తో కలిసి కథలపై వర్క్ చేస్తున్నామని తెలిపారు.

'హాఫ్ లయన్'గా పీవీ నరసింహారావు బయోపిక్



ఆహా స్టూడియో, అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా భారతరత్న పురస్కార గ్రహీత, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జీవిత ప్రస్థానాన్ని బయోపిక్ రూపంలో తెరమీదకు తీసుకురావడానికి సిద్ధమయ్యాయి. ఈ ప్రతిష్ఠాత్మక బయోపిక్‌ను 'హాఫ్ లయన్' పేరిట వెబ్ సిరీస్‌గా రూపొందిస్తున్నారు. ప్రముఖ రచయిత వినయ్ సీతాపతి రచించిన 'హాఫ్ లయన్' పుస్తకం ఆధారంగా జాతీయ అవార్డు గ్రహీత, నటుడు ప్రకాష్ ఝా ఈ సిరీస్‌ను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ పాన్ ఇండియన్ సిరీస్ ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. హిందీ, తెలుగు, తమిళ భాషల్లో ఈ సిరీస్‌ను విడుదల చేయబోతున్నారు. పీవీ నరసింహారావు జీవితంలోని కీలక మైలురాళ్లను ఈ సిరీస్ హైలైట్ చేయనుంది. 1991 నుంచి 1996 వరకు ప్రధానిగా బాధ్యతలు నిర్వహించిన ఆయన భారతదేశ ఆర్థిక వ్యవస్థను సమూలంగా మార్చి కొత్తపుంతలు తొక్కించటంలో ఎలా సఫలీకృతుడయ్యాడో ఇందులో చూపించనున్నారు. తెలుగు జాతి ఆత్మగౌరవమైన పీవీ నరసింహారావుకు 'భారతరత్న' అవార్డును ప్రకటించిన శుభ తరుణంలో ఈ వెబ్ సిరీస్ ప్రకటన అందరిలోనూ ఆసక్తిని పెంచింది.

మరోసారి న్యూజిలాండ్‌కు కన్నప్ప



మంచు విష్ణు నటిస్తున్న డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' రెండో షెడ్యూల్ న్యూజిలాండ్‌లో మొదలైంది. విష్ణు టైటిల్ రోల్ పోషిస్తున్న ఈ చిత్రంలో మోహన్‌బాబు, మోహన్‌లాల్, ప్రభాస్ తదితరులు నటిస్తున్నారు. 'మహాభారతం' సీరియల్‌ను రూపొందించిన ముఖేశ్‌కుమార్ సింగ్ ఈ చిత్రానికి దర్శకుడు. 'కన్నప్ప' చిత్రం తొలి షెడ్యూల్ 90 రోజుల పాటు న్యూజిలాండ్‌లోనే జరిగింది. రెండో షెడ్యూల్‌లో కీలకమైన సన్నివేశాలు చిత్రీకరించనున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అంచనాలు కలిగిన ఈ చిత్రాన్ని ఓ దృశ్య కావ్యంగా తెరకెక్కిస్తున్నారు నిర్మాత డాక్టర్ మోహన్‌బాబు.

దర్శకుణ్ణి తప్పు పట్టలేం

ఖుష్బూ



మితిమీరిన హింసతో పాటు మహిళలను కించపరిచే సన్నివేశాలు ఉన్నాయంటూ పలువురు సినీ ప్రముఖుల విమర్శలు ఎదుర్కొంది 'యానిమల్' చిత్ర బృందం. తాజాగా విమర్శకుల జాబితాలో నటి ఖుష్బూ చేరారు. "యానిమల్' సినిమాలో కుటుంబ విలువలను, మహిళలను కించపరిచిన తీరుకు బాధపడతావు, ఆ సినిమా చూడొద్దు' అని మా పిల్లలు నన్ను హెచ్చరించారు' అని ఖుష్బూ చెప్పారు. ఓ ప్రైవేట్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 'ఇందులో దర్శకుణ్ణి తప్పు పట్టాల్సిన పని లేదు. 'యానిమల్' లాంటి సినిమాలు రికార్డు స్థాయి వసూళ్లు సాధిస్తున్నాయంటే ముందు జనాల ధోరణి ఎలా ఉందో అర్థం చేసుకోవాలి. బాగా చదువుకున్నవాళ్లు కూడా ఇలాంటి సినిమాలను ఆదరించడం బాధాకరం. ఈ సినిమా బాగా నచ్చిందని చెప్పేవాళ్లను చూస్తున్నప్పుడు వాళ్లు కూడా అలాంటి వాళ్లేనేమో అనిపిస్తుంది' అని ఆవేదన వ్యక్తం చేశారు. సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో వచ్చిన 'యానిమల్' చిత్రంలో రణ్‌బీర్‌కపూర్ హీరోగా నటించారు. రష్మిక మందన్న కథానాయిక.



హృదయాలను గెలుచుకునే చిత్రం

మలయాళ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్న సర్వైవల్ థ్రిల్లర్ 'గోట్ లైఫ్' (మలయాళంలో 'ఆడు జీవితం). హాలీవుడ్ నటుడు జిమ్మీ జీన్ లూయిస్, అమలాపాల్, కే ఆర్ గోకుల్ ప్రధాన తారాగణం. బెన్యామిన్ రాసిన 'గోట్ డేస్' నవల ఆధారంగా దర్శకుడు బ్లెస్సీ తెరకెక్కించారు. విజువల్ రొమాన్స్ బేనర్ ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తోంది. ఈ సినిమా కోసం ప్రత్యేకంగా రూపొందించిన వెబ్‌సైట్‌ను చిత్రబృందం బుధవారం ఆవిష్కరించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంగీత దర్శకుడు ఏ ఆర్ రెహమాన్ మాట్లాడుతూ "'గోట్‌లైఫ్' చిత్రం ప్రేక్షక హృదయాల్లో చెరగని ముద్ర వేస్తుంది. ఈ చిత్రం వరల్డ్ క్లాసిక్ మూవీ 'లారెన్స్ ఆఫ్ అరేబియా' స్థాయిలో ఉండబోతోంది. ఇది ప్రతి ఒక్కరి హృదయాలను గెలుచుకుంటుందనే నమ్మకం ఉంది' అన్నారు. పూర్తిగా ఎడారి నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం మార్చి 10న మలయాళం, తెలుగుతో పాటు పలు భారతీయ భాషల్లో విడుదలవుతోంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సునీల్ కేఎస్

నాయర్ నా భర్తే మలయాళ నటి హర్షం

'గగన్‌యాన్'కు సంబంధించి ఎంపికైన నలుగురు వ్యోమగాముల్లో ప్రశాంత్ నాయర్ ఒకరు. వ్యోమగామిగా ఈయనను ఎంపిక చేస్తూ ప్రధాని మోదీ ప్రకటించిన తర్వాత మలయాళ సినీ నటి, స్నేహం సినిమాలో



నటించిన లీనా సంతోషంతో ఉక్కిరిబిక్కిరికి గురయ్యారు. "నాయర్ నా భర్తే, మాకు గత నెల 17న వివాహం జరిగింది. మాది పెద్దలు కుదిర్చిన వివాహం. నాయర్‌ను వ్యోమగామిగా ప్రకటించిన సందర్భం నా జీవితంలో మరువలేనిది. ఇదొక చరిత్రాత్మక ఘట్టం. ఈ దేశానికి, మా రాష్ట్రానికి(కేరళ), వ్యక్తిగతంగా నాకు ఎంతో గర్వకారణం" అని ఆమె పేర్కొన్నారు.

రాజుగారి అమ్మాయితో నాయుడుగారి అబ్బాయి



రవితేజ నున్నా, నేహా జురెల్ జంటగా నటించిన 'రాజుగారి అమ్మాయి- నాయుడుగారి అబ్బాయి' చిత్రం ట్రైలర్‌ను బుధవారం ప్రసాద్ ప్రీవ్యూ థియేటర్‌లో జరిగిన కార్యక్రమంలో దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'అందరికీ కనెక్ట్ అయ్యే టైటిల్‌తో విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిన చిత్రం ఇది. సినిమా విజయం సాధించాలి' అని కోరారు. నిర్మాతల్లో ఒకరైన ముత్యాల రామదాసు మాట్లాడుతూ 'ఈ మధ్యకాలంలో చిన్న సినిమాలు కూడా పెద్ద విజయం సాధిస్తున్నాయి. అలాగే ప్రేక్షకులను ఆకట్టుకొనే అంశాలతో 'రాజుగారి అమ్మాయి నాయుడుగారి అబ్బాయి' చిత్రం రూపుదిద్దుకుంది. దర్శకుడు సత్యరాజ్‌కు మంచి విజన్ ఉంది. ఆయన పెద్ద దర్శకుడు కావాలని కోరుకుంటున్నాను. ఎన్నో సమస్యలు ఎదురైనా ఎక్కడా రాజీపడకుండా తీసిన సినిమా ఇది. మార్చి 9న విడుదల చేస్తున్నాం. సినిమాలో హీరోగా నటించిన కొత్త నటుడు రవితేజ పెద్ద హీరోగా ఎదగాలి' అన్నారు. 'ముత్యాల రామదాసుగారు మా వెనుక ఉండి ఈ సినిమాను విజయవంతంగా పూర్తి చేయించారు. మా అమ్మ నున్నా కుమారిగారు లేకపోతే ఈ ప్రాజెక్ట్ కంప్లీట్ అవదు. ఈ సినిమా కోసం ఎంతో కష్టపడ్డాం. అందరినీ ఆకట్టుకొనే చిత్రం అవుతుంది' అన్నారు రవితేజ. ఈ చిత్రనిర్మాణంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ దర్శకుడు సత్యరాజ్ కృతజ్ఞతలు తెలిపారు.

అందరినీ మెప్పిస్తుందనే నమ్మకం ఉంది



శివ కందుకూరి హీరోగా రూపొందిన క్రైమ్‌థ్రిల్లర్ 'భూతద్ధం భాస్కర్ నారాయణ'. పురుషోత్తం రాజ్ దర్శకత్వంలో స్నేహాల్, శశిధర్, కార్తీక్ నిర్మించారు. రాశి సింగ్ కథానాయిక. మార్చి 1న ఈచిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ ట్రైలర్ ఈవెంట్‌ను చిత్రబృందం నిర్వహించింది. శివ కందుకూరి మాట్లాడుతూ "భూతద్ధం...ప్రచార చిత్రాలకు ప్రేక్షకుల నుంచి అద్భుత స్పందన వచ్చింది. సినిమా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది. గీతా డిస్ట్రిబ్యూషన్ విడుదల వల్ల సినిమా మరింత మంది ప్రేక్షకులకు చేరువవుతుంది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఈ సినిమాతో దర్శకుడిగా నా కల నెరవేరింది. శ్రీ చరణ్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. శివ లాంటి హీరో దొరికినందుకు ఆనందంగా ఉంది. సినిమా చాలా బాగా వచ్చింది. ఆదరించండి' అని ప్రేక్షకులను కోరారు. రాశి సింగ్ మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాం. కథ వినూత్నంగా ఉంటుంది. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే అంశాలు ఈ చిత్రంలో ఉన్నాయి' అన్నారు. ప్రచార చిత్రాలు సినిమాపై ఆసక్తిని పెంచాయి, బిజినెస్ అద్భుతంగా జరిగింది అని నిర్మాతలు చెప్పారు.



పోశ్చర్ టిప్స్

బాడీ లాంగ్వేజ్ ట్రిక్స్..!

ఎదుటి వారు మనతో ప్రవర్తించే విధానం మన బాడీ లాంగ్వేజ్ మీద ఆధారపడి ఉంటుంది. నిలబడే తీరు, ముఖంలో ఒలికే కవళికలు మనల్ని ఆకర్షణీయంగా కనిపించేలా చేస్తాయి. అలాంటి కొన్ని ట్రిక్స్ మీకోసం!

పోశ్చర్

నడిచేటప్పుడు భుజాలు వెనక్కి, చుబుకం పైకి ఉండాలి. నిటారుగా ఉండాలి. శరీరం గురించిన కాన్షియస్ కలిగి ఉండాలి.

ముఖకవళికలు

ముఖం మీద చిరునవ్వు ఎప్పుడూ మెరుస్తూ ఉండాలి. ఇతరులు మీతో మాట్లాడడానికి ఆసక్తి చూపుతారు. చిరునవ్వు మీ గురించి ఎదుటివాళ్లలో సద్భావన కలుగుతుంది.

స్వరం

అనవసరంగా గొంతు పెంచి మాట్లాడకూడదు. సందర్భాన్నిబట్టి స్వరం మారుస్తూ ఉండాలి. మార్దవం, గంభీరం, సున్నితత్వం స్వరంలో సందర్భానుసారంగా తొణికిసలాడాలి.

చేతుల కదలికలు

అవసరాన్నిబట్టి భావ వ్యక్తీకరణకు తోడ్పడేలా చేతులు కదిలించాలి. మీరు వ్యక్తం చేయదలచుకున్న విషయాన్ని చేతుల కదలికలు స్పష్టం చేసేలా ఉండాలి.

కళ్లు

పరిచయం చేసుకునేటప్పుడు సూటిగా కళ్లలోకి చూడాలి. ఎదుటి వ్యక్తి మాట్లాడేటప్పుడూ కళ్లలోకి చూస్తూ వినాలి.

నడక

ఎంత హడావుడిలో ఉన్నా ఆ తొందర నడకలో ప్రతిబింబించకూడదు. నడకలో ఆత్మవిశ్వాసం తొణికిసలాడాలి.

కూల్

క్రమశిక్షణతో మెలగాలి. ఎంత చిరాకు వచ్చినా స్థిరత్వం కోల్పోకూడదు.

స్ఫూర్తి



నలుగురిలో నారాయణలా బతకడంలో ఆనందం ఏముంటుంది? సవాళ్లతో కూడుకున్న భిన్నమైన వృత్తిలోనే అసలైన మజా అంటుంది. కాబట్టే పురుషులకే పరిమితమైన వృత్తిలో ఫోర్క్‌లిఫ్ట్ ఆపరేటర్‌గా రాణిస్తున్నాను అంటోంది శ్రీరామోజు రాధిక. తెలంగాణలోని జీఎమ్మార్ హైదరాబాద్ ఎయిర్ కార్గో తొలి మహిళా ఫోర్క్ లిఫ్ట్ ఆపరేటర్‌గా గుర్తింపు సాధించిన రాధిక 'నవ్య'తో పంచుకున్న కబుర్లివి.

ఫోర్క్‌లిఫ్ట్ ఆపరేటర్

మా వారి ద్వారా జీఎమ్మార్ వరలక్ష్మి ఫౌండేషన్ గురించి తెలుసుకుని, దాన్లో కుట్టుపని నేర్చుకుందామని నిర్ణయించుకున్నాను. నిజానికి నాకు వాహనాలు నడపడమంటే ఇష్టం. కానీ వాటిని నేర్చుకునే అవకాశం, అవసరం అప్పటి వరకూ రాలేదు. దాంతో ముందు నుంచీ తెలిసిన కుట్టుపనినే ఉపాధిగా మలుచుకుందామనే ఆలోచనతో ఫౌండేషన్‌కి వెళ్లాను. కానీ ఫౌండేషన్ కౌన్సెలర్, జ్ఞానేశ్వర్... 'కుట్టుపనినే ఎందుకు ఎంచుకుంటున్నావు, ఎక్స్‌కవేటర్ శిక్షణ కూడా మహిళలకు అందుబాటులో ఉంది, ఇప్పటివరకూ ఎవరూ ఈ శిక్షణ తీసుకోలేదు' అని అనడంతో నాకు ప్రాణాలు లేచొచ్చాయి. వాహనాలు నడపడం ఇష్టం కాబట్టి మరో ఆలోచన లేకుండా వెంటనే ఒప్పేసుకున్నాను. అలా ఆయన ప్రోత్సాహంతో 2023 నవంబరులో ఎక్స్‌కవేటర్ నడపడంలో శిక్షణ తీసుకుని, మూడు నెలల పాటు ఆ పనిలో కొనసాగాను. అలా వాహనాలు నడపాలనే కోరిక తీరడంతో పాటు, పురుషులకే పరిమితమైన ఎక్స్‌కవేటర్‌ను సైతం నడపగలిగే ధైర్యాన్ని కూడా పొందగలిగాను. ఆ ఆత్మవిశ్వాసంతో నేను ఏ పనినైనా చేయగలుగుతాననే నమ్మకం కూడా నాలో పెరిగింది. సరిగ్గా అదే సమయంలో ఫోర్క్‌లిఫ్ట్ ఆపరేటర్ నడపడంలో కూడా మహిళలకు శిక్షణ ఇవ్వబోతున్నట్టు తెలిసింది. దాంతో మరో ఆలోచన లేకుండా ఆ శిక్షణ తీసుకోవాలని నిర్ణయించుకున్నాను.



మాది వరంగల్‌లోని వెంకటాపూర్. నేను పదో తరగతి వరకే చదువుకున్నాను. 2010లో పెళ్లితో చదువుకు బ్రేక్ పడింది. నాకిద్దరు పిల్లలు. పెద్ద బాబు విఘ్నేష్ నాలుగో తరగతి, చిన్న బాబు వేదాంశ్ రెండో తరగతి చదువుతున్నారు. మా వారు శ్రీరామోజు నాగరాజు, ఎయిర్‌పోర్టులోని లక్ష్య మీడియాలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తారు.

మహిళలకూ సాధ్యమే!

ఫోర్క్ లిఫ్ట్ ఆపరేటర్ శిక్షణకు ముందు సిమ్యులేటర్ ట్రైనింగ్ కోసం బెంగుళూరు వెళ్లాను. అక్కడ వారం రోజుల పాటు శిక్షణ పొందిన తర్వాత, జీఎమ్మార్‌లో మరో 10 రోజుల పాటు ఫోర్క్‌లిఫ్ట్ వాహనం నడపడంలో ప్రత్యక్ష శిక్షణ తీసుకున్నాను. వాహనంలో వెనక్కీ ముందుకూ కదిలే గేర్లతో పాటు, సరుకును పైకీ, కిందకూ ఎత్తి దింపడానికి సంబంధించిన లీవర్లు ఉంటాయి. వీటన్నిటి మీదా పట్టు పెంచుకున్నాను. అలా ఫిబ్రవరి 1న తొలి మహిళా ఫోర్క్ లిఫ్ట్ ఆపరేటర్‌గా నా వృత్తిని మొదలుపెట్టాను. రకరకాల సరుకు విమానాశ్రయానికి వస్తూ, పోతూ ఉంటుంది. ఆ సరుకంతా విమానాశ్రయంలోని కార్గోకు ట్రక్కుల్లో చేరుకుంటూ ఉంటుంది. ఫోర్క్‌లిఫ్ట్ సహాయంతో ఆ ట్రక్కుల్లోని సరుకును దింపి, కార్గో లోపలికి తీసుకువెళ్లి, వాటిని వర్గీకరించి, వాటి వాటి స్థానాల్లో అమర్చడం, కార్గోకు చేరుకున్న సరుకును తిరిగి ట్రక్కుల్లో నింపడం నా పని. సాధారణంగా ఫోర్క్ లిఫ్ట్ ఆపరేటర్ అనగానే అది శ్రమతో కూడుకున్న ప్రమాదకరమైన వృత్తి అనుకుంటారు. కానీ అది నిజంకాదు. మహిళలు సైతం ఈ పనిని సులువుగా చేయగలుగుతారు అనడానికి నేనే ప్రత్యక్ష సాక్ష్యం.

ఏమిటీ ఫోర్క్‌లిఫ్ట్..?

కార్గోలోని బరువైన కంటైనర్లను ఒక చోట నుంచి వేరే చోట పెట్టేందుకు ఫోర్క్‌లిఫ్ట్‌ను ఉపయోగిస్తారు. ఇది ఆటో కంటే కాస్త పెద్ద పరిమాణంలో ఉండే ఎలక్ట్రికల్ వెహికిల్. ఉదాహరణకు ఎగుమతి కోసం కూరగాయలు వచ్చాయనుకొందాం... అవి పెద్ద పెద్ద బాక్స్‌ల్లో లోడ్ చేసి ఉంటాయి. ఒక్కో బాక్స్ అర టన్ను, టన్ను బరువు ఉంటుంది. ఈ బాక్స్‌లను ఎత్తి, లోడింగ్ ప్రాంతంలో పెట్టే పనిని ఫోర్క్ లిఫ్ట్ చేస్తుంది.

భయం, బెరకు, విమర్శలే అవరోధాలు

ఈ వృత్తిలోకి అడుగు పెట్టినప్పుడు, 'నీకీ పని అవసరమా?' అని నన్ను వెనక్కి లాగే ప్రయత్నం చేసిన వాళ్లున్నారు. కానీ ఇది నాకు నచ్చిన పని. సమర్థంగా చేయగలుగుతాననే నమ్మకం నాకుంది.

కాబట్టి వాళ్ల మాటలను పట్టించుకోలేదు. భవిష్యత్తులో ఈ వృత్తిలోనే కొనసాగుతాను. నిజానికి నేనీ పని సమర్థంగా చేయడాన్ని చూసిన సాటి మహిళలు, 'నాక్కూడా నీలా ఫోర్క్‌లిఫ్ట్ ఆపరేటర్ కావాలని ఉంది' అనడం మొదలుపెట్టారు. భయం, బెరుకు, విమర్శలను పక్కన పెట్టగలిగితే మహిళలు సాధించలేనిదంటూ ఏదీ ఉండదు. మిగతా మహిళల్లా వెనకంజ వేసి ఉంటే, నేను కూడా కుట్టుపనికే పరిమితమైపోయి ఉండేదాన్ని. ధైర్యంగా ముందడుగు వేయగలిగాను కాబట్టే ఈ రోజు తొలి ఫోర్క్ లిఫ్ట్ ఆపరేటర్‌గా గుర్తింపు సాధించగలిగాను.

• గోగుమళ్ల కవిత

ఒత్తిడి తగ్గించే కాఫీ

కాఫీ తాగటం వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయి. అవేంటంటే...

- కాఫీ తాగటం వల్ల మెరిసే ముఖం మీ సొంతం అవుతుంది. మృదుత్వం వస్తుంది. చర్మంలోని కణజాలాలను మెరుగు పరిచే లక్షణాలు కాఫీలోని కెఫీన్‌కు ఉంది. చర్మాన్ని హైడ్రేట్ చేస్తుంది. చర్మంలో ఫ్లెక్సిబిలిటీని తీసుకొస్తుంది.
- కాఫీ అనేది డైయూరిటిక్ పానియం. ఇది తాగితే శరీరంలోని విష పదార్థాలన్నీ తొలగిపోతాయి. పొట్ట శుభ్రంగా ఉంటుంది.
- ఊబకాయం తగ్గించే అవకాశం ఎక్కువ. ముఖ్యంగా బ్లాక్ కాఫీ తాగటం వల్ల శరీరంలోని కొవ్వు పదార్థాలు తొలగిపోతాయి. ఈ విధంగా బరువును తగ్గించే గుణం కాఫీకి ఉందనమాట!
- అలసట ఉండటం.. విశ్రాంతి లేకుండా ఉండేవారు కాఫీ తాగితే అలసట కనపడదు. కాస్త చురుగ్గా అనిపిస్తుంది.



- కాఫీ గింజల్లో ఫ్రీ రాడికల్స్ ఉంటాయి. దీనివల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. ఇందులోని యాంటీ యాక్సిడెంట్స్ వల్ల చర్మంలో ముడతలు, వలయాలు రావు.
- కాఫీ తాగటం అంటే ఒత్తిడిని తగ్గించుకోవటమే. కాస్త కాఫీ తాగగానే వెంటనే ఒంట్లో చురుకు వస్తుంది. కాఫీలో ఉత్తేజపరిచే లక్షణం ఉంది.
- కాస్త తలనొప్పిగా ఉండే కాఫీ తాగితే సరిపోతుంది అంటారు. ఇది నిజమే. కాఫీ వల్ల రక్తప్రసరణ సాఫీగా సాగుతుంది. ముఖ్యంగా మెదడు చురగ్గా పని చేస్తుంది. జ్ఞాపకశక్తి అలవడుతుంది.

శనగపిండితో అందం

శనగపిండి వంటకే కాదు జుట్టు, చర్మ ఆరోగ్యానికి మేలేంతో చేస్తుంది. వంటింట్లో ఉండే ఈ సహజమైన పిండితో చర్మ సౌందర్యాన్ని ఎలా మెరుగు పర్చుకోవాలో తెలుసుకుందాం..

- బౌల్‌లో రెండు టేబుల్ స్పూన్ల శనగపిండి వేసి అందులోకి ఒకటి లేదా రెండు టేబుల్ స్పూన్లు పెరుగు వేయాలి. మరీ నీళ్లలా కాకుండా సరిపడేంతగా చూసుకుని పెరుగు కలపాలి. ఈ మిశ్రమాన్ని బాగా కలిపిన తర్వాత ముఖానికి పట్టించుకోవాలి. ఆరిన తర్వాత కడిగేయాలి. ఇలా చేస్తుంటే ముఖం మీద నొప్పులు తొలగిపోతాయి.
- రెండు టేబుల్ స్పూన్ల శనగపిండిలో, రెండు టేబుల్ స్పూన్ల పాలు కలిపి మెత్తగా చూర్ణం చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి అరగంట తర్వాత శుభ్రం చేసుకోవాలి. దీనివల్ల ముఖం మీద ఉండే మట్టి తొలగిపోతుంది.
- బౌల్‌లో రెండు టేబుల్ స్పూన్ల శనగపిండి వేసి అందులో అంతే పరిమాణంలో పసుపు తీసుకుని కలపాలి. ఈ మిశ్రమం మెత్తగా కావటానికి తగినంత నిమ్మరసం కలిపి చూర్ణం చేసుకోవాలి. ఈ చూర్ణాన్ని ముఖానికి పట్టించి ఇరవై నిముషాల తర్వాత మంచి నీళ్లతో కడిగేసి మెత్తటి టవల్‌తో శుభ్రపరచాలి. ఇలా తరచుగా చేస్తుంటే ముఖం మీద నొప్పులు, బ్యాక్టీరియా వల్ల వచ్చే సమస్యలు, ముఖ్యంగా మొటిమలు లాంటివి తగ్గిపోతాయి.
- టేబుల్ స్పూన్ శనగపిండిని కప్పులో తీసుకోవాలి. ఇందులోకి అంతే పరిమాణంలో అలోవెరా జెల్‌ను కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి ఆరిన తర్వాత కడిగేయాలి. ఇలా చేస్తుంటే ముఖం మీద ఉండే నల్లటి మచ్చలు పోతాయి.
- బౌల్‌లో టేబుల్ స్పూన్ శనగపిండి తీసుకోవాలి. తొక్కతీసేసిన టమోటాను గుజ్జుగా చేసి ఈ పిండిలో కలపాలి. ఈ



చూర్ణాన్ని ముఖానికి పట్టించి అరగంట తర్వాత మైల్డ్ సోప్‌తో కడిగేయాలి. దీనివల్ల ముఖంలో గ్లో వస్తుంది. చర్మం స్మూత్‌గా తయారవుతుంది.
- ఇంట్లో కేవలం శనగపిండి మాత్రమే ఉంటే రెండు టేబుల్ స్పూన్ల పిండిని తీసుకుని మూడు టేబుల్ స్పూన్ల రోజ్ వాటర్‌ను కలపాలి. రోజ్‌వాటర్ లేకపోతే మంచినీళ్లను కలపాలి. కేవలం శనగపిండిని పట్టించుకున్నా సరే చర్మం అందంగా తయారవుతుంది.

కౌన్సెలింగ్

పాదంలోని ఆనెలు పోయేదెలా?

Q A

డాక్టర్! నా పాదాల్లో ఆనెలున్నాయి. వాటితో నడవడం ఇబ్బందిగా ఉంది. వీటిని శాశ్వతంగా వదిలించుకోవాలంటే ఏం చేయాలి?

- ఓ సోదరి, హైదరాబాద్.

అధిక బరువు, గట్టిగా ఉండే చెప్పులు వేసుకోవడం, పాదాలకు చెప్పుల్లేకుండా నడవడం.. ఈ కారణాల వల్ల పాదాల్లో ఆనెలు ఏర్పడతాయి. ఆనెలు అనగానే అదేదో పెద్ద సమస్య అని భయపడవలసిన అవసరం లేదు. మొద్దుబారిన చర్మాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల, పాదంలో లోతుకు ఆనెలు ఏర్పడతాయి. ప్రారంభంలో ఆనెలు పైచర్మానికే పరిమితమైతే, వీటిని వైద్యుల సహాయంతో సునాయాసంగా తొలగించుకోవచ్చు. పైచర్మాన్ని తొలగించి, ప్యాచ్ వేస్తే, అడుగున లోతుగా కోన్ ఆకారంలో పెరిగిన ఆనె మెత్తబడి, స్పర్శ కోల్పోతుంది. అప్పుడు దాన్ని తేలికగా తొలగించవచ్చు అయితే ప్యాచ్ వేసిన తర్వాత ఎక్కువగా నడవకూడదు. అలా నడిస్తే, ప్యాచ్ స్థానం తప్పి, పక్కన ఉన్న చర్మం మెత్తమడి సమస్య పెద్దది కావచ్చు.



కాబట్టి ప్యాచ్ వేసుకున్న తర్వాత జాగ్రత్తగా ఉండాలి. అంతా సక్రమంగా ఉంటే, ప్యాచ్‌ను తొలగించి లోపలి వరకూ ఉన్న ఆనెను తొలగించి, కొన్ని మందులు వాడుకుంటే ఆనె పూర్తిగా తగ్గిపోతుంది. ఇలా ఆనెలను తొలగించుకున్న తర్వాత, బరువును అదుపులో ఉంచుకోవాలి. అలాగే గట్టిగా ఉండే చెప్పులకు బదులుగా మెత్తగా ఉండే చెప్పులు వాడుకోవాలి. ఇంట్లో చెప్పులు లేకుండా నడిచే అలవాటు మానుకోవాలి. ఈ జాగ్రత్తలు పాటిస్తే పాదం ఆనెలు తిరగబెట్టకుండా ఉంటాయి.



డాక్టర్ స్వప్నప్రియ,
డెర్మటాలజిస్ట్,
కాస్మోస్యూర్ క్లినిక్, హైటెక్ సిటీ,
హైదరాబాద్.

మనిషిని మనిషిగా చూడని ఈ సమాజాన్ని ఆమె పక్కన పెట్టారు. రూపం చూసి తోటి విద్యార్థులు అవహేళన చేస్తే... తనలోని మేధాశక్తితో సమాధానమిచ్చారు. ఒక స్వీపర్ కూతురుగా... అట్టడుగు వర్గం నుంచి వచ్చిన మహిళగా... విజయానికి అంగవైకల్యం అడ్డు కాదని నిరూపించారు. పీహెచ్‌డీ పూర్తి చేసి... తెలంగాణ గవర్నర్ తమిళసై నుంచి 'డాక్టరేట్' అందుకున్న డాక్టర్ కత్తి వెంకటమ్మ సంకల్ప దీక్ష ఇది...

ఆత్మవిశ్వాసంతో ఆకాశమంత ఎత్తులో..!

సంకల్పం



"ఒకరిపై ఆధారపడకుండా నీ కాళ్లపై నువ్వు నిలబడాలి'... ఇది నాకు మా నాన్న రాజయ్య చెప్పిన మాట. దాని కోసం ఆయన ఎన్నో త్యాగాలు చేశారు. ఆర్థిక స్తోమత లేకపోయినా... నన్ను ఉన్నత చదువులు చదివించాలని ఆరాటపడ్డారు. ఎందుకంటే ఏడుగురు సంతానంలో నేను వికలాంగురాలిని. తను లేకపోతే నా బాగోగులు ఎవరు పట్టించుకొంటారన్నది నాన్న బాధ. ఆయన ఆకాంక్షలకు అనుగుణంగా, నా భవిష్యత్తుకు నేనే భరోసా అవ్వాలన్న లక్ష్యంగా చదువు కొనసాగించాను. కర్నూలు జిల్లా శ్రీశైలంలో ఓ నిరుపేద కుటుంబం మాది. అణగారిన వర్గం. నాన్న మున్సిపాలిటీలో స్వీపర్‌గా పని చేసేవారు. ఇద్దరు అన్నల తరువాత నేను మూడో సంతానాన్ని. నాన్న సంపాదనతో ఇల్లు గడవడమే కష్టంగా ఉండేది. ఇంత పెద్ద కుటుంబాన్ని పోషించడమంటే తలకు మించిన భారమే. దాంతో మా అమ్మ దిబ్బులమ్మ కూడా పని మొదలుపెట్టింది. ఈ పరిస్థితుల నుంచి మమ్మల్ని బయటపడేయగలిగేది, మా భవిష్యత్తుకు భరోసా కల్పించేది చదువు మాత్రమేనని చిన్న వయసులోనే నాకు అర్థమైంది. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా విద్యాభ్యాసం ఆపకూడదని అప్పుడే నిర్ణయించుకున్నాను.

ఎగతాళి చేసినా...

పొట్టిగా, కాస్త భిన్నంగా ఉన్న నా రూపాన్ని చూసి స్కూల్లో తోటి విద్యార్థులు ఆట పట్టించేవారు. తెలిసీ తెలియని వయసు కదా... ఎందుకు నా పట్ల అలా ప్రవర్తిస్తున్నారో అర్థమయ్యేది కాదు. కానీ ఇంటర్‌లోకి వచ్చాక కూడా అదే పరిస్థితి. పొట్టిగా ఉన్నావంటూ ఎగతాళి చేసేవారు. హేళనగా మాట్లాడేవారు. నన్ను చూడగానే నవ్వుకొనేవారు. అవి నా మనసును తీవ్రంగా గాయపరిచాయి. వాటిని తట్టుకోలేకపోయాను. ఇంటికి వచ్చి ఏడ్చేదాన్ని. కొన్ని వారాలు కాలేజీకి వెళ్లలేకపోయాను. చాలాసార్లు చనిపోవాలని అనిపించింది. 'ఇక నాకు ఈ చదువు వద్దు. కాలేజీ వద్దు' అని అంటే... నాన్న కోప్పడ్డారు. 'రేపు నేను పోయిన తరువాత నీ గురించి ఎవరూ పట్టించుకోరు. అందుకే నువ్వు చదువుకోవాలి. ఒకరిపై ఆధారపడకుండా జీవించాలి' అని ప్రేరణనిచ్చారు. మొదట మొండికేసినా... తరువాత ఆలోచించాను. 'ఎవరేమనుకుంటే నాకేంటి' అనుకుని మళ్లీ కాలేజీకి వెళ్లాను. నా మనసుకు సర్దిచెప్పుకున్నాను. కానీ నా చుట్టూ ఉన్నవారిలో మార్పు కనిపించలేదు. అదే తీరు... ఎగతాళి చేయడం. అలాంటివన్నీ పట్టించుకోవడం మానేసి... 'నా చదువు నేను చదువుకోవాల'ని బలంగా నిశ్చయించుకున్నాను. నాన్న ఇచ్చిన ధైర్యం, తోడబుట్టినవారి ప్రోత్సాహంతో చదువు కొనసాగించగలిగాను. మా కుటుంబంలో ఉన్నత చదువులు చదివింది కూడా నేనే.

టీచర్ పోస్టు కోసం...

మొదటి నుంచి నా లక్ష్యం ఏమిటంటే... బాగా చదువుకొని, మంచి ఉద్యోగం తెచ్చుకోవాలని. అప్పుడే కదా నాకు ఒక ఆధారం దొరుకుతుంది. దాని కోసం 2010లో బీఏ అవ్వగానే బీఈడీ చేశాను. టీచర్ అవుదామని. 'టెట్'కు అర్హత సాధించాను. డీఎస్సీ కోచింగ్ కోసం అవనిగడ్డ వెళ్లాను. ఆ సమయంలోనే బాత్‌రూమ్‌లో కాలు జారి పడడంతో కాలికి తీవ్ర గాయమైంది. డీఎస్సీ రాయలేకపోయాను. గాయంతో ఏడాది మంచం మీదే గడిచిపోయింది. టీచర్ కావాలన్న లక్ష్యం పక్కకు వెళ్లిపోయింది. కానీ బాధపడలేదు. జీవితం అన్నాక ఒడుదొడుకులు సహజమే.

పీజీ టు పీహెచ్‌డీ...

మళ్లీ ఉద్యోగ ప్రయత్నాలు చేసేముందు విద్యార్హతలు పెంచుకోవాలని అనుకున్నాను. శ్రీశైలం క్యాంపస్‌లో హిస్టరీ అండ్ ఆర్కియాలజీలో పీజీ చేశాను. 2015లో పీజీ అవ్వగానే ఎందుకో మనసు పీహెచ్‌డీ వైపు మళ్లింది. టీచర్‌గా స్థిరపడాలనుకున్నాను... అవ్వలేదు. పీహెచ్‌డీ అయినా చేస్తే సమాజంలో మంచి గుర్తింపు కూడా దక్కుతుంది కదా. ఉద్యోగ అవకాశాలు కూడా మెరుగవుతాయనే ఉద్దేశంతో పీజీ అయిన మరుసటి ఏడాదే పీహెచ్‌డీకి దరఖాస్తు చేసుకున్నాను. ఫిజికల్ హ్యాండీక్యాప్డ్ కేటగిరీలో కూడా చాలా మంది పోటీపడ్డారు. వాళ్లందరినీ దాటి, శ్రీశైలం 'పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం'లో పీహెచ్‌డీ మొదలుపెట్టగలిగాను. యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ అందించే నేషనల్ ఫెలోషిప్‌కు ఎంపికయ్యాను.

వ్యయప్రయాసలెన్నో...

పీహెచ్‌డీ అంటే సామాన్యమైన విషయం కాదు. ముఖ్యంగా నాలాంటివారికి. ఎంతో అధ్యయనం చేయాలి. పరిశోధించాలి. అయితే యూనివర్సిటీలో మా గైడ్, అధ్యాపకులు నాకు అండగా నిలిచారు. 'నువ్వు ఇక్కడివరకు రావడం ఎంతో గొప్పగా ఉంది' అంటూ అందరూ నన్ను అభినందించేవారు. ఎప్పుడు ఏ సందేహం వచ్చినా తీర్చడానికి అందుబాటులో ఉండేవారు. వారందరి సహకారంతో పాటు, విశ్రాంత ఆచార్యులు రామిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి గారి పర్యవేక్షణలో 'కర్నూలు జిల్లాలోని ప్రసిద్ధ శైవ క్షేత్రాలు' మీద పరిశోధన పత్రాలు సమర్పించాను. గత ఏడాది ఫిబ్రవరిలో పీహెచ్‌డీ పూర్తయింది. డాక్టరేట్‌ను పొందాను. బుధవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ తమిళసై చేతుల మీదుగా డాక్టరేట్‌ను అందుకోవడం నా జీవితంలోనే మధుర ఘట్టం."

స్ఫూర్తిమంత్రం కావాలి...

నా ఈ ప్రయాణంలో ఎన్నో ఆటుపోట్లు, సవాళ్లు. ఆర్థికంగా ఇబ్బంది పడ్డాను. చదువుకొనేచోట, ప్రయాణించే బస్సుల్లో అవమానాలు భరించాను. అన్నిటినీ తట్టుకొని నిలబడగలిగాను కనుకనే ఇవాళ డాక్టరేట్ సాధించాను. వీటన్నిటి వెనకా చదువుకోవాలన్న నా బలమైన ఆకాంక్ష, ఆత్మవిశ్వాసం ఉన్నాయి. మా నాన్న చనిపోయాక ఇంటి బాధ్యత అమ్మ మీద పడింది. ఆమె కష్టపడుతూ నన్ను చదివించింది. నేను చదివింది పూర్తిగా ప్రభుత్వ విద్యాలయాల్లోనే. నాకు మూడు వేల రూపాయల వికలాంగుల పెన్షన్ వస్తుంది. అదే నాకు ఆధారం. ప్రస్తుతం నా లక్ష్యం... ప్రభుత్వ ఉద్యోగం సంపాదించడం. తరువాత నాలాంటివారికి చేతనైన సాయం చేయడం. నేను ఒక్కటి చెప్పదలుచుకున్నాను... చాలామంది తమలోని లోపాలను చూసుకొని వెనకడుగు వేస్తుంటారు. ముఖ్యంగా నాలాంటి వికలాంగులైతే ఎవరో ఏదో అనుకొంటారని బయటకు రావడానికి కూడా జంకుతుంటారు. కానీ మనం భయపడి ఇంట్లో కూర్చున్నంతకాలం ఈ పరిస్థితుల్లో మార్పు రాదు. అడుగు బయట పెట్టాలి. బాగా చదువుకొని ఉన్నత స్థానాల్లో స్థిరపడాలి. భావితరాలకు మన కథ ఒక స్ఫూర్తిమంత్రం కావాలి.



• హనుమా
ఫొటోలు: అశోకుడు

స్పోర్ట్స్

విజయవాడ ● గురువారం 29 ఫిబ్రవరి 2024

అదరగొట్టిన అడైర్
కుప్పకూలిన అఫ్ఘానిస్తాన్

అబుధాబి: ఐర్లాండ్ పేసర్ మార్క్ అడైర్ (5/39) ఐదు వికెట్లతో అదరగొట్టడంతో బుధవారం మొదలైన ఏకైక టెస్ట్‌లో అఫ్ఘానిస్థాన్ 155 పరుగులకే కుప్పకూలింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన అఫ్ఘాన్ జట్టులో ఇబ్రహీమ్ జద్రాన్ 53, కరీమ్ జనత్ 41 పరుగులు చేశారు. యంగ్, కాంఫెర్ రెండేసి వికెట్లు సాధించారు. అనంతరం ఐర్లాండ్ జట్టు తొలిరోజు ఆట చివరికి 31 ఓవర్లలో 4 వికెట్లకు 100 పరుగులు చేసింది. కాంఫెర్ 49 రన్స్ సాధించాడు.

నాగ్‌పూర్, ముంబైల్లో రంజీ సెమీస్

న్యూఢిల్లీ: ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్, నాగ్‌పూర్‌లోని విదర్భ క్రికెట్ అసోసియేషన్ స్టేడియం ఈ సీజన్ రంజీ ట్రోఫీ సెమీఫైనల్స్‌కు వేదికలు కానున్నాయి. మార్చి రెండు నుంచి జరిగే రంజీ సెమీస్‌లో విదర్భ-మధ్య ప్రదేశ్ (నాగ్‌పూర్‌లో), తమిళనాడు-ముంబై (ముంబైలో) జట్లు తలపడనున్నాయి.

జైస్వాల్‌కు 12, జురెల్‌కు 69

దుబాయ్: ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో అద్భుత ప్రదర్శన కనబరుస్తున్న యశస్వీ జైస్వాల్ ర్యాంకుల్లోనూ ముందుకెళ్లాడు. బుధవారం ఐసీసీ ప్రకటించిన టెస్టు ర్యాంకింగ్స్ బ్యాటర్ల జాబితాలో యశస్వీ మూడు స్థానాలు ఎగబాకి 12వ స్థానానికి చేరుకున్నాడు. రాంచీ టెస్టులో సూపర్ షోతో అలరించిన ధ్రువ్ జురెల్ 31 స్థానాలు మెరుగుపరచుకొని 69వ ర్యాంకులో నిలిచాడు. కేన్ విలియమ్సన్ నెంబర్ వన్ బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. బౌలర్లలో బుమ్రా టాప్‌లో, అశ్విన్‌లో రెండో స్థానంలో ఉన్నారు.

రెండో రౌండ్లో ప్రజ్ఞానంద ఓటమి

ప్రాగ్ మాస్టర్స్ చెస్

ప్రాగ్: భారత చెస్ సంచలనం ప్రజ్ఞానందకు ప్రాగ్ మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో రెండో రౌండ్లో నిరాశ ఎదురైంది. బుధవారం రాత్రి ఇరాన్ గ్రాండ్‌మాస్టర్ పర్హమ్ మగ్సూద్‌తో జరిగిన గేమ్‌లో ప్రజ్ఞానంద పరాజయం పాలయ్యాడు. కాగా, అంతకుముందు రోజు జరిగిన మొదటి రౌండ్లో జర్మనీ గ్రాండ్‌మాస్టర్ విన్సెంట్ కేమర్‌ను 41 ఎత్తుల్లో ప్రజ్ఞానంద ఓడించాడు. ఈ ప్రదర్శనతో లైవ్ రేటింగ్‌లో మరోసారి దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్‌ను అధిగమించిన ప్రజ్ఞానంద భారత్ తరఫున అత్యధిక రేటింగ్ కలిగిన ఆటగాడిగా నిలిచాడు. ఇక, ఇతర రెండో రౌండ్ మ్యాచుల్లో నోదిర్‌బెక్ అబ్దుసత్తరోవ్ (ఉజ్బెకిస్థాన్)తో గేమ్‌ను విదిత్ సంతోష్ గుజరాతి డ్రా చేసుకున్నాడు. రెండో రౌండ్ అనంతరం ప్రజ్ఞానంద, విదిత్ చెరో పాయింట్‌తో ఉన్నారు.

బోర్డును ధిక్కరించిన
ఇషాన్, అయ్యర్‌పై వేటు

- సెంట్రల్ కాంట్రాక్టుల్లో మొండిచేయి
- గ్రేడ్-ఎకు సిరాజ్ ప్రమోట్
- తిలక్ వర్మకు చోటు
- ఎ+ గ్రేడ్‌కు రూ. 7 కోట్లు





తిలక్ వర్మ

న్యూఢిల్లీ: రంజీ మ్యాచ్‌లు ఆడాలంటూ చేసిన సూచనలను బేఖాతరు చేసిన ఇషాన్ కిషన్, శ్రేయాస్ అయ్యర్‌కు బీసీసీఐ గట్టిషాక్ ఇచ్చింది. 30 మంది ఆటగాళ్లతో బుధవారం విడుదల చేసిన సెంట్రల్ కాంట్రాక్ట్‌ల జాబితా నుంచి వీరిద్దరినీ తప్పించారు. 2023లో 26 మంది ఉండగా.. ఈసారి అదనంగా మరో నలుగురికి కాంట్రాక్ట్‌లు దక్కడం గమనార్హం. మానసిక సమస్యలతో దక్షిణాఫ్రికా టూర్ మధ్యలో జట్టునుంచి బయటకు వచ్చిన కిషన్.. జార్ఖండ్ తరఫున రంజీలు ఆడకుండా ఐపీఎల్ కోసం సన్నద్ధం అవుతుండడం బోర్డు పెద్దలకు ఆగ్రహం తెప్పించింది. అలాగే శ్రేయాస్ అయ్యర్ కూడా బోర్డు ఆదేశాల్ని పట్టించుకోలేదు. చేతులు కాలాక అన్నట్టు..ఇప్పుడు ముంబై తరఫున సెమీస్ ఆడడానికి సిద్ధమయ్యాడు. గతేడాది అయ్యర్ 'బి'లో, ఇషాన్ 'సి' గ్రేడ్ కాంట్రాక్టుల్లో ఉన్నారు. ఇక రోహిత్ శర్మ, కోహ్లీ, బుమ్రా, జడేజాలు ఉన్న ఎ+ గ్రేడ్‌లో ఎటువంటి మార్పులూ లేవు. అయితే, పేసర్ సిరాజ్‌తోపాటు కేఎల్ రాహుల్, శుభ్‌మన్ గిల్‌లకు 'బి' గ్రేడ్ నుంచి 'ఎ'కు ప్రమోషన్ లభించగా.. తెలుగు కుర్రాడు తిలక్ వర్మతోపాటు మొత్తం 15 మందికి 'సి గ్రేడ్' కాంట్రాక్ట్‌లు లభించాయి. తిలక్‌కు ఇదే తొలి సెంట్రల్ కాంట్రాక్ట్. గతేడాది 'సి'లో ఉన్న కేఎస్ భరత్ కాంట్రాక్ట్‌ను కొనసాగించారు. యశస్వి జైస్వాల్‌కు తొలిసారి.. అందునా నేరుగా 'బి గ్రేడ్' జాబితాలో చోటుదక్కింది. గాయం కారణంగా ఆటకు దూరమైన రిషభ్ పంత్, అక్షర్ పటేల్ స్థాయిని తగ్గించి 'బి గ్రేడ్'లో చేర్చారు. అయ్యర్, ఇషాన్‌ల పేర్లను ఈ విడత పరిగణనలోకి తీసుకోలేదని బీసీసీఐ విడుదల చేసిన ప్రకటనలో ప్రత్యేకంగా పేర్కొంది. జాతీయ జట్టుకు దూరమైన ఆటగాళ్లు.. ఆ సమయంలో జరుగుతున్న దేశవాళీ టోర్నీలకు ప్రాధాన్యతనివ్వాలని మరోసారి స్పష్టం చేసింది. నిర్దేశించిన కాల పరిమితి (అక్టోబరు 1, 2023-సెప్టెంబరు 30, 2024)లో 3 టెస్టులు లేదా 8 వన్డేలు లేదా 10 టీ20లు ఆడిన ఆటగాళ్లకు కాంట్రాక్ట్‌లు దక్కాయని బోర్డు తెలిపింది. ఇంగ్లండ్ సిరీస్‌లో రెండే టెస్టులు ఆడిన ధ్రువ్ జురెల్, సర్ఫరాజ్ ఖాన్‌లు.. ధర్మశాలలో జరిగే ఆఖరి మ్యాచ్‌లో కూడా ఆడితే 'సి గ్రేడ్' కాంట్రాక్ట్‌కు పరిగణనలోకి తీసుకొంటామని వివరించింది.

సెంట్రల్ కాంట్రాక్ట్‌లు (2023-24) వీరికే..

ఎ+ గ్రేడ్ (రూ. 7 కోట్లు): రోహిత్, కోహ్లీ, బుమ్రా, జడేజా
ఎ గ్రేడ్ (రూ.5 కోట్లు): అశ్విన్, షమి, సిరాజ్, రాహుల్, గిల్, హార్దిక్ పాండ్యా.
బి గ్రేడ్ (రూ. 3 కోట్లు): సూర్యకుమార్ యాదవ్, రిషభ్ పంత్, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, జైస్వాల్.
సి గ్రేడ్ (రూ. కోటి): రింకూ సింగ్, తిలక్ వర్మ, కేఎస్ భరత్, రజత్ పటీదార్, రుతురాజ్ గైక్వాడ్, శార్దూల్ ఠాకూర్, శివమ్ దూబే, రవి బిష్ణోయ్, జితేష్ శర్మ, వాషింగ్టన్ సుందర్, ముకేష్ కుమార్, సంజూ శాంసన్, అర్షదీప్, ప్రసిద్ధ్ కృష్ణ, అవేశ్ ఖాన్.
పేస్ బౌలింగ్ కాంట్రాక్ట్‌లు: ఆకాశ్ దీప్, విజయ్ కుమార్ వైశాఖ్, ఉమ్రాన్ మాలిక్, యష్ దయాళ్, విద్వత్ కవేరప్ప.

పుజార కెరీర్ ముగిసినట్టేనా?

చతేశ్వర్ పుజార, ఉమేష్ యాదవ్, శిఖర్ ధవన్, దీపక్ హుడా, యజ్వేంద్ర చాహల్‌లకు వార్షిక కాంట్రాక్ట్‌లు దక్కలేదు. దీనిని బట్టి పుజార అంతర్జాతీయ కెరీర్ ముగిసిందన్న సంకేతాలిచ్చినట్టయింది. కానీ, చాహల్ మెరుగైన ప్రదర్శన చేస్తే మళ్లీ టీమ్‌లోకి వచ్చే అవకాశాలున్నాయి. అయితే, ఈసారి ప్రత్యేకంగా ఫాస్ట్ బౌలింగ్ కాంట్రాక్ట్ కింద ఐదుగురి పేర్లను సెలక్షన్ కమిటీ సిఫార్సు చేసింది. కాగా, వార్షిక వేతనాలను ఏమేరకైనా పెంచారా? అనే విషయాన్ని బోర్డు స్పష్టం చేయలేదు.

బాదేసిన నవ్‌గిరె

- 7 వికెట్లతో యూపీ గెలుపు
- ముంబైకి తొలి ఓటమి



కిరణ్ నవ్‌గిరె (57)

డబ్ల్యూపీఎల్‌లో నేడు
బెంగళూరు x ఢిల్లీ
రాత్రి 7.30 గం. నుంచి

బెంగళూరు: కిరణ్ నవ్‌గిరె (31 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 57) సుడిగాలి ఇన్నింగ్స్‌తో.. డబ్ల్యూపీఎల్‌లో యూపీ వారియర్స్ గెలుపు ఖాతా తెరిచింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో యూపీ 7 వికెట్ల తేడాతో డిఫెండింగ్ చాంప్ ముంబై ఇండియన్స్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 161 పరుగులు చేసింది. అంజలి, హారిస్, దీప్తి తలో వికెట్ పడగొట్టారు. ఫిట్‌నెస్ లేమితో హర్మన్‌ప్రీత్ ఈ మ్యాచ్‌కు దూరం కాగా.. సివర్ బ్రంట్ తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరించింది. యాస్తిక భాటియా (26) కలసి తొలి వికెట్‌కు 50 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన హేలీ మాథ్యూస్ (55).. బ్రంట్‌తో కలసి రెండో వికెట్‌కు 42 పరుగులు జోడించింది. డెత్ ఓవర్లలో అమేలియా కెర్ (23), పూజ (18), ఇస్సీ వోంగ్ (15 నాటౌట్) వేగంగా ఆడడంతో.. టీమ్ స్కోరు 160 మార్క్ దాటింది.

పరుగుల వరద..

ఛేదనలో యూపీ 16.3 ఓవర్లలో 3 వికెట్లకు 163 పరుగులు చేసి గెలిచింది. వారియర్స్‌కు ఓపెనర్లు హేలీ (33), కిరణ్ తొలి వికెట్‌కు 56 బంతుల్లో 94 పరుగుల భాగస్వామ్యంతో ధనాధన్ ఆరంభాన్నిచ్చారు. బృంద గాయపడడంతో ముందుగా వచ్చిన కిరణ్ ఎడాపెడా షాట్లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. వోంగ్ వేసిన మూడో ఓవర్‌లో కిరణ్ 4 ఫోర్లతో బ్యాట్ ఝుళిపించగా.. హేలీ కూడా ఆ తర్వాతి ఓవర్‌లో మరో రెండు బౌండ్రీలు బాదింది. దీంతో పవర్‌ప్లే ముగిసే సరికి యూపీ 61/0తో బలమైన స్థితిలో నిలిచింది. అయితే, 10వ ఓవర్‌లో కెర్ బౌలింగ్‌లో కిరణ్ అవుట్ కావడంతో.. యూపీ బ్యాటింగ్ కుదుపులకు గురైంది. ఆ తర్వాతి ఓవర్‌లో తహిల మెక్‌గ్రాత్ (1), హీలీని వోంగ్ అవుట్ చేయడంతో.. వారియర్స్ నాలుగు పరుగుల తేడాతో 3 టాపార్డర్ వికెట్లు చేజార్చుకొంది. కానీ, గ్రేస్ హారిస్ (38 నాటౌట్), దీప్తి (27 నాటౌట్) నాలుగో వికెట్‌కు అజేయంగా 65 పరుగులు జోడించి.. జట్టును గెలిపించారు. నవ్‌గిరెకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

ఫైనల్లో పల్టన్ x స్టీలర్స్

చాంప్ జైపూర్, పట్నాకు షాక్
ప్రొ కబడ్డీ లీగ్



పట్నా రైడర్‌ను పట్టేసిన పుణెరి ఆటగాళ్లు

హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్‌లో ఈసారి కొత్త జట్టు విజేతగా నిలవనుంది. డిఫెండింగ్ చాంపియన్ జైపూర్ పింక్ పాంథర్స్‌కు షాకిస్తూ అనూహ్య ప్రదర్శనతో హరియాణా స్టీలర్స్ తొలిసారి ఫైనల్‌కు దూసుకెళ్లగా.. మూడుసార్లు విజేత పట్నా పైరేట్స్‌ను చిత్తు చేసిన పుణెరి పల్టన్ వరుసగా రెండోసారి టైటిల్‌ఫైట్‌లో నిలిచింది. స్టీలర్స్, పల్టన్ మధ్య శుక్రవారం ఫైనల్ జరగనుంది. ఇద్దరిలో ఎవరు గెలిచినా, వాళ్లకిదే తొలి టైటిల్ కానుంది. ఇక్కడి గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో బుధవారం జరిగిన తొలి సెమీఫైనల్లో పుణెరి జట్టు 37-21 స్కోరు తేడాతో పట్నా పైరేట్స్‌ను చిత్తుగా ఓడించింది. పల్టన్ కెప్టెన్ అస్లామ్ ఇనామ్‌దార్ రైడింగ్‌లో ఏడు పాయింట్లు సాధించి తన జట్టును టైటిల్ ఫైట్‌కు చేర్చడంలో కీలకపాత్ర పోషించాడు. అస్లామ్‌కు తోడు మోహిత్ గోయత్ రైడింగ్‌లో సత్తా చాటడంతో ప్రథమార్ధం ముగిసేసరికే పల్టన్ 20-11తో ఆధిక్యంలో నిలిచింది. ద్వితీయార్ధంలోనూ పుణెరి ఆటగాళ్లు విజృంభించడంతో పైరేట్స్‌కు నిరాశ తప్పలేదు. మహ్మద్‌రెజా అద్భుతమైన ట్యాక్లింగ్‌కు పంకజ్ మోహితె, అబినేశ్, గౌరవ్ ఖత్రి సహకారం తోడవడంతో పల్టన్ దూకుడును అడ్డుకోవడంలో పట్నా విఫలమైంది. సచిన్, సుధాకర్ మాత్రమే రాణించడంతో పట్నాకు ఆ మాత్రం స్కోరైనా దక్కింది. ఆ తర్వాత జరిగిన రెండో సెమీఫైనల్లో హరియాణా స్టీలర్స్ 31-27తో లీగ్ ఫేవరెట్ జైపూర్ పింక్‌పాంథర్స్‌కు ఝలకిచ్చింది. మన్‌ప్రీత్, వినయ్, శివమ్ పథారె ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టి హరియాణాను ఫైనల్‌కు చేర్చారు.

బిజినెస్

రిలయన్స్, డిస్నీ విలీనం

రూ.70,000 కోట్ల మీడియా సంస్థ ఆవిర్భావం



న్యూఢిల్లీ : భారత మీడియా, వినోద పరిశ్రమలో భారీ విలీనం చోటు చేసుకుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్, వాల్ డిస్నీ భారత్‌లోని తమ మీడియా, వినోద వ్యాపారాలను విలీనం చేయాలని నిర్ణయించాయి. దీనికి సంబంధించిన ఒప్పందంపై రెండు సంస్థలు సంతకాలు చేశాయి. దీంతో దేశంలో రూ.70,000 కోట్ల విలువైన అతి పెద్ద మీడియా సంస్థ ఆవిర్భవించనుంది. ఈ నిర్ణయం ప్రకారం రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన మీడియా సంస్థ వయాకామ్ 18 కోర్టు ఆమోదంతో వాల్‌డిస్నీకి చెందిన స్టార్ ఇండియాలో విలీనమవుతుంది. విలీన కంపెనీ ఈక్విటీలో రిలయన్స్ ఇండస్ట్రీస్, దాని అనుబంధ సంస్థలకు 63.16 శాతం, డిస్నీకి 36.84 శాతం వాటా ఉంటుంది.

రూ.11,500 కోట్ల పెట్టుబడి : విలీనం తర్వాత ఏర్పడే కొత్త మీడియా కంపెనీ తన కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు రిలయన్స్ సహకరించనుంది. ఇందుకోసం రూ.11,500 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. దీంతో విలీన కంపెనీ సోనీ, నెట్‌ఫ్లిక్స్‌లను సమర్థవంతంగా ఎదుర్కొంటుందని భావిస్తున్నారు. రిలయన్స్ సినిమా లైవ్ స్పోర్ట్స్ ప్రత్యేక హక్కులు పొందడంతో ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) తొలి త్రైమాసికంలో వాల్ డిస్నీకి చెందిన డిస్నీ+హాట్‌స్టార్ ఖాతాదారులు 5.5 కోట్ల నుంచి 4 కోట్లకు పడిపోయారు. ఈ విలీనంతో సోనీ, జీ టీవీలను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని వాల్ డిస్నీ భావిస్తోంది.

ఎలిఫెంట్ హౌస్‌తో రిలయన్స్ జట్టు

శ్రీలంకకు చెందిన బెవరేజ్ కంపెనీ ఎలిఫెంట్ హౌస్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు రిలయన్స్ రిటైల్ ఎఫ్‌ఎంసీజీ అనుబంధ విభాగమైన రిలయన్స్ కన్స్యూమర్ బుధవారం ప్రకటించింది. ఈ భాగస్వామ్యం ద్వారా భారత్‌లో ఎలిఫెంట్ హౌస్ బ్రాండ్ నేమ్‌తో పానీయాల తయారీతో పాటు విక్రయాలు జరుపనున్నట్లు సంస్థ వెల్లడించింది.



చైర్‌పర్సన్‌గా నీతా అంబానీ

విలీనం తర్వాత రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ భార్య నీతా అంబానీ కొత్త కంపెనీకి చైర్‌పర్సన్‌గా, ఉదయ్ శంకర్ వైస్ చైర్మన్‌గా ఉంటారు. ఈ విలీన ప్రక్రియ ఈ ఏడాది చివరికి లేదా వచ్చే ఏడాది తొలి మూడు నెలల్లో పూర్తవుతుందని భావిస్తున్నారు. జీ-సోనీ మధ్య 1,000 కోట్ల డాలర్ల విలీన ఒప్పందం బెడిసి కొట్టిన నెల రోజులకే రిలయన్స్-వాల్ డిస్నీల మధ్య ఈ విలీన ఒప్పందం కుదరడం విశేషం. రెండు స్ట్రీమింగ్ యాప్‌లు, 120 టీవీ ఛానల్స్ కొత్త కంపెనీ చేతికి వస్తాయి.

2028 నాటికి దేశంలో 20,000 మంది కుబేరులు



గత ఏడాది 6% వృద్ధితో 13,263కు చేరిన సంఖ్య
నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక

న్యూఢిల్లీ: గత ఏడాదిలో భారత కుబేరులు (యూహెచ్‌ఎన్‌డబ్ల్యూఐ) 13,263కు పెరిగారని ప్రముఖ ప్రాపర్టీ కన్సల్టింగ్ కంపెనీ నైట్ ఫ్రాంక్ ఇండియా తాజా నివేదిక వెల్లడించింది. 2022లో 12,495 మంది కుబేరులుండగా.. 2023లో వీరి సంఖ్య 6.1 శాతం పెరిగిందని తెలిపింది. ఐదేళ్లలో (2028 చివరి నాటికి) మరో 50 శాతం పెరిగి దాదాపు 20,000కు చేరుకోవచ్చని అంచనా వేసింది. కనీసం 3 కోట్ల డాలర్ల (దాదాపు రూ.250 కోట్లు) సంపద కలిగిన వారిని ఈ జాబితాలో చేర్చినట్లు సంస్థ స్పష్టం చేసింది. "సంపద సృష్టి యుగంలో ప్రపంచంలోని అభివృద్ధి చెందుతున్న సంపత్తి, అవకాశాలకు భారత్ నిదర్శనంగా నిలిచింది. వచ్చే ఐదేళ్లలో భారత కుబేరులు 50 శాతం పెరగనుండటమే ఇందుకు సంకేతం" అని నైట్ ఫ్రాంక్ ఇండియా చైర్మన్, ఎండీ శిశిర్ బైజాల్ అన్నారు.

నివేదిక ముఖ్యాంశాలు..

1 భారత కుబేరుల్లో 90 శాతం మంది సంపద 2024లో మరింత వృద్ధి చెందవచ్చని అంచనా. 63 శాతం మంది సంపద విలువ 10 శాతంపైనే పెరిగే అవకాశం ఉంది.

1 2028 చివరినాటికి ప్రపంచవ్యాప్తంగా యూహెచ్‌ఎన్‌డబ్ల్యూఐలు మరో 28.1 శాతం పెరిగి 8,02,891కి చేరుకోవచ్చని అంచనా. గత ఏడాదిలో వీరి సంఖ్య 4.2 శాతం పెరిగి 6,01,300కు చేరుకుంది.

1 గత సంవత్సరం కుబేరుల సంఖ్య పెరుగుదల పరంగా, 9.7 శాతం వృద్ధితో టర్కీ అగ్రస్థానంలో ఉంది. అమెరికాలో 7.9 శాతం, భారత్‌లో 6.1 శాతం, దక్షిణ కొరియాలో 5.6 శాతం, స్విట్జర్లాండ్‌లో 5.2 శాతం వృద్ధి నమోదైంది.

17% పెట్టుబడులు విలాస వస్తువులపైనే..

భారత కుబేరుల్లో విలాస వస్తువులపై మోజు ఎక్కువేనని నైట్‌ఫ్రాంక్ పేర్కొంది. వారు తమ పెట్టుబడి సొమ్ములో 17 శాతం అత్యంత ఖరీదైన గడియారాలు వంటి లగ్జరీ ఉత్పత్తులు, పెయింటింగ్స్, ఆభరణాలు వంటి వాటికి కేటాయిస్తున్నట్లు తెలిపింది. వారు వాటిని కలిగి ఉండటంలో లభించే సంతోషమే ఇందుకు కారణమని కంపెనీ సర్వేలో వెల్లడైంది.

సంపదలో 32 శాతం స్థిరాస్తుల కొనుగోలుకు..

భారత కుబేరులు తమ సంపదలో 32 శాతం దేశ, విదేశాల్లో స్థిరాస్తుల కొనుగోలుకు కేటాయించినట్లు ఆ నివేదికలో తెలిపారు. వీరి స్థిరాస్తుల పోర్ట్‌ఫోలియోలో 14 శాతం విదేశాల్లోనివేనని పేర్కొంది. ఈ నివేదిక ప్రకారం సగటున, ఒక భారత కుబేరుడు 2.57 ఇళ్లు కలిగి ఉన్నారు. 28 శాతం మంది తమ రెండో ఇంటిని గత ఏడాదిలో అద్దెకిచ్చారు. భారత కుబేరుల్లో 12 శాతం మంది ఈ ఏడాదిలో కొత్త గృహం కొనుగోలు ఆలోచనలో ఉన్నారు. దాదాపు ఇంతే శాతం మంది గత ఏడాదిలోనే కొత్త ఇళ్లు కొనుగోలు చేశారని నివేదిక తెలిపింది. భారత సంపన్నులకు స్థిరాస్తులు ప్రధాన పెట్టుబడి మార్గమని పేర్కొంది. లగ్జరీ ఫ్లాట్లు, గృహాల కొనుగోళ్లు, ధరల్లో వృద్ధితో నైట్ ఫ్రాంక్ ప్రైమ్ ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ ఇండెక్స్‌లో ముంబై 8వ స్థానానికి ఎగబాకింది. ఢిల్లీ 37, బెంగళూరు 59వ స్థానాల్లో నిలిచాయి.

సునీల్ మిట్టల్‌కు 'నైట్‌హుడ్'

బ్రిటన్ అత్యున్నత పౌర పురస్కారం



లండన్: భారతీ ఎంటర్‌ప్రైజెస్ వ్యవస్థాపకులు, చైర్మన్ సునీల్ భారతీ మిట్టల్‌కు అరుదైన గౌరవం దక్కింది. బ్రిటన్ ప్రభుత్వం మిట్టల్‌ను గౌరవ నైట్‌హుడ్ అవార్డుతో సత్కరించింది. కింగ్ చార్లెస్-3 చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును బుధవారం అందుకున్నారు. కింగ్ చార్లెస్-3 నుంచి ఈ ప్రతిష్ఠాత్మక, అత్యున్నత పౌర పురస్కారాన్ని అందుకున్న తొలి భారతీయుడు ఈయనే. ఉభయ వాణిజ్య సంబంధాల బలోపేతానికి కృషి చేసినందుకు ఆయనకు ఈ పురస్కారం లభించింది. "బ్రిటన్ రాజు నుంచి ఈ అవార్డు అందుకోవడం గౌరవంగా భావిస్తున్నాను" అని మిట్టల్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. గతంలో రతన్ టాటా (2009లో), రవిశంకర్ (2001), జంషెడ్ ఇరానీ (1997) కూడా బ్రిటన్ రాణి 'ఎలిజబెత్-2' నుంచి గౌరవ నైట్‌హుడ్ పురస్కారాన్ని అందుకున్నారు. సునీల్ మిట్టల్ ప్రస్తుతం ఇండియా-యూకే సీఈఓ ఫోరమ్ సభ్యులుగా ఉన్నారు. గతంలో యూనివర్సిటీ ఆఫ్ లీడ్స్, న్యూకాసిల్ యూనివర్సిటీ నుంచి హానరరీ డాక్టర్ ఆఫ్ సివిల్ లా అవార్డులను అందుకున్నారు. అంతేకాదు, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ సలహాదారుల బృందంలో సభ్యుడిగానూ ఉన్నారు. అలాగే, లండన్ బిజినెస్ స్కూల్ (ఎల్‌బీఎస్) గవర్నింగ్ బాడీకి సేవలందించారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్‌లో భారత సలహా బృందం సభ్యులుగానూ పనిచేశారు.

హైదరాబాద్ మైక్రోసాఫ్ట్ కేంద్రం
సందర్శించిన బిల్‌గేట్స్



హైదరాబాద్: మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ మంగళవారం హైదరాబాద్‌లోని ఇండియా డెవలప్‌మెంట్ సెంటర్‌ను (ఐడీసీ) సందర్శించారు. ఐడీసీ ఏర్పాటై 25 సంవత్సరాలు నిండిన సందర్భంగా ఈ కేంద్రాన్ని సందర్శించిన గేట్స్ కొందరు మేధోవంతులైన ఇంజనీరింగ్ సిబ్బందితో భేటీ అయ్యారు. కృత్రిమ మేధ (ఏఐ) చోదక భారతదేశానికి అవకాశాలు అపారంగా ఉన్నాయన్న ఆశాభావం ప్రకటించారని మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బిల్ గేట్స్ ఆకాంక్షలను అనుగుణంగా ఏఐ, క్లౌడ్, సెక్యూరిటీ, గేమింగ్ విభాగాల్లో ఐడీసీ మరింతగా కృషి చేస్తుందని చెప్పారు. 1998లో ఇన్నోవేషన్ కేంద్రంగా అభివృద్ధి చెందాలన్న ఆకాంక్షతో బిల్ గేట్స్ ఈ కేంద్రాన్ని స్థాపించారని పేర్కొన్నారు. ఈ 25 సంవత్సరాల కాలంలో అజ్యూర్, విండోస్, ఆఫీస్, బింజ్, కోపైలట్ వంటి ప్రపంచ శ్రేణి ఉత్పత్తులు, ఏఐ అప్లికేషన్ల అభివృద్ధిలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషించిందని ఆ ప్రకటనలో తెలిపారు. మైక్రోసాఫ్ట్ చైర్మన్, సీఈఓ సత్య నాదెళ్ల కూడా తన ఇటీవలి పర్యటనలో ఏఐలో భారత్‌కు అపార అవకాశాలున్న విషయం ప్రస్తావించారని గుర్తు చేశారు.

తెలుగు రాష్ట్రాల్లో యారీ రైడర్ యాప్ విస్తరణ

హైదరాబాద్: ఓపెన్ నెట్‌వర్క్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) ఆధారిత 'యారీ' రైడర్ యాప్ తన సేవలను మరింత విస్తరిస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్‌కే పరిమితమైన ఈ యాప్ ఏప్రిల్ నెలాఖరుకల్లా తన సేవలను వరంగల్, విజయవాడ, తిరుపతి, వైజాగ్‌లకు విస్తరించనుంది. ఈ యాప్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ (సీబీఓ) పారితోష్ వర్మ ఈ విషయం వెల్లడించారు. రోజుకు రూ.25 కమిషన్‌తో ఆటో డ్రైవర్లు ఎవరైనా తమ రైడింగ్ యాప్‌లో చేరవచ్చన్నారు. క్యాబ్‌లకు సంబంధించి రోజువారీ కమిషన్‌ను ఇంకా ఖరారు చేయాల్సి ఉందన్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో 30,000 ఆటో రిక్షాలు, మూడు వేల క్యాబ్‌లు 'యారీ' యాప్ ద్వారా సేవలు అందిస్తున్నాయి. వచ్చే నెలాఖరుకల్లా ఈ సంఖ్యను 50 వేల ఆటో రిక్షాలు, 10 వేల క్యాబ్‌లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వర్మ తెలిపారు

రూ.6 లక్షల కోట్ల సంపద ఆవిరి

అమ్మకాల ఒత్తిడితో 800 పాయింట్లు కుంగిన సెన్సెక్స్



ముంబై: లాభాల స్వీకారంతో స్టాక్‌మార్కెట్ బుధవారం కుదేలైంది. సెన్సెక్స్ 790.34 పాయింట్ల నష్టంతో 72,304.88 వద్ద ముగియగా నిఫ్టీ 247.20 పాయింట్లు నష్టపోయి 21,951.15 వద్ద స్థిరపడింది. ఒక్క రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ల అమ్మకాలతోనే సెన్సెక్స్ 186 పాయింట్లు నష్టపోయింది. సెన్సెక్స్ ఒక దశలో 876.93 పాయింట్లు నష్టపోయి 72,222.29 పాయింట్ల ఇంట్రా డే కనిష్ఠ స్థాయిని తాకింది. స్మాల్‌క్యాప్, మిడ్ క్యాప్ సూచీలు కూడా బుధవారం 1.82 శాతం నుంచి 1.94 శాతం వరకు నష్టపోయాయి. ఈ అమ్మకాల హోరుతో బీఎస్ఈలో లిస్టింగ్ అయిన కంపెనీల షేర్ల మార్కెట్ విలువ రూ.6.02 కోట్లు తుడిచి పెట్టుకు పోయింది.

ఎందుకంటే ?: గురువారం ఫిబ్రవరి నెల ఎఫ్ అండ్ ఓ సెటిల్‌మెంట్స్‌కు చివరి రోజు కావడం, ప్రధాన అంతర్జాయ మార్కెట్లు నష్టాల్లో ట్రేడవడం, ఎఫ్‌పీఐల అమ్మకాలు, లాభాల స్వీకరణ మార్కెట్‌ను బాగా దెబ్బతీశాయి. అమెరికా కేంద్ర బ్యాంకు వడ్డీరేట్లు ఇప్పట్లో తగ్గించకపోవచ్చన్న వార్తలు, గురువారం వెలువడే జీడీపీ గణాంకాలు అంత ఆశాజనకంగా ఉండకపోవచ్చన్న అంచనాలూ మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి.

వొడాఫోన్ ఐడియా షేర్లు ధమాల్ : వొడాఫోన్ ఐడియా కంపెనీ షేర్లు బుధవారం మదుపరులకు చుక్కలు చూపించాయి. అమ్మకాలు హోరెత్తడంతో బీఎస్ఈలో ఈ కంపెనీ షేర్లు 13.99 శాతం నష్టంతో రూ.13.65 వద్ద ముగిశాయి. దీంతో బుధవారం ఒక్క రోజే కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.10,806.71 కోట్లు తుడిచి పెట్టుకు పోయి రూ.66,447.95 కోట్లకు చేరింది.

యూకేలో టాటాల ఈవీ బ్యాటరీల ఫ్యాక్టరీ

లండన్: టాటా గ్రూప్ బ్రిటన్‌లో అతి పెద్ద విద్యుత్ వాహనాల (ఈవీ) బ్యాటరీల తయారీ ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. తన అనుబంధ సంస్థ అగ్రటాస్ ద్వారా టాటా గ్రూప్ బ్రిటన్ వాయువ్య ప్రాంతంలోని సోమర్‌సెట్‌లో ఈ ప్లాంట్ ఏర్పాటు చేయనుంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,830 ▼	57,590 ▼	75,400 ▼
ముంబై	62,140 ▼	56,920 ▼	69,340 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

28వ తేదీ	
హైదరాబాద్	460
29వ తేదీ	
చిత్తూరు	543
గోదావరి	460
విజయవాడ	460
విశాఖపట్నం	500
వరంగల్	462
దజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	135
వరంగల్	135
కరీంనగర్	135
మహబూబ్‌నగర్	135
కర్నూలు	135
విశాఖపట్నం	127
గోదావరి	139
విజయవాడ	139
గుంటూరు	139
ఒంగోలు	139
చిత్తూరు	144

బాదుడు లేని అభివృద్ధి, కోతలు లేని సంక్షేమం అమలు చేస్తాం. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. ప్రభుత్వ ఆదాయాన్ని పేద వర్గాల అభివృద్ధికి వెచ్చిస్తాం. త్వరలో బీసీ డిక్లరేషన్ విడుదల చేస్తున్నాం. తర్వాత ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ డిక్లరేషన్లు, యువత పాలసీ కూడా విడుదల చేస్తాం.

రాష్ట్రంలో విధ్వంసం చేసిన పాలకులను తరిమి కొట్టడానికి ప్రజలు సిద్ధం! త్వరలో నవ్యాంధ్రకు నవోదయం! వచ్చే ఎన్నికలు రాష్ట్రానికి ఎంతో కీలకం. వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్ కోసమే చేతులు కలిపాం.

కులాలు కూడు పెట్టవు. మంచి పాలకులు కావాలి. అధికారం కోసం జగన్ రాష్ట్రాన్ని కులాలు, వర్గాలు, ప్రాంతాలుగా విభజిస్తున్నారు. ఒక్కో ఇటుక పేర్చి కట్టిన కట్టడాన్ని జగన్ ఒక్క గొడ్డలి పెట్టుతో విధ్వంసం చేశారు. దీనిని సీనియర్ నేతగా నేను, ప్రశ్నించే తత్వమున్న పవన్ భరించలేం.

- చంద్రబాబు

'తెలుగు జన విజయ కేతనం జెండా' సభలో టీడీపీ - జనసేన శ్రేణులకు అభివాదం చేస్తున్న పవన్, చంద్రబాబు





తాడేపల్లిగూడెం సమీపంలోని ప్రత్తిపాడులో 'తెలుగు జన విజయ కేతనం జెండా' పేరిట నిర్వహించిన ఉమ్మడి సభకు భారీగా తరలివచ్చిన జనం.

జగన్ నీకు సంబంధించినంత వరకూ నేను మూడు పెళ్లిళ్లు.. రెండు విడాకులు. పవన్ అంటే ఆంధ్రప్రదేశ్ ప్రజల భవిష్యత్.. కన్నీళ్లు తుడిచే చేయి.. ప్రాణాపాయంలో అర్ధరాత్రి పరిగెత్తుకుంటూ వచ్చే 108 అంబులెన్స్.. ఆడబిడ్డలకు రక్షణగా ఉండే రాఖీ. పెద్దోళ్ల భుజం మీద ఉంటే కండువా.. గర్వంగా ఎగిరే జాతీయ జెండా.. జగన్.. పవన్ అంటే.. నిన్ను నట్టేట ముంచే తుఫాన్. నిన్ను పాతాళానికి తొక్కే వామనుడి పాదం. గుర్తుపెట్టుకో.

- పవన్‌కల్యాణ్

జయం మనదే!

ప్రజల ఆశీర్వాదం కోసమే ఈ ఉమ్మడి సభ

'తెలుగు-జన విజయకేతనం' సభలో చంద్రబాబు ఉద్ఘాటన

అమరావతి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): "టీడీపీ-జనసేన పొత్తు గెలవాలి. రాష్ట్రం వెలగాలి. పేదల జీవితాలు పండాలి. తెలుగుదేశం, జనసేన పార్టీల ఐక్యత విజయ శిఖరంలా నిలబడాలి" అని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. తొలి విడత అభ్యర్థుల జాబితా ప్రకటన అనంతరం.. బుధవారం పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో నిర్వహించిన 'తెలుగు జన విజయకేతనం - జెండా' సభలో ఆయన ప్రసంగించారు. ముఖ్యాంశాలు చంద్రబాబు మాటల్లోనే...

'రెండు పార్టీలు కలిసిన తర్వాత జరుగుతున్న ఈ మొదటి సభ రాష్ట్రం దశ, దిశ మార్చబోతోంది. తాడేపల్లిగూడెం సభ తాడేపల్లి ప్యాలెస్‌ను కంపింపచేస్తోంది. ఈ సభ ఒక శుభ సూచకం. రాష్ట్రానికి నవోదయం. రెండు పార్టీలు కలిసింది మా కోసం... మా అధికారం కోసం కాదు. ఈ రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజల భవిష్యత్తును బాగు చేయడం కోసం! ఒక సైకో చేతిలో నాశనమైన రాష్ట్రాన్ని నిలబెట్టడానికి... యువతకు మంచి భవిష్యత్తు ఇవ్వడానికి... రైతాంగానికి అండగా నిలవడానికి... పేదల జీవితాల్లో వెలుగులు నింపడానికే ఈ పొత్తు. ఒక వ్యక్తి తన అహంతోనో... తన జేబులు నింపుకోవడానికో ఈ రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తుంటే నేనూ పవన్ కల్యాణ్ చూస్తూ ఊరుకోలేం. మాది ప్రజలు కోరుకొన్న పొత్తు. ప్రజలు కుదిర్చిన పొత్తు. రాష్ట్రానికి వెలుగు నింపే పొత్తు. మా ఇద్దరికీ ఏ భేషజాలు లేవు. ఈ రాష్ట్రాన్ని విధ్వంస పాలన నుంచి కాపాడటానికి మేం ఏ త్యాగాలకైనా సిద్ధం. ఈ పొత్తు సూపర్ హిట్ అని ఈ సభతోనే తేలిపోయింది. ప్రజల ఆశీర్వాదం కోసమే ఈ సభ!

కుట్రలు తిప్పి కొట్టండి...

టీడీపీ, జనసేన పార్టీల పొత్తును చూడలేని శక్తులు ఈ ఐక్యతను భగ్నం చేయడానికి అనేక కుట్రలు చేస్తాయి. వాటిలో పడవద్దు. రెండు పార్టీల్లో బాగా పనిచేసిన వారు అనేక మంది ఉన్నారు. అందరికీ ఎన్నికల్లో సీట్లు ఇవ్వలేం. కానీ.. బాగా పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు న్యాయం చేసే బాధ్యతను మేం ఇద్దరం తీసుకుంటాం. రెండు పార్టీల్లో ఎవరూ ఆవేశానికి పోవద్దు. ఇద్దరిలో ఎవరూ ఎక్కువ కాదు.. ఎవరూ తక్కువ కాదు. రెండు పార్టీలు కలిసి అడుగు వేయాలి. పొత్తు ధర్మాన్ని అందరూ అర్థం చేసుకోవాలి. ప్రజల జీవితాలను ఛిద్రం చేసిన వారిని రాష్ట్రం నుంచి తరిమికొట్టడానికి సమష్టిగా పనిచేయాలి!

'సైకో' అంటున్నది ఇందుకే...

దేశం మొత్తం మీద ఏ రాష్ట్ర ముఖ్యమంత్రినైనా సైకో అని పిలుస్తున్నారా? రూ.5కు అన్నం పెట్టే అన్న క్యాంటీన్లను మూసి వేయించాడు. ప్రజా వేదిక కూల్చివేతతో తన పాలన మొదలు పెట్టాడు. మాస్క్ అడిగిన డాక్టర్ సుధాకర్ చావు కళ్లచూశారు. తూర్పు గోదావరిలో దళితుడిని చంపి శవాన్ని ఇంటికి డోర్ డెలివరీ చేశారు. రాజధాని అమరావతిలో ఎస్ఆర్ఎం, విట్ యూనివర్సిటీలు పెడితే వాటిపై కక్షగట్టి రోడ్లు వేయకుండా ఇబ్బందులు పెడుతున్నాడు. రాష్ట్ర క్రికెట్ టీం కెప్టెన్ హనుమ విహారి వైసీపీ టెర్రరిస్టుల వేధింపులు భరించలేక రాష్ట్రం వదిలి పారిపోయాడు. సొంత చెల్లిని, తల్లిని కూడా సామాజిక మాధ్యమాల్లో చండాలంగా తిట్టిస్తున్నాడు. ఇప్పటం గ్రామంలో జనసేన సభకు భూమి ఇచ్చారని వాళ్ల ఇళ్లను రోడ్డు విస్తరణ పేరుతో కూలగొట్టించాడు. సినిమా టికెట్ల వివాదం తీసుకువచ్చి చిరంజీవి, రాజమౌళి వంటి వారిని కూ డా అవమానించాడు. ఆయన చర్యలను తప్పుబట్టిన పవన్ ఈ రాష్ట్రానికి విమానంలో రావడానికి వీల్లేదని అడ్డుపడ్డాడు. ఎన్నికల ముందు ముద్దులు పెట్టి తర్వాత పిడి గుద్దులు గుద్దడం జగన్ నైజం. ఈ సైకోను భరించడం అవసరమా?

నాడు పడిన కష్టాన్ని...

అశాస్త్రీయ విభజనతో నష్టపోయిన రాష్ట్రాన్ని నిలబెట్టడానికి గత ప్రభుత్వ హయాంలో అహర్నిశలూ శ్రమించాం. హైదరాబాద్‌ను మించిన రాజధానిని నిర్మించాలని అమరావతి తలపెట్టాం. రాష్ట్రంలో ప్రతి చేనుకూ నీరివ్వాలని పోలవరం పరుగులు పెట్టించాం. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఐఐటీ, ఐఐఎం సహా పదకొండు కేంద్ర విద్యా సంస్థలు తెచ్చాం. పదహారు లక్షల కోట్ల పెట్టుబడులు, పది లక్షల ఉద్యోగాలు తెచ్చాం. ఎదుగుతున్న చెట్టును ఒక గొడ్డలి వేటుతో నరికినట్లు జగన్ నరికేశాడు. ఈ రాష్ట్రాన్ని బాగు చేసుకోవాలన్న తపన, పట్టుదల మాకున్నాయి. మేం వస్తే ఏం చేయాలో ఒక బ్లూ ప్రింట్‌తో సిద్ధంగా ఉన్నాం. కొద్ది రోజుల్లో ఉమ్మడి మేనిఫెస్టో కూడా ప్రజల ముందు ఉంచుతాం. మన అభ్యర్థులను ఎంపిక చేసే ముందు రాష్ట్రవ్యాప్తంగా కోటీ ముప్పై లక్షల మంది అభిప్రాయాలు సేకరించాం. ప్రజల అభిప్రాయాలు తెలుసుకొని అభ్యర్థులను ఎంపిక చేస్తున్నాం. మన అభ్యర్థులను చూసి జగన్ భయపడుతున్నాడు. విజయ సాధనకు కసితో పనిచేయాలి!

వై నాట్ పులివెందుల?

'వై నాట్ 175' అని జగన్ అంటుంటే 'వై నాట్ పులివెందుల' అని మేం ప్రశ్నిస్తున్నాం. ఏం పీకావని 175 సీట్లు నీకు ఇవ్వాలి? వై నాట్ జాబ్ క్యాలెండర్? వై నాట్ డీఎస్సీ? వైనాట్ ఉచిత ఇసుక? వీటి గురించి ఎందుకు మాట్లాడవు? ఈసారి పులివెందులలో కూడా ఓడిస్తాం. తాడేపల్లిగూడెం సభలో ప్రజాగర్జన పులివెందులలో కూడా ప్రతి ధ్వనిస్తోంది. హూ కిల్డ్ బాబాయి? దమ్ముంటే సమాధానం చెప్పు జగన్! పాతిక ఎంపీ సీట్లు ఇస్తే హోదా తెస్తానన్నాడు. మద్య నిషేధం అన్నాడు. సీపీఎస్ రద్దన్నాడు. చేశాడా? జగన్ ఒక బ్లఫ్ మాస్టర్. పవన్, బాలయ్యకు కూడా తెలియని సినిమా సెట్టింగులు వేసి పాలన చేస్తున్నాడు. కుప్పంలో నీళ్లు వదిలినట్లు చూపించడానికి ఒక గేటు తెచ్చి పెట్టాడు. తెల్లవారేసరికి అక్కడ నీళ్లు లేవు. 23 గంటల్లో పెట్టిన గేటు కూడా లారీలో వేసుకొని వెళ్లిపోయారు. ఈ రాష్ట్రంలో పాలన అంతా ఇదే మాదిరి వ్యవహారం.

సిద్ధానికి యుద్ధమే సమాధానం

సిద్ధం అంటూ రోడ్డెక్కిన వాడికి యుద్ధమంటే ఏమిటో తెలియాలి. ప్రజల నుంచి వచ్చింది తెలుగుదేశం-జనసేన పొత్తు. శ్రామికులు, యువత, నిరుద్యోగులు, రైతులు కోరుకున్న పొత్తు ఇది. తెలుగుదేశం శ్రామికుని కండరాల నుంచి వచ్చింది. రైతు కష్టాలనుంచి, పేదల కన్నీళ్లనుంచి పుట్టుకొచ్చింది. వైసీపీ ప్రభుత్వంలో మోసపోయిన వారంతా ఓటు వేస్తే జగన్‌మోహన్‌రెడ్డి ఇంటికి పోవడం ఖాయం. తెలుగుదేశం-జనసేన విజయం సొంతం.

- అచ్చెన్నాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు, టీడీపీ



ఉమ్మడిగా ఉప్పొంగిన 'జెండా'

(మొదటి పేజీ తరువాయి)

అధికార వైసీపీ అన్ని రకాలుగా ప్రయత్నించింది. వైసీపీ 'సిద్ధం' సభలకు వేల సంఖ్యలో ఆర్టీసీ బస్సులను ఇస్తున్న సంగతి తెలిసిందే. విద్యా సంస్థల బస్సులనూ హైజాక్ చేస్తున్నారు. కానీ.. 'ప్రయాణికుల ఒత్తిడి ఎక్కువ ఉన్నందున జెండా సభకు బస్సులు ఇవ్వలేం' అంటూ ఆర్టీసీ అధికారులు సాకులు చెప్పారు. జన సమీకరణకు ఆటంకాలు సృష్టించారు. రేయింబవళ్లు పనిచేస్తున్న కార్మికులనూ పోలీసులు బెదిరించారు. మంగళవారం పొద్దుపోయిన తర్వాత ప్రాంగణంలో భారీ వేదిక నిర్మాణం, ఎల్ఈడీలు ఏర్పాటు చేస్తుండగా.. అర్ధరాత్రి ఈ పనులు చేయడానికి వీలు లేదంటూ ఆంక్షలకు దిగారు. అయినా నేతలు ఎక్కడా వెనక్కి తగ్గలేదు.

ఆంక్షలు అధిగమించి...

సభకు వస్తున్న వాహనాలను తాడేపల్లిగూడెం, రాజమండ్రి జాతీయ రహదారిపై ట్రాఫిక్ నియంత్రణ పేరిట పోలీసులు నిలిపివేశారు. అయినా... ఒకటి రెండు కిలోమీటర్లు నడిచి మరీ జనం సభా ప్రాంగణానికి చేరుకున్నారు. అద్దె బస్సులు, సొంత కార్లు, ఇతర వాహనాల్లో తరలి వచ్చారు. మండుటెండలోనూ టీడీపీ, జనసేన జెండాలతో సందడి చేశారు. జాతీయ రహదారి వెంట కిలోమీటర్ల పొడవునా జనమే కనిపించారు. సభకు వచ్చిన వారికి మజ్జిగ ప్యాకెట్లు, మంచినీళ్లు అందించారు. అటు శ్రీకాకుళం మొదలుకుని ఇటు రాయలసీమ వరకు జిల్లాల నుంచి జనం తరలి వచ్చారు. ఇరు పార్టీలకు చెందిన 500 మంది ముఖ్య నేతలు ఆసీనులయ్యేలా భారీ వేదికను ఏర్పాటు చేశారు. పవన్, చంద్రబాబు ప్రసంగాలకు మంచి స్పందన కనిపించింది. చంద్రబాబు ప్రసంగం పూర్తయిన వెంటనే పవన్ లేచి వచ్చి ఆయనను ఆలింగనం చేసుకున్నారు. చివర్లో... చంద్రబాబు, పవన్ సహా ఇరు పార్టీల ముఖ్య నేతలు తమ ఐక్యతకు చిహ్నంగా చేతులు కలిపి ఉమ్మడిగా అభివాదం చేశారు.

సమష్టి కృషితో సభ విజయవంతం

తాడేపల్లిగూడెం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెంలో ఇటువంటి మహోన్నత సభ నిర్వహించడం, దానిని విజయవంతం చేయడంలో అందరి సమష్టి కృషి ఉంది. ఈ సభకు స్థలాన్ని ఇచ్చేందుకు అంగీకరించిన వ్యాపారవేత్త నంద్యాల కృష్ణమూర్తికి కృతజ్ఞతలు. సభ ఏర్పాట్లు కేవలం మూడు రోజుల్లో పూర్తి చేసినందుకు జనసేన నియోజవర్గ ఇన్‌చార్జి బొలిశెట్టి శ్రీనివాస్‌ను, అన్ని రకాలుగా సహకరించిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జిని అభినందిస్తున్నా. వలంటీర్లు చేసిన కృషి అభినందనీయం. పోలీసులు, రెవెన్యూ శాఖ సిబ్బంది అందించిన సహకారానికి కృతజ్ఞతలు.

- నాదెండ్ల మనోహర్, చైర్మన్, పీఏసీ, జనసేన

దరిద్రపు పార్టీని వదిలేశా

మొన్నటి వరకు వున్న దరిద్రపు పార్టీని వదిలేశాను. ఇప్పుడు ఏ పార్టీలోనూ లేను. సైకాసురుడిని గద్దె దింపడం కోసం, ఇద్దరు గొప్ప నాయకులు ఈగోలను పక్కన పెట్టి రాష్ట్ర పరిరక్షణ, ప్రజాస్వామ్య రక్షణ కోసం కలిసినందుకు అభినందనలు తెలిపేందుకు ఇక్కడకు వచ్చాను. ఇక ఆ దరిద్రాన్ని చరిత్ర పుటల్లో కలిపేయబోతున్నాం. దుర్మార్గుడి అంతం కోసం శివకేశవులు కలవాలని కోరుకున్నాను. ఇప్పుడు కృష్ణార్జునుల్లా కలిశారు. దుర్మార్గుడి పాలనను తరిమి కొడదాం. నాకు టికెట్ ఇవ్వరని జగన్ మీడియాలో వార్తలు రాస్తున్నారు. ఇప్పుడే చెబుతున్నా... నేను నరసాపురం నుంచి పోటీ చేస్తున్నాను. బీజేపీతో కలిసి టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా పోటీ పడుతున్నా.

- కే రఘురామకృష్ణరాజు, ఎంపీ, నరసాపురం

వైసీపీతో యుద్ధంలో గెలవాల్సిందే

జగన్ మాట్లాడితే సిద్ధం అంటున్నాడు. మోసపూరిత హామీలతో ఓటు అడగటానికి వస్తున్న అతనితో ప్రజలందరూ యుద్ధం చేసి గెలవాల్సిందే. అందుకే చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఒకటిగా వచ్చి, రాష్ట్ర భవిష్యత్తు కోసం ఒక్కటిగా నిలిచారు. ఈ ఎన్నికల్లో అహర్నిశలు కష్టపడాలి. అధికార మదాన్ని పారద్రోలాలి. వైసీపీ అధికారంలోకి వచ్చి అంతా నాశనం చేసింది. ఇప్పుడు అటువంటి పాలన కోసం ఇద్దరి నాయకులు పెద్ద మనసుతో కలసి వస్తున్నందున కులమతాలకు అతీతంగా గెలిపించుకోవాలి.

- ఎంఏ షరీఫ్, మాజీ చైర్మన్, శాసన మండలి

జగన్‌కు జనం ఉసురు తగులుతుంది

జగన్ ఐదేళ్ల పాలనలో వ్యవసాయం నాశనమైంది. రైతులను మోసంచేశాడు. ఒక రైతుగా నా స్వీయ అనుభవం చెబుతున్నాను. మొన్నటి తుఫాన్, అంతకుమందు భారీ వర్షాలతో నష్టపోయిన రైతులను దగా చేసాడు. ఒక్కొక్క లోడుకు 20 నుంచి 30 వేల రూపాయల నష్టాన్ని చూపించాడు. బస్తాకు 75 కేజీలు తీసుకోవాలి. ఐదు నుంచి 10 కేజీలు అదనంగా దోచేశారు. ఇది జగన్ అబ్బ సోమ్మా..! ఇతని పాలనలో రైతుల ఆత్మహత్యలు మూడో స్థానంలోను, కౌలు రైతుల ఆత్మహత్యలు రెండో స్థానంలోను నమోదయ్యాయి. రైతులకు సబ్సిడీ లేదు. బీమా లేదు. వీరి ఉసురు తగులుతుంది.

- నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే, పాలకొల్లు

ఎస్సీ, బీసీ, మైనార్టీలంటూనే మోసం

నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీలంటూ సీఎం వైఎస్ జగన్ ఐదేళ్ళుగా ప్రజలను మోసం చేస్తూనే ఉన్నాడు. సుబ్రహ్మణ్యంలాంటి ఎస్సీ డ్రైవర్‌ను చంపి పార్శిల్ పంపారు. ఎన్నో దౌర్జన్యాలు, అక్రమ కేసులకు ఎస్సీ, ఎస్టీలు బలైపోతున్నారు. వీరందరికి రక్షణ కోసమే జనసేన, టీడీపీ పాలన అవసరం. సిద్ధం అంటూ బోర్డులతో హడావిడి చే స్తున్న జగన్‌ను ఓట్లయుద్ధంలో ఓడించటానికి అందరూ సిద్ధం కావాలి.

- కొల్లు రవీంద్ర, మాజీ మంత్రి

జగన్‌ను గద్దె దింపాలి

జగన్ పాలన, బ్రిటిష్ పాలనలా విభజించు, పాలించులా సాగుతోంది. దోపిడీలు పెరిగాయి. ఇలాంటి పరిస్థితుల్లో పవన్‌కళ్యాణ్, చంద్రబాబు లాంటి సమర్థవంతమైన నాయకులతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. కౌరవ పాలన సాగుతోంది. ఎన్నికల కురుక్షేత్రంలో దుర్యోధనుడి పాలనను చరమగీతం పాడుదాం. త్వరలో బీజేపీ కలుస్తుంది. ఈ మూడు పార్టీల కలయిక రాబోయే స్థానిక ఎన్నికల వరకు కొనసాగాలి. మూడు రాజధానులు అంటూ విశాఖను నాశనం చేస్తున్నారు.

- కొణతాల రామకృష్ణ, మాజీ మంత్రి


రాయలసీమను ఎడారిని చేసిన జగన్

వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంలో రాయలసీమ ఎడారి అయ్యింది. చంద్రబాబు హయాంలో ఎత్తిపోతలకు 90 శాతం రాయితీ ఉండేది. దానిని జగన్మోహన్‌రెడ్డి అమలు చేయడం లేదు. రాష్ట్ర అభివృద్ధి కోసం, సంక్షేమం కోసం తెలుగుదేశంపాటు పడింది. ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు వరకు రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేశారు.- నందమూరి బాలకృష్ణ


సూపర్ 6 పేదల మేనిఫెస్టో!

ప్రతి గడపకూ వెళ్లి ఆ హామీలు వివరించండి: లోకేశ్

- వైసీపీ తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టండి
- పేదలకు ఇళ్లు నిర్మించే బాధ్యత నాది: లోకేశ్



మంగళగిరి, ఫిబ్రవరి 28: మాజీ సీఎం చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ అనేది పేద, మధ్య తరగతి ప్రజల మేనిఫెస్టో అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ తెలిపారు. ఇందులో పొందుపరచిన హామీలపై విస్తృతంగా ప్రచారం చేయాలని.. ప్రతి గడపకూ వెళ్లి తెలియజేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. గుంటూరు జిల్లా మంగళగిరి, తాడేపల్లి పట్టణాలు, మండలాలు, దుగ్గిరాల మండలానికి చెందిన క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జులతో బుధవారం ఉండవల్లిలో ఆయన వేర్వేరుగా భేటీ అయ్యారు. రైతులు, మహిళలు, యువత ఎదుర్కొంటున్న అనేక సమస్యలను నేతలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. 2019 ఎన్నికల సమయంలో 20 రోజులు ముందు మాత్రమే మంగళగిరికి వచ్చానని, స్వల్ప వ్యవధిలో ఇక్కడి ప్రజలకు చేరువ కాలేకపోవడం వల్లే ఓడిపోయానని చెప్పారు. అయినప్పటికీ ఐదేళ్ల నుంచి మంగళగిరిలోనే ప్రజల మధ్య తిరుగుతూ అనేక సంక్షేమ కార్యక్రమాలను సొంత నిధులతో అమలు చేస్తున్నానని తెలిపారు. తాను గెలిస్తే ఇంకెన్ని సంక్షేమ ఫలాలు అందుతాయో ప్రజలకు వివరించాలన్నారు. 'మంగళగిరిలో నేను గెలిస్తే కాలువ కట్టలపై పేదల ఇళ్లు తొలగిస్తారని వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం చేశారు. కానీ వైసీపీ గెలిచాక వారే పేదల ఇళ్లను కూల్చివేశారు. సీఎం జగన్ ఇంటి వద్ద పేదలు నివాసం ఉండడమే నేరం అన్నట్లుగా అర్ధరాత్రి పేదల ఇళ్లను ఖాళీ చేయించి వారిని తరిమివేశారు' అని ధ్వజమెత్తారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ఇళ్ల తొలగింపు జరగదని, పైగా నిరుపేదలందరికీ సొంత ఇళ్లు కట్టించి ఇచ్చే బాధ్యతను తాను తీసుకుంటానని భరోసా ఇచ్చారు. అటవీ, రైల్వే స్థలాల్లో నివాసం ఉంటున్న వారి సమస్యను కేంద్రంతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను స్థానికంగానే మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మంగళగిరిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని చెప్పారు. ఐదేళ్లుగా విజయసాయిరెడ్డి, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి ఇక్కడి ప్రజలను ఏమాత్రం పట్టించుకోలేదని.. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మంగళగిరిలో తిరుగుతున్నారని, ఇన్నాళ్లూ ఏమైపోయారని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చాక తాడేపల్లి, ఉండవల్లి పరిధిలో యూ-1 జోన్ ఎత్తివేస్తానని హామీఇచ్చారు. 'టీడీపీ గెలిస్తే సచివాలయం, వలంటీర్ వ్యవస్థలను రద్దు చేస్తుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఆ ఉద్దేశం మాకు లేదు. వాటిని స్థానిక సంస్థలతో కలిసి పనిచేసే విధంగా బలోపేతం చేస్తాం' అని తెలిపారు. జగన్ ప్రభుత్వం రద్దు చేసిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు.



కాచుకో జగన్

అమరావతి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ సిద్ధం అంటున్నారని.. ఆయనకు యుద్ధం చూపిస్తామని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రకటించారు. తాడేపల్లి కోటను బద్దలు కొడతామని హెచ్చరించారు. చంద్రబాబు అనుభవం రాష్ట్రానికి అవసరమని.. అందుకే టీడీపీతో పొత్తుపెట్టుకున్నామని స్పష్టం చేశారు. బుధవారం సాయంత్రం టీడీపీ-జనసేన ఉమ్మడిగా తాడేపల్లిగూడెంలో నిర్వహించిన 'జెండా' సభలో ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు. '2024లో టీడీపీ-జనసేన సహకరించుకోవాల్సిన అవసరం ఉంది. సహకరించుకుంటే ఐదు కోట్ల మంది ప్రజల భవిష్యత్ బంగారంలా ఉంటుంది. మనలో మనం కలహాలాడుకుంటే మళ్లీ దుర్మార్గుడు, దాష్టీకుడు వచ్చి ప్రజాకంటకుడిగా మారతాడు' అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ హెచ్చరించారు. "జగన్ బతుకు జూబ్లీహిల్స్ సొసైటీ ఫామ్‌హౌస్ కట్టినప్పటి నుంచి నాకు తెలుసు. అదే చెక్‌పోస్టులో ఏం చేసేవాడో నాకు తెలుసు. బంజారాహిల్స్ రెస్టారెంట్‌లో ఏం చేశాడో నాకు తెలుసు. మాట్లాడితే నా వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడతాడు. నీ వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడాలంటే నా దగ్గర టన్నుల కొద్దీ ఉంది." అని హెచ్చరించారు. సుదీర్ఘంగా నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్న అనుభవం కలిగిన రాజకీయ ఉద్దండుడు చంద్రబాబును 53 రోజులు జైలులో పెడితే తనకు బాధేసిందని, ఆయన సతీమణిని అనకూడని మాటలంటే బాధ కలిగిందని అన్నారు. జగన్‌కు అధికారం వస్తే స్కామాంధ్ర అవుతుందని మోదీ అప్పుడే చెప్పారని గుర్తు చేశారు. మరిన్ని ముఖ్యాంశాలు పవన్ మాటల్లోనే...

అమరావతే రాజధాని

రాష్ట్రంలో అభివృద్ధి వికేంద్రీకరణ ఉండాలి గానీ రాజధాని వికేంద్రీకరణ కాదు. మూడు చోట్లకు పరిగెత్తాల్సి వస్తుంది. అమరావతే రాజధానిగా ఉంటుందని.. తాడేపల్లిగూడెం జెండా సభ నుంచి ఉద్ఘాటిస్తున్నాం. కార్యకర్తలు మోసే టీడీపీ, జనసేన జెండాలే పోరాటానికి స్ఫూర్తి, 2024లో మన పొత్తు విజయానికి స్ఫూర్తి అని జెండా సభ పెట్టాం. పోలింగ్ బూత్‌లలో వైసీపీ రౌడీలు, గూండాలు అరాచకాలు చేస్తే ఆ జెండాలు మడత పెట్టి కర్ర తీసుకుని ఎదుర్కొనేందుకు జెండా సభ పెట్టాం.

రాష్ట్రం ఐదుగురికి తాకట్టు!

క్లాస్‌వార్ క్లాస్‌వార్ అనే జగన్.. ఐదు కోట్ల మంది ఉన్న రాష్ట్రాన్ని కేవలం ఐదుగురికి తాకట్టు పెట్టారు. వైఎస్ జగన్, పెద్దిరెడ్డి, సజ్జల, మిథున్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డికి ఇచ్చేశారు. ఈ ఐదుగురి కోసం ఐదు కోట్ల మంది తిప్పలు, కష్టాలు పడుతున్నారు. ఇది మారాలి. ఏదైనా మాట్లాడతామంటే గూండాలతో బెదిరిస్తున్నారు. రౌడీలతో దాడులు చేయిస్తున్నారు. వైసీపీ గూండాయిజాన్ని చూసి భయపడకండి. మనం ఉన్నాం., ఉద్దండుడైన రాజకీయ నేత చంద్రబాబు ఉన్నారు. వచ్చే 45 రోజుల్లో జరిగే ఎన్నికల్లో వైసీపీ గూండాలు, క్రిమినల్స్‌ను ఈ జెండా సభ నుంచి హెచ్చరిస్తున్నాను. మా సభలు, మా నాయకులు, కార్యకర్తలను బెదిరిస్తే మక్కెలిరగ్గొట్టి మడత మంచం మీద పెడతాను.

పొత్తులకు కారణం..

నేను ఎందుకు చంద్రబాబు, టీడీపీతో పొత్తు పెట్టుకున్నానంటే.. ఆయన నవ నగరాన్ని నిర్మించిన వ్యక్తి. ఉపాధి కల్పించిన వ్యక్తి.. పారిశ్రామికవేత్తలను రప్పించిన వ్యక్తి.. ఆయన స్వయంశక్తితో స్వచ్ఛందంగా వచ్చిన వ్యక్తి. ఆయన అనుభవం రాష్ట్రానికి కావాలి. అందుకే పొత్తు పెట్టుకున్నాం. మనవాళ్లే అని తపన పడితే గత ఎన్నికల్లో రెండు చోట్లా ఓడిపోయాను. ఓడిన ఆ బాధ ఎలా ఉంటుందో మీకు తెలుసా? .మనకు పోల్ మేనేజ్‌మెంట్ తెలుసా..? ఆర్గనైజ్ చేసే బలముందా.. సంస్థాగతంగా పాతుకుపోయిన తెలుగుదేశం పార్టీతో మనం పోటీ పడగలమా? 800 నుంచి వెయ్యి మంది బూత్ కార్యకర్తలున్నారా.. 1,000 మందికి 50 రోజులు డబ్బులిచ్చే సత్తా మన నాయకత్వానికి ఉందా? మన నాయకత్వం ఇంకా ఎదుగుతుంది. ఈలోపు రాష్ట్రాన్ని జగన్ పాలిట పడనివ్వం. అందుకనే 24 స్థానాలు, 3 పార్లమెంటు సీట్లకు సిద్ధపడ్డాం. నిజంగా నా మద్దతుదారులైతే నన్ను ప్రశ్నించకండి.. నా వెంట నడవండి.

24 స్థానాల్లో వామనావతారం..

నా నిర్ణయాలు నాకు సంబంధించినవి కావు. ప్రజలకు సంబంధించినవి. పొత్తులో భాగంగా 24 స్థానాలు తీసుకున్నాను. 24 స్థానాలేనా.. ఇంతేనా అని మనోళ్లు కాకుండా అవతలివాళ్లు అంటున్నారు. వాళ్లకు తెలియడం లేదు. బలిచక్రవర్తి ఇంతేనా అన్నాడు. నెత్తి మీద కాళ్లు పెట్టి బలిచక్రవర్తిని తొక్కుతుంటే అప్పుడు అర్థమైంది. జగన్ గుర్తుపెట్టుకో.. జనసేన వామనావతారాన్ని చూపిస్తుంది. పాతాళానికి తొక్కకపోతే నా పేరు పవన్ కల్యాణ్ కాదు.. నా పార్టీ జనసేన కాదు. విశ్వామిత్రుడు బ్రహ్మపదానికి వెళ్లింది 24తోనే. గాయత్రి మంత్రం 24 అక్షరాలు. అంకెలు లెక్కపెట్టొద్దు. పవన్ వంక చూడలేరు. సొంత బాబాయిని చంపిన వాడు, సొంత చెల్లిని గోడకేసి కొట్టిన వాడు చెబుతారా నాకు సలహాలు, సూచనలు! ఎవరితో యుద్ధం చేస్తున్నానో నాకు తెలుసు. జగన్ లాంటి దాష్టీకుడు, దుర్మార్గుడు యుద్ధం చేస్తేనే తగ్గుతాడు. యుద్ధంతోనే కింద కూర్చుకుంటాడు.

నాలుగో భార్య ఎవరో....

జగన్ దృష్టిలో పవన్ కల్యాణ్ అంటే మూడు పెళ్లిళ్లు.. రెండు విడాకులు. అతడు నాలుగు పెళ్లిళ్లు అంటాడు. మరి ఆ నాలుగో పెళ్లాం ఎవరో నాకు తెలియదు. అది జగనే ఏమో మరి! గర్వంగా ఎగిరే జాతీయ జెండా పవన్ కల్యాణ్. నిన్ను నట్టేట ముంచే తుఫాన్. తాడేపల్లిగూడెం నుంచి పిలుపిస్తున్నాను. మహాయుద్ధానికి శంఖం పూరిస్తున్నాను. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఒక దాష్టీకుడితో పోరాటం చేయడానికి ఒక మహాయుద్ధానికి సిద్ధమవుతున్నాను. ఈ విధ్వంసకర పాలనను ఆపుదాం. ముందుకు వెళ్దాం. వైసీపీ గోడలన్నీ బద్దలు కొడదాం. శాంతి, సుస్థిరతలు అందించే బాధ్యత టీడీపీ-జనసేన ఇస్తుంది. మాతో కలిసి నడవండి. మీ భవిష్యత్ కోసం పొత్తు గెలవాలి.. జగన్ పోవాలి.. వైసీపీ నేలమట్టం అవ్వాలి. హలో ఏపీ.. బైబై వైసీపీ.

నెల్లూరులో వైసీపీకి మరో షాక్!

- నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ రాజీనామా
- 2న టీడీపీలో చేరే అవకాశం?


విలేకరులతో మాట్లాడుతున్న రూప్‌కుమార్ యాదవ్

నెల్లూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): నెల్లూరులో అధికార వైసీపీకి మరో షాక్ తగిలింది. నగర డిప్యూటీ మేయర్, సిటింగ్ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ బాబాయి రూప్‌కుమార్ యాదవ్ బుధవారం వైసీపీ సభ్యత్వానికి, పార్టీ పదవులకు రాజీనామా చేశారు. ఈ సందర్భంగా రూప్‌కుమార్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'పార్టీ కోసం నా రక్తాన్ని చెమటగా మార్చి కష్టపడ్డాను. ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నామంటే అందుకు కారణం పార్టీయే. గత రెండేళ్లుగా పార్టీకి చెందిన నాయకుల వల్ల రకరకాల ఇబ్బందులు పడుతూ వచ్చాను. చివరికి పార్టీని విడిచిపెట్టడం అనివార్యంగా మారింది. త్వరలోనే నా రాజకీయ పయనం గురించి నిర్ణయం ప్రకటిస్తా' అని తెలిపారు. ఎమ్మెల్యే అనిల్‌కుమార్ మంత్రి అయిన తరువాత ఇద్దరి మధ్యా దూరం పెరిగింది. రూప్‌కుమార్ ఆదాయ మార్గాలపైకూడా దాడులు మొదలయ్యాయి. వైసీపీ అధినేతలకు ఫిర్యాదు చేసినా వారు అనిల్ యాదవ్‌కే మద్దతు పలికారు. ప్రత్యామ్నాయం కోసం చూస్తున్న రూప్ కుమార్‌కు ఎంపీ వేమిరెడ్డి ఆసరా దొరికింది. మార్చి 2న చంద్రబాబు నెల్లూరుకు వస్తున్నారు. అదే సమయంలో వీపీఆర్‌తోపాటు ఆయన అనుచరుడిగా రూప్‌కుమార్ కూడా టీడీపీలో చేరనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ప్రాణం ఉన్నంత వరకు టీడీపీలోనే ఉంటా

- వైసీపీ తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు: పీలా గోవింద్


మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ

అనకాపల్లి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): 'నా ప్రాణం ఉన్నంత వరకూ టీడీపీలోనే ఉంటా. వైసీపీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మాల్సిన అవసరం లేదు' అని అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. అనకాపల్లి టికెట్ తనకు కాకుండా జనసేన నేత కొణతాల రామకృష్ణకు కేటాయించడంతో పీలా మనస్తాపానికి గురయ్యారు. మూడు రోజులుగా మీడియాకు దూరంగా ఉంటున్నారు. బుధవారం అనకాపల్లిలో తన నివాసం వద్దకు పెద్ద సంఖ్యలో వచ్చిన కార్యకర్తలను ఉద్దేశించి పీలా గోవింద్ మాట్లాడారు. 'టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాలను శిరసావహిస్తా. కార్యకర్తలెవరూ సంయమనం కోల్పోవద్దు. పార్టీకి వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడవద్దు. వైసీపీ నాయకులు నాపై చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దు. వైసీపీ అరాచక పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కలగాలంటే టీడీపీ, జనసేన పొత్తు అవసరం. రాష్ట్రం బాగు కోసం చంద్రబాబును సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఉంది. టికెట్ వచ్చినా రాకపోయినా టీడీపీలోనే ఉంటా' అని స్పష్టం చేశారు.


వైసీపీ ప్రభుత్వం రైతులకు పెట్టింది 28,758 కోట్లే..!

- 1,84,567 కోట్లంటూ తప్పుడు ప్రచారం: సోమిరెడ్డి

నెల్లూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రైతులకు ఖర్చు పెట్టింది రూ.28,758 కోట్లు మాత్రమేనని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. కానీ రూ.1,84,567 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేసుకుంటూ ప్రజలను మోసం చేస్తోందని దుయ్యబట్టారు. బుధవారం నెల్లూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజల డబ్బుతో తప్పుడు ప్రకటనలు ఇవ్వడం వైసీపీ ప్రభుత్వానికి అలవాటుగా మారిపోయిందన్నారు. విద్యుత్ శాఖకు ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు ఉండగా, దానిని వ్యవసాయ శాఖలో చూపిస్తూ రూ.57 వేల కోట్లు ఉచిత విద్యుత్ కోసం ఖర్చు చేసినట్లు పేపర్లలో ప్రకటనలు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. పూర్తిగా మూసేసిన డ్రిప్ ఇరిగేషన్‌కు రూ.3,385 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రభుత్వం చెప్పడం దారుణమన్నారు. వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి తప్పుడు లెక్కలతో ప్రకటనలు ఇవ్వడం కష్టమేమీ కాదన్నారు. ప్రభుత్వ లెక్కలపై తాము చర్చకు సిద్ధమని ప్రకటించారు.

రుషికొండపై ఇదేం డ్రామా?

- నేడు గుట్టుగా ప్రారంభం
- పర్యాటకం ముసుగులో.. సీఎం క్యాంపు ఆఫీసు కోసం నిర్మాణం
- రూ.198 కోట్ల అంచనా పనులకు ఇప్పటిదాకా 450 కోట్ల వ్యయం
- అత్యంత విలాసవంతంగా భవనాలు
- అయినా ప్రారంభోత్సవానికి ముఖం చాటేసిన జగన్
- బాధ్యతలు మంత్రులు రోజా, రజనీలకు
- కోర్టుల్లో మాట వస్తుందనేనా?
- 5వ తేదీ తర్వాత వారానికి మూడ్రోజులు ఇక్కడి నుంచే పాలన?
- వైసీపీ వర్గాల్లో ప్రచారం


రుషికొండపై నిర్మించిన భవనం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పర్యావరణ నిబంధనలు ఉల్లంఘించి రుషికొండపై అడ్డగోలుగా నిర్మించిన సీఎం క్యాంపు కార్యాలయాన్ని పర్యాటక మంత్రి ఆర్కే. రోజా గురువారం ప్రారంభించబోతున్నారు. రుషికొండపై పర్యాటక ఆదరణ పొందుతున్న రిసార్ట్స్‌ను కూలగొట్టి, కొండకు బోడిగుండు చేసి మరీ క్యాంపు కార్యాలయం కోసం భవనాలు నిర్మించారు. రూ.198 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించి ఇప్పటివరకూ రూ.450 కోట్లు ఖర్చు చేశారు. అత్యంత విలాసవంతంగా నిర్మించారు. రుషికొండపై కొత్తగా నిర్మిస్తున్న భవనాలు సీఎం క్యాంపు కార్యాలయం కోసమేనని రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ తెలుసు. కానీ దీనికి 'పర్యాటక భవనాలు' అని ముసుగు తొడిగారు. ముఖ్యమంత్రి జగన్ విశాఖ నుంచే పాలన సాగించబోతున్నారని ఆర్భాటం చేశారు. 'ఉగాదికి వస్తున్నాం.. దసరాకు వచ్చేస్తాం.. డిసెంబరు నుంచి మీ బిడ్డ కాపురం ఇక్కడే.. సంక్రాంతి తర్వాత విశాఖలోనే' అంటూ ప్రకటనలు గుప్పిస్తూ వచ్చారు. హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు కేసులు ఉండడంతో కాలు పెట్టలేకపోయారు. ఇంకా ఆ కేసులు తేల లేదు. వాటి కోసం చూసుకుంటే పుణ్యకాలం గడిచిపోతుందని ఇప్పుడు ప్రారంభోత్సవమంటూ కొత్త డ్రామాకు తెర తీశారు.

ఏదైనా జిల్లాలో కోటి రూపాయల ప్రాజెక్టు ప్రారంభోత్సవం ఉంటేనే హెలికాప్టర్ వేసుకుని వెళ్లిపోతున్న జగన్.. రుషికొండపై రూ.450 కోట్లతో నిర్మించుకున్న క్యాంపు కార్యాలయం ప్రారంభోత్సవానికి మాత్రం ముఖం చాటేశారు. అటు తిరిగి.. ఇటు తిరిగి కోర్టుల్లో మాట పడాల్సి వస్తుందని భయపడ్డారో ఏమో.. మంత్రి రోజా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజనికి ఆ బాధ్యతలు అప్పగించారు. జిల్లా కలెక్టర్, కొందరు అధికారులు, వైసీపీ నేతల సమక్షంలో మంత్రులు ప్రారంభిస్తారు. నిన్నటికి నిన్న కుప్పానికి కృష్ణా నది నీళ్లు అంటూ ఉత్తుత్తి గేట్లు పెట్టి హంగామా చేసి అభాసుపాలైన నేపథ్యంలో.. విశాఖకు ముఖం చెల్లక రావడం లేదనే వాదన వినిపిస్తోంది. కాగా.. మంత్రి రోజా చేతుల మీదుగా లాంఛనంగా భవనం ప్రారంభం కాగానే.. మార్చి 5వ తేదీ తరువాత సీఎం విశాఖ వచ్చి వారానికి మూడు రోజులు ఇక్కడే ఉంటారని వైసీపీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఉత్తరాంధ్ర వైసీపీ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి కొద్దిరోజుల క్రితం మాట్లాడుతూ.. త్వరలో జగన్ విశాఖ నుంచే పరిపాలన ప్రారంభిస్తారని చెప్పడం దీనికి సంకేతమని ఆ వర్గాలు చెబుతున్నాయి.

ఇంట్లో కూర్చుంటే.. మీ ఓటు చోరీ..!

- వేరొకరికి మీ ఓటు వేసే అవకాశం ఇచ్చినట్టే
- ఈసీ ఆదేశాల ఉల్లంఘన ఏపీలోనే చూస్తున్నాం
- విశ్రాంత ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేశ్


రాజమహేంద్రవరంలో నిర్వహించిన కళాజాతలో మాట్లాడుతున్న నిమ్మగడ్డ రమేశ్‌కుమార్

రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి), సర్పవరం జంక్షన్ (కాకినాడ), ఫిబ్రవరి 28: 'ఎన్నికల్లో ఓటు వేయకుండా ఇంట్లో కూర్చుంటే.. వేరొకరికి మీ ఓటు వేసే అవకాశం ఇచ్చినట్టే. ఇది చాలా ప్రమాదం. మనకు తెలియకుండానే మన ఓటు ఎవరో వేసే దౌర్భాగ్య పరిస్థితిని తిరుపతి ఉప ఎన్నికల్లో చూశాం. ఇలాంటి ఘోరాలను ఉక్కుపాదంతో అణచివేయాలి' అని రాష్ట్ర ఎన్నికల సంఘం విశ్రాంత ప్రధానాధికారి, సిటిజన్ ఫర్ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఓటు హక్కు వినియోగంపై ఓటర్లను చైతన్యం చేసే రాష్ట్రవ్యాప్త కార్యక్రమం 'కళాజాత'ను బుధవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్‌కుమార్ మాట్లాడుతూ... 'ఎవరైతే ప్రజా సంక్షేమానికి తోడ్పడతారో వారిని ఎన్నికోవడం వల్ల చక్కటి చట్ట సభలు ఏర్పడతాయి. దాంతో జవాబుదారీతనం ఉంటుంది. వలంటీర్ల నీడ కూడా ఎన్నికల ప్రక్రియపై పడడానికి వీల్లేదని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. కానీ రాష్ట్రంలో జరుగుతున్నదేమిటి..? అవ్వాతాతలను స్వయంగా తీసుకెళ్లి ఓటు వేయించాలని వలంటీర్లకు స్వయంగా ముఖ్యమంత్రి చెబుతున్నారని పత్రికల్లో చూస్తున్నాం. వలంటీర్లు పోలింగ్ ఏజెంట్లుగా పనిచేయడానికి కూడా ఎలాంటి నిబంధనలూ అడ్డురావని రెవెన్యూ మంత్రి చెబుతున్నారు. ఎన్నికల సంఘం చెప్పిన తర్వాత కూడా వాటిని ధిక్కరించడం కనీవినీ ఎరుగని సంఘటన. ఏపీలో ఓ నిశ్శబ్ద విప్లవం మొదలైంది. ఎవరైతే తమకు, కుటుంబానికి, రాష్ట్రానికి, సమాజానికి సేవ చేస్తారో.. అలాంటి వారికే ఓటు వేయాలి. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరగాలి' అని ఆయన పేర్కొన్నారు. కాగా, ఓటుని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం అన్నారు. సీనియర్ న్యాయవాది, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడుతూ... ప్రజాస్వామ్యం అంటే ఆర్థిక నేరగాళ్లు, భూకబ్జాదారులు, రౌడీలు, గూండాల కోసం అనే కొత్త అర్థాన్ని వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. మేధావుల మౌనం సమాజానికి ప్రమాదమని.. అందువల్ల మేధావులు, విద్యావంతులు మేల్కొనాలని కోరారు.

ఏపీలో ప్రమాదం అంచున ప్రజాస్వామ్యం

'రాష్ట్రంలో అనైతిక పద్ధతుల్లో భారీగా దొంగ ఓట్లు నమోదవుతున్నాయి. తిరుపతి ఉప ఎన్నికల్లో సుమారు 35 వేల దొంగ ఓట్ల సృష్టే ఇందుకు ఉదాహరణ. ఏపీలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది' అని నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. కాకినాడ జిల్లా కాకినాడ దంటుకళాక్షేత్రంలో బుధవారం నిర్వహించిన కళాజాతలో ఆయన పాల్గొన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని, లేకుంటే తమ సంస్థ తరఫున న్యాయ పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

రుషికొండపై నివేదిక సమర్పణకు మరికొంత గడువివ్వండి: కేంద్రం

- హైకోర్టు విచారణ 4 వారాలకు వాయిదా

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): విశాఖలోని రుషికొండపై రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) చేపట్టిన నిర్మాణాలు, ఇతర పర్యావరణ ఉల్లంఘనలు పరిశీలించి కేంద్ర పర్యావరణం-అటవీ శాఖ (ఎంవోఈఎఫ్) కమిటీ ఇచ్చిన నివేదికను ధర్మాసనం ముందు ఉంచేందుకు మరో రెండు వారాల సమయం ఇవ్వాలని కేంద్రం కోరింది. అందుకు అంగీకరించిన హైకోర్టు.. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందన రావు కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. కోస్తా నియంత్రణ మండలి (సీఆర్‌జడ్) నిబంధనలకు విరుద్ధంగా విశాఖ జిల్లా చినగదిలి మండలం ఎండాడ పరిధిలోని సర్వే నంబరు 19లో ఉన్న రుషికొండను తవ్వేయడంతో పాటు చెట్లను తొలగిస్తున్నారంటూ విశాఖ తూర్పు టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, విశాఖ నగరవాసి, జనసేననాయకుడు పీవీఎస్ఎన్ మూర్తి యాదవ్ వేర్వేరుగా హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఇదే వ్యాజ్యంలో ప్రతివాదిగా చేర్చి తన వాదనలు కూడా వినాలని కోరుతూ ఎంపీ రఘురామకృష్ణంరాజు కూడా ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన ధర్మాసనం.. రుషికొండ పై అనుమతులకు మించి తవ్వకాలు జరిపారని, నిర్మాణాల్లో ఉల్లంఘనలు జరిగినట్లు ఎంవోఈఎఫ్ కమిటీ నిర్ధారించిందని గుర్తు చేసింది. నివేదికలో పేర్కొన్న ఉల్లంఘనల ప్రభావం పర్యావరణంపై ఏమేరకు ఉంటుందనే విషయం పై నిపుణుల కమిటీతో అధ్యయనం చేయించాలని ఎంవోఈఎఫ్‌కు స్పష్టం చేసింది. ఈ ఆదేశాలకు అనుగుణంగా కమిటీ ఏర్పాటైంది. ఈ వ్యాజ్యాలు ఈ నెల 7న విచారణకు రాగా.. ఏపీటీడీసీ చేపట్టిన నిర్మాణాలు, ఇతర పర్యావరణ ఉల్లంఘనలు పరిశీలించి ఎంవోఈఎఫ్ నియమించిన కమిటీ నివేదిక సిద్ధం చేసిందని కేంద్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది జూపూడి యజ్ఞదత్ కోర్టుకు తెలియజేశారు. అయితే కమిటీకి నేతృత్వం వహిస్తున్న చైర్మన్ కె.గౌరప్పన్ గుండెపోటుతో మరణించారని, నివేదికపై ఆయన సంతకం చేయలేదని.. ఆయన లేవనెత్తిన అభ్యంతరాలపై కమిటీలోని ఇతర సభ్యుల అభిప్రాయాలు తెలుసుకుంటున్నామని తెలిపారు. ఈ వ్యాజ్యాలు బుధవారం మరోసారి విచారణకు రాగా.. నివేదిక సమర్పణకు యజ్ఞదత్ మరికొంత సమయం ఇవ్వాలని అభ్యర్థించారు.

జగన్ మళ్లీ వస్తే నాశనమే

- వైసీపీని ఓడించండి: వైవీబీ


విజయనగరం కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సర్పంచులు

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 28: సీఎం జగన్ మరోసారి అధికారంలోకి వస్తే పల్లెలు శిథిలమై.. గ్రామీణ ప్రజలు ఇంకా నరకం చూస్తారని.. రాష్ట్రం మొత్తం సర్వనాశనమేనని ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం విజయనగరం కలెక్టరేట్ వద్ద సర్పంచులతో కలిసిన నిరసన వ్యక్తం చేశారు. సీఎం జగన్‌ను ఓడించడానికి సర్పంచులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. దీనిక అన్ని పార్టీలూ కలిసి రావాలన్నారు.

రైతుకు సాయంలో తేడా గమనించాలి

- 57 నెలల్లో మంచి చేశాం: సీఎం జగన్
- రైతు భరోసా, వడ్డీ రాయితీ విడుదల

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులు ఏ దశలోనూ నష్టపోకుండా వారికి గత 57 నెలల్లో మంచి కార్యక్రమాలు చేశామని సీఎం జగన్ అన్నారు. రైతుకు సాయం విషయంలో గతానికి, ఇప్పటికీ తేడాను గమనించాలని కోరారు. రైతు భరోసా-పీఎం కిసాన్' పథకం మూడో విడత నిధులను బుధవారం ఆయన తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బటన్ నొక్కి విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 53.58 లక్షల మంది రైతులకు రూ.1,078 కోట్ల నిధులను వారి ఖాతాల్లో జమ చేశారు. అలాగే 2021-22 రబీ, 2022-23 ఖరీఫ్ సీజన్లలో రూ.లక్షలోపు పంట రుణాలు తీసుకున్న 10.78 లక్షల మంది రైతులకు వడ్డీ రాయితీ నిధులు రూ.217 కోట్లు కూడా విడుదల చేశారు. ఈ సందర్భంగా 'వ్యవసాయం సుసంపన్నం - రాష్ట్రానికి సౌభాగ్యం' పేరుతో వ్యవసాయశాఖ రూపొందించిన పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించారు. అనంతరం జగన్ మాట్లాడుతూ.. "రైతుభరోసా కింద ఐదేళ్లలో ఒక్కొక్క రైతుకు రూ.67,500 ఇచ్చాం. రైతుభరోసా సాయంతో 50% మంది రైతులకు మేలు జరిగింది. వీళ్లు వేసే 80% పంటలకు 80% ఖర్చు కింద ఈ పెట్టుబడి సాయం ఉపయోగపడుతుంది. రుణాలు తీసుకున్న రైతులు వడ్డీతో సహా కట్టిన వెంటనే సున్నావడ్డీ రూపంలో వెనక్కి ఇచ్చేస్తూ, ప్రతి రైతునూ ప్రోత్సహిస్తున్నాం. 19 లక్షల మంది రైతులకు 9గంటలు పగటి పూటే నాణ్యమైన కరెంటు ఇస్తున్నాం. ఆర్బీకేలు పెట్టి ప్రతి ఎకరాను ఈ-క్రాప్ చేయించి, అన్ని పంటలకు బీమా ప్రీమియం కడుతున్నాం. కేంద్రం నోటిఫై చేయని పంటలకు కూడా మద్దతు ధర ప్రకటించి, ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేయిస్తున్నాం. సమగ్ర భూ సర్వే చేపట్టి, భూ రికార్డులను అప్‌డేట్ చేసి, రిజిస్ట్రేషన్ ప్రక్రియను గ్రామ సచివాలయాల పరిధిలోకి తెచ్చాం" అని తెలిపారు.

రైతు భరోసాపై జగన్ అబద్ధాలు

- టీడీపీ అధికారప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ విమర్శ

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రైతు భరోసా ఐదో సంవత్సరం మూడో విడత నిధులు విడుదల చేస్తూ ముఖ్యమంత్రి జగన్ ఇప్పటికీ అబద్ధాలే వల్లె వేస్తున్నారని టీడీపీ అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ విమర్శించారు. ఇప్పటి వరకు రూ.34,288 కోట్లు రైతులకిచ్చి ఐదేళ్లుగా ప్రతి సంవత్సరం రూ.13,500 కోట్లు ఇస్తున్నామని అలవోకగా అబద్ధం చెప్తున్నారని బుధవారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. ఆ రూ.34 వేల కోట్లలో 45 శాతం కేంద్రం రైతుల అకౌంట్లలో నేరుగా వేస్తున్న డబ్బును కూడా తనపేరుతో జగనన్న భరోసా అని చెప్పుకోవడం తప్పన్నారు.

చేతకాని పాలనతో వ్యవసాయం నిర్వీర్యం: ఆలపాటి రాజా

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రైతు భరోసాతో రైతుల్ని వంచించి, చేతగాని పాలనతో జగన్ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేశారని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆరోపించారు. బుధవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అనునిత్యం మోసాలతో బతికే ముఖ్యమంత్రి చివరకు రైతు భరోసా పేరుతో అన్నంపెట్టే అన్నదాతల్ని వంచించిన వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోతారన్నారు. నాగలి పట్టిన అందరికీ ప్రభుత్వ సాయం ఇవ్వకుండా రైతుల్లో కూడా వివక్ష చూపిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో జరిగిన రైతు ఆత్మహత్యలన్నీ జగన్ ప్రభుత్వ హత్యలేనని విమర్శించారు.

వైసీపీలోకి ఐఏఎస్!

కర్నూలు ఎమ్మెల్యేగా పోటీ?.. వీఆర్ఎస్ తీసుకున్న ఇంతియాజ్

- ఉదయం దరఖాస్తు.. మధ్యాహ్నమే ఆమోదం.. సాయంత్రానికి ఉత్తర్వులు
- చేరికపై ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సీనియర్ ఐఏఎస్ అధికారి ఏఎండీ ఇంతియాజ్ బుధవారం స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) చేశారు. బుధవారం ఉదయం ఆయన వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేస్తూ ప్రభుత్వానికి లేఖ రాశారు. మధ్యాహ్నానికి ఆ లేఖను ప్రభుత్వం ఆమోదించింది. సాయంత్రానికి వీఆర్ఎస్‌ను ఆమోదిస్తున్నట్టు ఉత్తర్వులు (జీవో-477)ను జారీ చేసింది. వాస్తవానికి 2025, మే 31 వరకు ఇంతియాజ్‌కు సర్వీసు ఉంది. అయినా ఆకస్మికంగా వీఆర్ఎస్ తీసుకున్నారు. దీనికి కారణాలు ఏమిటో ఆయన తన దరఖాస్తులో ప్రస్తావించలేదని తెలిసింది. ప్రభుత్వం కూడా దరఖాస్తు అందిన రోజే ఆగమేఘాల మీద ఆమోదించింది. ఇంత వేగంగా వీఆర్ఎస్ తీసుకోవడానికి, ప్రభుత్వం శరవేగంగా ఆమోదించడానికి కారణం.. ఆయన వైసీపీలోకి చేరనుండడమేనని తెలిపింది. త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైసీపీ తరఫున ఆయన కర్నూలు ఎమ్మెల్యే స్థానం నుంచి పోటీచేయబోతున్నారని సమాచారం. ఈ వ్యవహారం గురించి 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పింది. 'ఎన్నికల బరిలో ఇద్దరు ఐఏఎస్‌లు' అని గతేడాది డిసెంబరు 30న వార్తను ప్రచురించింది. ఇంతియాజ్ ఎన్నికల బరిలో దిగబోతున్నారని సహచర ఐఏఎస్ వర్గాల్లో ప్రచారం జరిగింది. అయితే, ఆనాడు తనకు ఆ ఆలోచన లేదన్న ఆయన అనూహ్యంగా బుధవారం వీఆర్ఎస్ తీసుకున్నారు. డిప్యూటీ కలెక్టర్ స్థాయి నుంచి ఐఏఎస్‌గా పదోన్నతి పొందిన ఇంతియాజ్ 2018కి ముందు నెల్లూరు, ఆ తర్వాత గుంటూరు జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. చంద్రబాబు ప్రభుత్వంలో 2019, ఫిబ్రవరి 8న కృష్ణా జిల్లా కలెక్టర్‌గా పోస్టింగ్ పొందారు. 2021, జూన్ వరకు ఆ పోస్టులో కొనసాగారు. ఆ తర్వాత సీఎం జగన్ ఆయనను ఆ పోస్టు నుంచి తప్పించి అదే ఏడాది మైనారిటీ సంక్షేమశాఖ స్పెషల్ సెక్రెటరీగా నియమించారు. ఇక, అప్పటి నుంచి ఆయనకు అన్ని కీలక పోస్టులు, పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు దక్కాయి. మైనారిటీ సంక్షేమశాఖ కమిషనర్, ఆ శాఖ స్పెషల్ సెక్రెటరీగా రెండు బాధ్యతల్లో ఉన్న ఇంతియాజ్‌కు వక్ఫ్‌బోర్డు చైర్మన్ పదవి కూడా అప్పగించారు.

జగన్‌తో సాన్నిహిత్యం

సెర్ప్ సీఈవోతోపాటు మైనారిటీ సంక్షేమశాఖ కీలక

> అధికార పార్టీ వైసీపీలోకి సీనియర్ ఐఏఎస్ అధికారి ఏఎండీ ఇంతియాజ్ చేరనున్నట్టు తెలిసింది. రానున్న ఎన్నికల్లో ఆయన కర్నూలు ఎమ్మెల్యే స్థానం నుంచి పోటీ చేసే అవకాశం ఉందని ఇంతియాజ్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరో ఏడాదిపాటు సర్వీసు ఉండగానే ఆయన వీఆర్ఎస్ తీసుకోవడం దీనికి బలాన్ని చేకూరుస్తోంది.

బాధ్యతలు చూస్తున్న ఇంతియాజ్ వక్ఫ్‌బోర్డు విషయాల్లోనూ కీలకంగా వ్యవహరించారు. ముఖ్యమంత్రి జగన్‌కు దగ్గరయ్యారు. తొలుత కర్నూలు లోక్‌సభ స్థానం నుంచే పోటీచేయాలన్న ఆసక్తి ఆయనలో ఉంది. తన సన్నిహిత ఐఏఎస్‌లు, ఇతర అధికారుల వద్ద పలు సందర్భాల్లో ఈ విషయాన్ని చర్చించినట్లు తెలిసింది. అయితే, ఎంపీగా పోటీ చేసేవారు ఆ లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ అభ్యర్థుల ఎన్నికల ఖర్చు భరించాలన్నది జగన్ చెప్పిన మాట. దీనికోసం ముందుగానే రూ.140 కోట్లు కప్పం కట్టాల్సి ఉంటుందని ఆయన ఆశావహులకు తేల్చి చెప్పారు. సరిగ్గా ఇదే సమయంలో ఇంతియాజ్ అభ్యర్థిత్వంపై కూడా చర్చ జరిగింది. దీంతో తనకు ఎంపీ సీటుపై ఆశలేదని, ఇంకా తనకు సర్వీసు ఉందంటూ అసలు విషయాన్ని దాటవేస్తూ వచ్చారు. ఇప్పుడు వైసీపీ తన అభ్యర్థుల జాబితాను తుది దశకు తెస్తోంది. ఈ సమయంలో ఇంతియాజ్ వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేయడం, వెనువెంటనే సీఎం జగన్ ఆమోదించడం చకచకా జరిగిపోయాయి. ఇదిలావుంటే, ఇంతియాజ్ వైసీపీ నుంచి కర్నూలు లోక్‌సభకు పోటీ చేస్తారా? అసెంబ్లీకా? అన్నది తెలియాల్సి ఉంది. ఆయన సన్నిహితులు మాత్రం కర్నూలు అసెంబ్లీ స్థానానికే పోటీ చేస్తారని చెబుతున్నారు.

మా చెడ్డ మావయ్య!

మడమ తిప్పిన మామ!

పేద విద్యార్థులకు మేనమామని అన్నారు. వారి చదువుల బాధ్యత నాది అని హామీ ఇచ్చారు. విద్యా రంగానికి రూ.50 వేల కోట్లకు పైగా ఖర్చు చేశానని ప్రచారం చేసుకున్నారు. ఇప్పుడు ఒకటో తరగతి విద్యార్థుల ఫీజులు కట్టలేమని చేతులెత్తేశారు. 'అమ్మఒడి' నగదు ఇచ్చాం కదా.. వాటి నుంచి కట్టుకోవాలంటూ సలహా ఇచ్చారు. కట్టని వారి నుంచి తక్షణం వసూలు చేయాలని ఆదేశాలు జారీ చేయించారు.

(మొదటి పేజీ తరువాయి)

దీనికి కేవలం మూడు రోజుల గడువు మాత్రమే ఇవ్వడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. విద్యాహక్కు చట్టం(ఆర్టీఈ) కింద ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలి. ఇలా ఏటా ఒకటో తరగతిలో అడ్మిషన్లు తీసుకోవాలి. కానీ, పలు కారణాలతో రాష్ట్రంలో చాలాకాలం ఆర్టీఈ చట్టం అమలుకాలేదు. హైకోర్టు ఆదేశాలతో 2022-23 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలో ఈ చట్టాన్ని అమల్లోకి తెచ్చారు. గతేడాది, ఈ ఏడాది ఈ చట్టం కింద విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో చేరారు. ఈ అడ్మిషన్లకు పట్టణ ప్రాంతాల్లో రూ.8 వేలు, గ్రామాల్లో రూ.6500, గిరిజన ప్రాంతాల్లో రూ.5100గా ఫీజుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఫీజును ప్రభుత్వమే చెల్లించాల్సి ఉంది. కానీ, సీఎం జగన్ మాత్రం ఈ నగదును అమ్మఒడి నగదుతో చెల్లించుకోవాలని ముడిపెట్టారు. అలా ఈ రెండు విద్యా సంవత్సరాల్లో అమ్మఒడి తీసుకుని ఉంటే వారితో వెంటనే ఫీజులు కట్టించాలని సమగ్రశిక్ష ఎస్పీడీ మంగళవారం డీఈవోలకు ఆదేశాలు జారీ చేశారు. మూడు రోజుల్లో ఈ ఫీజులు తల్లిదండ్రులతో కట్టించాలని స్పష్టం చేశారు.

ఎలా చెల్లిస్తారు?

ఇప్పుడు ఒకటో తరగతిలో చేరే విద్యార్థికి వచ్చే ఏడాది 'అమ్మఒడి' నగదు వస్తుంది. చేరిన వెంటనే అమ్మఒడి నగదు వేయరు. అంటే ప్రస్తుత విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు పొందిన వారికి ఈ ఏడాది జూన్‌లోగానీ అమ్మఒడి రాదు. అలాంటప్పుడు ఫీజులు ఎలా కడతారనేది ఎవరికీ అంతుపట్టడం లేదు.

చట్టం ఏం చెబుతోంది?

ఆర్థిక భారం లేకుండా పేద విద్యార్థులు కార్పొరేట్ విద్యా సంస్థల్లో చదవాలన్నది విద్యాహక్కు చట్టం ఉద్దేశం. ఆర్టీఈ చట్టం కింద ప్రైవేటు పాఠశాలల్లో చేరే విద్యార్థుల ఫీజులు రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించాలని చెబుతోంది. ఈ విషయంలో విద్యార్థులకు ఎలాంటి సంబంధం ఉండకూడదని స్పష్టం చేస్తోంది. ఈ అంశం ఆధారంగానే ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు కోర్టును ఆశ్రయించాయి. ఫీజులు చాలా తక్కువగా నిర్ణయించారని, అది కూడా తల్లిదండ్రుల నుంచి తీసుకోవాలని చెప్పడం ఆర్టీఈ చట్టానికి విరుద్ధమని వాదించాయి. దీనిపై హైకోర్టు తీర్పు రావాల్సి ఉంది. పాఠశాలలో విద్యార్థి చేరిన సమయంలో ఆగస్టులో 50శాతం, విద్యార్థి సక్రమంగానే పాఠశాలకు వెళ్తున్నాడని నిర్ధారణ చేసుకున్న తర్వాత మరో 50శాతం ఫీజును జనవరిలో చెల్లించాలని చట్టం చెబుతోందని యాజమాన్యాలు వాదిస్తున్నాయి. తల్లిదండ్రుల నుంచి ఫీజులు వసూలు చేసుకోవడం కష్టంగా ఉంటుందని, అందుకే చట్టంలోని నిబంధనల ప్రకారం ప్రభుత్వం రీయింబర్స్ చేయాలని డిమాండ్ చేస్తున్నాయి.

తొలినుంచీ చిన్నచూపే

విద్యాహక్కు చట్టం అమలు విషయంలో జగన్ ప్రభుత్వం మొదటి నుంచీ నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తోంది. రాష్ట్రంలో 90వేల సీట్లు ఈ చట్టం కింద ప్రైవేటు పాఠశాలల్లో అందుబాటులో ఉంటే 2022-23లో కేవలం 3 శాతం భర్తీ అయ్యాయి. 2023-24లో 18,749 సీట్లు నిండాయి. 71 వేల సీట్లు మిగిలిపోయాయి. దీనికి ప్రధాన కారణం అసలు ఈ పథకం గురించి ప్రజలకు తెలియకపోవడం. దీనిపై విస్తృత ప్రచారం కల్పించాలని కేంద్రం చెబుతుంటే రాష్ట్రం మాత్రం కనిపించీ కనిపించకుండా ప్రకటనలు ఇచ్చి వదిలేస్తోంది. వచ్చే విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్ ఇచ్చిన విషయాన్ని కూడా మీడియాకు విడుదల చేయకుండా గోప్యంగా ఉంచింది.

రేపు సాగర్ కుడికాల్వకు 3 టీఎంసీలు

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ నుంచి శుక్రవారం ఉదయం 11 గంటలకు కుడికాల్వకు 3 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) నిర్ణయించింది. ఆమేరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు బుధవారం సమాచారం ఇచ్చింది.

వైసీపీలోకి మాజీ మంత్రి గొల్లపల్లి

రాజోలు, ఫిబ్రవరి 28: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు టీడీపీ ఇన్‌చార్జి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు వైసీపీలో చేరారు. తన కుమారుడు శ్రీధర్‌తో కలిసి బుధవారం తాడేపల్లిలోని సీఎం కార్యాలయానికి వెళ్లి ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. రాజోలు అసెంబ్లీ స్థానాన్ని పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించడంతో గొల్లపల్లి తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. టీడీపీకి, రాజోలు ఇన్‌చార్జి పదవికి రాజీనామా చేస్తున్నట్లు టీడీపీ కార్యాలయానికి ఫ్యాక్స్‌లో లేఖ పంపారు.

వైసీపీ నేతల నరనరానా అవినీతి రక్కసి: సత్యకుమార్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): 'జగన్ ప్రభుత్వానికి అభివృద్ధి అంటే తెలియదు. అభివృద్ధి చేయడం చేతకాదు. మాటలు మాత్రం కోటలు దాటుతాయి' అని బీజేపీ జాతీయ కార్యదర్శి వై సత్యకుమార్ విమర్శించారు. బుధవారం ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. 'పనోడు పందిరి వేస్తే... పిచ్చుకలు వచ్చి పడగొట్టాయని వెనకటికి ఒక సామెత ఉంది. గతంలో వైజాగ్‌లో బస్ బే నిర్మించగా ప్రారంభానికి ముందే అది కాస్తా కూలిపోయింది. నిన్న కాక మొన్న వైజాగ్ బీచ్‌లో ఫ్లోటింగ్ బ్రిడ్జ్ ప్రారంభించిన 24 గంటల్లోపే కొట్టుకుపోయింది. ఇప్పుడు రాయదుర్గం మల్లాపురంలోని జగనన్న కాలనీలో గృహ ప్రవేశానికి ముందే పేకమేడ ఇల్లు కూలిపోయింది. ఇది అభివృద్ధి కాదు... అవినీతి. వైసీపీ నాయకుల రక్తంలో నరనరానా జీర్ణించుకుపోయిన రక్కసి' అన్నారు.

జగన్ వైఎస్ పేరు చెడగొట్టేందుకే పుట్టాడు: నారాయణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం జగన్ ఆయన తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేరు చెడగొట్టేందుకే పుట్టాడని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. బుధవారం, ఏపీ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఎన్టీఆర్ తెలుగు వారి ఆత్మగౌరవం కోసం పోరాడారు. ఇందిరాగాంధీకి సైతం ఆయన లొంగలేదు. వైఎస్ రాజశేఖరరెడ్డి కూడా రాష్ట్ర అభివృద్ధి కోసం కట్టుబడ్డారు. జగన్ మాత్రం తన స్వార్థం కోసం రాష్ట్ర ప్రయోజనాలను మోదీకి తాకట్టుపెట్టారు. 11 కేసులలో నిందితుడిగా ఉన్న జగన్ బెయిల్‌పై బయట ఉన్నారు. స్వాతంత్ర్యనంతరం ఇంత సుదీర్ఘకాలం బెయిల్‌పై బయట ఉన్న వ్యక్తి జగన్ తప్ప మరెవరూ లేరు. ఆయనపై మోదీ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దొంగలించబడిన విగ్రహాలను వెనక్కి తెస్తానని చెప్పే మోదీ విదేశాలకు పారిపోయిన గుజరాతీ ఆర్థిక నేరగాళ్లను మాత్రం వెనక్కితీసుకురారు. ప్రజల కోసం పనిచేస్తే కృష్ణుడు, రాముడి పేరుతో ఓట్లు అడుక్కోవాల్సిన అవసరం ఏమిటి? లిక్కర్ స్కాంలో కవితను వదిలేసి కేజ్రీవాల్ వెంట మోదీ ప్రభుత్వం పడుతోంది' అని నారాయణ ఆరోపించారు.

సీఏఏ అమలుకు బీజేపీ కుట్ర: సీపీఐ

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీలను అణచివేసే వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) అమలుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ ఆరోపించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీజేపీ మతరూపం మరోసారి బయటపడుతోందని ఆయన పేర్కొన్నారు. ఏపీకి బీజేపీ ఎంతో చేసిందంటూ బాకాలు ఊదుతున్న నేతలకు సిగ్గుండాలని విమర్శించారు. రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేసిన బీజేపీకి ఈ ఎన్నికల్లో తిరస్కారం ఖాయమన్నారు.

ఏలూరు సీటు కోసం రోడ్డెక్కిన జనసైనికులు

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 28: ఏలూరు ఎమ్మెల్యే సీటును జనసేనకు కేటాయించాలంటూ జన సైనికులు, వీర మహిళలు సంయుక్తంగా బుధవారం నగరంలోని జనసేన కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలు, ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. తాడేపల్లిగూడెంలో జరిగే పవన్, చంద్రబాబు సభను బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. ఏలూరు నగర అధ్యక్షుడు నగిరెడ్డి కాశీ నరేశ్ మాట్లాడుతూ... పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ప్రత్యేక శ్రద్ధ వహించి ఏలూరు సీటును జనసేనకు కేటాయించాలని డిమాండ్ చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

వీఎంసీ ఆదాయానికి గండి

- కేఆర్ మార్కెట్ ప్లాట్‌ఫాం వ్యాపారుల నుంచి కొన్నేళ్లుగా బిల్ కలెక్టర్ వసూళ్లు, సొంతానికి వాడకం
- కొండలా పేరుకుపోయిన బకాయిలు.. మాఫీ చేయిస్తానని రూ.15లక్షలు వసూలు చేసిన అధికార పార్టీ కార్పొరేటర్

వన్‌టౌన్, ఫిబ్రవరి 28: స్థానిక కాళేశ్వర రావు మార్కెట్‌లోని ప్లాట్‌ఫారాలు నిర్వహిస్తున్న పలువురు వ్యాపారులు సుమారు పదేళ్ల నుంచి అద్దె బకాయి పడ్డారు. వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన ఓ అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్ పాత బకాయిలు మాఫీ చేయడానికి ప్లాట్‌ఫారాల నిర్వాహకుల వద్ద భారీగా డబ్బులు దండుకున్నాడు. సుమారు రూ.15 లక్షలకు పైగా ప్లాట్‌ఫారం నిర్వాహకుల వద్ద తీసుకున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మార్కెట్‌లో మొత్తం 11 ప్లాట్ ఫారాలున్నాయి. పూలకొట్లు, గుమ్మడికాయలు, నిమ్మకాయలు, ఇతర వస్తువుల వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. వీఎంసీ అధికారులు ఈ ప్లాట్‌ఫారాలను 2004లో 11మంది వ్యాపారులకు అద్దెకిచ్చారు. ఒక్కో ప్లాట్‌ఫారానికి నెలకు సుమారు రూ.400. వీరిలో 8మంది అద్దె చెల్లించకపోవడంతో ఒక్కొక్కరు సుమారు రూ.4లక్షలకు పైగా బకాయి పడ్డారు. అధికారులు కూడా బకాయి అద్దె వసూలులో నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సుమారు 15ఏళ్లుగా బిల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఉద్యోగి సక్రమంగా అద్దె వసూలు చేయకుండా వారి నుంచి అనధికారికంగా డబ్బులు వసూలు చేసుకుంటున్నట్టు పలువురు వ్యాపారులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో అధికార పార్టీ కార్పొరేటర్ ఒకరు ఆ వ్యాపారులతో మాట్లాడి తాను పాత బకాయిలు మొత్తం రద్దు చేయిస్తానని ఒప్పందం చేసుకుని సుమారు రూ.15లక్షలకు డీల్ కుదుర్చుకున్నట్టు సమాచారం. అధికార పార్టీ కార్పొరేటర్ కావడంతో అధికారులపై ఒత్తిడి తెచ్చి 8మంది వ్యాపారులు వీఎంసీకి చెల్లించాల్సిన బకాయి మొత్తం సుమారు రూ.30 లక్షలు రద్దు చేయించినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండి పడినట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో బిల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఓ ఉద్యోగి కీలకపాత్ర పోషించినట్టు బహిరంగంగానే చెబుతున్నారు.



దివ్యాంగుల ఆదరణ సామాజిక బాధ్యత

సత్యనారాయణపురం, ఫిబ్రవరి 28: దివ్యాంగులను ఆదరించడం సామాజిక బాధ్యతని, కండరాల క్షీణతపై అవగాహన పెంచుకోవాలని ఎమ్మెల్యే విష్ణు అన్నారు. స్థానిక బీఆర్టీఎస్ రోడ్డు ఫుడ్ జంక్షన్ వద్ద బుధవారం వరల్డ్ రేర్ డీసీజ్ డే సందర్భంగా అమరావతి రేర్ డిసీజ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మస్కులర్ డైస్ట్రోఫి వ్యాధిపై అవగాహన ర్యాలీ జరిగింది. అమరావతి రేర్ డీసీజ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు సుంకర శోభారాణి ప్రజల్లో అవగాహన కోసం ర్యాలీ నిర్వహించామన్నారు. 10మంది వ్యాధిగ్రస్థులకు వీల్‌చైర్లు పంపిణీ చేశారు. రేర్ డిసీజ్ ఆర్గనైజేషన్ సభ్యులు, డాక్టర్లు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు

ఉయ్యూరు, ఫిబ్రవరి 28: వీరమ్మతల్లి తిరునాళ్ల సందర్భంగా ఈనెల 25న ఇరువర్గాల మధ్య జరిగిన గొడవలో సంతోష్‌పై బీరు బాటిల్‌తో దాడి చేసి గాయపరచిన ముగ్గురు ముద్దాయిలను అరెస్టు చేసినట్టు గన్నవరం డివిజన్ డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య తెలిపారు. ఉయ్యూరు పట్టణ పోలీస్ స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో కేసు వివరాలు తెలిపారు. విజయవాడ సనత్‌నగర్‌కు చెందిన పాము, ఉజ్వల్ వీరమ్మ తిరు నాళ్లకు ఉయ్యూరు వచ్చి వేర్వేరుగా ఆలయ స్థలంలో భోజనాలు పెట్టుకున్నారు. పాము తరపున నగరం నుంచి వచ్చిన కొండూరు మణికంఠ, (కేటీఎం పండు), కళింగపట్నం మనోహర్‌బబ్లు, పాంచాల సాయిసిద్ధు మద్యంసేవిస్తుండగా ఉజ్వల్ తరపున వచ్చిన రాజు మనోహర్ వద్దకు వచ్చి సిగరెట్ వెలిగించుకోవడానికి నిప్పు అడుగ్గా సిద్దు తను కాలుస్తున్న బీడీ ఇచ్చాడు. అంతట రాజు వారినుద్దేసించి మీరు గంజాయి బ్యాచ్‌లా ఉన్నారనడంతో గొడవ జరిగి సంతోష్ మనోహర్‌ను మెడ, పొట్టపై గాయపరిచాడు. దీంతో మణికంఠ తన చేతిలోని బీరు బాటిల్ పగులగొట్టి దాడిచేయగా సంతోష్‌కు కుడివైపు మూతి వద్దనుంచి చెంప వరకు బలమైన గాయకావడంతో పారిపోయారు. సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలించగా విజయవాడ- మచిలీపట్నం రహదారిపై కంకిపాడు సమీపాన కొండూరు మణికంఠ, కళింగపట్నం మనోహర్, పాంచాల సాయిసిద్దును మంగళవారం అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నట్టు తెలిపారు. మణికంఠపై పెనమలూరు స్టేషన్‌లో రౌడీషీట్, పటమట స్టేషన్ పరిధిలో 2020లో జరిగిన గ్యాంగ్‌వార్ కేసులో ప్రధాన నిందితుడు, ఆయా స్టేషన్లలో హత్య, హత్యాయత్నం, దొమ్మి, కొట్లాట, గంజాయి కేసులున్నట్టు తెలిపారు.

ఉల్లాసంగా సిటీ లెవల్ ఆర్చరీ పోటీలు

విజయవాడస్పోర్ట్సు, ఫిబ్రవరి 28: నగరంలోని వీఎంసీ ఓల్గా ఆర్చరీ ఫీల్డ్‌లో ఖేలో ఇండియా ఎన్‌టీపీసీ సిటీ లెవల్ ఓపెన్ ఆర్చరీ టోర్నీ ఉత్సాహపూరిత వాతావరణంలో బుధవారం జరిగాయి. పోటీలను జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు వివి.వేణుగోపాల్‌రావు తొలి బాణాన్ని వదిలి పోటీలను ప్రారంభించారు. 90మంది ఆర్చర్లు పోటీల్లో తలపడ్డారు. విజేతలకు బహుమతుల ప్రదానోత్సవంలో జిల్లా ఆర్చరీ అసోసియేషన్ సెక్రటరీ చెరుకూరి కృష్ణకుమారి, రాష్ట్ర అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణలు పాల్గొని అందజేశారు.

అవధాన ప్రక్రియను దేవాలయాలే ప్రోత్సహించాలి

గుణదల, ఫిబ్రవరి 28: తెలుగు, సంస్కృత భాషల్లోనే నెలవైన అవధాన ప్రక్రియను దేవాలయాలు ప్రోత్సహించి భవిష్యత్ తరాలకు వారసత్వ సంపదను అందించాలని డాక్టర్ బేతవోలు రామ బ్రహ్మం అన్నారు. దుర్గగుడి ఆధ్వర్యంలో తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో శ్రీదుర్గా సౌందర్యలహరి మహాశతావధానం 3వ రోజు బుధవారం పద్య పరిమళాలతో సారస్వత సమారాధనగా సాగగా సంచాలకులుగా వ్యవహరించిన డాక్టర్ బేతవోలు సభలో ప్రసంగించారు. అవధానాలకు ఆకార, ప్రాకార గోపురాలను నిర్మించిన అవధానుల్లో బృహత్ ద్వి సహస్రావధాని బ్రహ్మశ్రీ డాక్టర్ మాడుగుల నాగఫణి శర్మ అని డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ అన్నారు. మార్చి 1 వరకు జరిగే ఈ కార్యక్రమంలో నేటికి 30 దత్తపదులు, 30 సమస్యలు, 30 వర్ణనలు, అశువులు, అప్రస్తుత ప్రసంగాలను అవధాని డాక్టర్ మాడుగుల నాగఫణి శర్మ అలవోకగా పూరించి ఆహుతుల ప్రశంసలు అందుకున్నారు. విచ్చేసినవారికి దుర్గమ్మ కుంకుమ, ప్రసాదం అందజేశారు. సాహితీవేత్తలు జీవి రంగాచార్యులు, కవయిత్రి మొల్ల సాహితీ పీఠం అధ్యక్షులు విద్వాన్ డాక్టర్ గానుగ పెంట హనుమంతరావు, పంతుల వెంకటేశ్వరరావు, సురభి శంకర శర్మ, హరికథకులు వెంకటరమణ పాల్గొన్నారు.

11అంశాలకు ఆమోదం

చిట్టినగర్: వీఎంసీ స్థాయీ సంఘం సమావేశంలో 11అంశాలకు ఆమోద ముద్రవేశారు. మేయర్ భాగ్యలక్ష్మి అధ్యక్షతన బుధవారం వీఎంసీ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో స్థాయీ సంఘ సమావేశం జరిగింది. 16 అంశాలపై చర్చించి 11 అంశాలను ఆమోదించారు. ఒక అంశం రికార్డు చేయడంతోపాటు పరిపాలన పరమైన అంశాలకు సంబంధించి ఒక అంశమును ధ్రువీకరించారు. మూడు అంశాలను వాయి దా వేశారు. సభ్యులు, మరుపిళ్ల రాజేష్, అదనపు క మిషనర్ (ప్రాజెక్ట్) కె.వి. సత్యవతి, చీఫ్ ఇంజనీర్ ప్ర భాకరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్. పీ. రత్నావళి, పట్టణ ప్రణాళికాధికారి ప్రసాద్ పాల్గొన్నారు.

ఏపీని అప్పుల కుప్పగా మార్చిన జగన్
బీజేపీ నేత డాక్టర్ కిలారు దిలీప్

ఆటోనగర్ (పెనమలూరు): సీఎం జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చడం తప్ప, ఏపీకి చేసిందేమీ లేదని బీజేపీ ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల ప్రజాపోరు క్లస్టరు ఇన్‌చార్జి డాక్టర్ విలారు దిలీప్ విమర్శించారు. నగరంలోని తూర్పు, పశ్చిమ లో జరుగుతున్న ప్రజాపోరులో భాగంగా బుధవా రం యనమలకుదురు రామలింగేశ్వరనగర్‌లో ఆయ న పార్టీ నేతలతో కలిసి పాల్గొని మాట్లాడారు. డాక్టర్ దిలీప్ మాట్లాడుతూ జగన్‌రెడ్డి సీఎం అయ్యాక మ హిళలపై వేధింపులు, మానభంగాలు, అదృశ్యాలు ఎ క్కువయ్యాయన్నారు. వైసీపీ అరాచకాలను ఎండగ ట్టి నిరంకుశప్రభుత్వాన్ని గద్దె దింపుతామన్నారు.

ఈఎన్‌టీ వైద్యుల సంఘం నగర శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక

గవర్నర్‌పేట: చల్లపల్లి బంగ్లా సమీపంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) హాలు లో బుధవారం భారతీయ ఈఎన్‌టీ వైద్యుల సం ఘం నగర శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. సంఘాధ్యక్షుడిగా డాక్టర్ దేవినేని ప్రదీప్, కార్యదర్శి గా డాక్టర్ కేఏఎస్ఆర్ భార్గవ్‌తో పాటు మిగిలిన కా ర్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంయుక్త కార్యదర్శిగా డా క్టర్ తన్వీర్ అఫ్రోజ్, కోశాధికారిగా డాక్టర్ కె. వినీషా, కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ సుధ, డాక్టర్ అను షా, డాక్టర్ గోపీనాయక్, డాక్టర్ స్పందన ఎన్నికయ్యారు.

రాజధాని గ్రామాల్లో భూమిలేని నిరుపేదలకు రూ.5000 పింఛను

వన్‌టౌన్: రాజధాని గ్రామాల్లో భూమిలేని నిరుపేదలకిస్తున్న ఫించను మొత్తాన్ని రూ.2500 నుంచి రూ.5000కు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ బు ధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెంచిన మొ త్తం 2024 ఫిబ్రవరి నుంచే అమలులోకి వస్తుందని, మార్చి 1న వలంటీర్లు రూ.5000 చొప్పున ఫించను అందచేయనున్నారన్నారు. 17,215 మంది భూమిలేని నిరుపేద కుటుంబాలు లబ్ధిపొందుతారన్నారు.

వైద్య శిబిరాలతో అక్టోపస్ సిబ్బందికి ప్రయోజనం

వన్‌టౌన్: అక్టోపస్ సిబ్బందికి వైద్య శిబిరాలు ఎంతో ప్రయోజనమని అక్టోపస్ ఐజీపీ సీహెచ్ శ్రీ కాంత్ అన్నారు. బుధవారం అక్టోపస్ కార్యాలయం లో సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్ ను ఆయన ప్రారంభించి, ప్రసంగించారు. వైద్య శిబిరాలను సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు వినియోగించుకోవాలన్నారు, గుండె వైద్య నిపుణురాలు కవి తా ప్రియాంక, ఎముకల వైద్య నిపుణుడు స్టాలిన్ చౌదరి, జనరల్ వైద్యుడు ప్రణవ్ రాఘవన్‌తో పాటు వివిధ ఆసుపత్రుల సిబ్బందిని ఆయన అభినందించారు. అడ్మిన్ ఎస్పీ ఎం నాగేంద్రరావు, అదనపు ఎ స్పీలు కె నగేష్‌బాబు, రామచంద్రమూర్తి, డీఎస్పీలు, డాక్టర్లు టి.రత్నాకర్, జి.మంజువాణి పాల్గొన్నారు.

2న బీసీల ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయండి: గణేశ్

ధర్నాచౌక్: మార్చి 2న జరగనున్న 139 బీసీ కులాల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర యువజన వి భాగం అధ్యక్షుడు బెజవాడ గణేశ్ బుధవారం ఒక ప్రకటనలో బీసీలకు పిలుపునిచ్చారు. గాంధీనగర్‌లోని శ్రీరామ ఫంక్షన్‌హాల్‌లో జరగనున్న ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు డాక్టర్ ఎన్.మారేష్‌ను ఘనంగా సన్మానిస్తామన్నారు. ముఖ్య అతిథులుగా మంత్రి రమేష్, ఎంపీ నాని, మాజీ మంత్రి వెలంపల్లి, దేవినేని అవినాష్ పాల్గొంటారన్నారు.

శ్రీ వారాహి సహిత శతచండీ కదళీయాగం వాయిదా

ధర్నాచౌక్: ప్రజా సంక్షేమం, ప్రకృతి పరిరక్షణకు నేటి నుంచి మార్చి 2 వరకు నిర్వహించాల్సిన శ్రీ వారాహి సహిత శతచండీ కదళీయాగం అనివార్య కారణాలతో వాయిదా వేసినట్టు వారాహిసేన రాష్ట్ర అధ్యక్షురాలు డి.సరోజా రమేష్, కన్వీనర్ పోరుమామిళ్ల ఈశ్వర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ట్రస్టుకు సంబంధించిన కొన్ని సాంకేతిక లోపాలు, విద్యార్థుల పరీక్షలు, అనుమతి లభించకపోవడంతోనే యాగాన్ని వాయిదా వేస్తున్నామన్నారు. త్వరలోనే యాగం నిర్వహించే తేదీలను ప్రకటిస్తామన్నారు.

యూకే వీసా ఇప్పిస్తానని డబ్బులు స్వాహా

- తిరిగి అడిగితే బెదిరింపులు.. పోలీసులకు ఫిర్యాదు.. ఇద్దరిపై కేసు



విద్యాధరపురం, ఫిబ్రవరి 28: యూకే వెళ్లడానికి వీసా ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి భవానీపురానికి చెందిన వ్యక్తి వద్ద డబ్బులు తీసుకుని బెదిరిస్తున్న ఇద్దరిపై భవానీపురం పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు ఈ కేసును చాలా గోప్యంగా ఉంచడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భవానీపురం హెచ్‌ఆర్‌టీ సాయి నిర్మల్ అపార్ట్‌మెంట్ ఫ్లాట్ నెంబర్ 504లో పీఎల్ మర్రెడ్డి కుటుంబసభ్యులతో ఉంటున్నాడు. ప్రైవేట్ కంపెనీలో జాబ్ చేస్తున్నాడు. భార్య సునీతరెడ్డిని 2022లో యూకే పంపించడానికి ప్రయత్నించాడు. ఈ క్రమంలో బందర్‌రోడ్డులోని ఐ.వి.వై కన్సల్టెంగ్స్‌లో పనిచేస్తున్న జీవీఏ జగదీష్‌ను సంప్రదించారు. అతడి ద్వారా మర్రెడ్డికి భవానీపురంలో ఉంటున్న వడలి లావణ్య పరిచయమైంది. ఆమె 3 నెలలో యూకే వీసా తెప్పిస్తానని, అందుకు రూ.16లక్షలు ఖర్చవుతుందని తెలిపింది. మొదట రూ.1.35 లక్షలు అడ్వాన్సుగా ఇవ్వాలని చెప్పింది. దీంతో మర్రెడ్డి ఓ బ్యాంకు ద్వారా లావణ్యకు ట్రాన్స్‌ఫర్ చేశాడు. మిగిలిన డబ్బులు 2022 ఫిబ్రవరిలో పలు దఫాలుగా రూ.14.65లక్షలు ట్రాన్స్‌ఫర్ చేశాడు. రోజులు గడుస్తున్నా వీసా ఇప్పించకపోవడంతో అనుమానం వచ్చి గట్టిగా ప్రశ్నించడంతో ఆమె తన మరిది సాతుపాటి అ రవింద్‌కుమార్ అలియాస్ సోనూను ప రిచయం చేసి వీసా ప్రాసెస్ ఐపోయిందంటూ చెప్పింది. బాధితుడు ఆమె గు రించి వివరాలు సేకరించగా ఆమెపై రా జమండ్రి, పలు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయని తెలిసింది. దీంతో బాధితు డు ఆమె తండ్రికి వెళ్లి నిలదీయగా 20 22 నవంబర్ 29న రూ.15లక్షల చెక్కు ను బాధితుడికిచ్చారు. ఆ చెక్కును 20 23 మార్చి 30న తన భార్య బ్యాంక్ ఖా తాకు జమ చేశాడు. మరుసటి రోజు లావణ్య బ్యాంక్ మేనేజర్ వద్దకు వెళ్లి తాను చెక్ ఇవ్వలేదని ఫిర్యాదు చేయడంతో బ్యాంక్ మేనేజర్ సునీతారెడ్డి బ్యాంక్ ఖాతాలోని రూ.15లక్షలు సీజ్ చేశారు. అప్పటికే యూకే వెళ్లిపోయిన లావణ్యను ఫోన్‌లో సంప్రదించగా తాను ఇండియా వచ్చాక డబ్బులిస్తానని హామీ ఇచ్చింది. కొన్ని నెలల తరువాత ఇండియా వచ్చినా బాధితులను కలవలేదు. ఫోన్ చేయగా హైదరాబాద్‌లో ఇస్తాను, విజయవాడలో ఇ స్తానంటూ కాలయాపన చేస్తూ వచ్చింది. కొన్ని రో జుల తరువాత రూ.10లక్షల చెక్కు వేరే వ్యక్తి ద్వారా బాధితుడికి పంపించగా మిగిలిన డబ్బులు ఎప్పుడి స్తారంటూ ప్రశ్నించగా సోనూ చేత పంపిస్తానంటూ చెప్పింది. బాధితుడు బ్యాంకుకు వెళ్లి విచారించగా అందులో డబ్బులు లేవని తెలిసింది. దీనిపై బాధితు డు సోనూను గట్టిగా ప్రశ్నించడంతో మరో రూ.2 లక్షలు ఇస్తే వీసా వస్తుందంటూ మాయమాటలు చెప్పి డబ్బులు తీసుకున్నాడు. అయినా వీసా రాకపోవడంతో డబ్బులు తిరిగిచ్చేయమని లావణ్య, సోనూ ను నిలదీశారు. సోనూ తను తీసుకున్న రూ.2 లక్ష ల్లో రూ.80వేలు మాత్రమే తిరిగిచ్చాడు. మిగిలినవి అడగ్గా సోనూ బాధితులను అసభ్యకరంగా దూషించి మీ దిక్కున్న చోట చెప్పుకోండని, చంపుతామని బెదిరించాడు. దీంతో బాధితులు మంగళవారం రాత్రి భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు లావణ్య, సోనూపై కేసు నమోదు చేశారు. అయితే పోలీసులు ఈ కేసును బయటకు రానీయకుండా గోప్యంగా ఉంచడం విస్మయం కలిగిస్తోంది.



న్యూ రాజరాజేశ్వరిపేటలో వైసీపీ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాస్‌తో పర్యటిస్తున్న ప్రభుత్వాధికారులు ఈఈ, డీఈ, ఏఈ

జీ హుజూర్..!

- పార్టీ ఇన్‌చార్జి వెలంపల్లి వెంటే అధికారులు
- డమ్మీగా మారిన స్థానిక ఎమ్మెల్యే

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 28: సెంట్రల్ నియోజకవర్గానికి వైసీపీ ఇన్‌చార్జ్‌గా వచ్చిన వెలంపల్లి శ్రీనివాస్ తన పర్యటనల్లో ప్రభుత్వాధికారులు కనిపిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. కేవలం ఓ పార్టీకి ఇన్‌చార్జ్‌గా వచ్చిన వ్యక్తి వెనుక పూర్తిస్థాయి అధికార యంత్రాంగం తిరుగుతుండటం పలు ప్రశ్నలకు దారితీస్తోంది. సాధారణంగా ఎమ్మెల్యే, ఎంపీ వంటి ప్రజా ప్రతినిధుల వెనుక తిరగాల్సిన అధికారులు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ వెనుక జీ హుజూర్ అంటూ తిరుగుతుండటం వివాదాస్పదమవుతోంది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికారుల పనితీరు చూస్తుంటే అధికార పార్టీకి పనిచేస్తున్నట్టు స్పష్టమవుతోంది. ఓ పక్క స్థానిక ఎమ్మెల్యే మల్లాది విష్ణు పర్యటనలు చేస్తున్నా ఆయన్ని వదిలేసి అధికారులు పార్టీ ఇన్‌చార్జ్ వెనుకే కనిపిస్తున్నారు. ఎమ్మెల్యేను డమ్మీ చేసి పార్టీ ఇన్‌చార్జ్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నాడని ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఏనాడు ప్రజా సమస్యలపై స్పందించని అధికారులు నేడు వెలంపల్లిని అంటిపెట్టుకుని తిరుగుతూ నానాహడావుడి చేస్తుండటంపై నియోజకవర్గ ప్రజలు అధికారుల తీరుపై అసంతృప్తి వెళ్లగక్కుతున్నారు. ఐదేళ్లుగా ప్రజా సమస్యలను గాలికొదిలేసి ఇప్పటికప్పుడు సమస్యల పరిష్కారమంటూ అత్యుత్సాహం ప్రదర్శించడం ప్రజలను మోసగించటమేనని ఆరోపిస్తున్నారు. పార్టీ ఇన్‌చార్జ్ వెనుక ఈఈ, డీఈ, ఏఈ, స్థాయి అధికారులు పర్యటనలో చేస్తుంటే ఎన్నికల కమిషన్, ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

ఆరుగురు ఉద్యోగులకు మ్యాన్ ఆఫ్ ది మంత్ సేఫ్టీ అవార్డులు

రైల్వేస్టేషన్, ఫిబ్రవరి 28: రైల్వే డివిజన్‌లో మ్యాన్ ఆఫ్ ది మంత్ సేఫ్టీ అవార్డులు ఆరుగురికి దక్కాయి. సికింద్రాబాద్ రైల్ నిలయంలో మంగళవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన రైల్వే భద్రత, ప్రయాణికుల భద్రతలపై పలు సూచనలు చేశారు. అవార్డులు పొందిన వారిని డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ అభినందించారు. కాకినాడ మెకానికల్ డిపార్ట్‌మెంట్ క్యారెజ్, వ్యాగన్ల అసిస్టెంట్ కె.రమేష్‌నాయుడు, మరో అసిస్టెంట్ డి.ఎస్.వి ఎస్ కోటేశ్వరరావు, విజయవాడ మెకానికల్ డిపార్ట్‌మెంట్ టెక్నిషియన్ బాబులాల్ మీనా, మెకానికల్ డిపార్ట్‌మెంట్ టెక్నిషియన్ జి. వెంకటరత్నం, విజయవాడ లోకో పైలట్ కేఎల్ సత్యప్రసాద్, కావలి ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ట్రాలీ మ్యాన్ ఎం.మురళీ మోహన్‌లు అవార్డులు అందుకున్నారు.

డ్రెయిన్లలో పూడికల తొలగింపు

- రోడ్డు వేస్తామంటూ కార్పొరేషన్ నుంచి ఫోన్

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

భవానీపురం, ఫిబ్రవరి 28: 45వ డివిజన్‌లో మాదాసు రామారావు వీధిలో డ్రెయిన్లలో శానిటరీ మేస్త్రీ రామరెడ్డి ఆధ్వర్యంలో డ్రెయిన్ల పూడికలను బుధవారం ముమ్మరంగా చేపట్టారు. 'సమస్యలన్నీ ఇక్కడే' అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో బుధవారం మాదాసు రామారావు వీధిలోని సమస్యలపై ప్రచురితమైన కథనానికి విశేష స్పందన వచ్చింది. డ్రెయిన్లలో ఐదుగురు కార్మికులు పేరుకుపోయిన పూడికలను తొలగించారు. కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారుల నుంచి కాలనీ పెద్దలు శ్రీనివాస్‌కు ఫోన్ చేశారు. మీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్నామని, రోడ్లపై పేరుకుపోయిన వ్యర్థాలను ఎక్సవేటర్‌తో తొలగించే పనులు చేపట్టారు. ఆంధ్రజ్యోతి కథనంతో అధికారుల్లో చలనం రావడంతో అక్కడ నివాసితులు హర్షం వ్యక్తం చేశారు.



మాదాసు రామారావు వీధిలో డ్రెయిన్ల పూడికలు తీస్తున్న కార్మికులు

ముగిసిన రాజ్యలక్ష్మి సుదర్శన లక్ష్మీ నరసింహ యాగం

గుణదల, ఫిబ్రవరి 28: రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని చంద్రబాబు మరోసారి ముఖ్యమంత్రి కావాలని కాంక్షిస్తూ టీడీపీ గన్నవరం అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు చేపట్టిన రాజ్యలక్ష్మి సుదర్శన లక్ష్మీ నరసింహ యాగం మహా పూర్ణాహుతితో బుధవారం ఘనంగా ముగిసింది. ప్రసాదంపాడు గ్రామంలోని టీడీపీ మండల కార్యాలయంలో మూడు రోజులుగా యాగం అంగరంగ వైభవంగా వేదమంత్రాల నడుమ జరుగుతున్న విషయం విదితమే. ముందుగా బుధవారం ఉదయం 75మంది రుత్వికుల యాగమంత్రోచ్చరణల మధ్య యార్లగడ్డ వెంకట్రావు, జ్ఞానేశ్వరి దంపతులు యజ్ఞకులుగా స్వస్తి వాచనం, గణపతి పూజ, పుణ్యాహవచనం పూజలు నిర్వహించారు. 3,500 రకాల వనమూలికలు సుగంధ ద్రవ్యాలను సుదర్శన శతకంతో అవనం చేసి హోమగుండానికి సమర్పించారు. చివరగా మహాపూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం యార్లగడ్డ దంపతులకు వేదపండితులు ఆశీర్వచనాలు అందజేశారు. పూజకు హాజరైన 3వేలమంది భక్తులకు హోమ కంకణాలు పంపిణీ చేశారు. హాజరైన ప్రతి ఒక్కరికీ తీర్థ ప్రసాదాలు, మహిళలకు పసుపు కుంకుమ అందజేసి అన్నసంతర్పణ చేశారు. మాజీ ఎమ్మెల్యేలు మూల్పూరి బాలకృష్ణారావు, డాక్టర్ దాసరి బాలవర్ధనరావు, టీడీపీ నేతలు బొప్పన భవకుమార్, గూడవల్లి నరసయ్య, బొప్పన హరికృష్ణ, దొంతు చిన్న, మూల్పూరి సాయి కల్యాణి, మండవ రమ్య, గుజ్జర్లపూడి బాబూరావు, కోనేరు సందీప్, పరుచూరి నరేష్, పాల్గొన్నారు.



యాగం చివర్లో పూర్ణాహుతి సమర్పిస్తున్న యార్లగడ్డ దంపతులు

ఆర్థిక క్రమశిక్షణతో ఉన్నత జీవితం: కలెక్టర్

వన్‌టౌన్, ఫిబ్రవరి 28: ఆర్థిక క్రమశిక్షణతోనే ఉన్నత జీవితాన్ని, ఆర్థిక అక్షరాస్యతతో సాధికారత పొందుతారని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. ఈ నెల 26 నుంచి మార్చి 1 వరకు జరుగుతున్న ఆర్‌బీఐ ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా బుధవారం నగరంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో యూనియన్ బ్యాంక్ ముద్రించిన వారోత్సవాల పోస్టర్లను బ్యాంక్ అధికారులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏటా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అక్షరాస్యత వారోత్సవాలను నిర్వహిస్తుందని సరైన ఆరంభంతో ఆర్థికంగా స్మార్ట్‌గా ఎదగండనే నినాదంతో ఈ ఏడాది ఉత్సవాలను నిర్వహిస్తున్నారన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజియనల్ హెడ్ ఎం.శ్రీధర్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ కె.ప్రియాంక, సప్తగిరి గ్రామీణ బ్యాంక్ చీఫ్ మేనేజర్ ఎంవి.నాగిరెడ్డి, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ జీ.వీ రవీంద్ర, యాక్సిస్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ పి.కృపాజీ పాల్గొన్నారు.

గోరా టెక్నోహబ్‌తో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం

పటమట: విద్యార్థులు, యువతలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి, నూతన ఆవిష్కరణల దిశగా ప్రోత్సహించే లక్ష్యంతో గోరా టెక్నోహబ్‌ను ఏర్పాటు చేయడం గొప్ప విషయమని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. స్థానిక బెంజ్‌సర్కిల్ సమీపంలోని నాసిక కేంద్రంలో ఏర్పాటు చేసిన గోరా టెక్నో హబ్‌ను కలెక్టర్ ఢిల్లీరావు బుధవారం ప్రారంభించారు. అనంతరం జాతీయ సైన్సు దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఎంతో గొప్ప ఉద్దేశం, సేవాభావంతో దార్శనికతతో డాక్టర్ జి.సమరం టెక్నో హబ్ ఏర్పాటు చేశారన్నారు. డాక్టర్ సమరం మాట్లాడుతూ ఇదో విశిష్ట కేంద్రమని, సైన్స్ ఔత్సాహికులకు ప్రేరణగా నిలిచి, ప్రోత్సహించేందుకు దోహదం చేస్తుందన్నారు. ప్రొఫెసర్ లక్ష్మీదేవి, ప్రొఫెసర్ నరేష్, డాక్టర్ జి.మారు, జి.రశ్మి సమరం, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆంజనేయస్వామి, వినాయక స్వామి విగ్రహాలకు పుష్పాధివాసం

ఆంజనేయ, వినాయక విగ్రహాలకు నేడు ప్రతిష్ఠాపన

వన్‌టౌన్, ఫిబ్రవరి 28: దుర్గగుడి పాతమెట్ల వద్ద ఉన్న వినాయకుడి గుడిని పునర్నించిన నేపథ్యంలో వినాయక స్వామి విగ్రహాన్ని, సీతమ్మవారి పాదాల వద్ద ఉన్న దక్షిణ ముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ఆంజనేయ స్వామి విగ్రహాన్ని గురువారం ప్రతిష్ఠించనున్నారు. బుధవారం స్థానాచార్యుడు విష్ణుభొట్ల శివప్రసాదశర్మ ఆధ్వర్యంలో ముఖ్య అర్చకుడు యజ్ఞనారాయణ, అర్చకులు, వేదపండితులు విగ్రహాలకు ఆగమానుసారం విగ్రహాల కు, కలశాలకు, విగ్రహాలకు జలాధివాసం, క్షీరాధివాసం, ధాన్యాధివాసం, పు ష్పాధివాసం, శయనాధివాసాలను నిర్వహించారు. మహన్యాస హోమాలు, పూజలను చేశారు. ఈవో రామారావు, ఈఈ ఏర్పాట్లను పరిశీలించారు.

దుర్గమ్మకు బంగారు రాళ్ల నెక్లెస్ కానుక

ఇంద్రకీలాద్రిపైనున దుర్గమ్మకు తెనాలికి చెందిన ఉయ్యూరి విజయలక్ష్మి, అన్నపురెడ్డి గోపాల రెడ్డి దంపతులు బుధవారం 35గ్రాముల బంగారు రాళ్ల నెక్లెస్‌ను ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు ద్వారా కానుకగా అందజేశా రు. దాతలలకు దుర్గమ్మ దర్శనానంతరం ప్రసాదం, శేషవస్త్రం, ఆశీర్వచనం అందజేశారు. ప్రత్యేక ఆహ్వానితుడు జక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



మహిళా సదస్సులో ప్రసంగిస్తున్న వివిధ మహిళా సంఘాల నేతలు

నాయకత్వ స్థానాల్లో మహిళలు: ఉషారాణి

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 28: మహిళలు, యువతులను నాయకత్వ స్థానాల్లోకి తీసుకోవడం కోసం అన్ని రాజకీయ పార్టీలు కృషి చేయాలని ప్రజాశక్తి బుక్ హౌస్ మాజీ ఎడిటర్ కె.ఉషారాణి అన్నారు. మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో మహిళలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారిత కోసం సదస్సును జరిగింది. సదస్సుకు పి.విజయ అధ్యక్షత వహించారు. జనశిక్షణా సంస్థాన్ చైర్మన్ ఎన్ విద్యాఖన్నా, సేఫ్ అధ్యక్షురాలు జి. జ్యోత్స్న, గైనకాలజిస్ట్ డాక్టర్ సుశీల, హైకోర్టు అడ్వకేట్ ఎం. అనురాధ, ఎంబీవీకే బాధ్యులు స్వరూపరాణి ప్రసంగిస్తూ మహిళలకు నాయకత్వ స్థానాల్లో, చట్టసభల్లో రిజర్వేషన్లు, మహిళల ఆర్థిక స్వేచ్ఛ, మహిళల విద్య, ఆరోగ్యం, స్వయం ఉపాధి అంశాలను ప్రస్తావించారు.

బంధం తెంచుకోమన్నందుకే దాడి!

- కోలుకుంటున్న మాధురి

విజయవాడ, ఫిబ్రవరి 28: సత్యనారాయణపురం శ్రీనగర్లో వివాహిత వక్కలగడ్డ మాధురిపై హత్యాయత్నానికి గల కారణాలను పోలీసులు వెలికితీస్తున్నారు. ఇప్పటి వరకు కొనసాగించిన బంధానికి ముగింపు పలకాలని మాధురి తెగేసి చెప్పడంతోనే నాని ఈ ఘాతుకానికి ఒడిగట్టాడని తెలిసింది. మాధురి ఇక్కడకు వచ్చినప్పటి నుంచి ఫోన్ చేస్తునే ఉన్నాడు. తనను మరిచిపోవాలని చెప్పంటే నాని ఇష్టపడలేదు. ఈ క్రమంలోనే మాధురి ఇక గుడివాడకు వచ్చే అవకాశం లేదని చెప్పడంతో నాని ఆక్రోశానికి లోనయ్యాడు. ఒప్పించడానికి ప్రయత్నం చేశాడు. నేరుగా కత్తి తీసుకుని మాధురి తల్లి ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో ఆమె తల్లి కనకదుర్గ ఇంటి బయట వాకిలి ఊడ్చుతుంది. లోపలికి వెళ్లి తలుపునకు గడియ వేశాడు. మాధురిని గుడివాడ రావాలని ఒత్తిడి తెచ్చాడు. లొంగకపోవడంతో ఇష్టానుసారంగా నరికేశాడు. ప్రస్తుతం మాధురి ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. శరీరమంతా గాయాలవడంతో వైద్యులు శస్త్ర చికిత్స చేశారు. ప్రస్తుతం ఆమె కోలుకుంటుంది.



విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రచురించిన పుస్తకాన్ని అవిష్కరిస్తున్న సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు, కళాశాల అధ్యాపకులు

ఔషధాల తయారీలో రసాయన, జీవరసాయన శాస్త్రాల పాత్ర కీలకం

- సిద్ధార్థలో అంతర్జాతీయ సమావేశం

లబ్బీపేట, ఫిబ్రవరి 28: మారుతున్న కాలంలో వస్తున్న కొత్త రకా ల వ్యాధులకు ఔషధాలను తయారు చేసే ప్రక్రియలో రసాయన, జీవరసాయన శాస్త్రల ప్రాముఖ్యత ప్రధానమైందని కృష్ణా వర్సిటీ హెచ్‌వోడీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ, డీన్ డాక్టర్ డి.రామకృష్ణ రెడ్డి అన్నారు. సిద్ధార్థ మహిళా కళాశాలలో బుధవారం కళాశాల రసాయన శాస్త్రం, జీవరసాయన శాస్త్రం విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో అధునిక వ్యాధులకు వ్యతిరేకంగా ఔషధ లక్ష్యాల అభివృద్ధి కోసం రసాయన, జీవరసాయ న విధానాలపై రెండ్రోజుల అంతర్జాతీయ సమావేశం ప్రారంభమైంది. బ యోఫామ్ క్లినికల్ సర్వీస్ డైరెక్టర్ డాక్టర్ కె.సేతురామ్, డాక్టర్ అనిల్ కె.పసుపులేటి, డాక్టర్.త్రివేణి, డైరెక్టర్ టి.విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, జీవరసాయన శాస్త్ర విభాగాధిపతి ఎ.హరిక, రసాయన శాస్త్ర విభాగాధిపతి ఎమ్.సుభాని పాలొన్నారు.

విశాఖ బీచ్ వద్ద నిర్మాణాలు ఆపించండి

▸ కలెక్టర్, తహశీల్దార్‌కు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా భీమునిపట్నం పరిధిలో కోస్తా నియంత్రణ మండలి (సీఆర్‌జడ్) నిబంధనలను ఉల్లంఘించి సముద్రానికి అతిసమీపంలో చేపట్టిన శాశ్వత నిర్మాణాలను తక్షణం నిలుపుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. నిర్మాణానికి వినియోగిస్తున్న భారీ యంత్రాలను అక్కడికక్కడే తక్షణమే సీజ్ చేయాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్, విశాఖ జిల్లా కలెక్టర్, భీమునిపట్నం తహశీల్దార్‌ను ఆదేశించింది. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడానికి ఏం చర్యలు తీసుకున్నారో తెలియజేస్తూ పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని స్పష్టం చేసింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. భీమునిపట్నం పరిధిలోని సీఆర్‌జడ్-1 ప్రాంతంలో సముద్రానికి అతిసమీపంలో శాశ్వత కాంక్రీట్ నిర్మాణం చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదంటూ జనసేన కార్పొరేటర్ పీఎల్‌వీఎన్ మూర్తి యాదవ్ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపించారు. సీఆర్‌జడ్ ప్రాంతంలో నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు జరుపుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని.. భారీ యంత్రాలను వినియోగిస్తున్నారని.. సముద్రానికి అతిసమీపంలో నిర్మాణాలు చేస్తున్నారంటూ ఫొటో ఆధారాలను కోర్టు ముందు ఉంచారు. వాటిని పరిశీలించిన ధర్మాసనం.. సీఆర్‌జడ్ ప్రాంతంలో నిర్మాణాలకు ఎలా అనుమతిచ్చారని ప్రశ్నించింది. నిర్మాణాలకు తాము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని వీఎంఆర్‌డీఏ తరఫు న్యాయవాది తెలిపారు. వివరాలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. సముద్రానికి అతిసమీపంలో జరుపుతున్న శాశ్వత నిర్మాణాలను తక్షణం నిలిపివేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

జగన్ అక్రమాస్తుల కేసుల్లో డిశ్చార్జి పిటిషన్ల పరిష్కారానికి గడువు పెంపు

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఏపీ ముఖ్యమంత్రి జగన్‌కు సంబంధించిన అక్రమాస్తుల కేసుల్లో పెండింగ్‌లో ఉన్న డిశ్చార్జి పిటిషన్‌లను పరిష్కరించడానికి ఏప్రిల్ 30 వరకు గడువు పొడిగిస్తూ తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. ప్రజాప్రతినిధులపై ఉన్న పెండింగ్ కేసులను పర్యవేక్షించే అంశాన్ని హైకోర్టు సుమోటోగా స్వీకరించింది. సీబీఐ కోర్టులో ప్రజాప్రతినిధులకు సంబంధించి (జగన్ కేసులు) పెండింగ్‌లో ఉన్న 20 కేసుల్లో డిశ్చార్జి పిటిషన్‌లను రెండునెలల్లో పరిష్కరించాలని పేర్కొంటూ హైకోర్టు గత ఏడాది డిసెంబర్ 15న ఆదేశాలు జారీచేసింది. ఆ గడువు ఫిబ్రవరి 15తో ముగిసింది. అయితే మరింత గడువు కావాలని.. 13 వేల పేజీల స్టేట్‌మెంట్లు, ఆదేశాలు సిద్ధం చేయాల్సి ఉందని సీబీఐ కేసుల ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి హైకోర్టుకు లేఖరాశారు. ఈ లేఖను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు డిశ్చార్జి పిటిషన్‌లను పరిష్కరించడానికి ఏప్రిల్ 30 వరకు గడువు పొడిగించింది. జగన్‌పై ఉన్న 11 సీబీఐ, 9 ఈడీ కేసుల్లో జగన్, విజయసాయిరెడ్డి, ఇతర నిందితులవి కలిపి దాదాపు 129 డిశ్చార్జి పిటిషన్‌లు సీబీఐ కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి.

బాబును కలిసిన పలువురు టీడీపీ నేతలు

అమరావతి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబును ఆ పార్టీ నాయకులు పలువురు బుధవారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో కలిశారు. గుంటూరు ఎంపీ సీటు ఆశిస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్ చంద్రబాబుతో భేటీఅయ్యారు. పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి గౌరు వెంకటరెడ్డి బాబును కలిశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గానికి సంబంధించి ఎస్సీవీ నాయుడుకు సీటు ఇవ్వాలని పలువురు విజ్ఞప్తి చేశారు.



చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన రాయలసీమ విద్యార్థి జేఏసీ నేతలు

టీడీపీలోకి సీమ విద్యార్థి సంఘాలు

అమరావతి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాయలసీమకు చెందిన వివిధ విద్యార్థి సంఘాల నేతలు బుధవారం టీడీపీలో చేరారు. ఉండవల్లిలోని నివాసంలో పార్టీ అధినేత చంద్రబాబు సమక్షంలో రాయలసీమ విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ చైర్మన్ బి.శ్రీనివాసులు, వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి బి.నాగరాజు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి చంద్రబాబు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జేఏసీ నేతలు మాట్లాడుతూ జాబ్ కేలండర్ పేరుతో వైసీపీ యువతను మోసం చేసిందని, ఈ ప్రభుత్వంలో యువతకు ఉద్యోగాలు వచ్చే పరిస్థితి కనిపించడం లేదన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైసీపీకి యువత బుద్ధి చెప్తుందన్నారు.

ఎన్నికల నోటిఫికేషన్‌లోపే కారుణ్య నియామకాలు

▸ బొప్పరాజు డిమాండ్

విజయవాడ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పరిధిలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు చనిపోయి ఆరేడు సంవత్సరాలు దాటినందున వారి కుటుంబాల ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల నోటిఫికేషన్ లోపు కారుణ్య నియామకాల ఉద్యోగాలు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. కొవిడ్ ముందు, తర్వాత జిల్లా పరిషత్ టీచర్లు, హెడ్ మాస్టర్లు అనేక మంది చనిపోయారని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా చొరవ తీసుకుని నిబంధనల మేరకు వీరందరికీ వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద కారుణ్య నియామకాలు కల్పించాలని కోరారు. ఒకవేళ సరిపోకపోతే అదనపు పోస్టులను క్రియేట్ చేసి అయినా ఉద్యోగాలు కల్పించాలని కోరారు.

త్వరలో ఆర్టీసీలో పదోన్నతులకు పరిష్కారం: దామోదరరావు

విజయవాడ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో దీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల ప్రక్రియను త్వరితగతిన చేపట్టేందుకు యాజమాన్యం అంగీకరించిందని ఏపీపీటీడీ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు అన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత ఈయూ రాష్ట్ర కమిటీ కృషి మేరకు సంస్థలో 2096 మందికి పదోన్నతులు వచ్చాయని తెలిపారు. తాజాగా బుధవారం ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావును కలిసిన సందర్భంలో.. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనానికి ముందు చేరిన వారందరికీ వారి వారి విద్యార్హతల ప్రకారం పదోన్నతులివ్వాలని కోరినట్లు పేర్కొన్నారు.

నేడు విభిన్న ప్రతిభావంతుల సింహగర్జన

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల సింహగర్జన గురువారం ఉదయం 11 గంటలకు కర్నూలులోని ఎస్టీబీసీ కాలేజ్ గ్రౌండ్స్‌లో జరుగుతుందని టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు తెలిపారు. వైసీపీ పాలనలో విభిన్న ప్రతిభావంతులకు జరుగుతున్న అన్యాయం గురించి సమాజానికి తెలియజేయాలన్న లక్ష్యంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నట్టు ఆయన వివరించారు.

హైకోర్టులో కేఏ పాల్ వాదనలు

▸ విశాఖ ఉక్కుపై విచారణ 14కు వాయిదా

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏపాల్ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్)పై హైకోర్టు బుధవారం విచారణ జరిపింది. పార్టీ ఇన్ పర్సన్‌గా కేఏ పాల్ స్వయంగా వాదనలు వినిపించారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించకుండా నిలువరించాలని కోరారు. ప్లాంట్‌కు చెందిన వేల ఎకరాలను ఇప్పటికే విక్రయించేశారని, ఇక 16వేల ఎకరాలు మాత్రమే మిగిలి ఉన్నాయని తెలిపారు. ప్లాంట్‌ను విక్రయించబోమని కేంద్రం చెబితే గనుక..తన బిలియనీర్ విదేశీ మిత్రులు సాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నారని, విదేశీ సాయం నియంత్రణ చట్టం(ఎఫ్‌సీఆర్ఏ) కింద ప్రత్యేక ఖాతాకు కేంద్రం అనుమతిస్తే సొమ్మును అందులో జమ చేస్తామని వివరించారు. మొదటి విడతలోనే రూ.8వేల కోట్లు జమ చేస్తామని చెప్పారు. స్టీల్ ప్లాంట్ భూములు విక్రయించకుండా స్టే విధించాలని కోరారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జి.నరేందర్, జస్టిస్ న్యాపతి విజయ్‌తో కూడిన ధర్మాసనం ఇదే వ్యవహారంపై దాఖలైన ఇతర వ్యాజ్యాలను ప్రస్తుత పిల్‌తో జత చేసే విషయంలో సీజే నుంచి పరిపాలనపరమైన ఆమోదం తీసుకోవాలని రిజిస్ట్రీని ఆదేశించింది. విచారణను మార్చి 14వ తేదీకి వాయిదా వేసింది.

అక్రమాల 'యోగా'సనం

▸ బుద్ధ యోగా ఫౌండేషన్ దందా

▸ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల్లో ఇన్‌స్ట్రక్టర్లు, వలంటీర్ల నియామకం

▸ మధ్యవర్తులతో లక్షల్లో ముడుపుల వసూళ్లు

▸ ఆయుష్ శాఖ పేరిట నియామక ఉత్తర్వులు

▸ పాఠశాల విద్యాశాఖ నుంచి ప్రొసీడింగ్స్

▸ తెరవెనుక అధికార పార్టీ వైసీపీ పెద్దలు!



బుద్ధ యోగా ఫౌండేషన్ పేరుతో ఇచ్చిన ఐడీ కార్డు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 28: రాష్ట్ర విద్యాశాఖలో రూ.కోట్ల కుంభకోణం జరిగినట్టు తెలుస్తోంది. యోగా ఇన్‌స్ట్రక్టర్లు, యోగా వలంటీర్ల ఉద్యోగాల పేరిట ఒక్కో అభ్యర్థి నుంచి రూ.లక్షలు గుంజుకున్నారు. ఈ దందాను 2021లో మొదలు పెట్టారు. బ్యాచ్‌లు బ్యాచ్‌లుగా పోస్టులు భర్తీ చేసి.. రూ.కోట్లు కొల్లగొట్టారని సమాచారం. ఒక్కో అభ్యర్థి నుంచి రూ.2 లక్షలు, రూ.3.30 లక్షలు, రూ.4 లక్షలు.. ఇలా అందినకాడికి వందల మంది నుంచి వసూలు చేశారు. అనంతరం వీరిని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూళ్లలో యోగా ఇన్‌స్ట్రక్టర్లు, యోగా వలంటీర్లుగా నియమించారు. ఇన్‌స్ట్రక్టర్లకు రూ.25 వేలు, వలంటీర్లకు రూ.15 వేలు జీతం ఇస్తామని చెప్పడంతో నిరుద్యోగులు క్యూకట్టారు. అడిగినంత లంచాన్ని మధ్యవర్తులకు ముట్టజెప్పారు. ఇలా ఎంపికైన వారికి నియామక పత్రాలను ఇచ్చారు. ఉద్యోగం వచ్చిందని ఆశగా స్కూళ్లలో చేరిన వారికి నెలల తరబడి జీతాలు లేవు. దీంతో తాము మోసపోయామని గుర్తించిన బాధితులు పలు ప్రాంతాల్లో పోలీసులను ఆశ్రయిస్తున్నారు. కడప జిల్లాలో కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అనంతలోనూ ఈ కేసులు వెలుగు చూశాయి. రాష్ట్ర వ్యాప్తంగా రూ.50 కోట్ల వరకు ఈ స్కాం జరిగినట్లు తెలిసింది. ఈ స్కాం సహా బుద్ధ యోగా ఫౌండేషన్ వెనుక అధికార పార్టీ కీలక నేతలు ఉన్నారని సమాచారం.

విడతల వారీగా ఉద్యోగాలు

రాష్ట్ర వ్యాప్తంగా బుద్ధా యోగా హెల్త్ ఫౌండేషన్ పేరుతో నిరుద్యోగులకు వల వేశారు. కేంద్ర ప్రభుత్వం, ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగాలు ఇస్తున్నామని నమ్మించారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ నుంచి అనుమతి ఉన్నట్లు నమ్మించారు. దీంతో అనంతపురం, కదిరి, పుట్టపర్తి, కడప ప్రాంతాలకు చెందిన వందల మంది నిరుద్యోగులు ఈ ఉద్యోగాల కోసం తరలి వచ్చారు. చాలా మంది నిరుద్యోగులు 2022, 2023 జనవరి, ఫిబ్రవరి నెలల్లో బ్రోకర్లకు లక్షల రూపాయలు చెల్లించారు. వీరికి 2023 జూన్, జూలైలో నియామక పత్రాలు ఇచ్చారు. కానీ, 2021 నుంచే విడతలవారీగా నియామకాలు జరిగినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు 13 విడతల్లో ఈ పోస్టులను భర్తీ చేశారని బాధిత టీచర్లు చెబుతున్నారు. మరీ ముఖ్యంగా 13వ బ్యాచ్‌లో 13 బ్యాచ్-ఏ, బ్యాచ్-బీ, బ్యాచ్-సీ, బ్యాచ్-డీ పేరుతో కూడా నియామకాలు చేపట్టి.. అందినకాడికి డబ్బులు లాగినట్లు సమాచారం. ఈ పోస్టులకు సంబంధించి 13వ బ్యాచ్ చివరిదని చెప్పి.. 13వ బ్యాచ్ కింద నాలుగు విడతల్లో నిరుద్యోగుల నుంచి డబ్బులు గుంజినట్టు తెలుస్తోంది. మొదట్లో ఉద్యోగాల్లో చేరిన వారికి 4 నెలలు, 6 నెలలు జీతాలు చెల్లించారు. ఆ తర్వాత పైసా కూడా ఇవ్వలేదు. 2023, జూన్ 26న నియమితులైన 12వ బ్యాచ్ వాళ్లకు ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలో సుమారు 300 మంది ఉద్యోగాల్లో చేరారు. కడప జిల్లాలో 74 మంది ఉన్నారని బాధితులు చెబుతున్నారు. కడపకు చెందిన ఓ మహిళ రూ.3 లక్షలకు పైగా చెల్లించారు. 2023, జనవరి 3వ వారంలో ఆమె మధ్యవర్తికి డబ్బు చెల్లించారు. అదే ఏడాది ఏప్రిల్‌లో ఆమెకు పోస్టింగ్ ఇచ్చారు. కానీ, ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా జీతం ఇవ్వలేదు. శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన ఓ మహిళ 2023, ఫిబ్రవరిలో రూ.2 లక్షలు చెల్లించారు. అదే ఏడాది జూన్‌లో ఆమెకు పోస్టింగ్ ఇచ్చారు. ఏడు నెలలు గడిచినా జీతం చెల్లించలేదు. అనంతపురం జిల్లాకు చెందిన ఓ యువకుడు రూ.2 లక్షలు చెల్లించాడు. 2022 జులైలో అతనికి పోస్టింగ్ ఇచ్చారు. కానీ జీతం చెల్లించలేదు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా 1500 మంది వరకు బాధితులు ఉన్నట్లు సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా రూ.50 కోట్లకు పైగా ఈ కుంభకోణం నడిచినట్లు తెలుస్తోంది.

బుద్ధ యోగా పేరిట..

ఉద్యోగాల భర్తీ అంతా బుద్ధ యోగా హెల్త్ ఫౌండేషన్ పేరుతో నడిచినట్లు స్పష్టమవుతోంది. ఈ ఫౌండేషన్ వెనుక వైసీపీ పెద్ద తలకాయలే ఉన్నట్లు సమాచారం. పోలీసులు తీగ లాగితే ఈ కుంభకోణం డొంక కదులుతుందని బాధితులు చెబుతున్నారు. అయితే, అధికార పార్టీ పెద్దల హస్తం ఉందని తెలుస్తుండడంతో పోలీసులు చొరవ చూపడం అనుమానమేనని అంటున్నారు. బుద్ధ యోగా హెల్త్ ఫౌండేషన్ పేరిట జరిగిన తతంగం మొత్తం ఓ మాయలా కనిపిస్తోంది. 2022 జూలైలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ పేరిట ప్రొసీడింగ్స్ వచ్చాయి. యోగా ఇన్‌స్ట్రక్టర్లను విధుల్లో చేర్చుకోవాలని, ప్రత్యేక హాజరు నమోదు చేయాలని సూచించారు. యోగా శిక్షణ ఉచితంగానే ఇస్తారని పేర్కొన్నారు. వీరి భర్తీ ప్రక్రియను మొత్తం బుద్ధ యోగా ఫౌండేషన్‌వారే చూసుకున్నారు. పోస్టుల భర్తీ వ్యవహారాన్ని బహిరంగపరచకుండా, లోలోపలే తతంగం నడిపించారు. గుంటూరులోని బ్రాడీపేటలో దీని కార్యాలయం ఉందని, 45 రోజుల శిక్షణ కోసం తమను అక్కడికి పిలిపించి, 60 రోజులు అక్కడే ఉంచారని బాధితులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే విడతలవారీగా లంచం చెల్లింపులు జరిగాయి. కొందరు ఫోన్ పే, మరికొందరు నగదు రూపంలో డబ్బులు చెల్లించామని చెబుతున్నారు. వీరందరికీ గవర్నమెంట్ ఆఫ్ ఏపీ, బుద్ధ యోగా హెల్త్ ఫౌండేషన్ పేరిట ఐడీ కార్డులు ఇచ్చారు. ఆయుష్ శాఖ కమిషనర్ పేరిట నిమాయక ఉత్తర్వులు ఇచ్చారు. ఇదిలావుంటే, జిల్లాల విద్యాశాఖ అధికారులకు వీరి నియామకంపై సమాచారమే లేదని తెలిసింది. కొందరు ఎంఈఓలకు మాత్రం మౌఖికంగా తెలుసునని సమాచారం.

నేడు తెలంగాణ డీఎస్సీ నోటిఫికేషన్!

▸ 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జారీ.. గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ రద్దు

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు శుభవార్త. ఆ రాష్ట్ర ప్రభుత్వం 11,062 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు గురువారం నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉంది. ఇందుకోసం గత ప్రభుత్వం 5,089 టీచర్ పోస్టులతో జారీ చేసిన నోటిఫికేషన్‌ను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ అధికారులు బుధవారం ప్రకటన విడుదల చేశారు. గత నోటిఫికేషన్ ఇచ్చినప్పుడు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం గత ప్రభుత్వం 5,089 పోస్టులతో 2023 సెప్టెంబరు 6వ తేదీన నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో సుమారు 1.77 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించింది. ఈ మేరకు కొత్తగా మరో 5,973 ఖాళీ పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపింది. వీటితో కలిపి మొత్తం పోస్టుల సంఖ్య 11,062కు చేరింది. కాగా, కొత్త పోస్టులతో అనుబంధ నోటిఫికేషన్ జారీ చేస్తారన్న ప్రచారం జరిగినా.. మొత్తం పోస్టులకు కలిపి మళ్లీ నోటిఫికేషన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా పాత నోటిఫికేషన్‌ను రద్దు చేసింది. ఇటీవల గ్రూపు-1 పోస్టుల భర్తీలోనూ గత నోటిఫికేషన్‌ను రద్దు చేసి, కొత్త నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే.

చెరువు ఆక్రమణను అడ్డుకోండి

▸ శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంజిల్లా, సింగుపురం గ్రామపంచాయతీ పరిధిలోని చెరువును స్థానిక సర్పంచ్ ఆక్రమించారని ఆరోపిస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. చెరువులో ఆక్రమణలు తొలగించి, దాని రక్షణకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. అనంతరం నివేదికను కోర్టు ముందు ఉంచాలని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. శ్రీకాకుళంజిల్లా, సింగుపురం గ్రామపంచాయతీ పరిధిలోని చెరువును స్థానిక సర్పంచ్ ఆదిత్యనాయుడు ఆక్రమించారని పేర్కొంటూ ఎంపీటీసీ అప్పారావు మరో ఐదుగురు హైకోర్టులో పిల్ వేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది విద్యావతి వాదనలు వినిపించారు. ఆక్రమణలకు సంబంధించి ఫోటోలను కోర్టు ముందు ఉంచారు.

టెట్, టీఆర్‌టీ షెడ్యూల్‌పై ముగిసిన వాదనలు

▸ తీర్పు రిజర్వ్ చేసిన హైకోర్టు

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఏపీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్), ఏపీ టీచర్ నియామక పరీక్ష (ఏపీ టీఆర్‌టీ)ల మధ్య సముచిత సమయం ఉండేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టులో వాదనలు ముగిశాయి. ఇరువైపుల వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేస్తూ న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ బుధవారం ఆదేశాలిచ్చారు. టెట్, టీఆర్‌టీ మధ్య సముచిత సమయం ఉండేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఎం. పెద్దిరాజు, మరో నలుగురు హైకోర్టును ఆశ్రయించారు. ప్రస్తుత నోటిఫికేషన్ రద్దుచేసి ఈ పరీక్షల నిర్వహణకు తాజాగా నోటిఫికేషన్ జారీ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ల తరఫున న్యాయవాది జవ్వాజి శరత్‌చంద్ర వాదనలు వినిపించారు. టెట్ ముగిసిన తర్వాత టీఆర్‌టీ రాయడానికి సిద్ధమయ్యేందుకు తగిన సమయం లేదని, అభ్యర్థులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారని విన్నవించారు. అభ్యర్థులు పరీక్షకు సిద్ధమయ్యేందుకు తగిన సమయం ఇచ్చేలా షెడ్యూల్‌లో మార్పులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

వాట్సాప్ సమాచారంతో పిల్ ఎలా వేస్తారు?

▸ పిటిషనర్‌ను నిలదీసిన హైకోర్టు ధర్మాసనం

▸ బార్ కౌన్సిల్ నిధుల దుర్వినియోగంపై పిల్ కొట్టివేత

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఏపీ బార్ కౌన్సిల్ నిధులు దుర్వినియోగం అయ్యాయని, సీబీఐ విచారణకు ఆదేశించాలంటూ వేసిన పిల్‌ను హైకోర్టు కొట్టివేసింది. వాట్సాప్ వచ్చిన సమాచారం ఆధారంగా పిల్ ఎలా దాఖలు చేస్తారని పిటిషనర్‌ను నిలదీసింది. పిల్‌ను నాన్‌సీరియస్‌గా అభివర్ణించింది. పార్టీ ఇన్ పర్సన్ న్యాయవాది బాల్‌రెడ్డికి రూ.50 వేలు ఖర్చులు విధిస్తూ పిల్‌ను కొట్టివేసింది. ఈ దశలో పిటిషనర్ జోక్యం చేసుకుంటూ దిగువ కోర్టులో న్యాయవాది అయిన తాను అంత మొత్తం చెల్లించుకోలేనని, విధించిన ఖర్చులను ఉపసంహరించాలని అభ్యర్థించారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం విధించిన ఖర్చులను తొలగించింది. బార్ కౌన్సిల్ స్టాంపుల కొనుగోలులో రూ.కోట్లు దుర్వినియోగం అయ్యాయని, ఈ వ్యవహారంపై సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరుతూ కడపకు చెందిన న్యాయవాది మూలి వెంకట బాలిరెడ్డి పిల్ దాఖలు చేశారు. ఈ పిల్ బుధవారం విచారణకురాగా పార్టీఇన్‌పర్సన్ బాలిరెడ్డి వాదనలు వినిపిస్తూ... స్టాంపులు విక్రయించగా వచ్చిన సొమ్ముకు, బార్ కౌన్సిల్ చూపిస్తున్న మొత్తానికి వ్యత్యాసం ఉందన్నారు. ఈ దశలో కలగజేసుకున్న ధర్మాసనం.. "స్టాంపుల విక్రయం ఎలా జరుగుతుంది? ఎవరు విక్రయిస్తార"ని ఆరాతీసింది. బార్ కౌన్సిల్ తరఫున సీనియర్ న్యాయవాది పి. వీరారెడ్డి వాదనలు వినిపిస్తూ... పిటిషనర్ ఆరోపణలో నిజం లేదని, రూ.100 స్టాంపు విక్రయించగా వచ్చిన సొమ్ములో రూ.86 మాత్రమే బార్ కౌన్సిల్‌కు చేరుతుందని వివరించారు. పిటిషనర్ రూ.100 బార్ కౌన్సిల్‌కు చేరుతుందని తప్పుగా లెక్కవేసి, నిధులు దుర్వినియోగం అయ్యాయనే అభిప్రాయంతో ఉన్నారని పేర్కొన్నారు. పూర్తి వివరాలు తెలుసుకోకుండా పిల్ ఎలా దాఖలు చేశారని పిటిషనర్‌ను ధర్మాసనం నిలదీసింది.

గండం గట్టెక్కినట్లే!



కాంగ్రెస్ పరిశీలకులతో సీఎం సుఖ్వీందర్ సింగ్

▸ హిమాచల్‌లో కాంగ్రెస్ సర్కారుకు ఉపశమనం

సిమ్లా/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: రాజ్యసభ ఎన్నికల సందర్భంగా హిమాచల్‌ప్రదేశ్‌లో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. మంగళవారం రాజ్యసభ ఎన్నికల్లో ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీ అభ్యర్థికి ఓటేయడంతో సుఖ్వీందర్‌సింగ్ సర్కారు మైనారిటీలో పడిందని బీజేపీ వాదించింది. కాంగ్రెస్ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానానికి సిద్ధమైంది. బుధవారం ఉదయం ప్రతిపక్ష నేత జైరాం ఠాకూర్ గవర్నర్‌ను కలిశారు. 2024-25 ఆర్థిక బిల్లును ఓటింగ్ ద్వారానే ఆమోదించేలా చూడాలని కోరారు. హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీలో మొత్తం 68 స్థానాలు ఉండగా.. కాంగ్రెస్‌కు 40, బీజేపీకి 25 సీట్లు ఉన్నాయి. మరో ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి అభిషేక్ మను సింఘ్వీ, బీజేపీ అభ్యర్థి హర్ష్ మహాజన్‌కు చెరో 34 ఓట్లు వచ్చాయి. డ్రా తీయగా విజయం మహాజన్‌ను వరించింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆరుగురు, స్వతంత్రులు ముగ్గురు బీజేపీకి అనుకూలంగా ఓటు వేశారు. దీంతో కాంగ్రెస్ సర్కారు మైనారిటీలో పడిపోయిందని బీజేపీ చెబుతోంది. ఈ క్రమంలో బుధవారం ఉదయం అసెంబ్లీలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. బీజేపీ సభ్యులు ఆర్థిక బిల్లును అడ్డుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. స్పీకర్ సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. తర్వాత జైరాం ఠాకూర్ సహా 15 మంది బీజేపీ సభ్యులను సస్పెండ్ చేశారు. అంతకు ముందే 10 మంది సభ్యులు వాకౌట్ చేశారు. అనంతరం మూజువాణీ ఓటుతో బడ్జెట్‌ను ఆమోదించి, సభను నిరవధికంగా వాయిదా చేశారు. ఇదిలా ఉండగా.. సీఎం సుఖ్వీందర్ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రజాపనుల శాఖ మంత్రి విక్రమాదిత్య సింగ్ బుధవారం తన పదవికి రాజీనామా చేశారు.

రంగంలోకి కాంగ్రెస్ అధిష్ఠానం

హిమాచల్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రమాదంలో పడడంతో దిద్దుబాటు చర్యలు చేపట్టింది. సీనియర్ పరిశీలకులు భూపేశ్ బఘేల్, భూపిందర్‌సింగ్ హుడా, డీకే శివకుమార్‌లను హుటాహుటిన సిమ్లా పంపింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలందరితో మాట్లాడి, సమస్యను పరిష్కరించాలని పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే వారిని ఆదేశించినట్లు జైరాం రమేశ్ తెలిపారు. బీజేపీ దొడ్డిదారిలో అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ సర్కారును పడగొట్టే చాన్స్ కేంద్రానికి ఇవ్వబోమన్నారు.

హిమాచల్‌లో ప్రజలు ఇచ్చిన తీర్పును అణచివేయాలని బీజేపీ ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక ఆరోపించారు. అధికార దుర్వినియోగం, కేంద్ర సంస్థలను ఉసిగొల్పడం ద్వారా బీజేపీ రాజకీయ అనిశ్చితి సృష్టించాలని చూస్తోందని ధ్వజమెత్తారు. కాగా, హిమాచల్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అసమ్మతి తీవ్రరూపం దాల్చడంతో పరిస్థితిని చక్కదిద్దేందుకు కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను అధిష్ఠానం రంగంలోకి దించింది.

దూరం నుంచే గుండె లయ వినొచ్చు!

హైదరాబాద్‌సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా హైదరాబాద్‌లో జరుగుతున్న బయో ఏసియా 2024 సదస్సు మంగళవారం ముగిసింది. ఇందులో భాగంగా నిర్వహించిన ట్రేడ్ ఎక్స్‌పోలో పలు స్టార్టప్‌లు ప్రదర్శించిన ఉత్పత్తులు, నూతన ఆవిష్కరణలు అందరినీ ఆకట్టుకున్నాయి. అమీర్‌పేటలో ఉన్న పేషెంట్ గుండెలయను ఎక్కడో అమెరికాలో ఉన్న డాక్టర్ వినే వీలు కల్పించే స్టెతస్కోప్‌ను 'ఆబో' అనే సంస్థ తయారుచేసింది. దాని పేరు.. 'ఆబో వన్'. ఇది పేషెంట్ల గుండెలయను రికార్డ్ చేసి ఫార్వార్డ్ చేయగలదని.. రియల్‌టైమ్‌లోనూ వినిపించగలదని ఆబో ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ స్మార్ట్ స్టెత్ ధర.. 16500 రూపాయలు. చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన అనారోగ్యాలతో బాధపడే పేషెంట్ల సమస్యను డాక్టర్ ఎక్కడి నుంచైనా పర్యవేక్షించడానికి వీలు కల్పించే 'ఆబోస్కోప్'ను సైతం ఈ సంస్థ అందుబాటులోకి తెచ్చింది. అలాగే.. 'ఆబో ఎక్స్6' అనే పరికరంతో ఆరు రకాల వైటల్స్‌ను, ఆబో రింగ్‌తో నిద్ర, ఒత్తిడిని ట్రాక్ చేయడం సాధ్యమవుతుంది. ఏ తరహా సమస్యకు ఏ తరహా థెరపీ అయితే సరిపోతుందో తెలిపే 'ఫిజీ' అనే డివైజ్‌ను స్టార్టూన్ ల్యాబ్స్ తయారుచేసింది.



స్టెతస్కోప్

రాధ, రాజారెడ్డి దంపతులకు సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్



న్యూఢిల్లీ, హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారులు రాధా రెడ్డి-రాజారెడ్డి దంపతులకు ప్రతిష్ఠాత్మకమైన సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్ లభించింది. కొన్ని దశాబ్దాలుగా ఢిల్లీలో కూచిపూడి నృత్య కళను పరిరక్షిస్తూ వేల మందికి శిక్షణ నిచ్చిన రాధా రాజారెడ్డి దంపతులకు గతంలోనే పద్మశ్రీ, పద్మవిభూషణ్ పురస్కారాలు వరించాయి. సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్‌లో భాగంగా వారికి రూ 3 లక్షల మేరకు నగదు పురస్కారం లభిస్తుంది. 2022, 23 సంవత్సరాలకు సంగీత నాటక అకాడమీ సంగీతం, నృత్యం, రంగస్థలం, సంప్రదాయ, జానపద, గిరిజన సంగీత, నృత్య కళల్లో 92 మందికి అవార్డులు ప్రకటించింది. మరో 80 మంది యువకళాకారులకు కూడా 2022, 23 సంవత్సరాలకు ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారాలను ప్రకటించింది. 2023 సంవత్సరానికి గాను సంగీత నాటక అకాడమీ పురస్కారాలు లభించిన వారిలో తెలుగువారు ప్రముఖ గాయకుడు, భగవద్గీతను గానం చేసిన ఎల్వీ గంగాధర శాస్త్రి, మద్దాలి ఉషా గాయత్రి (కూచిపూడి), నటరాజ రామకృష్ణ శిష్యుడు పేరిణి ప్రకాశ్ (పేరిణి నాట్యం) ఉన్నారు 2022 సంవత్సరానికి గాను మండా సుధారాణి (గాత్రం), వినుకొండ సుబ్రహ్మణ్యం (డోలు వాయిద్యం), భాగవతుల సేతురామ్ (కూచిపూడి)లకు సంగీత నాటక పురస్కారాలు లభించాయి. ఈ పురస్కారం కింద తామపత్రం, రూ.లక్ష నగదు ఇస్తారు. 2023 సంవత్సరానికి గాను ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కారాలు అందుకున్నవారిలో తెలుగువారు బి మల్లికార్జున రావు (రంగస్థల కళ- మేకప్), అంగడి బాస్కర్ (జానపద సంగీతం) ఉండగా, 2022 సంవత్సరానికి ప్రముఖ సినీనటుడు రక్త కన్నీరు సి నాగభూషణం మనుమరాలు శ్వేతా ప్రసాద్ (గాత్రం), టి.రెడ్డి (కూచిపూడి) ఉన్నారు. యువపురస్కారాల కింద తామపత్రం, రూ.25వేల నగదు ఇస్తారు. కాగా కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కృత్తివెంటి శ్రీనివాసరావుకు జగదల్‌పూర్‌లోని మహేంద్ర కర్మ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ పట్టా ప్రదానం చేస్తున్నట్లు ప్రకటించింది.

ఎస్వీ వర్సిటీ గుండా రోడ్ల నిర్మాణంపై స్టే!

▸ నిర్మాణానికి వీసీ అభ్యంతరం లేదనడంపై హైకోర్టు ఆగ్రహం

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): తిరుమల వెళ్లే వీఐపీలు సాఫీగా ప్రయాణించేందుకు వీలుగా శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ క్యాంపస్ గుండా రహదారి నిర్మాణం చేపట్టాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ప్రతిపాదించడాన్ని హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. రహదారి నిర్మాణం చేస్తే అభ్యంతరం లేదని యూనివర్సిటీ వైస్ చాన్సలర్(వీసీ) చెప్పడాన్ని తీవ్రంగా ఆక్షేపించింది. విద్యార్థుల ప్రయోజనాలు కాపాడేలా వీసీ నిర్ణయాలు ఉండాలని అభిప్రాయపడింది. టీటీడీ, మున్సిపల్ కార్పొరేషన్‌లకు వీసీ భయపడాల్సిన అవసరం లేదని పేర్కొంది. రహదారి నిర్మాణం జరిగితే యూనివర్సిటీ గుండా ప్రతిరోజూ లక్షలాది వాహనాలు ప్రయాణిస్తాయని, ఇది విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతుందని స్పష్టం చేసింది. యూనివర్సిటీ క్యాంపస్ గుండా రహదారి నిర్మాణాన్ని ఆమోదించలేమని పేర్కొంది. రహదారి నిర్మాణం విషయంలో ఎలాంటి తదుపరి చర్యలూ చేపట్టవద్దని అధికారులను ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతికి చెందిన ఆర్.అభిషేక్‌రెడ్డి హైకోర్టులో ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది టి.అనిరుధ్ యాదవ్ వాదనలు వినిపించారు.

'ఎన్నికల్లో బ్రీత్ ఎనలైజర్ల'పై ముగిసిన వాదనలు

అమరావతి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో మద్యానికి ప్రభావితం కానివారు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకొనేలా పోలింగ్ బూత్‌ల వద్ద బ్రీత్ ఎనలైజర్లు ఏర్పాటు చేసేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం పై హైకోర్టులో వాదనలు ముగిశాయి. దీంతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు బుధవారం ప్రకటించింది. విజయవాడకు చెందిన జనవాహిని పార్టీ కార్యదర్శి ఎం.శివరామ సుందర్ ఈ వ్యాజ్యం దాఖలు చేశారు. పిటిషనర్ తర ఫు న్యాయవాది డీఎస్ఎన్వీ ప్రసాద్‌బాబు వాదనలు వినిపిస్తూ... ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 16ని అనుసరించి మద్యం సేవించిన వారిని ఓటుహక్కు వినియోగించకుండా నిరోధించాలన్నారు. మద్యం సేవించినవారికి దేశ, రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే అర్హత ఉండదని పేర్కొన్నారు. తగిన ఉత్తర్వులు జారీ చేస్తామంటూ ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది.

ఎమ్మెల్యే మల్లాదికి ఊరట

▸ కల్తీ మద్యం కేసును కొట్టేసిన ప్రజాప్రతినిధుల కోర్టు

విజయవాడ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచలనం సృష్టించిన కల్తీ మద్యం కేసులో వైసీపీ విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణును ప్రజాప్రతినిధుల కోర్టు నిర్దోషిగా తేల్చింది. 2015 డిసెంబరు 7న కృష్ణలంక రణదివె నగర్ నెహ్రూనగర్‌కు చెందిన రోజువారీ కూలీలు జాతీయ రహదారికి పక్కన ఉన్న స్వర్ణ బార్‌లో మద్యం తాగారు. వారిలో ఆకుల విజయ్‌కుమార్, నరస గోపి, మీసాల మహేష్, మునగాల శంకరరావు, ఎన్‌బీవీ నాంచారయ్య ప్రాణాలు కోల్పోయారు. మరో 15 మంది ఆస్పత్రిపాలయ్యారు. బార్ యజమాని కె.నాగేశ్వరరావుతోపాటు 15 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మల్లాది విష్ణు ఏ-9, ఆయన సోదరుడు శ్రీనివాస్ ఏ-10గా ఉన్నారు. నిందితుల్లో ఇద్దరు చనిపోయారు. మిగిలిన 13 మందిపై ఉన్న కేసును కోర్టు కొట్టేస్తూ న్యాయాధికారి గాయత్రీదేవి బుధవారం తీర్పు ఇచ్చారు.

రెండోసారి ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారుల వివరాలు అందజేయండి: హైకోర్టు

అమరావతి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గతంలో ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలు తీసుకొని తాజాగా మరోసారి ఇళ్ల పట్టాలు పొందినవారి వివరాలను తమ ముందు ఉంచాలని పిటిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ ఆదేశాలిచ్చింది. ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 22,620 మందికి ఇళ్లపట్టాలు ఇచ్చేందుకు వీలుగా రూ.210 కోట్లు జారీ చేస్తూ ఇచ్చిన జీవోను సవాల్ చేస్తూ సామాజిక కార్యకర్త సింగరాజు రాంబాబు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది ఎస్.రవిప్రసాద్ వాదనలు వినిపించారు. ఒంగోలు మున్సిపాలిటీ పరిధిలో 7వేల టిడ్కో ఇళ్లతో పాటు పలు ఖాళీ స్థలాలు ఉన్నాయన్నారు. ఇప్పటివరకు వాటిని లబ్ధిదారులకు అందజేయలేదన్నారు. కేవలం రాజకీయ కారణాలతో మరో 22 వేల ఇళ్ల పట్టాల పంపిణీ చేస్తున్నారని పేర్కొన్నారు. ఇళ్ల పట్టాల పంపిణీకి ముందు సామాజిక ఆర్థిక సర్వే నిర్వహించలేదన్నారు. గతంలో ప్రభుత్వం నుంచి ఇళ్ల స్థలాలు పొందినవారికే మరోసారి ఇస్తున్నారన్నారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● గురువారం 29 ఫిబ్రవరి 2024
diksuchi@andhrajyothy.com

తిరుపతి ఐఐటీలో సైన్స్ హ్యాక్



తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీటీపీ)- నేషనల్ సర్వీస్ స్కీం(ఎన్ఎస్ఎస్) కింద 'సైన్స్ హ్యాక్-4.0' పేరుతో ఆన్‌లైన్ ప్రాజెక్ట్ కాంపిటీషన్‌ను నిర్వహిస్తోంది. దీనిని పాఠశాల విద్యార్థులకు ప్రత్యేకించారు. ఆరోతరగతి నుంచి పదోతరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పోటీలో పాల్గొనవచ్చు.

పోటీ వివరాలు

- విద్యార్థులు సైన్స్‌లో ప్రయోగ/ప్రాజెక్ట్ అంశాన్ని స్వయంగా ఎంచుకోవాలి. ప్రాజెక్ట్ మోడల్‌ను స్వయంగా రూపొందిస్తూ మొత్తం ప్రక్రియను వీడియో రికార్డ్ చేయాలి. తెలుగు/హిందీ/ఇంగ్లీష్ భాషలో ప్రాజెక్ట్‌ను వివరించాలి. వీడియో నిడివి పదిహేను నిమిషాలకు మించకూడదు.
- ఈ వీడియోని సంస్థ వెబ్‌సైట్‌లో ఇచ్చిన లింక్ ద్వారా అప్‌లోడ్ చేయాలి. లింక్‌లో ఇచ్చిన దరఖాస్తు ఫారంలో విద్యార్థి వివరాలు నమోదు చేసి సబ్మిట్ చేయాలి.
- విజేతల వివరాలను సంస్థ వెబ్‌సైట్‌లో ప్రకటిస్తారు. విద్యార్థులకు ఈ మెయిల్ ద్వారా కూడా తెలియజేస్తారు. గెలుపొందిన వారికి బహుమతులతోపాటు ఈ-సర్టిఫికెట్ ఇస్తారు. అంతేగాక ఐఐటీ తిరుపతి నిర్వహించే ఓపెన్ స్కూల్ డే 2024 ప్రోగ్రామ్‌లో పాల్గొనే అవకాశం కల్పిస్తారు.

ప్రాజెక్ట్ వీడియోలు అప్‌లోడ్ చేసేందుకు చివరి తేదీ: మార్చి 15
వీడియోలు అప్‌లోడ్ చేయాల్సిన లింక్: https://forms.gle/1YTKn3UPUxWYcsve8. **వెబ్‌సైట్:** www.iittp.ac.in

సీయూఈటీ(యూజీ) 2024

దేశవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ యూనివర్సిటీలు సహా పార్టిసిపేటింగ్ యూనివర్సిటీలు, డీమ్డ్ యూనివర్సిటీలు, అటానమస్ కళాశాలలు, ప్రభుత్వ/ ప్రైవేట్ యూనివర్సిటీలు అందిస్తున్న అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలకు ఉద్దేశించిన 'కామన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్ట్(సీయూఈటీ) యూజీ 2024 నోటిఫికేషన్ వెలువడింది.



ఈ పరీక్షని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహిస్తుంది. హిందీ, ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ సహా మొత్తం 13 మాధ్యమాల్లో పరీక్ష రాయవచ్చు. ఒక జనరల్ టెస్ట్ పేపర్, 33 లాంగ్వేజ్ టెస్ట్ పేపర్లు, 27 డొమైన్ సబ్జెక్ట్ పేపర్ల నుంచి అభ్యర్థులు కనిష్ఠంగా మూడు, గరిష్ఠంగా ఆరు టెస్ట్ పేపర్లు రాసే వీలుంది.

డొమైన్ సబ్జెక్టులు

అకౌంటెన్సీ/బుక్ కీపింగ్, అగ్రికల్చర్, ఆంత్రోపాలజీ, బయాలజీ/బయలాజికల్ స్టడీస్/బయోటెక్నాలజీ/బయో కెమిస్ట్రీ, బిజినెస్ స్టడీస్, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మాటిక్స్ ప్రాక్టీసెస్, ఎకనామిక్స్/ బిజినెస్ ఎకనామిక్స్, ఇంజనీరింగ్ గ్రాఫిక్స్, ఆంత్రప్రెన్యూర్‌షిప్, ఫైన్ ఆర్ట్స్/ విజువల్ ఆర్ట్స్/కమర్షియల్ ఆర్ట్, జాగ్రఫీ/జియాలజీ, హిస్టరీ, హోం సైన్స్, నాలెడ్జ్ ట్రెడిషన్ ప్రాక్టీసెస్ ఇన్ ఇండియా, లీగల్ స్టడీస్, మాస్ మీడియా/ మాస్ కమ్యూనికేషన్, మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్, పర్ఫార్మింగ్ ఆర్ట్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్/నేషనల్ క్యాడెట్ కోర్/యోగా, ఫిజిక్స్, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, సంస్కృతం, సోషియాలజీ, టీచింగ్ ఆప్టిట్యూడ్.

లాంగ్వేజ్ సబ్జెక్టులు

ఇంగ్లీష్, హిందీ, అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళం, తెలుగు, ఉర్దూ, అరబిక్, బోడో, చైనీస్, డోగ్రీ, ఫ్రెంచ్, జర్మన్, ఇటాలియన్, జపనీస్, కశ్మీరీ, కొంకణి, మైథిలి, మణిపురి, నేపాలీ, పర్షియన్, రష్యన్, సంతాలీ, సింధీ, స్పానిష్, టిబెటన్, సంస్కృతం.

అర్హత

గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు/చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం మూడేళ్ల వ్యవధి గల డిప్లొమా పూర్తిచేసినవారు; హయ్యర్ సెకండరీ సర్టిఫికెట్ ఒకేషనల్ ఎగ్జామినేషన్ ఉత్తీర్ణులు; జనరల్ సర్టిఫికెట్ ఎడ్యుకేషన్ ఎగ్జామినేషన్ అడ్వాన్స్‌డ్ లెవెల్ పూర్తిచేసినవారు; కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ నుంచి హైస్కూల్ సర్టిఫికెట్ ఎగ్జామినేషన్ ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

దీనిని హైబ్రిడ్ మోడ్(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్/పెన్&పేపర్ టెస్ట్)లో నిర్వహిస్తారు. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ఇందులో మూడు సెక్షన్లు ఉంటాయి. మొదటి సెక్షన్‌లో లాంగ్వేజ్ టెస్ట్‌లు ఉంటాయి. రీడింగ్ కాంప్రహెన్షన్, లిటరరీ ఆప్టిట్యూడ్, ఒకాబులరీలకు సంబంధించి 50 ప్రశ్నలు ఇస్తారు. వీటిలో 40 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. రెండో సెక్షన్‌లో డొమైన్ సబ్జెక్ట్ టెస్ట్‌లు ఉంటాయి. ఇంటర్/పన్నెండోతరగతి సిలబస్ ఆధారంగా 50 ప్రశ్నలు అడుగుతారు. వీటిలో 40 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. మూడో సెక్షన్‌లో జనరల్ టెస్ట్ ఉంటుంది. ఇందులో జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ రీజనింగ్, లాజికల్ అండ్ అనలిటికల్ రీజనింగ్ అంశాలనుంచి 60 ప్రశ్నలు ఇస్తారు. వీటిలో 50 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ప్రశ్నకు అయిదు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు.

ఎగ్జామ్ వివరాలు

అభ్యర్థులు జనరల్ టెస్ట్ సహా డొమైన్ సబ్జెక్టుల నుంచి 4 లేదా 5 పేపర్లు; లాంగ్వేజ్ సబ్జెక్టుల నుంచి 1 లేదా 2 పేపర్లు చొప్పున గరిష్ఠంగా 6 పేపర్లు ఎంచుకోవాలి. జనరల్ టెస్ట్ సహా కనీసం ఒక లాంగ్వేజ్ ఉండేలా చూసుకోవాలి.

మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్, అకౌంటెన్సీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మాటిక్స్ ప్రాక్టీసెస్, జనరల్ టెస్ట్ పేపర్లకు ఒక్కోదానికి పరీక్ష సమయం ఒక గంట. మిగిలిన అన్ని పేపర్లకూ ఒక్కోదానికి 45 నిమిషాలు ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** మూడు సబ్జెక్టుల వరకు జనరల్ అభ్యర్థులు రూ.1000; ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.900; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.800; విదేశీ అభ్యర్థులు రూ.4500 చెల్లించాలి. ప్రతి అదనపు సబ్జెక్టుకు జనరల్ అభ్యర్థులు రూ.400; ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.375; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.350; విదేశీ అభ్యర్థులు రూ.1800 చెల్లించాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 26
- **కరెక్షన్ విండో ఓపెన్:** మార్చి 28, 29
- **ఎగ్జామినేషన్ సెంటర్ వివరాలు వెల్లడి:** ఏప్రిల్ 30 నుంచి
- **అడ్మిట్‌కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** మే రెండో వారంలో
- **సీయూఈటీ యూజీ 2024 తేదీలు:** మే 15 నుంచి 31 వరకు
- **ఫలితాలు విడుదల:** జూన్ 30న
- **వెబ్‌సైట్:** www.nta.ac.in, https://exams.nta.ac.in/CUET-UG/

నైసర్‌లో సమ్మర్ ఔట్‌రీచ్ ప్రోగ్రామ్

భువనేశ్వర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైసర్)కు చెందిన స్కూల్ ఆఫ్ మేథమెటికల్ సైన్సెస్(ఎస్ఎంఎస్)- 'సమ్మర్ ఔట్‌రీచ్ ప్రోగ్రామ్ ఇన్ మేథమెటిక్స్ (ఎస్ఓపీఎం) 2024'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇందులో ఆల్జీబ్రా అండ్ అనాలిసిస్‌కు సంబంధించి శిక్షణ ఇస్తారు. ఈ ప్రోగ్రామ్‌ను మే 20 నుంచి జూన్ 8 వరకు నిర్వహిస్తారు. అకడమిక్ మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైనవారికి రానుపోనూ స్లీపర్ క్లాస్ ట్రైన్ ఫేర్ ఇస్తారు. భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తారు.

అర్హత

బీఎస్సీ(మేథమెటిక్స్) రెండో ఏడాది, మూడో ఏడాది చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. మేథమెటిక్స్‌లో రాణించాలనుకొనేవారికి ఈ ప్రోగ్రామ్ ఉపయోగపడుతుంది.

చదువుతున్న కళాశాల నుంచి రికమండేషన్ లెటర్, ఇంటర్/పన్నెండోతరగతి నుంచి డిగ్రీ వరకు మార్కుల పత్రాలను దరఖాస్తుకు జతచేయాలి.

ముఖ్య సమాచారం

- స్పీడ్ పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ: మార్చి 27
- ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల: ఏప్రిల్ 2న
- దరఖాస్తు పంపాల్సిన చిరునామా: కోఆర్డినేటర్, స్కూల్ ఆఫ్ మేథమెటికల్ సైన్సెస్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్-భువనేశ్వర్, వయా జత్ని, ఖుర్దా జిల్లా, ఒడిశా-752050
- ఈ-మెయిల్: sopm@niser.ac.in
- వెబ్‌సైట్: www.niser.ac.in

జాబ్ కార్నర్

పీఎఫ్‌సీలో కో-ఆర్డినేటర్లు

న్యూఢిల్లీలోని పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్..కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. **మొత్తం ఖాళీలు: 27**

1. కో-ఆర్డినేటర్(సీఎస్ఆర్)/లెవల్ 1: 2 పోస్టులు
2. కో-ఆర్డినేటర్(ఆర్‌డీఎస్ఎస్)-1/లెవల్ 3: 1 పోస్టు
3. కో- ఆర్డినేటర్(ఆర్‌డీఎస్ఎస్)-2/లెవల్ 3: 1 పోస్టు
4. కో-ఆర్డినేటర్(ఆర్‌డీఎస్ఎస్)-3/లెవల్ 3: 1 పోస్టు
5. కో-ఆర్డినేటర్(ఆర్‌డీఎస్ఎస్)-4/లెవల్ 3: 1 పోస్టు
6. కో-ఆర్డినేటర్(ఆర్‌డీఎస్ఎస్)-5/లెవల్ 3: 1 పోస్టు
7. కో-ఆర్డినేటర్(ఆర్‌డీఎస్ఎస్)-1/లెవల్ 2: 19 పోస్టులు
8. కో-ఆర్డినేటర్(ఆర్‌డీఎస్ఎస్)-2/లెవల్ 2: 1 పోస్టు

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంసీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 21 నుంచి 60 ఏళ్ల మధ్య ఉండాలి. **జీతం:** లెవల్-1 వారికి రూ.65,000, లెవల్-2 వారికి రూ.90,000, లెవెల్-3 వారికి రూ.1,25,000

దరఖాస్తు ఫీజు: రూ.500, ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 7

వెబ్‌సైట్: https://pfcindia.com/ensite

ఎన్‌టీపీసీలో అసిస్టెంట్ మేనేజర్లు

న్యూఢిల్లీలోని నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్..ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 20

పోస్టు: అసిస్టెంట్ మేనేజర్(సేఫ్టీ)

అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమాలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 40 సంవత్సరాలు మించకూడదు

వేతనం: నెలకు రూ.60,000- రూ.1,80,000 వరకు చెల్లిస్తారు

దరఖాస్తు ఫీజు: జనరల్, ఈడబ్ల్యూ, ఓబీసీ అభ్యర్థులకు రూ.300. ఎస్సీ, ఎస్టీ, ఎక్స్ సర్వీస్‌మెన్, మహిళా అభ్యర్థులకు మినహాయింపు ఉంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 8

వెబ్‌సైట్: https://www.ntpc.co.in/

నదీ జలాల వివాదాలు

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

ఆల్మట్టి వివాదం

- కర్ణాటక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నాటి నుంచి ఈ వివాదం ఉంది.
- దీనికి సంబంధించిన ట్రిబ్యునల్స్: బచావత్ ట్రిబ్యునల్, బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్
- ఆల్మట్టి డ్యాం వాస్తవ ఎత్తు: 517 మీటర్లు
- ఎత్తు పెంచడంలో భాగంగా కర్ణాటక ప్రతిపాదించిన ఎత్తు: 524. 25 మీటర్లు
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించిన ఎత్తు: 519.6 మీటర్లు

కృష్ణా నది జలాల వివాదం (బ్రిజేష్ కుమార్ ట్రిబ్యూనల్)

- 1969 ఏప్రిల్ 10: బచావత్ ట్రిబ్యూనల్ ఏర్పాటు (ఇంటర్ స్టేట్ వాటర్ డిస్ప్యూట్స్ యాక్ట్-1956 ప్రకారం)
- ఇది 1973లో తుది తీర్పు ఇచ్చింది. దీనిలో స్కీమ్-ఎ లో నికర జలాలు, స్కీమ్-బి లో మిగులు జలాలను పంపిణీ చేసింది. కృష్ణా నదిలో లభించే మొత్తం నీటిలో 75 శాతం నికర నీటి లభ్యతగా గుర్తించి పంచింది.



- 1976 మే 31: ప్రభుత్వం బచావత్ ట్రిబ్యునల్ తుది తీర్పు గెజిట్‌ను ప్రకటించింది.

దీని ప్రకారం కృష్ణా నదిలో నికర జలాల లభ్యత 2060 టీఎంసీలుగా పేర్కొంది.

- మహారాష్ట్ర - 560, కర్ణాటక-700, ఆంధ్రప్రదేశ్ 800 టీఎంసీల నీటి వాటా కలిగి ఉన్నాయి.


నోట్: మిగులు జలాలు అంటే...ప్రాజెక్ట్‌లలోని నీటిని కాలువల ద్వారా పొలాలకు మళ్లించి సాగునీటికి, వివిధ అవసరాలకు ఉపయోగించగా, మిగిలిపోయి తిరిగి నదిలో కలిసే జలాలు.

- ట్రిబ్యునల్ 70 టీఎంసీలను మిగులు జలాలుగా పేర్కొని, మహారాష్ట్రకు-25, కర్ణాటకకు-45, ఆంధ్రప్రదేశ్‌కు-11 టీఎంసీలు కేటాయించింది.
- 2004 ఏప్రిల్ 2: బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తూ కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది. 2006 ఫిబ్రవరి 1 నుంచి ట్రిబ్యునల్ అధికారికంగా అమలులోకి వచ్చింది. 2010 డిసెంబరు 31న కర్ణాటకకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. అదేవిధంగా మిగులు జలాల వాటాను ఆంధ్రప్రదేశ్‌తోపాటు కర్ణాటక, మహారాష్ట్రకు పంచింది. కృష్ణా నది నికర నీటి లభ్యతను 2594 టీఎంసీలుగా లెక్కించింది(మిగులు జలాలను కూడా కలిపింది). మహారాష్ట్రకు-666 టీఎంసీలు, కర్ణాటకకు-911 టీఎంసీలు, నది పరిరక్షణ కోసం-16 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు-1001 టీఎంసీలు కేటాయించింది.

నోట్: తదుపరి నది జలాల పునఃసమీక్ష 2050 తర్వాతే ఉంటుందని రిపోర్ట్ పేర్కొంది.

కావేరీ నది జలాల వివాదం

కావేరీ నది నీటిని తమిళనాడు గ్రాండ్ ఆనకట్ట (కల్లనై డ్యామ్)ను రెండవ శతాబ్దంలో నిర్మించడం ద్వారా, 1934లో నిర్మించిన మెట్టూరు డ్యామ్ ద్వారా చాలా సంవత్సరాల నుంచి వినియోగించుకుంటోంది.



అయితే కర్ణాటక 1932లో కృష్ణరాజ సాగర్ డ్యామ్ ద్వారా, తమిళనాడుకు వచ్చే కావేరీ జలాల లభ్యత తగ్గిపోవడంతో వివాదాలు ప్రారంభమయ్యాయి.

- కావేరీ నది పరివాహక ప్రాంతం: తమిళనాడు, కర్ణాటక, కేరళ, పాండిచ్చేరిలో ఉంది.
- 1990లో కేంద్ర ప్రభుత్వం కావేరీ వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసింది.
- 1998లో కావేరీ రివర్ అథారిటీని ఏర్పాటు చేసింది
- 2028 సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కావేరీ నది జలాల పంపిణీ: మొత్తం 726 టీఎంసీలలో కర్ణాటకకు 284.75, తమిళనాడుకు 404.25, కేరళకు 30, పాండిచ్చేరికి 7 టీఎంసీల వాటా లభించింది.

ముళ్ల పెరియార్ డ్యామ్ వివాదం

ప్రస్తుత కేరళ రాష్ట్ర సరిహద్దు లోపల, ఒకప్పటి ట్రావెన్ కోర్ సంస్థానంలో పెరియార్ నదిపై ఈ డ్యామును నిర్మించారు. 1886లో బ్రిటిష్ ప్రభుత్వం, ట్రావెన్ కోర్ సంస్థానం నుంచి డ్యామ్ ఉన్న ప్రదేశాన్ని 999 సంవత్సరాలకు లీజుకు తీసుకుని నిర్మించింది. డ్యామ్ వెనుక భాగంలో సొరంగ మార్గాన్ని ఏర్పాటు చేసి, దాని ద్వారా తమిళనాడులోని వైగై నదిలోకి నీటిని సరఫరా చేస్తున్నారు. దీని ద్వారా 68 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు.

కేరళ వాదన: 120 సంవత్సరాల క్రితం నిర్మించిన డ్యామ్ భద్రత గురించి కేరళ అభ్యంతరాలను తెలియజేస్తోంది. ఇది తెగిపోతే దిగువన ఉన్న ఇడుక్కీ డ్యామ్, పెరియార్ బ్యారేజ్‌లు ప్రమాదంలో పడతాయి. కనుక, ప్రస్తుతమున్న డ్యామ్‌ని కూల్చివేసి, కొత్త డ్యామ్ నిర్మించాలి. అది కూడా ప్రస్తుత 142 అడుగుల ఎత్తు కాకుండా 136 అడుగుల ఎత్తు మాత్రమే నిర్మించాలని వాదిస్తోంది.



తమిళనాడు ప్రభుత్వ వాదన: 2010లో డ్యామ్ భద్రతపై పరిశీలన కోసం ఏ.ఎస్.ఆనంద్ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ డ్యామ్ భద్రతకు ఎలాంటి ప్రమాదం లేదని పేర్కొంది. 136 అడుగుల నుంచి 142 అడుగుల వరకు నీటిని నిల్వ చేసుకోవచ్చని స్పష్టం చేసింది.

పాలార్ నది వివాదం

పెన్నా, కావేరీ నదుల మధ్యలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ద్వారా స్వతంత్రంగా ప్రవహించే మధ్యస్థ నది. ఈ నది తమిళనాడులోని వెల్లూరు, కంచి ప్రాంతాలకు జీవనాధారం. ఈ నదిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చిత్తూరు జిల్లా కుప్పం వద్ద డ్యామ్ నిర్మాణం ప్రారంభించింది. దీనిని తమిళనాడు వ్యతిరేకిస్తోంది.

సింధూనది జలాల ఒప్పందం

1960లో సింధూజలాల ఒప్పందం ఇండియా - పాకిస్థాన్ మధ్య జరిగింది. దీని ప్రకారం పశ్చిమ నదులైన- సింధూ, జీలం, చీనాబ్ నదులలోని మొత్తం నీటి ప్రవాహంలో 80 శాతం పాకిస్థాన్‌కి, 20 శాతం ఇండియాకి కేటాయించారు. తూర్పు నదులైన రావి, సట్లెజ్, బియాస్ నదులలో మొత్తం నీటిలో 80 శాతం ఇండియాకి, 20 శాతం పాకిస్థాన్‌కి కేటాయించారు.

బాగ్లీహార్: ఈ ప్రాజెక్టును సింధూ ఒప్పందానికి వ్యతిరేకంగా చీనాబ్ నదిపై భారత్ నిర్మించింది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకంగా ప్రపంచ బ్యాంక్‌లో పాకిస్థాన్ ఫిర్యాదు చేసింది. ఫలితంగా ఈ ప్రాజెక్టు పరిశీలన కోసం లఫైతే(స్విట్జర్లాండ్) కమిటీని నియమించారు. 2010లో ఈ వివాదం పరిష్కారమైంది.

కిషన్ గంగా: ఈ ప్రాజెక్టును సింధూ ఒప్పందానికి వ్యతిరేకంగా జీలం, కిషన్ గంగా నదుల ఆధారంగా నిర్మించారు. ఈ నిర్మాణానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ న్యాయస్థానంలో పాకిస్థాన్ ఫిర్యాదు చేసింది. ఫలితంగా ఈ ప్రాజెక్టు పరిశీలనకు స్క్వెబెల్ కమిటీ(బ్రిటన్)ని నియమించారు.



వి. వెంకట్‌రెడ్డి,
సీనియర్ ఫ్యాకల్టీ

బిట్స్



అభిప్రాయం

అనగనగా ఓ రాజ్యం. అది ఉత్తర దేశం. ఆ రాజ్యానికి పరమకోపిష్టి అయిన విశ్వదత్తుడు అనే రాజు ఉండేవాడు. ఏ ప్రశ్న అడిగినా..సమాధానం బావుండాలనే తత్వం అతనిది. తనను భజన చేస్తుంటే నచ్చదంటాడు. తనను వ్యతిరేకిస్తే మాత్రం అంతటితో ఊరుకోకుండా కటకటాల పాలు చేసి ఖైదీని చేసేవాడు.

అంతటి కోపిష్టి రాజుకు మంచి మనసు ఉంది. కిరీటం, బంగారు ఆభరణాలు, ఆ డాబు దర్పం పక్కన బెట్టి ఉండేవాడు. తన రాజ్యంలో ఒంటరిగా చెట్లకు నీళ్ల పోసేవాడు. బొమ్మలు గీసేవాడు. అతని మాటలకు.. అతని తీరుకు రాజ్యంలోని కొందరు ఆశ్చర్యపోయేవారు. ఏదీ పట్టించుకోకుండా.. పనివాళ్లతో కలసి తానూ కలసి పని చేసినట్లు ఉండేవాడు. రాజుగారితో ఏమి అన్నా తలనొప్పులేనని ఎవరూ ఆయన్ని వ్యతిరేకించేవారు కాదు. ఎదురు చెప్పేవారు కాదు. దీంతో రాజుగారు ఇదంతా తన గొప్పతనం అని అనుకునేవాడు.

రాజుగారికి మంచి మనసు ఉందని కొందరనేవారు. ఇది తెలిసి రాజ్యంలోని తోటమాలి తనకు ఏదైనా సాయం చేయవచ్చు కదా అనుకునేవాడు. తోటలో కాపలా కాసేప్పుడు రాజుగారు హుటాహుటిన అక్కడకు వెళ్లాడు. అక్కడ కొన్ని పూలు కోశారు రాజుగారు. తోటమాలిని పిలిచాడు. 'నేను పెట్టుకున్న ఉంగరం చూడు' అన్నాడు. అదిరిపోయాడు తోటమాలి. 'ఈ ఉంగరం భలే ఉంది కదా. ఈ బంగారం పని చేయటం కష్టం. ఉంగరంలో వజ్రం కూడా ఉంది. ఎంత ప్రతిభావంతుడో ఈ ఉంగరాన్ని చేసినవాడు' అంటూ పొగుడుతున్నాడు. తోటమాలి స్పందనేమీ లేదు.

'ఇంతగా మాట్లాడుతున్నా స్పందనేమీ లేదు ఎందుకూ' అని రాజుగారు ఆ తోటమాలిని అడిగారు. 'అయ్యా..మీరు రాజులు. ఏదైనా మంచి విలువైనదే ధరిస్తారు. ఆ ఉంగరం గురించి.. ఆ ఉంగరం చేసిన వారి గురించి మీరే ఇంతలా చెబుతుంటే నేనెందుకు వ్యతిరేకిస్తాను. అలా వ్యతిరేకిస్తే ఉండగలనా?' అన్నాడు. ఇంకా చెప్పు అన్నాడు రాజుగారు. 'నేను ఏకీభవిస్తే సంతృప్తిగా ఉండలేను. అది కూడా నాకు నచ్చదు' అన్నాడు తోటమాలి. 'నీ అభిప్రాయం బావుంది. ఇదిగో ఈ ఉంగరం నీదే తోటమాలి' అని రాజు వెళ్లిపోయాడు. అక్కడ ఉన్నవాళ్లకు ఏమీ అర్థం కాలేదు. రాజు మంచివాడు. తోటమాలి తెలివైనవాడు. అతని అభిప్రాయం విలువైనది అనుకున్నారంతా.

10 తేడాలను గుర్తించండి




దారి కనుక్కోండి



ఏవి ఎన్ని?



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 242

			2					
1				8		6	4	
6								9
	1				3		2	
4		8	5		9	1		6
	7		8				9	
3								7
	2	9		6				1
					4			

సుడోకు - 241 సమాధానం

9	3	8	1	2	5	7	4	6
7	4	6	8	3	9	2	1	5
1	2	5	7	4	6	3	9	8
6	7	4	3	5	1	9	8	2
5	1	9	2	7	8	4	6	3
3	8	2	6	9	4	5	7	1
2	6	3	4	1	7	8	5	9
8	9	7	5	6	2	1	3	4
4	5	1	9	8	3	6	2	7

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.